
'ప్రజల రుణం తీర్చుకునేందుకు
ఎంత కృషి చేయడానికైనా నేను సిద్ధం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 345

బుధవారం 6-3-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



విశాఖలోనే ప్రమాణ స్వీకారం

ఎన్నికల్లో గెలిచి అక్కడి నుంచే పాలన: ఏపీ సీఎం జగన్

- రాష్ట్రానికి వైజాగ్ గ్రోత్ ఇంజన్ లాంటిది
- పదేళ్లలో హైదరాబాద్, బెంగళూరు, చెన్నైకి దీటుగా ఎదుగుతుంది... వ్యవసాయంతోపాటు తయారీ, సేవా రంగాలూ వృద్ధి చెందాల్సిందే
- ఏపీలో ప్రతి 50 కి.మీ.కి పోర్టు, ఫిషింగ్ హార్బర్
- రూ.16 వేల కోట్లతో 4 కొత్త పోర్టుల నిర్మాణం

10లో



ప్రొఫెసర్ సాయిబాబా నిర్దోషి

మావోయిస్టులతో సంబంధాల కేసులో ఢిల్లీ వర్సిటీ మాజీ ప్రొఫెసర్ జి.ఎన్.సాయిబాబాతోపాటు మరో ఐదుగురు నిందితులను బాంబే హైకోర్టు నిర్దోషులుగా ప్రకటించింది.

- వివరాలు 6లో



'వెలిగొండ'.. కల సాకారం

రైతులకిచ్చిన మరో మాటను ఏపీ సీఎం వైఎస్ జగన్ నిలబెట్టుకున్నారు. దుర్భిక్ష ప్రాంతాల ప్రజల దశాబ్దాల కల వెలిగొండ ప్రాజెక్టును సాకారం చేశారు.

- వివరాలు 10లో


కేసీఆర్‌ను కలిసిన ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

కలసి నడుస్తాం

- లోక్‌సభ ఎన్నికల్లో బీఎస్పీతో బీఆర్‌ఎస్ జట్టు... కేసీఆర్ నివాసానికి ఆర్.ఎస్. ప్రవీణ్ బృందం
- సుమారు మూడు గంటలపాటు చర్చలు
- సీట్ల సర్దుబాటుపై ఒకట్రెండు రోజుల్లో స్పష్టత... నాగర్‌కర్నూలు స్థానాన్ని ఇచ్చేందుకు కేసీఆర్ సుముఖత
- లౌకికత్వాన్ని కాపాడేందుకే పొత్తు అని సంయుక్త ప్రకటన

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో కలసి నడవాలని భారత్ రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్), బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) నిర్ణయించాయి. పొత్తు విధివిధానాలు, సీట్ల సర్దుబాటు అంశాలపై బుధవారం లోతుగా చర్చించాలని ఇరు పార్టీల అధ్యక్షులు నిర్ణయానికి వచ్చారు. చర్చల సారాంశాన్ని బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతికి వివరించి ఆమోదం పొందిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడించనున్నారు. ఈ మేరకు బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, కె.చంద్రశేఖర్‌రావు, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ మంగళవారం సంయుక్త ప్రకటన చేశారు.

కేసీఆర్‌తో ప్రవీణ్ భేటీ..

నాగర్‌కర్నూలు లోక్‌సభ స్థానం నుంచి పోటీలో ఉంటానని ప్రకటించిన ప్రవీణ్‌కుమార్ మంగళవారం ఉదయం అనూహ్యంగా నందినగర్‌లోని

మిగతా 3వ పేజీలో ▶

కొత్త ఏటీఎం తెలంగాణ

కాంగ్రెస్ పార్టీపై ప్రధాని మోదీ ధ్వజం

బీజేపీ 'విజయ సంకల్ప యాత్ర' బహిరంగ సభలో ప్రసంగం

- రాష్ట్రాన్ని దోచుకోవడంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ రెండూ పరస్పరం 'కవర్ ఫైర్' చేసుకుంటున్నాయి
- ఈ రెండు పార్టీల మధ్య బలమైన అవినీతి బంధం ఉంది
- బీఆర్‌ఎస్ కుంభకోణాల్లో కాంగ్రెస్ భాగస్వామి అయ్యింది
- కాళేశ్వరంపై విచారణ జరిపించకుండా రాష్ట్ర సర్కార్ ఫైళ్లు మూసేసింది
- ఈ రెండు పార్టీల 'కవర్ ఫైర్' ఎక్కువ రోజులు సాగబోదు
- ఉగ్రవాదంపై సర్జికల్ స్ట్రైక్స్ చేసిన మోదీ సర్కార్ 'ఎయిర్ స్ట్రైక్' కూడా చేస్తుంది
- ఇందుకు ప్రజల సహకారం కావాలి.. 400 స్థానాల్లో బీజేపీని గెలిపించాలి
- తెలంగాణ ప్రజల ప్రేమను అభివృద్ధి రూపంలో రెండింతలు చేసి తిరిగి ఇస్తా
- కుటుంబ పార్టీల అవినీతి బయట పెడుతున్నందుకు కాంగ్రెస్ నాకు శాపనార్థాలు పెడుతోంది
- దేశ హితం కోసం మోదీ తనను తాను సమర్పించుకుంటున్నాడంటూ వ్యాఖ్య


ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ. చిత్రంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ కొత్త ఏటీఎంగా తయారైందని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. రాష్ట్రాన్ని దోచుకోవడంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ రెండూ పరస్పరం 'కవర్ ఫైర్' చేసుకుంటున్నాయని విమర్శించారు. 'కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ఒకే నాణేనికి రెండు ముఖాలు. ఈ పార్టీల మధ్య బలమైన అవినీతి బంధం ఉంది. దీని గురించి ప్రపంచం అంతా తెలుసు. మీరు తిన్నారు.. మేం కూడా తింటాం అన్నట్టుగా రెండు పార్టీల తీరు ఉంది. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ రెండిటిదీ ఒకే బాట.. అదే అబద్ధాలు.. దోపిడీ (ఝూట్.. లూట్)..' అంటూ మోదీ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరంలో అవినీతికి పాల్పడి రైతుల నుంచి బీఆర్‌ఎస్ సర్కార్ వేల కోట్లు దోచుకుంటే, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దానిపై విచారణ జరిపించకుండా మౌనం వహించడమే కాకుండా దానికి సంబంధించిన ఫైళ్లు మూసేసిందని ఆరోపించారు. బీఆర్‌ఎస్ కుంభకోణాల్లో కాంగ్రెస్ భాగస్వామి అయ్యిందని అన్నారు. ఈ రెండు పార్టీల 'కవర్ ఫైర్' ఎక్కువ రోజులు సాగబోదని, ఉగ్రవాదంపై సర్జికల్ స్ట్రైక్స్ చేసిన మోదీ ప్రభుత్వం.. 'ఎయిర్ స్ట్రైక్' కూడా చేస్తుందని హెచ్చరించారు. అయితే అందుకు ప్రజల పూర్తి ఆశీర్వాదం కావాలని,

మిగతా 2వ పేజీలో ▶

మహబూబ్‌నగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా మన్నె శ్రీనివాస్‌రెడ్డి

- వివరాలు 3లో

వీడ్కోలు సమయాన విన్నపాలు

ప్రధాని మోదీకి సీఎం రేవంత్ కోర్కెల చిట్టా

- బేగంపేట ఎయిర్‌పోర్టులో 11 అంశాలతో కూడిన వినతిపత్రం అందజేత
- ఎన్టీపీసీలో 2,400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి కేంద్రం సహకరించాలి
- మెట్రో విస్తరణకు, మూసీ ప్రక్షాళనకు చేయూతనివ్వండి
- తుమ్మిడిహెట్టి ఎత్తిపోతల ప్రాజెక్టుకు మహారాష్ట్రను ఒప్పించండి

2లో

Suggested Today's Eggs & Broiler Chicken Hyderabad Zone Rates

12 Eggs Retail Rate				
₹ 63	Ex Farm Live Bird	116 kg	Dressed with Skin	200 kg
	Retail Live Bird	138 kg	Skin Less	228 kg

Issued in the interest of consumers



మోదీని నేనెందుకు అభిమానిస్తా?

- సోనియా గాంధీ అంటేనే అభిమానం
- మా నాయకుడు రాహులే
- రాష్ట్రంలో లేని బీజేపీని ఎందుకు తిట్టాలి?
- 7న లోక్‌సభ అభ్యర్థులపై ప్రకటన రావచ్చు
- సచివాలయంలో మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి -5లో



రేవంత్ మూలాలు బీజేపీలో..: కేటీఆర్

- మోదీని పొగిడి రాహుల్‌ను వేస్ట్‌ఫెలోను చేశాడు
- తెలంగాణ ఆత్మగౌరవం ఉన్నోడు గుజరాత్ మోడల్ అంటాడా?
- 30 వేల ఉద్యోగాలు ఇచ్చామనడం మందికి పుట్టిన బిడ్డను తన బిడ్డగా ముద్దాడినట్లు ఉంది
- సిరిసిల్ల, ముస్తాబాద్ సభల్లో ప్రసంగం -3లో



వేదికపై మాట్లాడుతున్న ప్రధాని మోదీ. 'మై హూ మోదీ పరివార్' అంటూ నినాదాలు చేస్తున్న లక్ష్మీనారాయణ, బంగారు శ్రుతి, మహేశ్వర్‌రెడ్డి, లక్ష్మణ్, కిషన్‌రెడ్డి, బీబీ పాటిల్, ఈటల, వెంకటరమణారెడ్డి, రఘునందన్‌రావు తదితరులు

కొత్త ఏటీఎం తెలంగాణ

▶ మొదటి పేజీ తరువాయి

వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో అత్యధిక ఎంపీ సీట్లు గెలిచేలా, దేశవ్యాప్తంగా ఎన్డీయే పక్షం 400 స్థానాలకు మించి గెలిచేలా ఓట్లు వేసి నిండు మనసుతో ఆశీర్వదించాలని కోరారు. (నాలుగు వందల సీట్లు దాటాలి. బీజేపీకి ఓటు వేయాలి అంటూ తెలుగులో పిలుపునిచ్చారు) మంగళవారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో పలు అభివృద్ధి పనులను మోదీ ప్రారంభించారు. అనంతరం విడిగా ఏర్పాటు చేసిన బీజేపీ 'విజయ సంకల్ప యాత్ర' బహిరంగ సభలో పాల్గొన్నారు. తెలుగులో 'నా తెలంగాణ కుటుంబ సభ్యులకు నమస్కారాలు' అంటూ ప్రసంగం ప్రారంభించారు.

నేను చెప్పానంటే తప్పకుండా చేసి చూపిస్తా

'తెలంగాణ ప్రజల ప్రేమను నేను ఎప్పటికీ మర్చిపోలేను. మీ ప్రేమ, ఆదరాభిమానాలు, ఆశీర్వాదాలను తెలంగాణ అభివృద్ధి రూపంలో రెండింతలు చేసి తిరిగి ఇచ్చేస్తా. ఇది మోదీ గ్యారంటీ. నేను ఏదైనా చెప్పానంటే దానిని తప్పకుండా చేసి చూపిస్తాం. మనందరం కలిసి భారత్‌ను ప్రపంచంలోనే కొత్త శిఖరాలకు తీసుకెళదాం. తెలంగాణ ప్రజల్లో ఎంతో ఉత్సాహం కనిపిస్తోంది. రాష్ట్రంలో బీజేపీని బాగా ఆదరిస్తున్నారు. మీ ఆశీర్వాదాలు వృథా కానివ్వను. మోదీ గ్యారెంటీ అంటే.. ఇచ్చిన హామీని నెరవేర్చే గ్యారెంటీ. జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేశాం. అయోధ్యలోని భవ్య మందిరంలో శ్రీరాముడికి స్వాగతం పలికాం. ప్రపంచంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థికశక్తిగా మన దేశం మారింది. ఆర్థిక ప్రగతిలో మన దేశం కొత్త అధ్యాయాన్ని లిఖిస్తుందని చెప్పి, దానిని నిజం చేసి చూపాం..' అని మోదీ అన్నారు.

మూడేళ్లలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ

'ఇప్పుడు మరో గ్యారంటీ ఇస్తున్నా..రాసుకోండి. వచ్చే మూడేళ్లలో విశ్వంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదిగేలా చేస్తాం. మోదీ గ్యారెంటీ అంటే గ్యారెంటీగా పూర్తయ్యే హామీ. (ఈ వాక్యాన్ని తెలుగులో ఉచ్చరించారు. దీంతో పలువురు సభికులు 'మోదీ మోదీ' అని పెద్ద పెట్టున హర్షధ్వానాలు చేస్తూ నినదించారు. తెలంగాణ ప్రజలు తామే మోదీ కుటుంబమని చెబుతున్నారంటూ ఈ సందర్భంగా ప్రధాని వ్యాఖ్యానించారు. మేమే మోదీ కుటుంబం అంటూ ప్రజలతో నినాదాలు చేయించారు). సబ్ కా సాథ్, సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్ ద్వారా మేము అన్ని రాష్ట్రాలను ఒకే విధంగా చూస్తూ అభివృద్ధికి బాటలు వేస్తున్నాం..' అని ప్రధాని తెలిపారు.

తెలంగాణకు ఎక్కువ నిధులు

'తెలంగాణ అభివృద్ధికి ఎక్కువ నిధులు కేటాయిస్తున్నాం. వేలాది కోట్లు మౌలిక సదుపాయాల కల్పన ప్రాజెక్టులపై పెడుతున్నాం. వీటి వల్ల తెలంగాణ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగి వారి స్వప్నాలు సాకారమవుతాయి. రాష్ట్ర ప్రజల స్వప్నాలను, మోదీ కుటుంబసభ్యుల కలలను సాకారం చేయాలనే సంకల్పంతో ముందుకెళుతున్నాం. మహిళలు, దళితులు, రైతులు.. ఇలా అన్ని వర్గాల వారికి వివిధ పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. తెలంగాణ అభివృద్ధి విషయంలో ఏ చిన్న అవకాశాన్నీ విడిచిపెట్టబోమని గ్యారంటీ ఇస్తున్నాం. మాదిగ రిజర్వేషన్ల వర్గీకరణకు సంబంధించి ఇచ్చిన గ్యారెంటీని పూర్తి చేసేందుకు కట్టుబడి ఉన్నాం. తెలంగాణలోని రైతుల నుంచి గత పదేళ్లలో ధాన్యం, పత్తి పెద్దమొత్తంలో కొనుగోలు చేశాం. రాష్ట్రంలోని 40 లక్షలకు పైగా రైతులకు



మంగళవారం పటాన్‌చెరులో విజయ సంకల్ప యాత్ర బహిరంగ సభకు హాజరైన ప్రజలు

కిసాన్ సమ్మాన్ నిధి కింద ప్రయోజనం చేకూరింది..' అని మోదీ చెప్పారు.

నాకు కుటుంబం లేదంటున్నారు..

'దేశ ప్రజలు, వారి కుటుంబాలకు ఇచ్చిన హామీలు, గ్యారెంటీల అమలుకు నేను చర్యలు తీసుకుంటుంటే కాంగ్రెస్ పార్టీ, వారి మిత్ర పక్షాలు నన్ను, నా కుటుంబాన్ని తిడుతున్నాయి. శాపనార్థాలు పెడుతున్నాయి. మోదీని, ఆయన కుటుంబాన్ని ఎందుకు తిడుతున్నారు? వాళ్ల కళ్లు ఎందుకు ఎర్రబడుతున్నాయి? నేను వారి రూ.వేలు, లక్షల కోట్ల కుంభకోణాలు, అవినీతి గుట్టును విప్పుతున్నందుకు అంత ఆగ్రహంతో ఉన్నారు. దేశంలో కశ్మీర్ నుంచి తమిళనాడు దాకా కుటుంబ పార్టీల పాలన కొనసాగుతోంది. ఎక్కడెక్కడైతే కుటుంబ పార్టీలు అధికారంలో ఉన్నాయో అక్కడ వారి పరివారాలు ఆర్జనలో బలోపేతమై, రాష్ట్రాలు మాత్రం బలహీనమై పోయాయి. కుటుంబ పార్టీలకు దోచుకోవడానికి ఏమైనా లైసెన్స్ ఉందా? ఒక ముఖ్యమంత్రి కుటుంబం, దగ్గరి బంధువుల్లో 50 మంది ఉన్నతస్థానాల్లో ఆసీనులయ్యారు. వారసత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా నేను గళమెత్తితే...నా ప్రశ్నలకు బదులివ్వకుండా మోదీకి కుటుంబమే లేదంటూ విరుచుకుపడుతున్నారు. వీరి కుటుంబ రాజకీయాలకు వ్యతిరేకంగా గట్టిగా గొంతు విప్పి చర్యలు తీసుకోవడం సరైనదేనా? (సభికులు అవును అంటూ కేకలు వేశారు)' అని మోదీ అడిగారు.

140కోట్ల ప్రజలే నా కుటుంబసభ్యులు

'కుటుంబ పార్టీల కారణంగా ప్రతిభ ఉన్నవారికి అన్యాయం జరుగుతోంది. యువతకు ఉపాధి అవకాశాలు దొరకడం లేదు. కాంగ్రెస్ పార్టీ పరివార వాద పార్టీగా మారాక 50 ఏళ్లకు తక్కువ వయస్సు ఉన్న వారిని ముందుకెళ్లకుండా అడ్డుకుంది. ఏదైనా పదవిలో కూర్చోబెట్టాలంటే 80, 85 ఏళ్లు దాటిన వారిని తీసుకొస్తున్నారు. యాభై ఏళ్లలోపు వారు వస్తే తమను ఓవర్‌టేక్ చేస్తారనే భయం వారిని పట్టుకుంది. వారికి వారి కుటుంబమే సర్వస్వం. దీనికి భిన్నంగా దేశంలోని ప్రతి కుటుంబం నాదే. 140 కోట్ల ప్రజలే నా కుటుంబసభ్యులు. దేశంలోని ప్రతి చెల్లి, ప్రతి తల్లి, యువత నా కుటుంబమే. కాంగ్రెస్, ఇండి కూటమికి ఇది అర్థం కావడంలేదు. వారికి వారి కుటుంబప్రయోజనాలే ముఖ్యమైతే నాకు దేశ హితమే సర్వస్వం. వారు తమ కుటుంబ ప్రయోజనాల కోసం దేశహితాన్ని బలిపీఠం ఎక్కించారు. మోదీ మాత్రం దేశ హితం కోసం తనను తాను సమర్పించుకుంటున్నాడు..' అని ప్రధాని వ్యాఖ్యానించారు.

నా సంపాదన ప్రజలకే ఖర్చు చేస్తున్నా..

'దేశ రాజకీయాల్లోకి నీతివంతమైన యువతను తీసుకురావాల్సిన అవసరం ఉంది. నాకు అవకాశం దొరికినపుడు, గతంలో సీఎంగా ఉన్నపుడు, ఇప్పుడు నా సంపాదన నుంచి ప్రజల కోసం ఖర్చు చేశా. దానాలు చేశా. పేద పిల్లల చదువులకు కేటాయించా. కుటుంబ రాజకీయాలు చేసేవారు అధికారంలో ఉన్నపుడు వచ్చిన బహుమానాలను సొంతంగా వాడుకున్నారు. తాము సంపాదించిన నల్లధనాన్ని చట్టబద్ధం చేసుకునే ప్రయత్నం చేశారు. నేను మాత్రం గుజరాత్ సీఎంగా, దేశ పీఎంగా వచ్చిన ఇలాంటి గిఫ్ట్‌లను ఒక భాండాగారంలో భద్రపరిచి, తర్వాత వేలం వేసి వచ్చిన మొత్తాన్ని గంగమ్మ తల్లి సేవలో ఖర్చు చేస్తున్నా. మీ సేవకుడిగా దాదాపు రూ.150 కోట్లు ప్రజల సేవలో ఖర్చు చేశా. నేను కూడా పరివార వాదిని అయితే ఈ సొమ్మంతటినీ సొంతానికి తీసుకునేవాడిని. మీరు నా కుటుంబసభ్యులు. మీ గౌరవాన్ని తగ్గించి తలదించుకునే పని ఎప్పటికీ చేయను. కొందరు నల్లధనం దాచుకోవడానికి విదేశీ బ్యాంకుల్లో ఖాతాలు తెరిచారు. ఓ వర్గం తమ కుటుంబాలకు విలాసవంతమైన భవనాలు కట్టించారు. మోదీ ఇంతవరకు సొంతానికి ఒక్క ఇల్లు కూడా కట్టించుకోలేదు. కానీ దేశంలో పేదలకు మాత్రం 4 కోట్ల ఇళ్లు కట్టించాం. అందుకే కోట్లాది మంది ప్రజలు తాము మోదీ కుటుంబ సభ్యులమని అంటున్నారు..'అని మోదీ తెలిపారు.

ప్రధానికి ఘనంగా వీడ్కోలు

సనత్‌నగర్ (హైదరాబాద్): రెండురోజుల రాష్ట్ర పర్యటనను ముగించుకుని మంగళవారం ప్రత్యేక విమానంలో ఒడిశాకు బయలుదేరిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి బేగంపేట ఎయిర్‌పోర్టులో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఘనంగా వీడ్కోలు పలికారు. పీఎం మధ్యాహ్నం 1.10 గంటలకు విమానాశ్రయానికి రాగా.. గవర్నర్, సీఎంతో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్, సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా, నగర కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి తదితరులు వీడ్కోలు పలికారు.

కాంగ్రెస్ సర్కార్ వచ్చినా మార్పు లేదు

- బీజేపీ విజయ సంకల్ప సభలో కిషన్‌రెడ్డి
- 100 రోజుల్లోనే రాహుల్ గాంధీ ట్యాక్స్ వసూలు

సాక్షి, హైదరాబాద్/పటాన్‌చెరు/పటాన్‌చెరు టౌన్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినా ఏ రకమైన మార్పూ కనపడటం లేదని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. బీఆర్‌ఎస్ పాలనతో విసుగు చెందిన ప్రజలు తమ జీవితాలు మారతాయేమోనని కాంగ్రెస్‌ను గెలిపించారని వ్యాఖ్యానించారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే రాహుల్ గాంధీ ట్యాక్స్ వసూలు చేయడం ప్రారంభించిందని పేర్కొన్నారు. ప్రజలు ఓట్లు వేసి గెలిపించిన పాపానికి రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బిల్డర్లను బెదిరించి ట్యాక్స్ వసూలు చేస్తున్నారని ఆరోపించారు. మంగళవారం పటాన్‌చెరులో బీజేపీ 'విజయ సంకల్ప సభ'లో ఆయన మాట్లాడారు. కేసీఆర్ కుటుంబం అవినీతి పాలనతో, ల్యాండ్ మాఫియా, శాండ్ మాఫియా, లిక్కర్ మాఫియా, కాంట్రాక్ట్ మాఫియాతో రాష్ట్రాన్ని దోపిడీ చేసిందని, తెలంగాణ సంపదను దోచుకున్నదని ఆరోపించారు. తెలంగాణలో నిజమైన ప్రజాస్వామ్య వ్యవస్థ రావాలంటే కుటుంబ పార్టీలకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు.

బీఆర్‌ఎస్ పనైపోయింది: కె.లక్ష్మణ్

రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పనైపోయిందని బీజేపీ నేత కె.లక్ష్మణ్ విమర్శించారు. కాంగ్రెస్ గారడీ మాటలతో అధికారంలోకి వచ్చిందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ రాబోతోందని ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని మల్కాజిగిరి అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు, బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు గోదావరి తదితరులు మాట్లాడారు.

మెదక్ సీటు ఇవ్వాలన్న రఘునందన్

గో అహెడ్ అన్న ప్రధాని!



సాక్షి, హైదరాబాద్: మంగళవారం పటాన్‌చెరులో బీజేపీ విజయ సంకల్ప యాత్ర బహిరంగసభ వేదికపై ప్రధాని మోదీతో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే ఎం.రఘునందన్‌రావు కొద్దిసేపు మాట్లాడారు. తనకు మెదక్ లోక్‌సభ టికెట్‌ను కేటాయించాల్సిందిగా మోదీని రఘునందన్ కోరగా.. 'ఆల్‌ద బెస్ట్, గో అహెడ్' అని ఆయన అన్నట్లు తెలుస్తోంది ఇటీవల 9 ఎంపీ సీట్లకు బీజేపీ అభ్యర్థులను ప్రకటించగా మెదక్ స్థానాన్ని పెండింగ్‌లో పెట్టిన సంగతి విదితమే.

బంగారు శ్రుతికి ప్రధాని పలకరింపు

బీజేపీ నాగర్‌కర్నూల్ టికెట్ ఆశించి భంగపడిన ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శ్రుతి.. ఆ తర్వాత సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలుసుకున్న విషయం తెలిసిందే. కాగా మంగళవారం పటాన్‌చెరు సభ ముగిశాక వేదికపై ఉన్న నేతలకు అభివాదం చేస్తూ బంగారు శ్రుతి దగ్గర ఆగిన మోదీ ఆమెతో ఏదో మాట్లాడారు. అయితే ఢిల్లీకి వచ్చి కలిసేందుకు సమయం ఇవ్వాలని ఆమె ప్రధానిని కోరారని, అందుకు ఆయన అంగీకారం తెలిపినట్టు పార్టీ నాయకుల సమాచారం.

రూ.9వేల కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం

ఘట్‌కేసర్- లింగంపల్లి ఎంఎంటీఎస్‌కు ప్రధాని పచ్చజెండా

పటాన్‌చెరు/పటాన్‌చెరు టౌన్: రాష్ట్రంలో రూ.9 వేల కోట్ల కేంద్ర నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులు, ప్రాజెక్టులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం వర్చువల్‌గా జాతికి అంకితం చేశారు. అలాగే ఘట్‌కేసర్- లింగంపల్లి ఎంఎంటీఎస్ రైలును ప్రధాని పచ్చజెండా ఊపి ప్రారంభించారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు శివారులోని పటేల్ గూడలో ఈ కార్యక్రమం జరిగింది. కాగా రూ.1,298 కోట్లతో ఎన్‌హెచ్–65లోని సంగారెడ్డి చౌరస్తా నుంచి మదీనాగూడ మధ్య 31 కి.మీ.ల ఆరు లేన్ల హైవే విస్తరణ, రూ.399 కోట్లతో ఎన్‌హెచ్–765డీ లోని మెదక్ ఎల్లారెడ్డి మధ్యన రెండు లేన్ల హైవే విస్తరణ, రూ.500 కోట్లతో ఎన్‌హెచ్ –765 డీ మధ్య రెండు లేన్ల హైవే విస్తరణ పనులకు ప్రధాని శంకుస్థాపన చేశారు. గవర్నర్ తమిళిసై, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ తదితరులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

జాతికి అంకితం చేసిన ప్రాజెక్టులు

- రూ.3,338కోట్ల పారాదీప్–హైదరాబాద్ గ్యాస్ పైప్‌లైన్
- రూ.400 కోట్ల సివిల్ ఏవియేషన్ రీసెర్చ్ ఆర్గనైజేషన్
- రూ.1409 కోట్లతో ఏర్పాటు చేసిన కంది, రామసానిపల్లె సెక్షన్‌లోని 4 వరుసల జాతీయ రహదారి
- రూ. 323 కోట్లతో ఏర్పాటు చేసిన ఎన్‌హెచ్–167 లోని మిర్యాలగూడ కోదాడ సెక్షన్ రెండు వరుసల జాతీయ రహదారి విస్తరణ
- రూ.1,165 కోట్లతో హైదరాబాద్, సికింద్రాబాద్‌లలో 103 కి.మీ.ల పొడవున చేపట్టిన ఎంఎంటీఎస్ మలివిడత ప్రాజెక్టు.



జెండా ఊపి రైలును ప్రారంభిస్తున్న ప్రధాని మోదీ. చిత్రంలో కిషన్‌రెడ్డి, తమిళిసై, కోమటిరెడ్డి

మాకే ఓటేయండి..



మంగళవారం బేగంపేట విమానాశ్రయంలో ఓ సరదా సన్నివేశం చోటు చేసుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ ఏకంగా కాంగ్రెస్ ముఖ్యమంత్రి అయిన రేవంత్‌రెడ్డిని బీజేపీకి ఓటేయాలంటూ కోరారు. మంగళవారం ప్రధానికి వీడ్కోలు పలికే సమయంలో క్లిక్‌మనిపించిన ఈ ఫొటోలో మోదీ, రేవంత్‌రెడ్డితో పాటు మంత్రి పొన్నం, నాగర్‌కర్నూల్ ఎంపీ పి.రాములు ఉన్నారు. ఇటీవల బీజేపీలో చేరిన రాములు.. సీఎం రేవంత్ తన పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని ఓటరేనని ఈ సందర్భంగా మోదీకి చెప్పారు. అందుకు రేవంత్ కూడా అవునంటూ బదులిచ్చారు. వెంటనే స్పందించిన మోదీ 'అయితే ఇంకేంటి.. ఈసారి మాకే ఓటేయండి..' అంటూ సరదాగా వ్యాఖ్యానించినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలోనే మోదీ సహా ఫొటోలో కనిపిస్తున్న నేతలు ఒక్కసారిగా ఘొల్లున నవ్వారు.

- సాక్షి, హైదరాబాద్

అమ్మవారిని దర్శించుకున్న ప్రధాని



ప్రధానికి అమ్మవారి చిత్రపటాన్ని అందిస్తున్న ఈవో మనోహర్‌రెడ్డి, అర్చకులు

- ఉజ్జయినీ మహంకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు
- చాలా ఆనందంగా ఉందన్న మోదీ

రాంగోపాల్‌పేట (హైదరాబాద్): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం 10.05కి ఆలయం వద్దకు చేరుకున్న ప్రధానికి ఆలయ వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం మోదీ నేరుగా గర్భగుడికి వచ్చి అమ్మవారికి పూలు, పండ్లు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. పేరు గోత్ర నామాలతో ప్రధానికి అర్చకులు సంకల్పం చేయించారు. ఖడ్గమాల కుంకుమార్చన పూజలు చేయించారు. ఆశీర్వచనాలు, హారతి అందించారు. తర్వాత ప్రధాని గర్భగుడి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. గర్భగుడికి ఎదురుగా ఉండే రాజ మాతంగి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారి శేషవస్త్రాలు, పూలమాల, ప్రసాదాలను ప్రధానికి అందజేశారు. అనంతరం వేద పండితులు వేణుమాధవశర్మ 200 ఏళ్లకు పైబడిన మహంకాళి అమ్మవారి ఆలయ చరిత్రను ఆయనకు వివరించారు. కాగా అమ్మవారిని చూడటం చాలా ఆనందంగా ఉందంటూ ప్రధాని హర్షం వ్యక్తం చేశారు. ఆలయ ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి, ప్రధాన అర్చకులు రామతీర్థ శర్మ, వేద పండితులు వేణుమాధవ శర్మలు మోదీకి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. సుమారు పది నిమిషాల పాటు ప్రధాని ఆలయంలో గడిపారు.

మొట్టమొదటి ప్రధాని

ఇప్పటివరకు సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖుల్లో రాష్ట్రపతితో పాటు పలువురు ముఖ్యమంత్రులు, గవర్నర్లు కూడా ఉన్నారు. కానీ దేశ ప్రధాని అమ్మవారిని దర్శించుకోవడం మాత్రం ఇదే మొదటిసారి. ఎన్టీఆర్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రాష్ట్రపతిగా ఉన్న జ్ఞాని జైల్‌సింగ్ అమ్మవారిని దర్శించుకున్నారు.

ఎక్స్‌లో మోదీ పోస్టు

భారతీయులందరికీ మంచి ఆరోగ్యం, శ్రేయస్సు, సౌభాగ్యం సిద్ధించాలని సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారిని ప్రార్థించానంటూ ప్రధాని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పేర్కొన్నారు.

మా వినతులు పరిష్కరించండి

ప్రధాని మోదీకి మంత్రి కోమటిరెడ్డి వినతిపత్రం



సాక్షి, హైదరాబాద్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించడానికి వచ్చిన సమయంలో రహదారుల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంగళవారం పటాన్‌చెరులో కలిసి వినతిపత్రం ఇచ్చారు. రీజినల్ రింగ్ రోడ్డులోని ఉత్తర భాగంలో 'సంగారెడ్డి–తూప్రాన్–చౌటుప్పల్'ని జాతీయ రహదారి 161ఏఏగా గుర్తించడంతో పాటు వికసిత్ భారత్–2047 పథకం కింద గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత ట్రాఫిక్ అవసరాలకు అనుగుణంగా ఎన్‌హెచ్–65లో మల్కాపూర్ నుంచి విజయవాడ వరకు 44 కి.మీ. రహదారిని 6 లేన్లుగా మార్చాలని, రాష్ట్రంలో 1,767 కి.మీ. పొడవైన 16 రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్చాలని కోమటిరెడ్డి కోరారు. హైదరాబాద్–శ్రీశైలం 765 కి.మీ.లో 62 కి.మీ. రహదారిని జాతీయ రహదారిగా మార్చేందుకు సంబంధిత శాఖకు డీపీఆర్ పంపించిన విషయాన్ని ప్రధాని దృష్టికి తెచ్చారు. కాజీపేటలో రైల్ కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని మోదీకి విన్నవించారు.

వీడ్కోలు సమయాన విన్నపాలు

ప్రధాని మోదీకి సీఎం రేవంత్ కోర్కెల చిట్టా

- బేగంపేట ఎయిర్‌పోర్టులో 11 అంశాలతో కూడిన వినతిపత్రం అందజేత
- ఎన్టీపీసీలో 2,400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి కేంద్రం సహకరించాలి
- మెట్రో విస్తరణకు, మూసీ ప్రక్షాళనకు చేయూతనివ్వండి
- తుమ్మిడిహెట్టి ఎత్తిపోతల ప్రాజెక్టుకు మహారాష్ట్రను ఒప్పించండి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో తన రెండురోజుల పర్యటన ముగించుకుని ఒడిశాకు వెళ్తున్న ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి సీఎం రేవంత్‌రెడ్డి తన విన్నపాల చిట్టా అందజేశారు. సోమ, మంగళవారాల్లో రాష్ట్రంలో వేలకోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడంతో పాటు బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన బహిరంగ సభల్లో పాల్గొన్న ప్రధాని మంగళవారం ఒడిశాకు బయలుదేరారు. సీఎం రేవంత్ బేగంపేట విమానాశ్రయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆయనకు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మొత్తం 11 అంశాలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.



ప్రధాని మోదీకి వినతి పత్రం ఇస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో మంత్రి పొన్నం ప్రభాకర్

- ఎన్టీపీసీకి 4,000 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యం ఉంది. అయితే గత ప్రభుత్వం 1,600 మెగావాట్లు మాత్రమే సాధించింది. మిగిలిన 2,400 మెగావాట్ల ఉత్పత్తికి కేంద్రం సహకరించాలి. రాష్ట్రం తరఫున అన్ని అనుమతులు ఇస్తాం.
- హైదరాబాద్‌లో మెట్రో విస్తరణకు, మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధికి (ప్రక్షాళనకు) సహకరించాలి.
- తుమ్మిడిహెట్టి ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉంది. భూసేకరణ, నీటి వాటాల విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించేలా ప్రధాని జోక్యం చేసుకోవాలి.
- హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై అమ్రాబాద్ అటవీ ప్రాంతం మీదుగా ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సహకరించాలి. 2022–23లోనే కేంద్ర ప్రభుత్వం డీపీఆర్ తయారీకి రూ.3 కోట్లు మంజూరు చేసింది. రూ.7,700 కోట్లు ఖర్చయ్యే ఈ ప్రాజెక్టును మంజూరు చేయాలి.
- రాష్ట్రంలో ఇంటింటికీ నల్లా నీరు నూటికి నూరు శాతం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలి. దాదాపు పది లక్షల కుటుంబాలకు ఇప్పటికీ నల్లాల ద్వారా నీటి సరఫరా జరగడం లేదు. సమీపంలోని నీటి వనరుల ద్వారా గ్రామాలకు రక్షిత మంచినీటిని సరఫరా చేసేందుకు జల జీవన్ మిషన్ నిధులు కేటాయించాలి.
- ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి హైదరాబాద్ కంటోన్మెంట్ ఏరియాలో 178 ఎకరాలు, 10 టీఎంసీల కేశవాపురం రిజర్వాయర్ నిర్మాణానికి పొన్నాల గ్రామ సమీపంలోని 1,350 ఎకరాల మిలటరీ డెయిరీ ఫామ్ ల్యాండ్స్ (తోఫెఖానా) రాష్ట్రానికి బదిలీ చేయాలి. లీజు గడువు ముగిసిన శామీర్‌పేటలో ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్ భూములను (1,038 ఎకరాలు) తిరిగి అప్పగించాలి.
- నేషనల్ హెల్త్ మిషన్ కార్యక్రమం రాష్ట్రంలో విజయవంతంగా అమలు చేస్తున్నాం. 5,259 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను ప్రభుత్వం నిర్వహిస్తోంది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర వాటాగా రాష్ట్రానికి రావాల్సిన రూ.347.54 కోట్లను విడుదల చేయాలి.
- భారత్ మాల పరియోజన జాతీయ రహదారుల అభివృద్ధిలో భాగంగా కల్వకుర్తి–కొల్లాపూర్, గౌరెల్లి–వలిగొండ, తొర్రూర్ – నెహ్రూనగర్, నెహ్రూనగర్–కొత్తగూడెం, జగిత్యాల–కరీంనగర్ ఫోర్‌లేన్, జడ్చర్ల–మరికల్ ఫోర్‌లేన్, మరికల్ – డియసాగర్ టెండర్ల ప్రక్రియకు అనుమతులివ్వాలి.
- ఇండియా సెమీ కండక్టర్ల మిషన్‌లో భాగంగా తెలంగాణలో సెమీ కండక్టర్ల తయారీ పరిశ్రమల ఏర్పాటుకు కేంద్రం సహకరించాలి.

అత్యవసరంగా 29 ఐపీఎస్ పోస్టులను కేటాయించాలి

కేంద్ర హోంశాఖ 2016లో తెలంగాణకు 76 ఐపీఎస్ కేడర్ పోస్టులను మంజూరు చేసింది. ప్రస్తుతం పెరిగిన జిల్లాలు, పోలీస్ కమిషనరేట్ల సంఖ్యకు అనుగుణంగా ఐపీఎస్ క్యాడర్‌ను సమీక్షించాలి. అత్యవసరంగా 29 పోస్టులను కేటాయించాలి.

ఐఐఎం కూడా ఏర్పాటు చేయండి

ఐఐటీ, నల్సార్, సెంట్రల్ వర్సిటీతో పాటు ఎన్నో పేరొందిన పరిశోధన, ఉన్నత విద్యా సంస్థలు హైదరాబాద్‌లో ఉన్నాయి. కేంద్రం ఐఐఎంను కూడా ఏర్పాటు చేస్తే అవసరమైన స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం కేటాయిస్తుంది.

ఇదం జగత్



అయ్యో! అది ఈడీ ఇచ్చిన నోటీసు కాదు పట్టించుకోకపోవడానికి! 'సుప్రీం' నోటీస్ అది!

క్లుప్తంగా...

నేడు రైతునేస్తం ప్రారంభం



సాక్షి, హైదరాబాద్: రైతులకు నూతన సాంకేతిక వ్యవసా యంపై అవగాహన కల్పించి వ్యవసాయ ఉత్పత్తిని పెంచే లక్ష్యంతో వ్యవ సాయ శాఖ ఆధ్వర్యంలో రైతు నేస్తం అనే కార్యక్రమాన్ని బుధవారం సచివాల యంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తెలిపారు. రాష్ట్రంలో ఉన్న రైతు వేదిక లను వీడి యో కాన్ఫరెన్స్ ద్వారా అనుసంధానం చేసే కార్యక్రమమే రైతునేస్తం అని వివరించారు. రైతు వేదికల ద్వారా అధిక రాబడిని పొందడంతో పాటు వ్యవసాయాన్ని లాభసాటిగా చేయడం రైతు నేస్తం లక్ష్యమని వెల్లడించారు.

సీఎంను కలిసిన చేవెళ్ల ఎమ్మెల్యే



చేవెళ్ల: ఎమ్మెల్యే కాలె యాదయ్య మంగళవారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ నేపథ్యంలో ఆయన కాంగ్రెస్ గూటికి చేరుతారన్న ప్రచారం జరిగింది. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ ఇటీవల విడుదలైన సీడీపీ నిధులతోపాటు చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధికి అదనపు నిధులు కేటాయించాలని కోరేందుకే ముఖ్యమంత్రిని కలిశానని చెప్పారు. ఇందులో ఎలాంటి రాజకీయ కోణం లేదని స్పష్టం చేశారు.

కాంగ్రెస్, బీజేపీ మధ్య చీకటి ఒప్పందం: దాసోజు



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్, బీజేపీ మధ్య తెలంగాణలో చీకటి ఒప్పందం ఉందని బీఆర్ఎస్ నాయకుడు దాసోజు శ్రవణ్ ఆరోపించారు. పీఎంను బడే భాయ్ అన్న రేవంత్‌రెడ్డి.. మోదీతో ఉన్న ఒప్పందమేంటో చెప్పాలని నిలదీశారు. రాహుల్‌గాంధీ ఓవైపు మోదీని దించేయాలని చూస్తుంటే.. రేవంత్ ఆయనే ప్రధానిగా ఉండాలని కోరుకుంటున్నారన్నారు. దీన్ని బట్టి మూడోసారి మోదీని ప్రధాని చేయాలని రేవంత్ తపిస్తున్నట్లు ఉందని శ్రవణ్ ఒక ప్రకటనలో ఎద్దేవాచేశారు. కాగా, శ్రవణ్ మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి అబద్ధాల పునాదులపైనే పాలన సాగిస్తున్నారని విమర్శించారు. కొత్తగా 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పిన రేవంత్ గతంలో కేసీఆర్ హయాంలో ఇచ్చిన నోటిఫికేషన్లను తన ఖాతాలో వేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఉద్యోగ ఖాళీలపై శ్వేతపత్రం ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ప్రతిపక్షాలు పొత్తులు పెట్టుకున్నా కాంగ్రెస్‌దే గెలుపు

కాంగ్రెస్ సీనియర్ నేత మల్లు రవి



సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలో ప్రతిపక్షాలు ఎవరెవరితో పొత్తులు పెట్టుకున్నా అంతిమ విజయం కాంగ్రెస్ పార్టీదే అని ఆ పార్టీ సీనియర్ నేత మల్లు రవి ధీమా వ్యక్తంచేశారు. ఎన్నికల వేళ పొత్తు సహజమే అని, అందులోభాగంగా బీఎస్పీతో పొత్తు కోసం సంప్రదింపులు జరిపా మని తెలిపారు. మంగళ వారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో రవి విలేకరులతో మాట్లా డారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణు గోపాల్‌ను కలిసి రాష్ట్ర రాజకీయాలు, నాగర్‌కర్నూలు ఎంపీ టికెట్ అంశంపై చర్చించానని తెలిపారు. నాగర్‌కర్నూలు టికెట్ అధిష్టానం తనకే కేటాయిస్తుందని, అందులో అనుమానం లేదని రవి ఆశాభావం వ్యక్తం చేశారు.

గాడిద మీద ఎక్కైనా ఎంపీ అవ్వాల్సిందేనా?

ఆర్ఎస్ ప్రవీణ్‌కు ఆకునూరి మురళి ప్రశ్న



సాక్షి, హైదరాబాద్: వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకోవాలని బీఎస్పీ నిర్ణయించడంపై రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి ఎక్స్ వేదికగా తీవ్రంగా స్పందించారు. గాడిద మీద ఎక్కి అయినా ఎంపీ కావల్సిందేనా? అని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రెండేళ్లపాటు చెప్పిన మాటలన్నీ తప్పయ్యాయా? భవిష్యత్తులో బీఆర్ఎస్ కేంద్రంలో ఎవరికి మద్దతు ఇస్తుందో మీకు తెలియదా? రాజ్యాంగాన్ని ఎవరు రద్దుచేస్తారో మీకు తెలియదా? అని ప్రవీణ్‌ను మురళి ప్రశ్నించారు. 'ఈ పరిణామంపై ఎలా స్పందించాలో అర్థం కావడం లేదు. రాజకీయాల్లో విలువలు ఉండవనే వాదనను మీరు కూడా అనుసరిస్తారా? అన్యాయం పోలీస్ బాస్. ఇది కరెక్టు కాదు. మిమ్మల్ని, మీ రాజకీయాలను చూసిన తర్వాత యువత ఇంక ఎవర్నీ నమ్మరు' అని పోస్ట్ చేశారు.

దీర్ఘకాలిక లక్ష్యంతోనే పొత్తు

- భావసారూప్య శక్తులను కలుపుకొని పోవాలి
- బీఎస్పీతో కలసికట్టుగా పనిచేసి ప్రజాభీష్టాన్ని నెరవేరుద్దాం
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నేతలతో భేటీలో కేసీఆర్
- మహబూబ్‌నగర్ లోక్‌సభ అభ్యర్థిగా మరోమారు 'మన్నె'

సాక్షి, హైదరాబాద్: ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా దీర్ఘకాలిక లక్ష్యంతోనే బీఎస్పీతో పొత్తు కుదుర్చుకున్నట్లు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రకటించారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం జరిగిన మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూలు లోక్‌సభ నియోజకవర్గాలకు చెందిన పార్టీ నేతలతో ఉమ్మడి భేటీలో కేసీఆర్ మాట్లా డారు. బీఎస్పీతో పొత్తుకు సంబంధించి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్‌తో జరిగిన చర్చలు, తీసుకున్న నిర్ణయాలను వివరించారు.

శక్తులను కూడదీసుకోవాలి

'ప్రస్తుత పరిస్థితుల్లో మనం మన శక్తులను కూడదీసుకోవడంతోపాటు కలసి వచ్చే భావసారూప్య శక్తులను కలుపుకొని పోవాలి. ఆ దిశగా మనం తీసుకున్న నిర్ణయం రాష్ట్రవ్యాప్తంగా ప్రజాప్రయోజనాలను కాపాడే దీర్ఘకాలిక లక్ష్యంతో కూడుకొని ఉంది. లౌకికవాద తాత్వికతతో బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో చేసిన కృషి దేశానికే ఆదర్శంగా నిలిచింది. ఈ నేపథ్యంలో దళిత బహుజన శక్తులతో కలసి పనిచేయడం ద్వారా తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు మరింత చేరువవుతాం. బీఎస్పీ కలసికట్టుగా పనిచేసి ప్రజాభీష్టాలను సంపూర్ణంగా నెరవేరుద్దాం. ఈ దిశగా మరిన్ని చర్చలు జరిపి రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో పొత్తుల విధివిధానాలను ఖరారు చేస్తాం' అని కేసీఆర్ ప్రకటించారు. ఈ ప్రకటనను హర్షధ్వానాల నడుమ ముక్తకంఠంతో పార్టీ నేతలు ఏకీభవించారు.

లోక్‌సభ ఎన్నికల్లో ప్రజాదరణ పొందుదాం

'ఉద్యమ కాలం నుంచి తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగానే బీఆర్ఎస్ పనిచేస్తోంది. అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ లోక్‌సభ ఎన్నికల్లో ప్రజాదరణ పొందుదాం. ఉమ్మడి రాష్ట్రంలో పాలకుల నిర్లక్ష్యంతో నిలిచిన పెండింగ్ ప్రాజెక్టుల తోపాటు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించాం. బీఆర్ఎస్ ప్రభుత్వం రూపొందించిన ఎత్తిపోతల పథకం ద్వారానే కొడంగల్‌కు పుష్కలంగా సాగునీటిని తరలించవచ్చు. అయినా ఉన్నదాన్ని తీసేసి కొడంగల్‌కు లిఫ్ట్‌ను ఏర్పాటు చేయాలను కోవడం సరైన నిర్ణయం కాదు' అని కేసీఆర్ వ్యాఖ్యానించారు. పార్టీని వీడే వారి గురించి ఆలోచించకుండా ప్రజా సమస్యలపై పోరాడదా మని పిలుపునిచ్చారు.

డొల్లతనంతో కాంగ్రెస్ సర్కార్ అభాసుపాలు

'ఓట్లేసి గెలిపించిన కాంగ్రెస్ ప్రభుత్వం తాగు, సాగునీరు, విద్యుత్ వంటి కనీస అవసరాలను తీర్చలేకపోవడంతో ప్రజలు విస్మయం చెందుతున్నారు. కొత్తగా ఇచ్చే తెలివి లేక గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను కూడా కొనసాగించలేక పాలనలోని డొల్లతనాన్ని స్వయంగా కాంగ్రెస్ సర్కార్ బయటపెట్టుకొని అభాసుపాలవుతోంది. ప్రభుత్వం ఏర్పాటై 100 రోజులు కాకముందే ప్రజావ్యతిరేకతను మూటకట్టుకుంది. అధికారం కోసం ఎన్నికల ముందు గ్యారంటీల పేరిట అలవికాని హామీలు ఇచ్చింది. ఇప్పుడు అమలు చేతకాక అబద్ధాలకు, బెదిరింపులకు దిగి తప్పించుకుంటోంది' అని కేసీఆర్ మండిపడ్డారు.

మహబూబ్‌నగర్ అభ్యర్థిగా మన్నె శ్రీనివాస్‌రెడ్డి



కేసీఆర్‌తో మన్నె శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి పేరును కేసీఆర్ ఖరారు చేశారు. ఆయన గెలుపు కోసం అనుసరించాల్సిన కార్యాచరణపై నేతలకు దిశానిర్దేశం చేశారు. తక్షణమే మండలాలవారీగా ఎన్నికల సన్నాహక సమావేశాల ఏర్పాటుకు షెడ్యూల్ సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ఆ తర్వాత నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలు ఉంటాయని, త్వరలో మహబూబ్‌నగర్ పట్టణంలో భారీ బహిరంగ సభ ఉంటుందని కేసీఆర్ ప్రకటించారు. మరోవైపు బీఎస్పీతో పొత్తు నేపథ్యంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ నాగర్‌కర్నూలు నుంచి పోటీ చేస్తారనే అంశాన్ని కేసీఆర్ సూత్రప్రాయంగా వెల్లడించారు. కాగా, ఉచిత ఎల్ఆర్ఎస్ బుధ, గురువారాల్లో రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు పిలుపునివ్వడం, శుక్రవారం శివరాత్రి పర్వదినం కావడంతో ఉమ్మడి జిల్లాలవారీగా నిర్వహిస్తున్న భేటీలకు బీఆర్ఎస్ 3 రోజుల బ్రేక్ ఇచ్చింది. ఈ నెల 9 నుంచి ఉమ్మడి జిల్లాలవారీగా కేసీఆర్‌తో భేటీలు తిరిగి మొదలయ్యే అవకాశాలు ఉన్నాయి.



మంగళవారం కేసీఆర్‌తో సమావేశమైన బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. ఎస్. ప్రవీణ్ కుమార్ బృందం. చిత్రంలో బాల్క సుమన్, వేముల ప్రశాంత్‌రెడ్డి, హరీశ్‌రావు

కలసి నడుస్తాం

▶ మొదటి పేజీ తరువాయి

కేసీఆర్ నివాసానికి చేరుకున్నారు. ఆయన వెంట బీఎస్పీ ప్రధాన కార్యదర్శి విజయ్ ఆర్య, ఉపాధ్యక్షుడు దయానంద్‌రావు ఉన్నారు. వారికి రాజ్యసభ ఎంపీ జె.సంతోష్ కుమార్ స్వాగతం పలికారు. కేసీఆర్‌తో భేటీలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తదితరులు పాల్గొన్నారు. సుమారు 3 గంటలపాటు జరిగిన ఈ భేటీలో జాతీయ, రాష్ట్ర రాజకీయాలకు సంబంధించిన పలు అంశాలపై చర్చ జరిగింది. కేసీఆర్‌తో కలసి ప్రవీణ్ కుమార్, ఇతర నేతలు మధ్యాహ్న భోజనం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో కలసి పోటీ చేయాలనే సూత్రప్రాయ అంగీకారం కుదిరిన నేపథ్యంలో కేసీఆర్, ప్రవీణ్ మీడియాతో మాట్లాడారు.

సిద్ధాంతపరంగా సారూప్యత ఉంది: కేసీఆర్


'వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణలో బీఆర్ఎస్, బీఎస్పీ కలసి పనిచేయాలని నిర్ణయించుకున్నాం. సిద్ధాంతపరంగా ఇరు పార్టీల నడుమ సారూప్యత ఉంది. మేము అమలు చేసిన దళితబంధు, దళిత సంక్షేమం, రెసిడెన్షియల్ పాఠశాలలు, బలహీనవర్గాల అభ్యున్నతి తదితరాల ఆధారంగా ఒక ప్రతిపాదన వస్తే ఇద్దరం కలసి చర్చించాం. బీఎస్పీ హైకమాండ్ అనుమతితో చర్చించి కలసి పనిచేయాలని స్థూలంగా ఒక నిర్ణయానికి వచ్చాం. మిగతా విషయాలు ఒకట్రెండు రోజుల్లో వెల్లడిస్తాం. ఎవరు ఎన్ని స్థానాల్లో పోటీ చేయాలనే అంశంపై బుధవారం చర్చిస్తాం. పొత్తుపై అవగాహన ఏర్పడిన నేపథ్యంలో గౌరవప్రదంగా సీట్ల పంపిణీ ఉంటుంది. నేను ఇప్పటివరకు బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతితో మాట్లాడలేదు. కానీ ఆమెతో ఉన్న పాత పరిచయాన్ని దృష్టిలో పెట్టుకొని నేను కూడా మాట్లాడతా' అని కేసీఆర్ తెలిపారు.

రాజ్యాంగం రద్దుకు బీజేపీ కుట్ర: ఆర్.ఎస్. ప్రవీణ్

'తెలంగాణతోపాటు దేశవ్యాప్తంగా లౌకికత్వం ప్రమాదంలో ఉంది. లౌకికత్వాన్ని దెబ్బతీసేందుకు, రాజ్యాంగాన్ని రద్దు చేసేందుకు బీజేపీ కుట్రలు చేస్తోంది. లౌకికవాదాన్ని కాపాడిన బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్‌ను మాయావతి ఆశీస్సులతో కలిశా. తెలంగాణలో రాజ్యాంగం, లౌకికత్వానికి ప్రమాదం పొంచి ఉంది. లౌకికత్వాన్ని దెబ్బతీసే విషయంలో కాంగ్రెస్ కూడా బీజేపీలాగానే మారుతోంది. ఇరు పార్టీల ముప్పు నుంచి తెలంగాణను కాపాడేందుకు కలసి పనిచేయాలని నిర్ణయించుకున్నాం. సీట్ల సర్దుబాటు విషయంలో మా అధిష్టానానికి నివేదిస్తాం. మా స్నేహాన్ని ప్రజలు ఆశీర్వదిస్తారు' అని ఆర్.ఎస్. ప్రవీణ్ పేర్కొన్నారు.

అలా ఆదేశాలు ఇవ్వలేం

మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ భద్రతపై హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: ప్రతి ఒక్కరికి 4 ప్లస్ 4 భద్రత కల్పించాలంటూ ఆదేశాలు ఇవ్వలేమని హైకోర్టు స్పష్టం చేసింది. ఆ మేరకు భద్రత కల్పించేలా ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలన్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ విజ్ఞప్తిని నిరాకరించింది. ఈ విషయంపై కౌంటర్ దాఖలు చేయాలని డీజీపీని ఆదేశిస్తూ, తదుపరి విచారణను ఈ నెల 19కి వాయిదా వేసింది. తనకు ప్రాణహాని ఉందని, 4 ప్లస్ 4 భద్రత కల్పించాలంటూ గత డిసెంబర్‌లో డీజీపీకి వినతిపత్రం సమర్పించినా పట్టించుకోవడంలేదంటూ హైకోర్టులో శ్రీనివాస్‌గౌడ్ పిటిషన్ దాఖలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఎక్సైజ్, క్రీడలు, యువజన సర్వీసులు, టూరిజం.. ఇలా పలు శాఖలకు మంత్రిగా పనిచేశానని ఆయన పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి మంగళవారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ప్రతి ఒక్కరికీ ఇలా కేటాయించడం సాధ్యం కాదని వ్యాఖ్యానిస్తూ, శ్రీనివాస్ గౌడ్‌కు గన్‌మెన్లు అవసరమో.. లేదో తెలపా లని డీజీపీని ఆదేశించారు. మార్చి 19లోగా దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని చెప్పారు.

రేవంత్ మూలాలు బీజేపీలో..

- ప్రధాని మోదీని పొగిడి రాహుల్‌ను వేస్ట్‌ఫెలోను చేశాడు
- ఆయన మరో ఏక్‌నాథ్ షిండే, హిమంత బిశ్వశర్మ
- సిరిసిల్ల, ముస్తాబాద్ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశాల్లో కేటీఆర్



సిరిసిల్ల తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న కేటీఆర్

సిరిసిల్ల: రాష్ట్ర పర్యటనకు వచ్చిన ప్రధాని మోదీని 'పెద్దన్నయ్య'గా పొగిడి ఆయన ప్రాపకం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రయత్నించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు విమర్శించారు. భవిష్యత్తులోనూ ప్రధాని ఆశీస్సులు ఉండాలని కోరడం ద్వారా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని పరోక్షంగా వేస్ట్‌ఫెలో అని రేవంత్ చెప్పినట్లు అయిందని ఎద్దేవా చేశారు. రేవంత్ మూలాలు బీజేపీలో ఉన్నాయని... ఆయన మరో ఏక్‌నాథ్ షిండే (శివసేనను చీల్చి బీజేపీ మద్దతుతో మహారాష్ట్ర సీఎం అయిన నేత), హిమంత బిశ్వశర్మ (కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరి సీఎం అయిన అస్సాం సీఎం) అని వ్యాఖ్యానించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్, సిరిసిల్లలో మంగళవారం జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ ప్రసంగించారు.

రుణమాఫీ, రైతుబంధు ఏదీ?

బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని కేటీఆర్ చెప్పారు. తాము తీసుకొచ్చిన అనేక పథకాలను కేంద్రం కాపీ కొట్టిందన్నారు. అలాంటిది రాష్ట్రంలో గుజరాత్ నమూనా అభివృద్ధికి సహకరించాలని ప్రధానిని సీఎం రేవంత్ కోరడమంటే తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరచడమేనని మండిపడ్డారు. ఆయన సీఎం కావడం మన కర్మ అని పేర్కొన్నారు. ప్రజలు మోసపోవాలని కోరుకుంటున్నారని గతంలో మీడియా ముందు రేవంత్ చెప్పారని, ఇప్పుడు అదే జరిగిందన్నారు. రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని ఇప్పటికీ రైతుబంధు వేయలేదని ఎద్దేవా చేశారు. కేసీఆర్ హయాంలో ఎర్రని ఎండల్లోనూ చెరువులు మత్తడి దూకితే ప్రస్తుతం కరెంట్ కోతలు, నీరులేక పొలాలు ఎండిపోతున్నాయన్నారు.

కాళేశ్వరం గురించి కాంగ్రెస్ సన్నాసులకు ఏం తెలుసు?

కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల రూ. లక్ష కోట్లు గంగపాలయ్యాయని కాంగ్రెసోళ్లు అంటున్నారని, ఆ ప్రాజెక్టు గురించి కాంగ్రెస్ సన్నాసులకు ఏం తెలుసని కేటీఆర్ ప్రశ్నించారు. సగం తెలంగాణ కాళేశ్వరం పరిధిలో ఉందని, 270 కి.మీ. సొరంగంతో వందల కి.మీ. కాల్వలతో పంపుహౌస్‌లు, విద్యుత్ సబ్‌స్టేషన్లతో గోదావరి జలాలను ఎత్తిపోస్తూ చెరువులను నింపామన్నారు. కాళేశ్వరం నీటితో 3.50 కోట్ల టన్నుల ధాన్యాన్ని పండించే స్థాయికి రైతులు చేరుకున్నారని వివరించారు. మేడిగడ్డలో ఒక్క పిల్లర్ కుంగిపోతే.. మొత్తం ప్రాజెక్టు గంగపాలైనట్లు ప్రచారం చేస్తున్నారని, మేడిగడ్డ వద్ద కుంగిన పిల్లర్ చుట్టూరా కాఫర్ డ్యాం కట్టి ఇప్పటికీ నీటిని ఎత్తిపోయొచ్చని, పొలాలు ఎండకుండా చూడొచ్చన్నారు. కానీ ఈ ప్రభుత్వానికి ఆ తెలివి లేదని కేటీఆర్ విమర్శించారు. కేసీఆర్‌పై కోపాన్ని రేవంత్ రైతులపై చూపుతున్నారని... సిరిసిల్ల పవర్‌లూం పరిశ్రమకు బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వకుండా తనపై కోపాన్ని నేతన్నలపై చూపుతున్నారని కేటీఆర్ ఆరోపించారు.

రేవంత్ రంగు.. కాంగ్రెస్ పొంగు తెలిసింది

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నోటిఫికేషన్లు ఇస్తే ఇప్పుడు నియామక పత్రాలు అందిస్తూ 30 వేల ఉద్యోగాలిచ్చామని సీఎం రేవంత్ పేర్కొనడం మందికి పుట్టిన బిడ్డను సొంత బిడ్డగా ముద్దాడినట్లు ఉందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి రంగు.. కాంగ్రెస్ పొంగు తెలిసిపోయిందని, 50 ఏళ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ మళ్లీ ప్రజలను మోసం చేయాలని చూస్తోందన్నారు. గురువారం సిరిసిల్లకు వస్తున్న రేవంత్... కేసీఆర్ హయాంలో సిరిసిల్లలో జరిగిన అభివృద్ధిని చూడాలని సూచించారు. మల్కపేట రిజర్వాయర్‌ను ప్రారంభించాలని, సిరిసిల్ల వర్కర్లను ఓనర్లను చేయాలని, సిరిసిల్ల నేతన్నలకు బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వాలని, పాత బకాయిలను నేతన్నలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సిరిసిల్ల జిల్లాకు బండి ఏం చేశారు?

కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ సిరిసిల్ల జిల్లాకు ఏం చేశారో చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. అమిత్ షా చెప్పులు మోయడం తప్ప ఒక్క గుడి.. ఒక్క బడి కట్టలేదని ఆరోపించారు. ప్రజలకు ఏం చేశారని ప్రజాసంకల్ప యాత్ర చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మీ, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఎల్ఆర్ఎస్ కోసం నేడు బీఆర్ఎస్ ధర్నాలు


అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఆందోళనలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ప్లాట్లు, లేఔట్ల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం అమలు చేయనున్న భూ క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్)లో చార్జీలు వసూలు చేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ బుధవారం అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలు చేపట్టనుంది. హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ కార్యాలయాల ఎదుట కూడా నిరసనలకు దిగనుంది. అలాగే గురువారం జిల్లా కలెక్టర్లు, ఆర్డీఓలకు వినతి పత్రాలు సమర్పించనుంది. ఈ కార్యక్రమాల్లో పార్టీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జీలు పాల్గొనను న్నారు. చార్జీల వసూలుతో సుమారు 25 లక్షల మందిపై ఆర్థిక భారం పడుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించడం తెలిసిందే.

ఉచిత విద్యుత్‌లో అన్యాయం సరిదిద్దండి

సీఎంకు హరీశ్‌రావు లేఖ



సాక్షి, హైదరాబాద్: నిరుపేదలకు 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ పథకం అమల్లో అర్హులకు జరుగుతున్న అన్యాయాన్ని సరిదిద్దాలని సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఉద్దేశిస్తూ మంగళవారం బహిరంగ లేఖ రాశారు. ప్రభుత్వం రెండు వందల యూనిట్ల వరకే జీరో బిల్లు ఇస్తూ ఒక్క యూనిట్ అదనంగా విని యోగించినా మొత్తం యూనిట్లకు బిల్లును వసూలు చేస్తున్నారన్నారు. దీంతో పేదలైన లబ్ధిదారులు కరెంటు మీటరును చూస్తూ కాలం గడపాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. 200 యూనిట్లను బిల్లు నుంచి మినహాయించి అదనపు యూనిట్లకు మాత్రమే డబ్బులు చెల్లించేలా బిల్లింగ్ వ్యవస్థను మార్చాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో 90 లక్షల మందికి తెల్ల రేషన్ కార్డులు ఉండగా, ఇందులో కేవలం 30 లక్షల మందికి మాత్రమే ఉచిత విద్యుత్ పథకం అమలవు తోందని చెప్పారు. హైదరా బాద్‌లో 30 లక్షల అర్హు లైన కుటుంబాలు ఉండగా కేవలం 10 లక్షలకు మాత్రమే ఈ పథకం వర్తింప చేయడం సరికాదని హరీశ్ తన లేఖలో పేర్కొన్నారు.

పిల్లలు పిట్టల్లా రాలిపోతున్నా.. రివ్యూ చేయని సీఎం

- కేసీఆర్‌పై ఏడవటం తప్ప ఈ ప్రభుత్వం చేసిందేమీ లేదు
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శ



కామారెడ్డి క్రైం: బీసీ, ఎస్సీ, ఎస్టీ గురుకులాల్లో విద్యార్థులు పిట్టల్లా రాలిపోతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, సీఎం రేవంత్‌రెడ్డి కనీసం రివ్యూ చేయడం లేదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. నిజామాబాద్ జిల్లా బోధన్‌లోని బీసీ హాస్టల్‌లో తోటి విద్యార్థుల దాడిలో మృతి చెందిన కామారెడ్డి జిల్లా గాంధారి మండలం తిప్పారం తండా విద్యార్థి వెంకట్రాం కుటుంబాన్ని మంగళవారం కవిత పరామర్శించారు. అనంతరం పొందుర్తిలో మీడియాతో మాట్లాడారు. హాస్టల్‌లో విద్యార్థుల మధ్య ఘర్షణ జరగడం అధికార యంత్రాంగం వైఫల్యమేనన్నారు. ఇటీవల కాలంలోనే హాస్టళ్లలోనే అయిదుగురు విద్యార్థులు మృత్యువాత పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. పబ్లిసిటీ స్టంట్‌లు, ఎంతసేపూ కేసీఆర్‌పై ఏడవడం తప్ప రేవంత్ ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. కేసీఆర్ ఇచ్చిన ప్రభుత్వ ఉద్యోగాలకే సీఎం రేవంత్‌రెడ్డి నియామక పత్రాలు అందజేస్తున్నారన్నారు. బడ్జెట్‌లో రాష్ట్రా నికి రూపాయి కేటాయించని ప్రధాన మంత్రిని సీఎం రేవంత్‌రెడ్డి పెద్దన్న అనడం ఏమిటని ప్రశ్నించారు. వాళ్ల మధ్య రాజకీయ అవగాహన ఉందని ఆరోపించారు. మైనార్టీ డిక్లరేషన్‌లో ఏం చెప్పారో, ప్రభుత్వం వచ్చాక ఇప్పటివరకు ఏమి ఇచ్చారో షబ్బీర్ అలీ చెప్పాలని కవిత డిమాండ్ చేశారు.

జీవో 3పై బహిరంగ చర్చకు సిద్ధం

కవితకు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ సవాల్



సాక్షి, హైదరాబాద్: జీవో 3పై తాము బహిరంగ చర్చకు సిద్ధమని, ధర్నా చౌక్‌కు రమ్మంటే కూడా వస్తామని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ సవాల్ విసిరారు. మంగళవారం అసెంబ్లీ మీడియా హాల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. జీవోపై నిరుద్యోగులను, మహిళలను తప్పుదోవ పట్టించవద్దన్నారు. గత బీఆర్ఎస్ నిరుద్యోగులకు అన్యాయం చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగాలిచ్చి ఆదుకుంటోందని చెప్పారు. నిరుద్యోగులకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేస్తున్నామని, లీగల్ పాయి ంట్స్, రోస్టర్ విధానాన్ని తెర మీదికి తీసుకొచ్చి నిరుద్యోగులను కన్ఫ్యూజ్ చేస్తున్నారని వెంకట్ ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్‌లో మహిళ అంటే కవితే కనిపిస్తారని, కాంగ్రెస్‌లో మహిళలంటే మంత్రులుగా సీతక్క, సురేఖ, టీపీసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ కనిపిస్తారన్నారు.

'సీఎం ఇచ్చిన మర్యాదను పీఎం నిలబెట్టుకోలేదు'



సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చి న మర్యాదను ప్రధాని మోదీ నిలబెట్టుకోలేదని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్ కుటుంబానికి ఏటీఎంగా మారిందని గతంలో విమర్శించిన ప్రధాని ఇప్పుడు ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆయన ప్రశ్నించారు. మంగళవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేసీఆర్ భూ ఆక్రమణలు, ప్రాజెక్టుల్లో అక్రమాలు, అవినీతిపై చేసిన ఫిర్యాదులను కేంద్రం చెత్త బుట్టలో వేసిందని విమర్శించారు. బీఆర్ఎస్, బీజేపీ తోడు దొంగలని నిందించిన మల్‌రెడ్డి పార్లమెంటులో బీజేపీకి బీఆర్ఎస్ అనేక సార్లు మద్దతు పలికిందని గుర్తుచేశారు. కేసీఆర్‌ని కాపాడుతోంది కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమేనన్నారు. లిక్కర్ స్కాంలో కవితను ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రశ్నించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో దామోదర్‌రెడ్డి పోటీ!



ఖమ్మం మామిళ్లగూడెం: పెండింగ్‌లో ఉన్న విశ్రాంత ఉద్యోగులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోగా, వీటిపై మండలిలో చర్చించే పరిస్థితి లేనందున ఖమ్మం, వరంగల్, నల్లగొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానం నుంచి పోటీకి దిగాలని ఆలోచిస్తు న్నట్లు రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి. దామోదర్‌రెడ్డి తెలిపారు. ఖమ్మంలో మంగళవారం జరిగిన ఖమ్మం, నల్లగొండ, వరంగల్ ఉమ్మడి జిల్లాల స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థిని పోటీకి దింపడం ద్వారా సమస్యలను పరిష్క రించుకోవచ్చని తెలిపారు. అనంతరం సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు కల్యాణం కృష్ణయ్య, సెక్రటరీ జనరల్ చంద్రశేఖర్ మాట్లాడుతూ, గ్రాడ్యుయేట్లు, విశ్రాంత ఉద్యోగులు, ఉద్యోగులంతా ఓటర్లుగా నమోదు చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీతారామయ్య, రాష్ట్ర కార్యదర్శి పైడిపల్లి శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ పరిణతి కనబరిచారు

రేవంత్ రెడ్డి' పెద్దన్న' వ్యాఖ్యలపై బీజేపీ నేత మురళీధర్ రావు



సాక్షి, న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీనుద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి చేసిన పెద్దన్న వ్యాఖ్యలపై బీజేపీ సీనియర్ నేత మురళీధర్‌రావు స్పందించారు. తెలంగాణ ముఖ్యమంత్రి 'పరిణతి' ప్రదర్శించారని మురళీధర్‌రావు ప్రశంసించారు. ప్రధాని నరేంద్రమోదీ ఎప్పుడూ చెప్పే 'పీపుల్ ఫస్ట్, నేషన్ ఫస్ట్' అనే విధానాన్ని రేవంత్ రెడ్డి అనుసరించి తనకు రాష్ట్రమే తొలి ప్రాధాన్యత అని చెప్పారని పేర్కొన్నారు. ఈ మేరకు మురళీధర్ రావు మంగళవారం ఒక జాతీయ వార్తా సంస్థతో మాట్లాడుతూ, రేవంత్ రెడ్డి రాష్ట్రం కోసం స్వయం ప్రతిపత్తితో నిర్ణయం తీసుకోగల సమర్థుడని, ప్రధాని కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా తనది రాహుల్ గాంధీ కంటే భిన్నమైన వ్యక్తిత్వమని చూపించారన్నారు.

ప్రచారానికే మోదీ ప్రాధాన్యత: తమ్మినేని



సాక్షి, హైదరాబాద్: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ రెండు రోజుల రాష్ట్ర పర్యటనలో అభివృద్ధి అంశాల కంటే ఎన్నికల ప్రచారానికే ప్రాధాన్యత ఇచ్చారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. ఇది ఎన్నికల సభ కాదంటూనే 400 సీట్లు...బీజేపీకి అందరి మద్దతు అంటూ ప్రసంగం చేశారని మంగళవారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. తెలంగాణ అభివృద్ధికి ఎంతో చేశామని మాట్లాడిన మోదీ, ఆదిలాబాద్ జిల్లా ప్రజలు సుదీర్ఘ కాలంగా ఎదురుచూస్తున్న సీసీఐ పరిశ్రమ పునఃప్రారంభం ఏమైందో చెప్పాలని ప్రశ్నించారు. ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ వరకు రైల్వేలైన్ మంజూరు చేయాలని, జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు చేయాలని అడిగినా ఎందుకు పట్టించుకోలేదని పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లాలో అనేక పనులు పెండింగ్‌లో వున్నాయని, నిజాంపేట్-బీదర్ జాతీయ రహదారి, మెదక్-సంగారెడ్డి రైల్వేలైను, జిల్లాలో కేంద్రీయ విద్యాలయం, ట్రామాకేర్ ఏర్పాటు వంటి వాటిపై ప్రస్తావనే లేదని ఆయన గుర్తుచేశారు. మోదీ ఊకదంపుడు ఉపన్యాసం రాబోయే పార్లమెంటు ఎన్నికల ప్రచారం కోసం తప్ప రాష్ట్రాభివృద్ధికి తోడ్పడేది కాదని తమ్మినేని విమర్శించారు.

బాంబే హైకోర్టు తీర్పు హర్షణీయం..

ఎంతో కాలంగా దేశద్రోహ చట్టం, మావోయిస్టులతో సంబంధాలున్నాయనే నెపంతో అరెస్టు అయిన ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబాతో పాటు, మరో ఐదుగురిని బాంబే హైకోర్టు నిర్దోషులుగా ప్రకటించడంపై సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హర్షం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య హక్కులను కాపాడే బాంబే హైకోర్టు తీర్పునకు అనుగుణంగా వెంటనే వారిని విడుదల చేయాలని కోరారు.



వృద్ధాప్యం, అనారోగ్యం, మరణం- ఇవి లోపలి నుంచి కాల్చే మంటల్లాంటివి. ఇవి మరింత చెలరేగకుండా ఉండాలంటే, ధ్యానం ద్వారా వాటిని ఆర్పడానికి ప్రయత్నించాలి.

– థానిస్సరో భిక్షు (బౌద్ధ ధర్మం)

సాక్షి

బుధవారం, 6 మార్చి 2024

కొరకరాని కొయ్య ట్రంప్!

ఎన్ని అడ్డదారులు తొక్కినా, ఎలాంటి ప్రసంగాలు చేస్తున్నా అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో మొదట రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిత్వాన్నీ, ఆ తర్వాత అధ్యక్ష స్థానాన్నీ డోనాల్డ్ ట్రంప్ గెల్చుకోవటం ఖాయమని తాజా పరిణామాలు తెలియజేస్తున్నాయి. కొలరాడోలో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిత్వం కోసం జరిగే ఎన్నికలో బ్యాలెట్ పత్రంపై ట్రంప్ పేరు తొలగించాలన్న ఆ రాష్ట్ర సుప్రీంకోర్టు తీర్పును దేశ సర్వోన్నత న్యాయస్థానం ఏకగ్రీవంగా తోసిపుచ్చటం ఆయనకు కొత్త శక్తినిస్తుందనటంలో సందేహం లేదు. 'సూపర్ ట్యూజ్‌డే' కింద మంగళవారం ఒకేసారి పదిహేను రాష్ట్రాల్లో పార్టీ అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం ఎన్నికలు జరగనుండగా ఒకరోజు ముందు ఈ తీర్పు వెలువడింది. ట్రంప్ ఇప్పటికే అయోవా, న్యూహాంప్‌షైర్, నెవడా ప్రైమరీలను గెల్చుకోవటంతోపాటు తన ప్రత్యర్థి హేలీకి బలం వుంటుందని భావించిన ఆమె స్వస్థలం సౌత్ కరోలినాలో సైతం సత్తా నిరూపించుకున్నారు. 'సూపర్ ట్యూజ్‌డే' పోలింగ్‌లో సైతం ఆయనదే పైచేయి అని ప్రాథమిక సమాచారం చెబుతోంది. అయితే రకరకాల కేసుల్లో చిక్కుకుని వాటినుంచి బయటపడటానికి అనుసరించాల్సిన వ్యూహంపై న్యాయవాదులతో నిరంతరం సంప్రదింపులు జరపాల్సిరావటం, న్యాయస్థానాలకు హాజరుకావటం ట్రంప్ ప్రచారాన్ని దెబ్బతీస్తోందనే చెప్పాలి. న్యాయస్థానాలకు సెలవు దినాలైన శని, ఆదివారాల్లో మాత్రమే ఆయన ర్యాలీలు నిర్వహిస్తున్నారు. వాటిల్లో సైతం సరిగా దృష్టి సారించలేకపోతున్నారు. ప్రసంగాలకు బదులు కరచాలనాలతో సరిపెడుతున్నారు.

అయితే ఇదంతా ట్రంప్ స్వయంకృతం. దేశాధ్యక్ష ఎన్నికల్లో తనకు లభించిన విజయాన్ని డెమాక్రాటిక్ పార్టీ కొల్లగొట్టిందని ఆరోపిస్తూ కాపిటల్ హిల్‌పైకి మద్దతుదార్లను ఉసిగొల్పి విధ్వంసానికి కారకులయ్యారు. దాదాపు మూడు గంటలపాటు ఆ భవన సముదాయాన్ని మూకలు చేజిక్కించుకున్నాయి. ఆయన ప్రత్యర్థి, డెమాక్రాటిక్ అభ్యర్థి జో బైడెన్ విజయాన్ని ధ్రువీకరించటానికి 2021 జనవరిలో అమెరికా సెనేట్, ప్రతినిధుల సభ సంయుక్త సమావేశాన్ని నిర్వహిస్తున్న సమయంలో జరిగిన ఆ దాడి దేశంలోనే కాదు... ప్రపంచవ్యాప్తంగా అందరినీ నివ్వెరపరిచింది. నిజానికి ఈ కేసులోనే కొలరాడో సుప్రీంకోర్టు అధ్యక్ష అభ్యర్థిత్వానికి పోటీపడే అర్హతను ట్రంప్ కోల్పోయారని తీర్పునిచ్చింది. రాజ్యాంగంపై ప్రమాణం చేసి అధికారంలోకొచ్చిన ఎవరైనా అందుకు భిన్నంగా తిరుగుబాట్లను రెచ్చగొడితే భవిష్యత్తులో పదవులు చేపట్టటానికి అనర్హులవుతారని చెప్పే రాజ్యాంగం 14వ సవరణలోని సెక్షన్ 3కి అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకుంది. మెయిన్, ఇల్లినాయి సుప్రీంకోర్టులు సైతం ఇలాగే నిర్ణయం తీసుకునే అవకాశం వున్నదని అందరూ అనుకున్నారు. కానీ దేశ సుప్రీంకోర్టు తీర్పుతో అవి నిలిచిపోయాయి. జాతీయ స్థాయి ఎన్నికల్లో పోటీపడే అభ్యర్థులపై ఇలా ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం నిర్ణయాలు తీసుకుంటే... అవి పరస్పర విరుద్ధంగా వుంటే ఒకరకమైన అరాచకానికి దారితీస్తుందని ధర్మాసనంలోని తొమ్మిదిమంది న్యాయమూర్తులూ భావించారు. వీరిలో ఆరుగురు మితవాద న్యాయమూర్తులైతే మరో ముగ్గురు ఉదారవాదులు. దేశమంతటికీ వర్తించేలా పార్లమెంటు మాత్రమే అలాంటి నిర్ణయం తీసుకోవాలన్నది వారి ఉద్దేశం. అయితే పార్లమెంటు ఉభయసభలైన సెనేట్, ప్రతినిధుల సభల్లో అధికార విపక్షాలిద్దరికీ చెరోచోటా ఆధిక్యత వున్నప్పుడు సమస్య మరింత జటిలంగా మారుతుంది. ట్రంప్ అధ్యక్ష పదవి గెల్చుకున్నాక దాన్ని ధ్రువీకరించటానికి నిర్వహించే పార్లమెంటు సమావేశం కాస్తా ఆయన ఎన్నికను రద్దు చేస్తే దేశవ్యాప్తంగా ఎలాంటి పరిస్థితులు చోటుచేసుకుంటాయన్నది ఊహాతీతం. కాపిటల్ హిల్‌పై దాడికి సంబంధించి ట్రంప్‌పై నాలుగు వేర్వేరు కేసులు విచారణలో వున్నాయి. వాటిల్లోని దాదాపు 93 ఆరోపణలనూ ఆయన తోసిపుచ్చారు. ఆ నేరాలు తాను చేయలేదనటం మాత్రమే కాదు... ఇవన్నీ పదవిలో వుండగా వచ్చిన ఆరోపణలు కనుక అధ్యక్షుడిగా తనకు రక్షణ వుంటుందంటున్నారు. అధ్యక్ష పదవిలో వున్న నాయకుడిపై క్రిమినల్ నేరారోపణలు రావటం అమెరికా చరిత్రలో ఇదే మొదటిసారి. కాపిటల్ హిల్‌పై దాడికి ఆయన పిలుపు ఇచ్చివుండొచ్చుగానీ, ఆయన స్వయంగా ఈ దాడిలో పాల్గొనలేదన్నది ట్రంప్ న్యాయవాదుల వాదన. ఈ విషయంలో దేశ సుప్రీంకోర్టు ఏం చెబుతుందన్నది ఇప్పుడు అందరినీ వేధిస్తున్న ప్రశ్న. వాస్తవానికి వచ్చే నెల 22న సుప్రీంకోర్టు దీనిపై విచారణను ప్రారంభించాలి. కానీ ప్రతి దశలోనూ ఏదో ఒక అభ్యంతరంతో అడ్డుకుంటున్న ట్రంప్ న్యాయవాదులు దాన్ని సజావుగా సాగనిస్తారా అన్నది చూడాల్సివుంది.

అయితే ట్రంప్ కష్టాలు ఈ కేసుతో తీరిపోతాయనడానికి లేదు. ఆయన చుట్టూ మరిన్ని కేసులున్నాయి. నీలి చిత్రాల తార స్టార్మీ డేనియల్స్ తనపై ఆరోపణలు చేయకుండా వుండటానికి ఆమెకు భారీ మొత్తంలో డబ్బు ముట్టజెప్పారన్న అభియోగం అందులో ఒకటి. న్యూయార్క్ రియల్ ఎస్టేట్ మోసం కేసులో ఆయన 50 కోట్ల డాలర్ల పరిహారం చెల్లించాలని తీర్పు వెలువడింది. ప్రస్తుతం ఆ మొత్తాన్ని సమీకరించటానికి ఆయన పాట్లు పడుతున్నారు. అధ్యక్ష ఎన్నికల కోసం విరాళాలు సేకరించటం సరేసరి. ఇదిగాక ట్రంప్ తనపై అత్యాచారానికి పాల్పడ్డాడని కాలమిస్టు జీన్ కరోల్ ఆరోపించారు. అందులో 50 లక్షల డాలర్ల పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించగా, ఆమె పరువు ప్రతిష్ఠలు దెబ్బతీశారన్న ఆరోపణకు సంబంధించి 8 కోట్ల 30 లక్షల డాలర్లు ఇవ్వాలని మరో కోర్టు నిర్ణయించింది. వీటిపై అప్పీళ్లకు వెళ్లదల్చుకున్నారు. జనంలో వరస విజయాలు సాధిస్తున్న ట్రంప్‌ను న్యాయస్థానాల ద్వారా నిరోధించే డెమాక్రాటిక్ పార్టీ వ్యూహం వారికి ఏమేరకు లాభిస్తుందో వేచిచూడాలి.

మూడా? ముప్పై మూడా?

అభిప్రాయం



కల్వకుంట్ల కవిత

ఒకప్పుడు కేవలం ఇంటికే పరిమితమై ఉన్న భారతీయ మహిళలు ఇవ్వాళ అన్ని రంగాల్లోనూ తమదైన ప్రతిభను చూపుతున్నారు. వారి ప్రస్తుతం ఉన్న ఈ స్థితికి ఎందరో సంస్కర్తలు, ప్రజా, మహిళా సంఘాలు, ప్రభుత్వాల కృషి ఉంది. ముఖ్యంగా మహిళలకు విద్య, ఉద్యోగాల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ 1996లో తీసుకువచ్చిన జీవో నంబర్ 41 మహిళల పాలిట వరం వంటిది. ఈ జీవో ప్రకారం మహిళలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో సమాంతర రిజర్వేషన్లు అమలు చేయాలి. ఇందుకోసం మహిళలకు రోస్టర్ పాయింట్లు నిర్ణయించాలి. ఓపెన్, ఎస్సీ, ఎస్టీ, బీసీ కేటగిరీల్లో తొలి పోస్టులను మహిళలకు రిజర్వు చేయాలి. ప్రతి మూడో పోస్ట్ మహిళకు కేటాయించాలి.

ఈ దేశంలో మహిళలు అనేక సంవత్సరాలుగా అణచివేతకు, వివక్షకు, లైంగిక వేధింపులకు గురయ్యారు. పురుషాధిక్య సమాజం స్త్రీని వంటింటికి పరిమితం చేసి బయటి ప్రపంచానికి దూరంగా ఉంచింది. బడికి దూరంగా ఉంచి, విజ్ఞానానికి దూరం చేసింది. పాశ్చాత్య దేశాల్లో జరిగిన స్త్రీ చైతన్య పోరాటాలు క్రమంగా భారత్‌లోని ఆలోచనాపరులనూ మేల్కొ లపడంతో పరిస్థితుల్లో మార్పు వచ్చింది. ముఖ్యంగా ఈ దేశంలో మహిళా విద్య కోసం మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రి బాయి పూలే వంటి అనేకమంది సంఘ సంస్కర్తలు చేసిన పోరాటాలు స్త్రీ విద్య అభివృద్ధి చెందడానికి ఎంతో దోహదం చేశాయి. స్త్రీ, పురుష సమానత్వ భావజాలం క్రమేపీ పెరుగుతూ వచ్చింది. భారత దేశ స్వాతంత్ర్యం తర్వాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ మనకు ఇచ్చిన రాజ్యాంగంలో స్త్రీలకు అన్నీ హక్కులు కల్పించబడ్డాయి. అందులో భాగంగానే స్త్రీ చదువుకోవడానికి మార్గం సుగమమయ్యింది.

విద్యా, ఉద్యోగాల్లో మహిళలకు రిజర్వేషన్ ఇచ్చి వారిని మరింత ప్రోత్సహించాలని ఉద్యమాలు ఫలించి విద్య, ఉద్యోగాల్లో స్త్రీలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ 1996లో జీవో నం. 41 విడుదలయ్యింది. ఇది మహిళలకు ఒక వరంగా మనం భావించాలి. ఈ జీవో ప్రకారం మహిళలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో సమాంతర రిజర్వేషన్లు అమలు చేయాలి. ఇందుకోసం మహిళలకు రోస్టర్ పాయింట్లు నిర్ణయించాలి. ఓపెన్, ఎస్సీ, ఎస్టీ, బీసీ కేటగిరీల్లో తొలి పోస్టులను మహిళలకు రిజర్వు చేయాలి. ప్రతి మూడో పోస్ట్ మహిళకు కేటాయించాలి. తద్వారా మహిళలకు న్యాయం జరుగుతుంది. మహిళా రిజర్వేషన్‌కు ముందు ఉద్యోగ నియామకాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు వర్టికల్ రిజర్వేషన్లు అమలయ్యాయి. అంటే ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు కేటాయించిన పోస్టులను ఆ యా వర్గాలతోనే భర్తీ చేశారన్నమాట. ఈ కేటగిరీలవారు ఓపెన్ కేటగిరీ (ఓసీ)లో మెరిట్‌తో ఎంపికైతే వారికి రిజర్వు చేసిన పోస్టులు అలాగే ఉండేవి. వాటిని ఆ యా రిజర్వుడు వర్గాల అభ్యర్థులతో మాత్రమే భర్తీ చేసేవారు. ఇదే పద్ధతిలో మహిళలకు, సబార్డినేట్ సర్వీసు నిబంధన రూల్ నం. 22 (ఏ) ప్రకారం రిజర్వేషన్లు అమలయ్యాయి. ఈ విధానంలో మహిళలు ఓపెన్‌లో, రిజర్వుడు కేటగిరీల్లో జనరల్ మెరిట్‌లో పోస్టులు సాధించినప్పటికీ, వారికి ప్రత్యేకంగా రిజర్వు చేసిన పోస్టులు వారికే ఉంటాయి. అయితే రాజ్యాంగంలో మహిళలకు సమాంతర రిజర్వేషన్లు ఉన్నాయి కాబట్టి వాటి ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేయాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో ప్రత్యేకంగా రోస్టర్ పాయింట్‌ను మార్కు చేయకూడదనేది ఈ ఆదేశాల్లో గమనించవలసిన అంశం. ఈ నిబంధనతోనే సమస్యలు వస్తున్నాయి.

ఈ ఆదేశాల ప్రకారం ఒక కేటగిరీలో మూడు కన్నా ఎక్కువ



పోస్టులు ఉన్నపుడు మాత్రమే మహిళకు పోస్టు రిజర్వు అవుతుంది. ఒకవేళ మూడు కన్నా తక్కువ పోస్టులు ఉంటే రిజర్వు చేయరు. సాధారణంగా ప్రభుత్వ విభాగాలు, కేటగిరీలు, పోస్టుల కేటగిరీ ఆధారంగా వంద పోస్టులు ఉన్నపుడే ఇది సాధ్యమవుతుంది. ఒక నోటిఫికేషన్‌లో వేర్వేరు విభాగాలు, వేర్వేరు జిల్లాలు, వేర్వేరు కేటగిరీలకు సంబంధించిన పోస్టులు తక్కువ సంఖ్యలో ఉంటాయి. అవన్నీ ఒకచోట తీసుకున్నపుడు ఎక్కువగా కనిపిస్తాయి. తాజా ఆదేశాల ప్రకారం రోస్టర్ పాయింట్ తీసివేసినందున ఎక్కువ సంఖ్యలో పోస్టులు ఉన్నా 33 శాతం రిజర్వేషన్ వచ్చే అవకాశాలు లేవు. ఉదాహరణకు 1-10 రోస్టర్ పాయింట్స్ తీసుకుంటే... ఓసీకి 3, ఎస్సీకి 2, బీసీ-ఏకు 1, దివ్యాంగులకు 1, ఎస్టీకి1, ఈడబ్ల్యూఎస్‌కు1, బీసీబీకి 1 పోస్టులు ఉంటాయి. ఇందులో ఓసీ కి మూడు పోస్టులు ఉన్నందున 18 శాతం కింద ఒక పోస్ట్ మహిళకు వెళ్తుంది. ఇతర కేటగిరీల్లో మహిళలకు ప్రత్యేకంగా రిజర్వేషన్ ఉండదు. మహిళలు అందరూ పురుషులతో సమానంగా ఆయా పోస్టులకు పోటీ పడాలి. ఇలా ఎప్పుడు చూసినా మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ప్రాధాన్యత లభించదు. ఉదాహరణకు గ్రూప్ 1లో మల్టీ జోన్లు 1, 2 కింద ఆర్డీవో పోస్టులు 41 ఉన్నాయి. మహిళకు రోస్టర్ పాయింట్ తీసివేశారు. మల్టీ జోన్-1 కింద 19 పోస్టులు ఉన్నాయి. 33 శాతం లెక్కన కనీసం ఆరు పోస్టులు ఉండాలి. కానీ ఇప్పుడు మూడు పోస్టులు మాత్రమే వస్తాయి. మల్టీ జోన్-2 కింద 23 పోస్టులు ఉన్నా, కేవలం మూడు మాత్రమే మహిళలకు దక్కుతాయి. రోస్టర్ పాయింట్ తీసి వేయడంతో భారీగా మహిళా అభ్యర్థులు నష్టపోతున్నారు. ఆర్డీవో పోస్టుల్లో మహిళలకు దక్కే రిజర్వేషన్ కేవలం 14 శాతమే. ఒకవేళ తొలి పది పోస్టుల్లోని రెండు ఎస్సీ పోస్టులు పురుష అభ్యర్థులతో భర్తీ అయ్యాయి అనుకుందాం! అప్పుడు తరువాత రోస్టర్‌లో మూడో పోస్ట్ మహిళకు ఇవ్వాలి. కానీ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మహిళకు ప్రత్యేక రోస్టర్ ఉండదు. అప్పుడు ఆ పోస్టును జనరల్ కింద చూపిస్తారు.

ఇలాంటి సందర్భాల్లో పోస్టు ఏవిధంగా భర్తీ చేయాలన్న విషయమై మార్గదర్శకాలు లేవు. మహిళలకు సమాంతర రిజర్వేషన్ల అమలులో ఎదురయ్యే సమస్యలను ఏవిధంగా పరిష్కరించాలన్న విషయంలో ప్రత్యేక మెథడాలజీ ఏమీ లేదు. దీంతో నియామక సంస్థలు తమ సొంత నిర్ణయాలతో పోస్టులు భర్తీ చేస్తున్నాయి. ఫలితంగా మహిళలకు న్యాయబద్ధంగా రావాల్సిన పోస్టులు తగ్గిపోతున్నాయి. సరైన అభ్యర్థులు లేకపోవడంతో ఒక కేటగిరీలో ప్రతి మూడింటిలో ఒకటి చొప్పున మహిళలకు రిజర్వ్ అయిన పోస్టులు మిగిలిపోతే ఏం చేయాలన్న విషయంలో కూడా స్పష్టత లేదు.

రాజ్యాంగం ప్రకారం మహిళలకు సమాంతర రిజర్వేషన్లు అమలు చేయాలి. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారమే ముందుకు వెళ్లాలి. అయితే మహిళలకు సమాంతర రిజర్వేషన్లు అమలు చేయాలంటూ 1996లోనే వచ్చిన న్యాయ బద్ధమైన జీవో నం. 41 ఉంది. కాబట్టి ఈ జీవో కింద పేర్కొన్నట్లు మహిళలకు రోస్టర్ పాయింట్స్ కేటాయించి సమాంతర రిజర్వేషన్లు అమలు చేయాలి.

సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు మహిళా రిజర్వేషన్స్ అమలుకు ఆటంకమవుతుంది అని భావించిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ తీర్పుపై పిటిషన్ వేసి పాత 33 శాతం రిజర్వేషన్స్‌ను అమలు చేసింది. ఆ విధంగా అనేక మంది మహిళలకు విద్యా, ఉద్యోగాల్లో నష్టం జరగకుండా కాపాడింది. సుప్రీం కోర్టు తీర్పు అంటే, అన్ని రాష్ట్రాల్లో అమలు చెయ్యాలి. కానీ కేవలం తెలంగాణ ఆడబిడ్డల హక్కులను కోర్టు తీర్పు పేరుతో కాలరాయటం భావ్యం కాదని భావించిన నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ 33 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని దూరదృష్టితో సాహసోపేతమైన ఈ నిర్ణయం తీసుకొని అమలుచేసి మహిళా పక్షపాతిగా నిలిచారు. ఇక్కడ ఇంకో ముఖ్యమైన విషయం చెప్పాలి. 33 శాతం రిజర్వేషన్స్ అమలు చేయటం అంటే పురుష అభ్యర్థులకు అన్యాయం చెయ్యటం అని కొంత మంది అపోహ పడుతున్నారు. అలాంటిదేం కాదు.

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా రిజర్వేషన్స్‌కు గండి కొట్టేలా సమాంతర రిజర్వేషన్స్‌ను అమలు చేయడానికి జీవో నం. 3ను తీసుకొచ్చింది. ఈ జీవో అమలుతో విద్యా, ఉద్యోగాల్లో మహిళలు భారీగా నష్టపోతున్నారు. ఇదే విధానం కొనసాగితే విద్యా, ఉద్యోగాల్లో మహిళల ప్రాతినిధ్యం క్రమంగా తగ్గి, సమాజ ప్రయాణం తిరోగమనం బాట పడుతుంది. ఇది నాగరిక సమాజానికి మంచి పరిణామం కాదు. కాబట్టి ఈ ప్రమాదం నుంచి బయట పడాలంటే అమలు చెయ్యాల్సింది జీవో నం. 3 కాదు, 33 శాతం రిజర్వేషన్స్ అమలు అని గ్రహించాలి.

వ్యాసకర్త తెలంగాణ ఎమ్మెల్సీ

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

మాట్లాడాలి కదా?



రష్యన్ లక్ష్యాలపై దాడి గురించి జర్మన్ వైమానిక దళం మాట్లాడిన అధిక ప్రసంగ మాటలు లీక్ కావడం మీద కన్నా, వాటితో జర్మన్ ప్రభుత్వానికి సంబంధం లేదని కవర్ చేయడం మీద జర్మన్, పాశ్చాత్య దేశాలు దృష్టి పెట్టాయి. ఈ అన్యాయమైన పథకాల గురించి అవి మాట్లాడకపోవడం యూరప్‌కే కాదు, ప్రపంచానికే ప్రమాదం.

– కన్వల్ సిబాల్, విదేశాంగ శాఖ మాజీ కార్యదర్శి


మర్యాద



బాలాసాహెబ్ (బాల్ ఠాకరే) ఫొటోబయోగ్రఫీ మీద రాజ్ ఠాకరే పనిచేస్తున్నప్పుడు – అభివృద్ధి పనులను ప్రతిబింబించేట్టుగా ఒక ఫ్లై ఓవర్ ముందు బాలాసాహెబ్ ఫొటో కావాలనుకున్నారు. అయితే దాన్ని నితిన్ గడ్కరీ నిర్మించారు. ఆయన లేకుండా నేను ఫొటో దిగను అని బాలాసాహెబ్ అన్నారు. అలా ఈ ఫొటో వచ్చింది. (వాళ్లద్దరి ఫొటోను షేర్ చేశారు.)

– ప్రణవ్ జాధవ్, జర్నలిస్ట్

సాగిపోవాలి



ఎంపికలకు సంబంధించిన గందరగోళం మంచి, చెడుల మధ్య ఉండదు: మెరుగైనది, అత్యుత్తమమైనది మధ్య ఉంటుంది. మనం ఏది ఎంచుకున్నా ఇంకేదో మెరుగైనది ఉంటుంది. అందుకే అంతర్బుద్ధితో ఎంచుకోవాలి; ఒక్కసారి ఎంచుకున్నాక దాన్ని అంగీకరించాలి.

– శ్రీశ్రీ రవిశంకర్, ఆధ్యాత్మిక గురువు

అమ్మ అనడానికి ఇబ్బందా?



డచ్ (నెదర్లాండ్స్) ప్రభుత్వ అధికారులు సివిల్ రిజిస్ట్రీ నుంచి నిశ్శబ్దంగా 'అమ్మ' అనే మాటను తొలగించి, 'ఎవరికైతే శిశువు జన్మించిందో ఆ పేరెంట్' అని మార్చారు. ఈ పిచ్చికి అంతం లేదు.

– ఇవా వలార్డింగర్‌బ్రూక్, రైట్‌వింగ్ యాక్టివిస్ట్

అంతటా అంతే!



గురుగావ్‌కు డ్రైవ్ చేస్తూ పోవడం, రావడం (ఢిల్లీ నుంచి) నెమ్మదిగా మన జీవితాన్ని తగ్గిస్తుంది. మధ్యాహ్నం మూడింటికి కూడా హైవే మీద ప్రయాణించడం దుర్భరంగా ఉంటుంది.

– నిధి రజ్దాన్, జర్నలిస్ట్

ఇన్ బాక్స్

ద్వంద్వ వైఖరి సరికాదు

జనవరి 5న రేషన్ బియ్యం కుంభకోణం గురించి టీఎమ్‌సీ నాయకుడు షేక్ షాజహాన్‌ను విచారించడానికి వెళ్లిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులను 2,000 మంది చుట్టుముట్టి తలలు పగలగొట్టారు. దీంతో పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని సందేశ్‌ఖాలీ ప్రాంతం వార్తలకు ఎక్కింది. ఈ సందర్భంగా షేక్ షాజహాన్ అరాచకాలు, దౌర్జన్యాలు, భూ కబ్జాలు; అతనూ, అతని అనుయాయులూ స్త్రీలపై జరిపిన లైంగికదాడులూ ప్రపంచానికి తెలిశాయి. ఆ ప్రాంతంలోని నిమ్న వర్గాల మహిళలు గళం విప్పి, ఉద్యమం చేయడంతో ఈ సంఘటన చుట్టూ ఉన్న విషయాలన్నీ వెలుగు చూశాయి.

దేశంలో ఎక్కడైనా ఒక సంఘటన జరిగితే, నిమిషాల మీద అది బయట ప్రాంతాలకు వెళ్ళిపోతుంది. కానీ పశ్చిమ బెంగాల్లో వార్తా పత్రికలనూ, న్యూస్ ఛానెల్స్‌నూ దండోపాయాన్ని ఉపయోగించి మేనేజ్ చేయడం టీఎమ్‌సీ వాళ్లకు వెన్నతో పెట్టిన విద్య. టీఎంసీలో ఇప్పుడు ఉండే క్యాడర్ అంతా ఒకప్పుడు సీపీఎమ్‌లో ఉన్న కార్యకర్తలే. బెంగాలులో సీపీఎమ్ అధికారంలో ఉన్నప్పుడు ఎంత మంది కాంగ్రెస్ కార్యకర్తలు హత్య చేయబడ్డారో కాంగ్రెస్ నాయకులను అడిగితే చెబుతారు.

అనేక హత్యలు, కుంభకోణాలు మానభంగాలతో సంబంధం ఉన్న షేక్ షాజహాన్‌ను మమతా ప్రభుత్వం అరెస్టు చేయకుండా, 50 రోజులు మీనమేషాలు లెక్కించడం సరికాదు. కలకత్తా హైకోర్టు జోక్యంతో విధి లేని పరిస్థితులలో ఫిబ్రవరి 28న అరెస్టు చేసి మ్యాజిస్ట్రేట్ కస్టడీకి అప్పజెప్పడం జరిగింది. ఎన్నికల్లో లబ్ధి పొందడానికే టీఎమ్‌సీ నిందితుల అరెస్టుకు ఇంతవరకూ వెనుకాడిందనేది సుస్పష్టం.

మణిపూర్ జాతుల సంఘర్షణ విషయంలో దేశ వ్యాప్తంగా ర్యాలీలు, ధర్నాలు, రాస్తారోకోలు, కేంద్ర పార్లమెంటులో నిరసనలు తెలిపిన ప్రజాస్వామ్యవాదులు, లౌకికవాదులం అని చెప్పుకునేవారు సందేశ్‌ఖాలీలో స్త్రీలపై జరిగిన లైంగిక దాడులపై మౌనం వహించడం, అక్కడ మహిళలు నిర్వహించిన ఉద్యమానికి మద్దతు ఇవ్వకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

– ఉల్లి బాల రంగయ్య; సామాజిక, రాజకీయ విశ్లేషకులు

నిజాయితీ నిబద్ధతల మేలు కలయిక

సందర్భం



డా॥ యలమంచిలి శివాజీ

ఇటీవల స్వర్గస్థులయిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జన్నత్ హుస్సేన్ 1977–78 బ్యాచ్‌కి చెందినవారు. తొలిగా ప్రొబేషనరీ సబ్ కలెక్టరుగా తెనాలి వచ్చినప్పటి నుండి వారితో పరిచయం. 1987లో గుంటూరు జిల్లా కలెక్టరుగా వచ్చిన కొద్ది రోజులకే జిల్లా పరిషత్ అధ్యక్షురాలుగా ఉన్న దొడ్డపనేని ఇందిర అకాల మరణం చెందడంతో అక్కడ ఉప ఎన్నిక వచ్చింది. ఓట్ల లెక్కింపులో ఏదో బియ్యపు గింజలో వడ్ల గింజలాగా కొద్దిపాటి అవగాహనా లోపం! ఎన్టీఆర్‌కు ఫోన్ చేసి, యదార్థాలన్నింటినీ పూసగుచ్చి వివరించారు. అర్ధగంట సేపు దానితో కమ్ముకొన్న అనుమానాలన్నీ మబ్బుల్లాగా విడిపోయాయి.

1988 మార్చిలో నేను రాజ్యసభకు ఎన్నికయ్యాను. ప్రమాణ స్వీకారం చేయకముందే పత్తి రైతుల ఆత్మహత్యలపై రిజర్వు బ్యాంక్ డిప్యూటీ గవర్నర్ డాక్టర్ పీడీ ఓజా అధ్వర్యంలో ఆంధ్రా బ్యాంక్ ఛైర్మన్, సిండికేట్ బ్యాంక్ ఛైర్మన్ లతో ఓ ఉన్నతాధికార సంఘం గుంటూరు, ప్రకాశం జిల్లాలలో పర్యటించింది. ఎంతో ఆశతో ప్రాణాలను కళ్లలో పెట్టుకొని, చింపిరి గుడ్డలతో భర్తలను కోల్పోయిన భార్యలూ, భార్యలను కోల్పోయిన భర్తలూ, తల్లిదండ్రులను పోగొట్టుకొన్న పిల్లలూ, తోబుట్టువులను కోల్పోయిన సోదరీ సోదరులూ ఎందరో తమ దీన గాథలను వెళ్లబోసుకొన్నారు. ఆ పర్యటన యావత్తూ జిల్లా కలెక్టర్లు జన్నత్ హుస్సేన్, జయప్రకాష్ నారాయణ్‌లు నిర్వహించారు. రైతుల రాయబారిగా నేను ప్రతి సమావేశంలోనూ, ప్రతి ఊరిలోనూ, రైతుల దీన గాథలను – పత్తిరైతుల గోసను వివరించాను. రాజ్యసభ సమావేశాలకు వెళ్లడంతోనే పై రెండు జిల్లాల కలెక్టర్లు తెల్ల దోమ, శెనగపచ్చ పురుగు నివారణకు అవసరమైన క్రిమిసంహారక మందులను దిగుమతి చేయాలనీ, వాటిపై దిగుమతి సుంకాలను రద్దు చేయాలనీ ఒక నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపారు. దానిని సాకారమయ్యేటట్లు చూడాలని నాకు ఫోన్ చేసి చెప్పారు. ఆ మేరకు కేంద్రంలో మంత్రులుగా ఉన్న నారాయణ్ దత్ తివారీ, దినేశ్ సింగ్, రామనివాస్ మీర్ధా, జలగం వెంగళరావు, భజన్‌లాల్ వంటి వారితోనే గాక సంబంధిత అధికారులతో గూడా చర్చించి, ఆ ప్రతిపాదనలు సాకారమయ్యేటట్లు అనుమతి తీసుకోవడం జరిగింది.

హుస్సేన్ కలెక్టరుగా ఉన్నన్ని రోజులూ, ఎంతో నిబద్ధతగా ఉన్నారు. మంత్రులెవరయినా అయినదానికీ, కాని దానికీ ఫోన్లు చేస్తే, కలెక్టరు గారు పనిలో ఉన్నారని చెప్పమనేవారు. ఉన్నట్టుండి 1988 మే లోనే బదలీ అయ్యారు. రాజ్యసభ సమావేశాలు అయినాక, గుంటూరు వచ్చి వారికి వీడ్కోలు చెబుదామని కలెక్టర్ బంగ్లాకు వెళ్లాను. కొత్త కలెక్టరు ఏపీవీఎన్ శర్మకి ఛార్జి అప్పజెబుతున్నారని చెబితే, కలెక్టరాఫీసుకు వెళ్లాను. 'శివాజీ గారూ, నేనూ చిరకాల మిత్రులం. అయితే వారు మన దగ్గరకు రారు – మనమే వారి వద్దకు వెళ్లాలి' అని శర్మగారికి పరిచయం చేశారు.



జన్నత్ హుస్సేన్

చరిత్రాత్మక పొగాకు రైతుల 'క్రాప్ హాలిడే' పోరాట సమయంలో, జన్నత్ వ్యవసాయ శాఖకు ముఖ్య కార్యదర్శిగా ఉన్నారు. పొగాకు రైతుల ప్రతినిధి బృందంతో పాటు, కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ వారితో చర్చలు జరిపేందుకు, జన్నత్‌ను కూడా ఢిల్లీ పంపారు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. అక్కడ ఢిల్లీలో ఈ ప్రతినిధి బృందానికి అవసరమయిన భోజన, వసతి సౌకర్యాలు సరిపడా అందినవా, లేదా అని పరిపరి విధాల శ్రద్ధ తీసుకొనేవారు జన్నత్.

2007లో రైతులకిచ్చిన రుణాలను రద్దు చేయాలని ఒక సవివరమైన నివేదికను రూపొందించి, కేంద్ర ప్రభుత్వానికి అందజేశాను. ఆ ప్రతిపాదనకు 2008–09 వార్షిక బడ్జెట్‌లో ప్రకటించడానికి సూత్రప్రాయంగా అంగీకరించింది కేంద్రం. ఆ సందర్భంలో 2008 జనవరిలో ముఖ్య మంత్రి రాజశేఖర రెడ్డిని కలిసి వివరించి, మాట సాయం చేయమని విజ్ఞప్తి చేశాను. వెంటనే ఆయన కేంద్ర వ్యవసాయ మంత్రి శరద్‌పవార్‌కు ఫోన్ చేసి శివాజీ ప్రతిపాదన ఎంతవరకు వచ్చిందని అడిగారు. 'ఇప్పుడే విత్త మంత్రి చిదంబరంతో చర్చించి వస్తున్నాను. బడ్జెట్‌లో ఇది చోటు చేసుకుంటున్నద'ని జవాబిచ్చారు. ఇది తెలిసిన కొందరు అధికారపక్షం పెద్దలు, మంత్రులు దాని బదులు ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తే బాగుంటుందని ముఖ్యమంత్రికి సలహా ఇచ్చారు. దానిపై ముఖ్య మంత్రి వైఎస్ఆర్ జన్నత్‌తో సంప్రదిస్తే – 'శివాజీ ఈ సమస్యను కడ వరకూ తీసుకెళ్లాడు. ఈ తరుణంలో మనం దీనికి మెలిక వేస్తే, కేంద్రానికి మరో విధంగా సంకేతాలు వెడతాయ'ని జన్నత్ ముఖ్య మంత్రికి సలహా ఇచ్చి ఒప్పించారు.

ఉత్తరప్రదేశ్‌లో సిద్ధార్థనగర్ జిల్లాలో జన్మించిన జన్నత్‌కు చదువుకొనే రోజుల నుండి ఆరిఫ్ మహమ్మద్ ఖాన్‌తో స్నేహం. ప్రస్తుతం కేరళ గవర్నరుగా ఉన్న ఆరిఫ్... చరణ్‌సింగ్‌కు అనుయాయి. ఆ ప్రభావం కొంతవరకూ జన్నత్ మీద కూడా ఉన్నది. దైవభక్తి, పాపభీతి మెండుగా ఉన్న జన్నత్ ఎంతో నిజాయతీతో, నిబద్ధతతో తన ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తించిచారు. ఆయన లేని లోటు మాబోటి వారికి తీరనిది.

వ్యాసకర్త రాజ్యసభ మాజీ సభ్యులు | 98663 76735

అరుణగిరీశుని కరుణ

జ్యోతిర్మయం

ఈశ్వర కృపకు పాత్రులవటానికి ముందు ఎన్నో పరీక్షలు ఎదుర్కోవాలి. చివరికి నిరాశా, నిస్పృహ లతో మరణపుటంచులకు కూడా వెళ్ళవలసి వస్తుంది. బతుకు మీద ఆశ నశిస్తుంది. నశిస్తున్న ఆశనూ, మోడు బారిన జీవితాన్నీ చిగురింప చేసేవాడు ఈశ్వరుడు. ఆయన కరుణ అపారం, అనంతం.

ఒక పేదవానికి రెండు కాళ్ళు చచ్చుబడిపోయాయి. సంపాదనా మార్గం లేక కన్నవారికే గుదిబండగా తోచాడు. అయిన వారి నుంచి ప్రతిక్షణం అవమానాలే! బతుకు భారమైంది. నిరాశ ఆవరించింది. ఒకరోజు ఎవరికీ చెప్పకుండా కర్రల సాయంతో కుంటుకుంటూ గిరి ప్రదక్షిణ మార్గంలో పోయి ప్రాణత్యాగం చేద్దామనుకున్నాడు.

నిరంతరం ఎదుర్కొన్న అవమానాల తలపులు అతని మరణ నిశ్చయాన్ని మరింత దృఢతరం చేస్తున్నాయి. అంతలో అతనికి ఎదురుగా ఒక సాధువు వచ్చాడు. ఊహించని విధంగా కుంటివానికి ఊతమిచ్చే కర్రలను 'ఈ ఆభరణాలు కూడానా నీకు 'అంటూ లాగి దూరంగా విసిరేశాడు. అంతవరకూ అతను ఎదుర్కొన్న అవమానాల పరంపరకు ఇది పరాకాష్ఠ. కుంటివాడు అసహనంతో ఊగిపోయాడు. సాధువు పైకి ఒక్కసారిగా లంఘించాడు. తనకు కాళ్ళు పనిచెయ్యవని మర్చిపోయాడు. కాని, సాధువు అదృశ్యమయ్యాడు. కుంటివానికి ఆశ్చర్యం! తాను నడవగలుగుతున్నాడు. తన కాళ్ళు చక్కగా ఉన్నాయి. కానీ, సాధువేడీ! ఆనంద, సంభ్రమాలతో పరుగు పెట్టాడు. భక్తితో గిరి ప్రదక్షిణ చేశాడు. అవమానాలు చేసిన వారి చేతే గౌరవాలు పొందాడు. అరుణగిరి నాథుని కరుణకు సాక్షిగా నిలిచాడు.

పరమేశ్వరుని కరుణకు సాటి మరేదీ లేదు. నమ్మకంతో జీవనం కొనసాగిస్తే, ఈశ్వర కృప, ప్రేమ ఏ రోజు ఏ విధంగా ప్రసరిస్తుందో, జీవితాన్ని ఎటువంటి మలుపులు తిప్పుతుందో, ఊహించని గొప్ప మార్పులు తెస్తుందో చూస్తే ఆధ్యాత్మిక అనుభూతిని, స్ఫూర్తిని పొందకుండా ఉండలేము.

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** బ.ఏకాదశి రా.12.13 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** పూర్వాషాఢ ఉ.10.47 వరకు, తదుపరి ఉత్తరాషాఢ, **వర్జ్యం:** సా.6.29 నుండి 8.01 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.48 నుండి 12.36 వరకు, **అమృత ఘడియలు:** ఉ.6.08 నుండి 7.42 వరకు; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 6.20, **సూర్యాస్తమయం:** 6.03.

మోదీని నేనెందుకు అభిమానిస్తా?

సోనియా గాంధీ అంటేనే అభిమానం.. మా నాయకుడు రాహుల్ గాంధీనే

- రాష్ట్రంలో లేని బీజేపీని ఎందుకు తిట్టాలి
- లోక్‌సభ సీట్ల ప్రకటనలో బీజేపీ, బీఆర్‌ఎస్ మధ్య లోపాయికారీ అవగాహన
- కాళేశ్వరం అవినీతిపై ప్రధానికి బీజేపీ నేతల తప్పుడు సమాచారం
- నిర్దోషిత్వం రుజువు చేసుకునే అవకాశం కేసీఆర్‌కు ఇస్తాం
- 7న లోక్‌సభ అభ్యర్థులపై ప్రకటన రావచ్చు
- సచివాలయంలో మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: 'ప్రధాని నరేంద్ర మోదీని నేనెందుకు అభిమానించాలి? రాహుల్ గాంధీ నా నాయకుడు. సోనియా గాంధీ అంటే నాకు అభిమానం' అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రధాని మోదీని నేనెందుకు అభిమానిస్తా? అని ప్రశ్నించారు. గుజరాత్‌లో నర్మదా, సబర్మతి నదుల అభివృద్ధి, బుల్లెట్ ట్రైన్ నిర్మాణం తరహాలోనే తెలంగాణలో మూసీ పరీవాహక ప్రాంతం అభివృద్ధి, మెట్రో రైలు విస్తరణ వంటి ప్రాజెక్టులకు సహకరించాలని విజ్ఞప్తి చేసేందుకే ప్రదాని నరేంద్ర మోదీ పాల్గొన్న బహిరంగ సభలో 'గుజరాత్ మోడల్'ను ప్రస్తావించానని వివరణ ఇచ్చారు. మంగళవారం ఆయన రాష్ట్ర సచివాలయంలో విలేకరులతో చిట్‌చాట్ చేసి వారి ప్రశ్నలకు బదులిచ్చారు. ప్రధాని మోదీ సభలో గుజరాత్ మోడల్‌ను ప్రస్తావించడం ఆయనను మెచ్చుకున్నట్టేనా? అని విలేకరులు ప్రశ్నించగా, పైవిధంగా సీఎం రేవంత్ బదులిచ్చారు. ప్రధాని అంటే దేశంలో బిగ్ బ్రదర్ అని వ్యాఖ్యానించారు.

గుసగుసల్లేవ్.. ఏది చెప్పినా మైక్ ముందే

కేసీఆర్ తరహాలో తాను ప్రధాని మోదీ చెవిలో గుసగుసలు చెప్పలేదని, ఏదిచెప్పినా మైక్ ముందు బహిరంగంగా చెప్పానని రేవంత్ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో బీజేపీ లేనే లేదని, ఆ పార్టీని ఎలా తిట్టాలి? అని మరో ప్రశ్నకు బదులిచ్చారు. బీఆర్‌ఎస్, బీజేపీలు తమ లోక్‌సభ అభ్యర్థులను ప్రకటించిన తీరు చూస్తే రెండు పార్టీల మధ్య లోపాయికారీ ఒప్పందముందని అర్థమవుతోందని విమర్శించారు. బీజేపీ సీట్లను వదిలేసి మిగిలిన సీట్లను బీఆర్‌ఎస్ ప్రకటించిందని, బీజేపీ సైతం బీఆర్‌ఎస్ ప్రకటించిన సీట్లను వదిలేసి ఇతర సీట్లను ప్రకటించిందని ఆరోపించారు. రాష్ట్రంలో ఆరు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ అనడం..బీజేపీ, బీఆర్‌ఎస్‌ల మధ్య జరిగిన చర్చల ఫలితమే అని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దించాలంటే కేసీఆర్.. మోదీతో కలవాల్సి ఉంటుందన్నారు.

అదానీకి ఏమీ ఇవ్వలేదు.. తీసుకున్నాం

ప్రధాని మోదీ ఇచ్చినట్టు అదానీకి తాము ఏమీ ఇవ్వలేదని, అదాని నుంచే (పెట్టుబడులు) తీసుకున్నామని రేవంత్ చెప్పుకొచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి విషయంతో బీజేపీ రాష్ట్ర నేతలు ప్రధానికి తప్పుడు సమాచారమిచ్చారని, తమ ప్రభుత్వం విజిలెన్స్, జ్యుడీషియల్ విచారణకు ఇప్పటికే చర్యలు తీసుకుందన్నారు.

వారికి రైతుబంధు కట్..

రైతుబంధుపై పరిమితి ఉండదని, అయితే ఆదాయ పన్ను చెల్లింపుదారులు, గజ్వేల్ తరహాలో ఫామ్‌హౌజ్‌లు ఉన్న వారికి మాత్రం ఇవ్వబోమని రేవంత్‌రెడ్డి అన్నారు. నిరుపేదల రైతులు, పంటలు వేసేవారికే ఇస్తామన్నారు. అన్ని శాఖలకు కలిపి రూ.లక్షల కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉందని, ప్రాధాన్యత క్రమంలో చెల్లింపులు చేస్తున్నామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాగ్ సమర్పించి నివేదికపై విస్తృతంగా చర్చించిన తర్వాతే కార్యాచరణ ఉంటుందన్నారు. ప్రైవేటు వర్సిటీలకు జారీ చేసిన అనుమతులపై అధ్యయనం జరుగుతోందని, అవసరమైతే విచారణకు ఆదేశిస్తామన్నారు. ఉచితంగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారంపై అధికారుల కమిటీ నివేదిక వచ్చాక నిర్ణయం తీసుకుంటామనీ సీఎంఆర్‌ఎఫ్ అక్రమాలపై అంతర్గత విచారణ జరుగుతోందని సీఎం వెల్లడించారు.

రాష్ట్రం నుంచి రాహుల్ పోటీపై రేపు స్పష్టత

7న కాంగ్రెస్ ఎలక్షన్ కమిటీ సమావేశం కానుందని, అదే రోజు లోక్‌సభ ఎన్నికల అభ్యర్థులపై ప్రకటన రావచ్చని రేవంత్ రెడ్డి చెప్పారు. రాష్ట్రం నుంచి రాహుల్ గాంధీ పోటీపై ఆ రోజున స్పష్టత వస్తుందన్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు తనను వచ్చి కలుస్తుండడం వెనక రాజకీయాలు లేవని సీఎం స్పష్టం చేశారు. పార్టీలో చేరాలనుకునేవారు గాంధీభవన్‌కు వెళ్తారని, సెక్రటేరియట్‌కు, తన ఇంటికి రారు కదా అని వ్యాఖ్యానించారు. తమ కుటుంబం నుంచి ఎవరూ ఎన్నికల్లో పోటీచేయరని స్పష్టం చేశారు.

కసబ్‌కి ఇచ్చినట్టే కేసీఆర్‌కూ అవకాశం

కసబ్‌కు ఉరితీయడానికి ముందు విచారించారని, కేసీఆర్‌కి సైతం కాళేశ్వరం అక్రమాల్లో నిర్దోషిత్వాన్ని రుజువు చేసుకోవడానికి అవకాశమిస్తామని, తక్షణ చర్యలు సాధ్యం కావని రేవంత్ పేర్కొన్నారు. సిబ్బంది కొరత నేపథ్యంలో క్రమంగా ఒక్కోప్రభుత్వ శాఖలో అవినీతిపై విచారణ జరిపిస్తామని చెప్పారు. డీఎస్పీ ప్రణీత్‌రావు వ్యవహారంపై ఇప్పుడేమీ మాట్లాడబోమన్నారు.

రేపు ఢిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి

వేములవాడ: సీఎం రేవంత్‌రెడ్డి రాజన్న సిరిసిల్ల జిల్లా పర్యటన రద్దయినట్లు మంగళవారం ముఖ్యమంత్రి కార్యాలయ వర్గాలు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. 7న లోక్‌సభ అభ్యర్థుల ఖరారుకు ఢిల్లీలో జరిగే పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశానికి సీఎం హాజరు కానుండటంతో ఈ పర్యటన రద్దయినట్లు తెలిపారు.

సీఎం పౌరసంబంధాల అధికారులుగా మరో ఇద్దరు

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి పౌరసంబంధాల అధికారులుగా మరో ఇద్దరు నియమితులయ్యారు. సీనియర్ జర్నలిస్ట్ వి.శ్రీనివాసరావు, అదనపు పీఆర్వోగా అన్వేష్‌రెడ్డి పీఆర్ టీంలో చేరారు. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు మంగళవారం వెలువడ్డాయి. శ్రీనివాస్‌రావు ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన వారు కాగా అన్వేష్‌రెడ్డి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన వారు.

క్లుప్తంగా...

రజత్‌కుమార్‌పై పోస్టులను తొలగించేలా చర్యలు తీసుకోండి

కేంద్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: మాజీ ఐఏఎస్ అధికారి రజత్‌కుమార్ పరువుకు నష్టం కలిగించేలా ఆరోపణలు చేస్తూ పెట్టిన పోస్టులను తొలగించేలా, అలా పోస్టులు పెట్టిన వారిని బ్లాక్ చేసేలా యూట్యూబ్, గూగుల్‌పై చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 14కు వాయిదా వేసింది. డిసెంబర్ 17 నుంచి 21 వరకు హైదరాబాద్‌లో రజత్ కుమార్ తన కూతురు వివాహ వేడుకను నిర్వహించారు. అయితే ఈ వేడుకకు ఈవెంట్లు, డిన్నర్లు, హోటల్ రూముల ఏర్పాట్లను మేఘా కంపెనీ ప్రతినిధులే చూసుకున్నారని 'ది న్యూస్ మినిట్' ప్రచురించింది. దీనిపై యూట్యూబ్, గూగుల్‌లో పలువురు పోస్టులు పెట్టారు. అయితే ఎలాంటి ఆధారాలు లేకుండా తనపై సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారని, ఇవి తన పరువుకు భంగం కలిగించేలా ఉన్నాయంటూ రజత్‌కుమార్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పోస్టులను తొలగించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందా విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. రజత్‌కుమార్ పరువుకు నష్టం కలిగించేలా ఉన్న పోస్టులను తొలగించేలా చర్యలు చేపట్టాలని మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని ఆదేశించారు.

దిగుబడి రాక.. అప్పు తీర్చలేక.. రైతు ఆత్మహత్య


రాయల పోశెట్టి

తాంసి: ఆశించిన పంట దిగుబడి రాక, పెట్టుబడి కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనోవేదనకు గురైన రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలోని పాలోది గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు రాయల పోశెట్టి (52) తనకున్న 6.3 ఎకరాల్లో ఈ ఏడాది వానాకాలంలో పత్తిసాగు చేశాడు. అయితే పంటకు తెగుళ్లు సోకడం, సకాలంలో వర్షాలు పడక పోవడంతో దిగుబడి సరిగా రాలేదు. ఆరెకరాల్లో దాదాపుగా 60 క్వింటాళ్లకుపైగా దిగుబడి రావాల్సి ఉండగా 35 క్వింటాళ్లే వచ్చింది. అనుకున్న రీతిలో దిగుబడి రాకపోవడం, పెట్టుబడికి చేసిన అప్పులు తీర్చే దారిలేకపోవడంతో పోశెట్టి మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం గ్రామ సమీపంలో ఉన్న పంట చేలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. పోశెట్టికి రూ.5 లక్షలకు పైగా బయట వ్యక్తుల వద్ద అప్పు ఉన్నట్లు కుటుంబీకులు చెబుతున్నారు.

ప్రేమ పేరుతో మోసం.. బాలిక ఆత్మహత్య

నిందితుడిపై పోక్సో కేసు నమోదు

లింగంపేట (ఎల్లారెడ్డి): ప్రేమ పేరిట మోసానికి గురైన బాలిక ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. 'కామారెడ్డి జిల్లా లింగంపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక ఇంటర్మీడియెట్ చదువుతోంది. అదే గ్రామానికి చెందిన యువకుడు కొడబోయిన అశోక్ రెండేళ్లుగా బాలికతో ప్రేమ వ్యవహారం నడిపాడు. ఈ క్రమంలో బాలిక గర్భవతి కావడంతో తనను పెళ్లి చేసుకోవాలని యువకుడిని కోరింది. అయితే అశోక్ పెళ్లికి నిరాకరించాడు. మనస్తాపానికి గురైన బాలిక మంగళవారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుందని ఆయన వివరించారు. నిందితుడు అశోక్‌పై పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

నిలిపి ఉన్న రైలు బోగీ దగ్ధం

కాజీపేట జంక్షన్ రైల్వే యార్డులో ఘటన


మంటల్లో కాలిపోతున్న బోగీ

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లోని రైల్వే యార్డులో మంగళవారం అగ్నిప్రమాదం సంభవించి నిలిపి ఉన్న రైలు బోగీ దగ్ధమైంది. రైల్వే యార్డులో ట్రాఫిక్ క్లియర్ కోసం నిలిచి ఉన్న రైలు బోగీలో మంటలు ఎగసిపడటంతో సమీపంలో గల కాజీపేట రైల్వే స్టేషన్‌లోని ప్రయాణికులు ఉలిక్కిపడ్డారు. రైల్వే అధికారులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. కాజీపేట రైల్వే స్టేషన్ సమీపంలోని బోడగుట్ట వైపు గల రైల్వే యార్డులో గూడ్స్ రైళ్లు, సిక్ అయిన కోచ్‌లు, బోగీలను నిలిపి ఉంచారు. ఇటీవల సికింద్రాబాద్ నుంచి వచ్చిన రైలు బోగీని ఆ యార్డులో వేలం పాట కోసం నిలిపి ఉంచారు. మంగళవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో హైటెన్షన్ కరెంట్ తీగల కారణంగా మంటలంటుకున్న కోతి.. కింద ఉన్న బోగీపై పడింది. దీంతో బోగీలో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న రైల్వే అధికారులు, అగ్నిమాపక సిబ్బంది, రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఫైరింజన్‌తో మంటలు అదుపు చేశారు. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీసులు దగ్ధమైన బోగీని ఆధీనంలోకి తీసుకొని గార్డింగ్ చేశారు. ఈ ఘటనలో కోట్ల రూపాయల ఆస్తినష్టం వాటిల్లినట్లు సమాచారం. కాగా రైలు బోగీ దగ్ధంపై రైల్వే అధికారులు ప్రాథమిక విచారణ ప్రారంభించారు. కోతి వల్లే ఈ ప్రమాదం జరిగిందా.. వేరే కారణాలతో బోగీ దగ్ధమైందా అన్న కోణాల్లో విచారిస్తున్నారు.

జర్నలిస్టులు ప్రతిపక్ష పాత్ర పోషించాలి

పొత్తూరి స్మారక పురస్కార ప్రదానోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): ప్రస్తుత సమాజంలో జర్నలిస్టులు ప్రతిపక్ష పాత్ర పోషించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో పొత్తూరి వెంకటేశ్వరరావు స్మారక ట్రస్టు ఆధ్వర్యంలో ఇండియాటుడే సీనియర్ జర్నలిస్టు ఎస్.వెంకటనారాయణకు పొత్తూరి వెంకటేశ్వరరావు స్మారక ఉత్తమ పాత్రికేయ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా సమస్యలను వెలికితీసి పరిష్కరించేలా చేయడం జర్నలిస్టులకే సాధ్యమన్నారు. రాజకీయ నాయకులు మోర్ పవర్ అంటే, పాత్రికేయులు మోస్ట్ ఫ్రీడమ్ అంటారని తెలిపారు. వివిధ రంగాలలో జాతీయస్థాయిలో తెలుగు వారి పాత్ర తగ్గుతోందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయస్థాయిలో తెలుగువారి పాత్ర పెరగాల్సిన అవసరం ఉందని, తెలుగు రాష్ట్రాల నుంచి జాతీయ స్థాయిలో ప్రభావితం చేసేవారిని తమ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి, రామచంద్రమూర్తి, కె.శ్రీనివాస్, ప్రొఫెసర్ హరగోపాల్, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.


వెంకటనారాయణకు పురస్కారం అందజేస్తున్న సీఎం. చిత్రంలో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, రామచంద్రమూర్తి, శ్రీనివాస్‌రెడ్డి

టీఎస్ ఐసెట్ నోటిఫికేషన్ విడుదల

7వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ.. జూన్ 4, 5 తేదీల్లో పరీక్ష నిర్వహణ

కేయూ క్యాంపస్: ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ఈ విద్యాసంవత్సరం (2024–2025)లో ప్రవేశాలకుగాను ప్రవేశ పరీక్ష (టీఎస్ఐసెట్) నోటిఫికేషన్‌ను కాకతీయ యూనివర్సిటీ వీసీ, టీఎస్ ఐసెట్ చైర్మన్ తాటికొండ రమేశ్, కన్వీనర్ ఆచార్య నర్సింహాచారి మంగళవారం విడుదల చేశారు. ఈ మేరకు హనుమకొండలోని యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలోని టీఎస్ ఐసెట్ కార్యాలయంలో తొలుత సెట్ కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నెల 7వ తేదీనుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని వారు తెలిపారు. ఎస్సీ ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులు రూ.550, ఇతరులు రూ.750 రుసుం చెల్లించి దరఖాస్తును ఆన్‌లైన్‌లో సమర్పించాలని సూచించారు. ఏప్రిల్ 30వ తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. రూ.250 అపరాధ రుసుంతో మే 17వ తేదీ వరకు, రూ.500 అపరాధ రుసుంతో మే 27వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని వెల్లడించారు. దరఖాస్తుల్లో ఏమైనా పొరపాట్లు ఉంటే మే 17 నుంచి 20వ తేదీ వరకు మార్పులు చేసుకోవచ్చునని, మే 20వ తేదీనుంచి అభ్యర్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని తెలిపారు. టీఎస్ ఐసెట్‌ను జూన్ 4, 5వ తేదీల్లో నిర్వహిస్తారని చెప్పారు. ఈ ప్రవేశ పరీక్షలు కంప్యూటర్ బేస్డ్ టెస్టుగానే నిర్వహిస్తారని పేర్కొన్నారు. జూన్ 4న రెండు సెషన్‌లలో, 5న ఒక సెషన్‌లో ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. కాగా, జూన్ 15న ప్రాథమిక కీ విడుదల చేస్తారు. జూన్ 16 నుంచి 19 మధ్య ప్రాథమిక కీలో వచ్చిన అభ్యంతరాలు స్వీకరిస్తారు. ఫలితాలను జూన్ 28న విడుదల చేస్తారు. కార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి, కామర్స్‌అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రొఫెసర్ పి.వరలక్ష్మి, డీన్ పి.అమరవేణి, బీఓఎస్ చైర్మన్ కట్ల రాజేందర్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సదానందం, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ సీహెచ్ రాధిక పాల్గొన్నారు.



కేయూలో టీఎస్ఐసెట్ నోటిఫికేషన్ విడుదల చేస్తున్న వీసీ తాటికొండ రమేశ్, కన్వీనర్ నర్సింహాచారి తదితరులు

కేసీఆర్‌పై సమగ్ర విచారణ జరిపించాలి: సుధాకర్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: ఐదారు నెలల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ఉండదని మాజీ సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై సమగ్ర విచారణ జరిపించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్‌గౌడ్ కోరారు. మంగళవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజా తీర్పు మాత్రమే ఫైనల్ అనే విషయాన్ని కేసీఆర్ మరిచిపోతే ఎలా అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు ఉన్న సంఖ్యాబలం, ప్రజాబలం చూస్తే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎవరూ ఏమీ చేయలేరనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని సుధాకర్‌గౌడ్ హితవు పలికారు. ప్రభుత్వాన్ని కేసీఆర్ ఎలా పడగొడతారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.

అన్ని రాజకీయ పార్టీలు 9 పార్లమెంట్ సీట్లు ఇవ్వాలి

ఆర్.కృష్ణయ్య డిమాండ్



హిమాయత్‌నగర్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు 9 సీట్లు కేటాయించాలని కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ అధ్యక్షులను జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. మంగళవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో జాతీయ బీసీ యువజన సంఘం అధ్యక్షుడు గవ్వల భరత్‌కుమార్, గుజ్జ కృష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కర్ణాటక, కేరళ, తమిళనాడు, పాండిచ్చేరి, ఉత్తరప్రదేశ్, బిహార్‌లలో రాష్ట్ర కమిటీలు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. అనంతరం కృష్ణయ్య మాట్లాడుతూ, అన్ని రాజకీయ పార్టీలు బీసీలను మోసం చేస్తున్నాయని మండిపడ్డారు. బీసీల వాటా ఇప్పుడు ఇవ్వకపోతే తిరుగుబాటు తప్పదని, కేంద్ర ప్రభుత్వం బీసీ వ్యతిరేక వైఖరి మానుకోకపోతే దేశంలో బీసీల విప్లవం వస్తుందని హెచ్చరించారు. బీజేపీ మోదీ పేరుతో బీసీల ఓట్లు దండుకుంటోందని, ప్రధాని ఇప్పటికైనా బీసీల అభ్యున్నతికి చర్యలు తీసుకోవాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు. అదేవిధంగా చట్టసభల్లో బీసీ బిల్లు పెట్టాలని కోరారు.

ఫంక్షన్ హాళ్ల శబ్ద కాలుష్యంపై వివరాలివ్వండి

ఏఏజీకి హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: బోయిన్‌పల్లిలోని ఫంక్షన్ హాల్స్ నుంచి వెలువడే శబ్ద కాలుష్యంపై వివరాలు తెలుసుకుని చెప్పాలని అడిషనల్ అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) ఇమ్రాన్‌ఖాన్‌ను హైకోర్టు ఆదేశించింది. అలాగే ఈ వ్యాజ్యంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డును కూడా ప్రతివాదుల జాబితాలో చేర్చాలని రిజిస్ట్రీకి స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఈ నెల 7కు వాయిదా వేసింది. బోయిన్‌పల్లిలోని బాంటియా గార్డెన్, సికింద్రాబాద్‌లోని ఇంపీరియల్ గార్డెన్‌తో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గుర వుతున్నా రంటూ హైకోర్టుకు ఓ మిలిటరీ అధికారి లేఖ రాశా రు. ఓ సమయం అంటూ లేకుండా రాత్రీ పగలూ పరిమితికి మించి పెద్ద ఎత్తున శబ్దంతో స్థానికులు నిద్ర లేకుండా గడపాల్సిన పరిస్థితి ఉందని పేర్కొ న్నారు. రాత్రి 12 దాటినా కూడా ఈ శబ్దాలు ఆగడం లేదన్నారు. ఫంక్షన్‌హాళ్ల ప్రాంతాల్లో నడవడానికి కూడా దారి లేకుండా ఇష్టం వచ్చినట్లు వాహ నాల పార్కింగ్ చేస్తున్నారని వెల్లడించారు. డయల్ 100కు లేదా సమీప స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు ఫోన్ చేసిన ప్పుడు మాత్రమే తాత్కాలిక ఉపశ మనం కల్పిస్తున్నారని తర్వాత మళ్లీ యథావిధిగా శబ్ద కాలుష్యం కొనసాగుతోందని లేఖలో వివరించారు. పరీక్షల సమయంలో విద్యా ర్థులు కూడా చదువు కోలేక పోతున్నారని తెలి పారు. గత నెల వచ్చిన లేఖను హైకోర్టు ప్రజా ప్రయోజన వ్యాజ్యంగా విచారణకు స్వీకరించింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్ కుమార్ జూకంటి ధర్మాసనం మంగళవారం విచా రణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రభుత్వ నిబంధనల మేరకు శబ్ద కాలుష్యం అను మతించదగిన పరిమితుల్లో ఉండేలా చూసుకోవాలని అధికారులను ఆదేశిస్తూ విచారణ వాయిదా వేసింది.

గొర్రెలు, చేపల పంపిణీ కథ తేల్చండి

విజిలెన్స్ విచారణకు సీఎం ఆదేశం

- ప్రాథమిక నివేదిక ఆధారంగా ఏసీబీకి ఇవ్వాలని ఆదేశాలు
- ఏప్రిల్ నుంచి పాడి రైతులకు ప్రోత్సాహకం చెల్లింపు
- వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ నియామకాలకు వెయిటేజీ
- అన్ని మండలాల్లోనూ వెటర్నరీ హాస్పిటల్ ఉండాలి
- పశు సంవర్ధక శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: గొర్రెలు, చేపల పంపిణీ పథకాలు ప్రారంభమైనప్పటి నుంచి జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టాలని విజిలెన్స్ అధికారులను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదేశించారు, లబ్ధిదారుల ఎంపిక, గొర్రెల కొనుగోలు, పంపిణీ జరిగిన తీరుపై దర్యాప్తు చేయాలని స్పష్టం చేశారు. విజిలెన్స్ అధికారుల ప్రాథమిక దర్యాప్తులో ఏవైనా అవినీతి, అవకతవకలు జరిగినట్లు గుర్తిస్తే, ఆ ఫైలును అవినీతి నిరోధక శాఖకు అప్పగించాలని సూచించారు. మంగళవారం సచివాలయంలో పశు సంవర్ధక శాఖ, పాడి అభివృద్ధి, మత్స్య శాఖ అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు.

వివరాలు ఎందుకు సేకరించలేదు?

ఇటీవల గొర్రెల పంపిణీకి సంబంధించిన నిధులను బినామీ పేర్లతో కొందరు ఉద్యోగులు సొంత ఖాతాలకు మళ్లించుకున్న కేసులో ఏసీబీ దర్యాప్తు గురించి సీఎం మాట్లాడుతూ శాఖాపరంగా వివరాలేమీ సేకరించలేదా అని పశు, మత్స్యశాఖ ఉన్నతాధికారులను ప్రశ్నించారు. 2017లో ప్రారంభించిన గొర్రెల పంపిణీ పథకంలో మొదటి విడతకు రూ.3955 కోట్ల రుణం ఇచ్చిన నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎన్సీడీసీ) రెండో విడత రుణం ఇవ్వకుండా ఎందుకు నిలిపివేసిందని అధికారులను నిలదీశారు. అప్పటికే ఈ పథకంపై కాగ్ అభ్యంతరాలను లేవనెత్తడం, అవకతవకలను గుర్తించిన నేపథ్యంలోనే ఎన్సీడీసీ రుణం ఇవ్వలేదని అధికారులు బదులిచ్చారు. తమ వాటా కింద 25 శాతం డీడీలు చెల్లించిన లబ్ధిదారులకు గొర్రెలను ఎందుకు పంపిణీ చేయలేదని సీఎం ప్రశ్నించారు. రెండో విడత కింద 85,488 మంది తమ వాటాగా చెల్లించిన దాదాపు రూ.430 కోట్లు జిల్లా కలెక్టర్ల ఖాతాల్లోనే ఉన్నాయని అధికారులు తెలిపారు. మరో 2,20,792 మంది లబ్ధిదారులు తమ వాటా ఇవ్వలేదన్నారు.

మొబైల్ వెటర్నరీ క్లినిక్ సేవలు కొనసాగించాలి

పాడి రైతులకు ఒక లీటర్‌కు నాలుగు రూపాయల ప్రోత్సాహకాన్ని ఏప్రిల్ నుంచి మళ్లీ ప్రారంభిస్తున్నట్లు రేవంత్ రెడ్డి ప్రకటించారు. గత ప్రభుత్వం మూడేళ్ల నుంచి ఈ ప్రోత్సాహకాన్ని నిలిపివేసిందని, ఆ మొత్తం బకాయిలు రూ.203 కోట్లు పేరుకుపోయాయని అధికారులు తెలిపారు. ప్రతి నెలా గ్రీన్ చానల్ ద్వారా ఈ ప్రోత్సాహకాలు చెల్లించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రతి మండలంలో వెటర్నరీ హాస్పిటల్ తప్పకుండా ఉండాలని, 91 కొత్త మండలాల్లోనూ అవసరమైన ఏర్పాట్లు చేయాలని సీఎం సూచించారు. మొబైల్ వెటర్నరీ క్లినిక్ సేవలను కొనసాగించాలని, అందుకు అవసరమైన టెండర్లను వెంటనే పిలవాలన్నారు. టీఎస్పీఎస్సీ చేపట్టిన వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల నియామకాల్లో ఈ విభాగంలో ఏళ్లతరబడి పని చేస్తున్న వారికి వెయిటేజీ ఇవ్వాలనే ప్రతిపాదనను పరిశీలించాలని, వైద్యారోగ్య శాఖలో అమలైన వెయిటేజీ విధానాన్ని ఈ విభాగంలోనూ వర్తించేలా చూడాలని ముఖ్య మంత్రి అధికారులకు సూచించారు. సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, పశు సంవర్ధక శాఖ ముఖ్య కార్యదర్శి స్పెషల్ సీఎస్ అధర్ సిన్హా, డెయిరీ డైరెక్టర్ లక్ష్మి, ఫిషరీస్ డైరెక్టర్ గోపి సమావేశంలో పాల్గొన్నారు.



సాయిబాబా నిర్దోషి

మావోయిస్టులతో సంబంధాల కేసులో బాంబే హైకోర్టు తీర్పు

- కేసు నుంచి మరో ఐదుగురికి విముక్తి
- ఆరోపణలను రుజువు చేయడంలో ప్రాసిక్యూషన్ విఫలమైందని వ్యాఖ్య

సాక్షి, న్యూఢిల్లీ: మావోయిస్టులతో సంబంధాల కేసులో ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ జి.ఎన్.సాయిబాబాతోపాటు మరో ఐదుగురు నిందితులను బాంబే హైకోర్టు నాగ్‌పూర్ బెంచ్ నిర్దోషులుగా ప్రకటించింది. 2017లో సాయిబాబాతో పాటు ఇతరులను దోషులుగా నిర్ధారిస్తూ సెషన్స్ కోర్టు ఇచ్చిన తీర్పుపై నాగ్‌పూర్ బెంచ్ న్యాయమూర్తులు జస్టిస్ వినయ్ జోషీ, జస్టిస్ వాల్మీకి మెనెజెస్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారించింది. నిందితులపై వచ్చిన ఆరోపణలను రుజువు చేయడంలో ప్రాసిక్యూషన్ విఫలమైందని, అందుకే వారిపై అభియోగాలను కొట్టివేస్తున్నట్లు పేర్కొంది. నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ సెషన్స్ కోర్టు ఇచ్చిన తీర్పును ధర్మాసనం తోసిపుచ్చింది. మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయని, దేశంపై యుద్ధంపై చేసే కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ 2017 మార్చిలో సాయిబాబా, ఇతరులను మహారాష్ట్రలోని గడ్చిరోలీ సెషన్స్ కోర్టు దోషులుగా నిర్ధారించింది. దీనిపై సాయిబాబా బాంబే హైకోర్టును ఆశ్రయించారు. 2022 అక్టోబరు 14న జస్టిస్ రోహిత్ నేతృత్వంలోని ధర్మాసనం సాయిబాబాను నిర్దోషిగా ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై మహారాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ బేలా ఎం.త్రివేదిలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం తదుపరి రోజు శనివారమైనప్పటికీ ప్రత్యేకంగా విచారించింది. హైకోర్టు ఉత్తర్వులను తాత్కాలికంగా నిలిపివేసింది. అనంతరం జస్టిస్ షా, జస్టిస్ రవికుమార్ సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ జరిపి 2023 ఏప్రిల్ 19న బాంబే హైకోర్టు తీర్పును పక్కనపెట్టింది. ఈ తీర్పును మళ్లీ పరిశీలించాలని బాంబే హైకోర్టుకు పంపించింది. ఈ నేపథ్యంలో జస్టిస్ జోషీ, జస్టిస్ వాల్మీకిల హైకోర్టు ధర్మాసనం విచారించి, సాయిబాబా, ఇతరులను నిర్దోషులుగా ప్రకటించింది. ప్రొఫెసర్ సాయిబాబా 2014లో అరెస్టయ్యారు. ప్రస్తుతం నాగ్‌పూర్ సెంట్రల్ జైల్లో ఉన్నారు.

పదేళ్ల పోరాటం తర్వాత ఊరట దక్కింది

బాంబే హైకోర్టు తీర్పు పట్ల సాయిబాబా భార్య వసంత ఆనందం వ్యక్తం చేశారు. పదేళ్ల తర్వాత ఊరట లభించిందన్నారు. సాయిబాబాకు అండగా నిలిచిన లాయర్లకు, సామాజిక కార్యకర్తలకు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. తన భర్త పది సంవత్సరాలు జైలులో ఉన్నారని, ఆర్థికంగా, మానసికంగా తాము ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నామని చెప్పారు. సాయిబాబా గురించి ప్రజలకు వాస్తవాలు తెలుసని, ఆయన పట్ల వారికి సంపూర్ణ విశ్వాసం ఉందని పేర్కొన్నారు.

సుప్రీంకోర్టులో మహారాష్ట్ర సర్కారు పిటిషన్

మావోయిస్టులతో సంబంధాల కేసులో మాజీ ప్రొఫెసర్ సాయిబాబాను నిర్దోషిగా విడుదల చేస్తూ బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పు పట్ల మహారాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ మేరకు మంగళవారం అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసింది. బాంబే హైకోర్టు తీర్పును కొట్టివేయాలని మహారాష్ట్ర ప్రభుత్వం విన్నవించింది. సాయిబాబాతోపాటు ఇతరులను నిర్దోషులుగా నిర్ధారిస్తూ బాంబే హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుపై సుప్రీంకోర్టును ఆశ్రయించామని మహారాష్ట్ర అడ్వొకేట్ జనరల్ బీరేంద్ర షరాఫ్ ఈ సందర్భంగా చెప్పారు. నిందితులను నిర్దోషులుగా ప్రకటిస్తూ ఇచ్చిన తీర్పును కొంతకాలం నిలిపివేయాలని కోరుతూ హైకోర్టు ధర్మాసనం ముందు అప్లికేషన్ దాఖలు చేశారు. ధర్మాసనం స్పందిస్తూ.. న్యాయమూర్తి నిర్ణయం తీసుకున్న తర్వాత దాన్ని పునఃపరిశీలించే అధికారం ఉండదని, ఇది వ్యక్తి స్వేచ్ఛకు సంబంధించిన విషయమని స్పష్టం చేసింది. అడ్వొకేట్ జనరల్ దాఖలు చేసిన అప్లికేషన్‌ను కొట్టివేసింది.

జలాంతర మెట్రో

నేడే కోల్‌కతాలో నీటి అడుగున మెట్రో సేవలు ప్రారంభం

ఆధునిక భారత రైల్వే చరిత్రలో నూతన అధ్యాయానికి అండర్ వాటర్ మెట్రో శ్రీకారం చుట్టేందుకు సిద్ధమైంది. అత్యంత లోతైన హౌరా మెట్రో స్టేషన్ గుండా నీటి అడుగున మెట్రో రైళ్లు పరుగులు పెట్టనున్నాయి. ఇందుకు కోల్‌కతాలోని ఈస్ట్–కోస్ట్ మెట్రో కారిడార్ వేదికగా మారనుంది. ఈ కారిడార్‌లోని హౌరా మైదాన్– ఎస్ప్లానేడ్ సెక్షన్‌లో ఈ అండర్ వాటర్ మెట్రో సేవలు ప్రయాణికులకు అద్భుత అనుభూతిని పంచనున్నాయి. దేశంలోనే మొట్టమొదటిదైన ఈ అండర్‌వాటర్ మెట్రో సేవలను బుధవారం ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. హుగ్లీ నది జలాల కింద ఈ మెట్రో ప్రాజెక్టు రూపుదిద్దుకుంది.



విశేషాలు ఇవే...

- ఈస్ట్–వెస్ట్ మెట్రో మొత్తం పొడవు 16.6 కిలోమీటర్లు కాగా అందులో 10.8 కిలోమీటర్లమేర విస్తరించిన కారిడార్‌లో రైలు భూగర్భంలో ప్రయాణించనుంది.
- ఇందులో పూర్తిగా నదీజలాల కింద నుంచి 520 మీటర్లమేర రైలు పరుగులుపెట్టనుంది. 45 సెకన్లపాటు సాగే ఈ నదీగర్భ ప్రయాణం మెట్రో రైలు ప్రయాణికులకు అనిర్వచనీయ అనుభూతి ఇవ్వనుంది
- దేశంలో తొలిసారిగా నది అడుగున నిర్మించిన తొలి రవాణా టన్నెల్ కూడా ఇదే కావడం విశేషం.
- కోల్‌కతా పరిధిలోని జంట నగరాలుగా పేరొందిన హౌరా, సాల్ట్ లేక్‌లను కలుపుతూ ఈ మెట్రో రైల్వే సేవలను అందుబాటులోకి తెస్తున్నారు.
- 16.6 కిలోమీటర్లలో 4.8 కిలోమీటర్ల మార్గం కోల్‌కతాలోని సాల్ట్ లేక్ సిటీ ఐదో సెక్టార్, సెల్దాలోని కీలకమైన ఐటీ హబ్‌కు ఎంతో దోహదపడనుంది.
- హుగ్లీ నది అడుగున నిర్మించిన తొలి మెట్రో సొరంగ మార్గంగా ఇది రికార్డు లకెక్కనుంది.
- 'కోల్‌కతా మెట్రో'కు సంబంధించి 2023 ఏప్రిల్ నెల ప్రత్యేకమైంది. ఎందుకంటే ఆ నెలలో నదీ అడుగున 32 మీటర్ల మేర ప్రయోగాత్మక మెట్రో రైలును విజయవంతంగా నడిపి చూశారు.
- నేడు (బుధవారం) ప్రధాని మోదీ ఈ రైల్వే సేవలను లాంఛనంగా ప్రారంభించాక గురువారం నుంచి సాధారణ పౌరులను ప్రయాణాలకు అనుమతిస్తామని కోల్‌కతా మెట్రో అధికారి కౌశిక్ మిత్రా చెప్పారు. కవి సుభాష్–హిమంత ముఖోపాధ్యాయ్, తారాతలా–మాజెర్హాట్ మెట్రో సెక్షన్లను మోదీ ప్రారంభిస్తారు.
- ఈ మెట్రో సెక్షన్‌లో మొత్తంగా ఆరు స్టేషన్లు ఉంటాయి. వీటిలో మూడింటిని భూగర్భంలోనే కట్టారు. అయినా సరే ప్రయాణికులు భూగర్భం లోపలికి, బయటకు వేగంగా వచ్చిపోయేందుకు వీలుగా నిర్మించారు.
- అత్యంత రద్దీ, కాలుష్యమయ కోల్‌కతాలో పర్యావరణ అనుకూల ప్రయాణానికి భరోసానిస్తూ ఈ మెట్రోను ఇలా భూగర్భంలో డిజైన్‌చేశారు. దీంతో కాలుష్య తగ్గడంతోపాటు ప్రయాణికులకు ప్రయాణ సమయమూ కలిసిరానుంది.
- ఈస్ట్–వెస్ట్ మెట్రో కారిడార్ పనులు 2009లోనే మొదలయ్యాయి. హుగ్లీ నది అంతర్భాగ పనులు మాత్రం 2017లో ఊపందుకున్నాయి
- 2019 ఆగస్టులో భూగర్భంలో కొన్ని చోట్ల భూగర్భ జలాలు ఉబికిరావడం, భూమి కుంగడం వంటి ఘటనలతో అండర్‌వాటర్ మెట్రో పనుల్లో ఆలస్యం చోటుచేసుకుంది. 2022లో వాటర్ లీకేజీ ఘటనలూ ఎదురైనా అన్ని బాలారిష్టాలను దాటుకుంటూ ఎట్టకేలకు ఈ మెట్రో నేడు ప్రారంభోత్సవానికి సిద్ధమైంది.

ప్రపంచంలో ఎన్నెన్నో

19వ శతాబ్దిలోనే ఇంగ్లిష్ ఇంజనీర్లు భూగర్భ రైల్వే సేవలను అందుబాటులోకి తెచ్చారు. ప్రపంచంలోనే పురాతన భూగర్భ రైల్వే నెట్‌వర్క్‌గా థేమ్స్ టన్నెల్‌ను చెప్పుకోవచ్చు. 1843లోనే రోథర్‌హీట్, ర్యాపింగ్ పట్టణాల మధ్య ఈ మార్గాన్ని నిర్మించారు. ఇప్పుడిది లండన్‌లో కీలక రైలు మార్గాల్లో ఒకటి. దీని పొడవు కేవలం 400 మీటర్లు. జపాన్‌లోని సీకెల్ టన్నెల్ ప్రఖ్యాతిగాంచిన అండర్‌వాటర్ రైల్వే టన్నెల్‌గా పేరొందింది. దీని పొడవు ఏకంగా 53.85 కిలోమీటర్లు. హోన్‌షూ, హొక్కైడో ద్వీపాల మధ్య సుగారు జలసంధి కింద దీనిని నిర్మించారు. ఇది ప్రపంచంలోనే లోతైన, పొడవైన రైల్వే టన్నెల్‌గా రికార్డుసృష్టించింది. తుర్కియేలోని ఇస్తాంబుల్‌లో బోస్పొరస్ జలసంధి కింద అండర్‌వాటర్ టన్నెల్ నిర్మించారు. ఇది ఇస్తాంబుల్‌లోని ఆసియా, యూరప్ భూభాగాలను కలుపుతుంది. ఈ రైల్వే టన్నెల్ పొడవు దాదాపు 14 కి.మీ.లు.

– సాక్షి, నేషనల్ డెస్క్

డీకే శివకుమార్‌కు సుప్రీంలో ఊరట

2018నాటి మనీలాండరింగ్ కేసు కొట్టివేత



న్యూఢిల్లీ: కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌పై గతంలో నమోదైన మనీ లాండరింగ్ కేసును సర్వోన్నత న్యాయస్థానం మంగళవారం కొట్టేసింది. ఈ కేసుకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) గతంలో ఇచ్చిన సమన్లను రద్దుచేయాలంటూ డీకే 2019లో కర్ణాటక హైకోర్టును ఆశ్రయించగా అక్కడ ఆయనకు చుక్కెదురైంది. దీంతో ఆయన సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలుచేశారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల సుప్రీంకోర్టు ధర్మాసనం మంగళవారం విచారించింది. పన్నుల ఎగవేత, హవాలా లావాదేవీలు జరిపారంటూ ఆదాయపన్ను శాఖ 2017లో డీకే శివకుమార్, ఆయన వ్యాపార భాగస్వామి, మద్యం వ్యాపారి సచిన్ నారాయణ్, మరో భాగస్వామి సునీల్ కుమార్ శర్మలపై కేసు వేసింది. అప్పుడే ఢిల్లీసహా పలు ప్రాంతాల్లో సోదాలు చేసి రూ.8.59 కోట్ల నగదును స్వాధీనం చేసుకుంది. బెంగళూరు కోర్టులో ఐటీ శాఖ చార్జ్‌షీట్‌ను దాఖలుచేసింది. మనీ లాండరింగ్ జరిగిందంటూ ఈడీ 2018లో కేసు నమోదుచేసి విచారణ మొదలుపెట్టి 2019 సెప్టెంబర్‌లో డీకేను అరెస్ట్‌చేసింది. ఆ తర్వాతి నెలలో ఢిల్లీ హైకోర్టు డీకేకు బెయిల్ మంజూరుచేసింది. మంగళవారం వచ్చిన తీర్పుపై డీకే సంతోషం వ్యక్తంచేశారు.

ఫ్రాన్స్‌లో అబార్షన్ ఇక చట్టబద్ధ హక్కు

పారిస్: ఫ్రాన్స్ గర్భస్రావాన్ని చట్టబద్ధం చేసింది. అబార్షన్‌ను చట్టబద్ధ హక్కుగా పేర్కొన్న ప్రపంచంలోని మొట్టమొదటి దేశంగా నిలిచింది. ఈ మేరకు 1958 నాటి చట్టాన్ని సవరించేందుకు సోమవారం దేశ పార్లమెంట్ 780–72 ఓట్ల తేడాతో ఆమోదముద్ర వేసింది. కొత్త చట్టం ప్రపంచానికే ఒక సందేశం వంటిదని, ఫ్రాన్సుకు గౌరవమని అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మాక్రాన్ చట్టసభల సభ్యుల హర్షధ్వానాల మధ్య అభివర్ణించారు. ఈ సందర్భంగా పారిస్‌లోని ప్రముఖ పర్యాటక కట్టడం ఈఫిల్ టవర్‌ను 'మై బాడీ మై చాయిస్' అనే సందేశంతో కూడిన విద్యుద్దీపాలతో అలంకరించారు. అయితే, వాటికన్ సిటీ మాదిరిగానే అబార్షన్ వ్యతిరేక సంఘాలు ఈ మార్పును తీవ్రంగా విమర్శించాయి..

జడ్జి పదవిని వదిలి..బీజేపీలోకి..!



కోల్‌కతా: కలకత్తా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభిజిత్ గంగోపాధ్యాయ మంగళవారం పదవికి రాజీనామా చేశారు. బీజేపీలో చేరనున్నట్లు ఆయన మంగళవారం మీడియా సమక్షంలో వెల్లడించారు. అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అవినీతి, అక్రమాలకు మారుపేరుగా మారిపోయిందని విమర్శించారు. 'ఈ నెల 7వ తేదీన బీజేపీలో చేరబోతున్నాను. బీజేపీ జాతీయ పార్టీ. బెంగాల్‌లో అవినీతి టీఎంసీకి వ్యతిరేకంగా పోరాడుతోంది. అందుకే ఆ పార్టీలో చేరుతున్నాను'అని చెప్పారు. బీజేపీ అధిష్టానం కోరితే రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తానని చెప్పారు. 'పశ్చిమబెంగాల్‌లో టీఎంసీకి రోజులు దగ్గరపడ్డాయి. రాష్ట్రంలో సీపీఎం మాదిరిగానే టీఎంసీకి కూడా ఓటమి తప్పదు'అని ఆయన నిప్పులు చెరిగారు. రాజీనామా లేఖను మంగళవారం ఉదయం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు, ప్రతులను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌కు, కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీఎస్ శివజ్ఞానంకు పంపారు.

మోదీ గ్యారంటీ హోర్డింగ్‌లు పెట్టండి

చమురు సంస్థలకు కేంద్రం అనధికార ఆదేశాలు

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారంటీలకు సంబంధించిన హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలను పెట్రోలు బంకుల్లో ఏర్పాటు చేయాలని పెట్రోలియం శాఖ అనధికారికంగా కోరినట్లు తెలిసింది. మోదీ గ్యారెంటీల్లో ఒకటైన 'ఉజ్వల యోజన'పథకం హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు బుధవారం సాయంత్రం కల్లా అన్ని రిటైల్ ఔట్‌లెట్లలోనూ ఏర్పాటు చేయాలని మౌఖికంగా కోరినట్లు సమాచారం. దేశవ్యాప్తంగా సుమారు 80 వేల పెట్రోల్ బంకులకు ఈ సమాచారం వెళ్లినట్లు తెలుస్తోంది. ఆదేశాలను పట్టించుకోని బంకుల వివరాలను ఫీల్డ్ ఆఫీసర్లకు రిపోర్టు చేయాలని చమురు సంస్థల మేనేజర్లకు కేంద్ర పెట్రోలియం శాఖ సూచించినట్లు తెలిసింది.

భారత బలగాలు మా భూభాగంపై వద్దేవద్దు

మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జు అక్కసు



మాలె: మాల్దీవుల అధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జు మరోసారి భారత వ్యతిరేకతను వెళ్లగక్కారు. సాధారణ పౌర దుస్తుల్లోనైనా సరే భారత సైనిక సిబ్బంది తమ భూభాగంలో మే 10వ తేదీ తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండరాదని అన్నారు. మాల్దీవుల్లో భారత్ మూడు వైమానిక కేంద్రాలను ఏర్పాటు చేసింది. అక్కడి ప్రభుత్వం మార్చి 10వ తేదీ కల్లా భారత సైనిక సిబ్బంది వాటిని విడిచి వెళ్లిపోవాలని గడువు ప్రకటించింది. దీంతో, సైనిక సిబ్బంది నుంచి ఆ కేంద్రాల బాధ్యతలను చేపట్టేందుకు భారత్ నుంచి పౌర సిబ్బందితో కూడిన మరో బృందం అక్కడికి చేరుకున్న నేపథ్యంలో చైనాకు అనుకూలంగా వ్యవహరిస్తున్న అధ్యక్షుడు ముయిజ్జు మళ్లీ తన బుద్ధిని బయటపెట్టారు. భారతీయ సిబ్బంది ఏ రూపంలోనైనా సరే తమ దీవిలో ఉండరాదన్నారు.

నలుగురితో యూపీ మంత్రివర్గ విస్తరణ

లక్నో: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మంగళవారం తన మంత్రి వర్గాన్ని విస్తరించారు. కొత్తగా నలుగురు మంత్రులను చేర్చుకున్నారు. దీంతో మొత్తం మంత్రుల సంఖ్య 56కు చేరింది. తాజాగా మంత్రులైన వీరిలో ఇద్దరు బీజేపీ నేతలు కాగా మరో ఇద్దరు ఎన్‌డీఏ పక్షమైన సుహేల్‌దేవ్ భారతీయ సమాజ్ పార్టీ (ఎస్‌బీఎస్‌పీ) చీఫ్ ఓం ప్రకాశ్ రాజ్‌భర్, రాష్ట్రీయ లోక్‌దళ్ (ఆర్‌ఎల్‌డీ) నేత అనిల్ కుమార్. రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో వీరి చేత గవర్నర్ ఆనందీబెన్ పటేల్ ప్రమాణం చేయించారు. ఇది రెండోసారి సీఎం అయ్యాక యోగి చేపట్టిన మొదటి మంత్రివర్గ విస్తరణ. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో బీజేపీ తన స్థానాన్ని పదిలం చేసుకునేందుకు చేసిన ప్రయత్నంగా భావిస్తున్నారు.

ప్రపంచ కుబేరుడు జెఫ్ బెజోస్



వాషింగ్టన్: ప్రపంచంలో అత్యంత ధనవంతుడిగా 'అమెజాన్' వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ మరోసారి రికార్డుకెక్కారు. ఈ విషయంలో టెస్లా అధినేత ఎలాన్ మస్క్‌ను ఆయన వెనక్కి నెట్టేశారు. బ్లూంబర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ప్రకారం జెఫ్ బెజోస్ సంపద 200 బిలియన్ డాలర్లు కాగా, ఎలాన్ మస్క్ సంపద 198 మిలియన్ డాలర్లు. ఎలాన్ మస్క్ గత ఏడాది కాలంలో 31 బిలియన్ డాలర్ల సంపద కోల్పోయారు. ఇదే సమయంలో బెజోస్ 23 బిలియన్ డాలర్లు సంపాదించారు. టెస్లా కంపెనీ షేరు ధర సోమవారం 7 శాతం క్షీణించింది. 'ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడు' అనే రికార్డు స్థిరంగా ఏమీ ఉండదు. మార్కెట్ పనితీరు, ఆర్థిక పరిస్థితులను బట్టి తరచుగా చేతులు మారుతూ ఉంటుంది.

ఇజ్రాయెల్ దాడిలో 17 మంది మృతి

రఫా: గాజాలోని ఖాన్‌యూనిస్ నగరంపై మంగళవారం ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో 17 మంది ప్రాణాలు కోల్పోయారు. నేలమట్టమైన భవన శిథిలాల నుంచి మృతదేహాలను, క్షతగాత్రులను స్థానికులు బయటికి తీస్తున్న దృశ్యాలను స్థానిక యంత్రాంగం ఆన్‌లైన్‌లో ఉంచింది. గత 24 గంటల వ్యవధిలో దాడుల్లో 100 మంది వరకు చనిపోయినట్లు గాజా ఆరోగ్య శాఖ తెలిపింది. దీంతో, గత ఏడాది అక్టోబర్ 7వ తేదీ నుంచి ఇజ్రాయెల్ సాగిస్తున్న దాడుల్లో చనిపోయిన వారి సంఖ్య 30,631కి, క్షతగాత్రుల సంఖ్య 72 వేలకు చేరుకుందని పేర్కొంది. డీ హైడ్రేషన్, పోషకాహార లోపంతో ఉత్తర గాజాలో 10 మంది వరకు చిన్నారులు చనిపోయినట్లు యూనిసెఫ్ తెలిపింది.

తమ ఖజానా నింపుకోవడమే కాంగ్రెస్ మిత్రపక్షాల పని

ఒడిశాలో ప్రధాని మోదీ విమర్శలు

జాజ్‌పూర్(ఒడిశా): కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో హస్తం పార్టీ, దాని మిత్ర పక్షాలు తమ బొక్కసాలు నింపుకోవడంలో బిజీగా ఉండేవని ప్రధాని మోదీ విమర్శించారు. ఒడిశా పర్యటన సందర్భంగా జాజ్‌పూర్ జిల్లాలో జరిగిన ఒక సభలో ప్రధాని ప్రసంగించారు. '' మా ప్రభుత్వహయాంలో అమలవుతోన్న అభివృద్ధి పనులు 2014 ఏడాదికి ముందు కూడా సాధ్యమే. కానీ ఆనాడు కాంగ్రెస్ హయాంలో అభివృద్ధిని పక్కనపడేసి కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు తమ ఖజానాలు నింపుకోవడంలో మునిగిపోయాయి. గత పదేళ్లలో బీజేపీ కేంద్రప్రభుత్వం ఒడిశాలోకి పెట్టుబడుల వరద పారేలా చేసింది. వికసిత భారత్‌కు ఒడిశా సింహద్వారంగా మారాలనేది మా అభిమతం. నా 'మేరా భారత్, మేరా పరివార్' నినాదం విపక్షాల 'ఇండియా' కూటమి నేతలను కలవరపెడుతోంది'' అని మోదీ వ్యాఖ్యానించారు. తూర్పు భారతావని అభివృద్దే తమ ప్రభుత్వ లక్ష్యమని ప్రధాని మోదీ ప్రకటించారు. ఒడిశాలో చమురు, సహజ వాయువు, రైల్వే, రోడ్డు రవాణా, అణు విద్యుత్ సంబంధిత రూ.19,600 కోట్ల విలువైన ప్రాజెక్టుల ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ జాజ్‌పూర్ జిల్లాలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు.

భారత్.. దేశం కాదు ఉపఖండం

- ఒకే దేశం అయితే దేశమంతటా ఒకే భాష ఉండాలి
- భరతమాత, జైశ్రీరామ్‌ను తమిళనాడు స్వీకరించదు
- కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే భారతదేశ రాజ్యాంగమే ఉండదు
- డీఎంకే సీనియర్ నేత ఎ.రాజా వివాదాస్పద వ్యాఖ్యలు



చెన్నై: తమిళనాడుకు చెందిన అధికార డీఎంకే సీనియర్ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి ఎ.రాజా మరో వివాదానికి ఆజ్యం పోశారు. బీజేపీ సిద్ధాంతాలైన భరతమాత, జైశ్రీరామ్‌ను తమిళనాడు ఎప్పటికీ స్వీకరించబోదని, అవి తమకు ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు. ఇండియా ఒకే దేశం కాదని, ఇదొక ఉపఖండం మాత్రమేనని అన్నారు. ఒకే దేశం అయితే దేశమంతటా ఒకే భాష ఉండాలని చెప్పారు. మధురైలో మంగళవారం డీఎంకే కార్యక్రమంలో ఎ.రాజా ప్రసంగించారు. ''రాముడికి శత్రువు ఎవరు? రాముడి గురించి, రామాయణం గురించి నాకు అంతగా తెలియదు. వాటిపై నాకు నమ్మకం లేదు. రాముడు సీతతో కలిసి అడవికి వెళ్లాడని చిన్నప్పుడు మా తమిళ టీచర్ చెప్పారు. ఒక వేటగాడిని, సుగ్రీవుడిని, విభీషణుడిని రాముడు తన సోదరులుగా స్వీకరించాడు. ఇందులో కులం, మతం ప్రసక్తి లేదని అర్థమవుతోంది. ఇండియా ఒకే దేశమని అంటున్నారు. ఒకే దేశమైతే ఒకే భాష, ఒకే సంప్రదాయం, ఒకే సంస్కృతి ఉండాలి. ఇండియాలో అలా లేదు కాబట్టి ఇదొక ఉపఖండం. ఇండియా గతంలో ఎన్నడూ ఒక దేశంగా లేదు. తమిళనాడు, కేరళ, ఢిల్లీ, ఒడిశా తదితర రాష్ట్రాల్లో వాటి సొంత సంస్కృతులు ఉన్నాయి. భిన్న జాతులు, భాషలు, సంస్కృతుల సమాహారమే ఇండియా. ఇక్కడ ఒక సామాజిక వర్గం ప్రజలు గొడ్డు మాంసం తింటారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత తమిళనాడులో డీఎంకే ఉండదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అంటున్నారు. తమిళనాడులో డీఎంకే లేకపోతే అసలు భారతదేశమే ఉండదు. ఇలా ఎందుకు చెప్తున్నానంటే.. కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే భారత దేశ రాజ్యాంగమే ఉండదు. రాజ్యాంగం లేకపోతే దేశం కూడా మనుగడ కోల్పోతుంది. భారతదేశం లేకపోతే తమిళనాడు రాష్ట్రం ఉండదు. దేశం నుంచి మేము విడిపోతాం. ఇలా జరగాలని భారతదేశం కోరుకొంటోందా?'' అంటూ ఎ.రాజా సంచలన వ్యాఖ్యలు చేశారు.

రాజాను వెంటనే అరెస్టు చేయాలి

డీఎంకే నేత ఎ.రాజా వ్యాఖ్యలపై బీజేపీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనను తక్షణమే అరెస్టు చేయాలని తమిళనాడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డీఎంకే నాయకులు విద్వేషపూరిత వ్యాఖ్యలు చేయడం మానుకోవడం లేదని బీజేపీ నేత అమిత్ మాలవీయా విమర్శించారు. సనాతన ధర్మం గురించి ఉదయనిధి స్టాలిన్ అనుచితంగా మాట్లాడారని చెప్పారు. దేశాన్ని ముక్కలు చేయాలన్నదే డీఎంకే నేతల కుటిల యత్నమని మండిపడ్డారు. రాజాపై కఠిన చర్యలు తీసుకోవాలని తిమళనాడు డీఎంకే అధికార ప్రతినిధి తిరుపతి అన్నారు. రాజా వ్యాఖ్యలను డీఎంకే మిత్రపక్షం కాంగ్రెస్ సైతం ఖండించింది. మాట్లాడేటప్పుడు సంయమనం పాటించాలని సూచించింది. రాజా వ్యాఖ్యలతో విభేదిస్తున్నానని కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనాతే చెప్పారు.

షాజహాన్ షేక్‌ను సీబీఐకి అప్పగించం

- కలకత్తా హైకోర్టు ఆదేశాలు బేఖాతరు
- సుప్రీంలో బెంగాల్ ప్రభుత్వం పిటిషన్

కోల్‌కతా/న్యూఢిల్లీ: సందేశ్‌ఖాలీ అరాచకాల కేసులో ప్రధాన నిందితుడైన తృణమూల్ మాజీ నేత షాజహాన్ షేక్‌ను సీబీఐకి అప్పగించాలంటూ కలకత్తా హైకోర్టు మంగళవారం జారీ చేసిన ఆదేశాలను పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం లెక్కచేయలేదు. అతడిని అప్పగించబోమని పేర్కొంది. ఈ మేరకు హైకోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. షేక్ ఇంట్లో సోదాలు చేసేందుకు వెళ్లిన ఈడీ అధికారులపై అతడి అనుచరులు దాడి చేశారు. ఈడీ ఫిర్యాదు మేరకు బెంగాల్ పోలీసులు షేక్‌ను అరెస్ట్‌చేశారు. ఈ కేసును సీబీఐకి అప్పగించాలని ఈడీ కోరగా, హైకోర్టు అంగీకరించింది. ఈ కేసులో పోలీసులు పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని, నిందితుడిని కాపాడేందుకు దర్యాప్తులో ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నారని న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. అయితే, బెంగాల్ ప్రభుత్వం తాజాగా సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో నిందితుడు షాజహాన్ షేక్‌ను బెంగాల్ పోలీసులు సీబీఐకి అప్పగించలేదు. మరోవైపు షాజహాన్ షేక్‌కు చెందిన రూ.12.78 కోట్ల ఆస్తులను అటాచ్ చేశామని ఈడీ ప్రకటించింది.

ఇజ్రాయెల్‌పై హెజ్బొల్లా క్షిపణి దాడి

కేరళ వాసి మృతి, మరో ఇద్దరికి గాయాలు

జెరూసలేం: ఇజ్రాయెల్‌పై హెజ్బొల్లా మిలిటెంట్లు జరిపిన యాంటీ ట్యాంక్ క్షిపణి దాడిలో ఒక భారతీయుడు ప్రాణాలు కోల్పోయాడు. మరో ఇద్దరు గాయపడ్డారు. బాధితులంతా కేరళకు చెందిన వారే. ఉత్తర సరిహద్దులకు సమీపంలోని గలిలీ ప్రాంతంలో ఉన్న మర్గలియోట్ సామూహిక వ్యవసాయ క్షేత్రంలో సోమవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. పౌల్ట్రీఫాంలో ఉన్న పాట్ నిబిన్ మాక్స్‌వెల్ (31) చనిపోగా జోసెఫ్ జార్జ్(31), పాల్ మెల్విన్(28) అనే వారు గాయపడ్డారు. మాక్స్‌వెల్‌ది కేరళలోని కొల్లం జిల్లా. క్షిపణి దాడిలో మాక్స్‌వెల్ గాయపడినట్లు సోమవారం సాయంత్రం తమకు ఇజ్రాయెల్‌లోని బంధువులు తెలిపారని తండ్రి పాత్రోస్ చెప్పారు. ఆ తర్వాత అతడు చనిపోయినట్లు అర్ధరాత్రి సమాచారమిచ్చారని గద్గద స్వరంతో మీడియాకు చెప్పారు. తన పెద్ద కుమారుడు ఇజ్రాయెల్‌లోనే ఉంటున్నారని ఆయన వివరించారు. గతంలో మస్కట్, దుబాయ్‌కి వెళ్లి వచ్చిన మాక్స్‌వెల్ రెండు నెలల క్రితమే ఇజ్రాయెల్ వెళ్లాడని తెలిపారు.

కోలుకుంటున్న క్షతగాత్రులు: 'క్షిపణి దాడిలో గాయపడిన జార్జిని పెటా టిక్వాలోని బీలిన్సన్ ఆస్పత్రికి తరలించాం. అతడి ముఖం, ఇతర శరీర భాగాలకు గాయాలయ్యాయి. వైద్యులు శస్త్రచికిత్స చేశారు. ప్రస్తుతం కోలుకుంటున్నాడు. భారత్‌లోని కుటుంబ సభ్యులతో అతడు మాట్లాడొచ్చు'అని అధికార వర్గాలు తెలిపాయి. మెల్విన్‌కు స్వల్ప గాయాలైనట్లు ఇజ్రాయెల్ అధికారవర్గాలు తెలిపాయి. క్షతగాత్రులకు అత్యుత్తమ వైద్య సాయం అందిస్తామని చెప్పాయి. ఘటనపై ఢిల్లీలోని ఇజ్రాయెల్ రాయబార కార్యాలయం దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. మిలిటెంట్ల దాడిని పిరికిపంద చర్యగా పేర్కొంది. కాగా, సోమవారం హెజ్బొల్లా మిలిటెంట్లు జరిపిన దాడిలో ఒకరు చనిపోగా మొత్తం ఏడుగురు గాయపడినట్లు ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వివరించింది. గత ఏడాది అక్టోబర్ 8వ తేదీ నుంచి హమాస్, ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న పోరులో హమాస్‌కు మద్దతుగా లెబనాన్‌లోని హెజ్బొల్లా మిలిటెంట్లు రాకెట్లు, డ్రోన్లు, క్షిపణులతో ఇజ్రాయెల్ ఉత్తర ప్రాంతంపై దాడులకు పాల్పడుతున్నారు.

రాహుల్ గాంధీకి ఊహించని అనుభవం

మోదీ అంటూ బీజేపీ కార్యకర్తల నినాదాలు

షాజాపూర్: భారత్ జోడో న్యాయ్ యాత్రలో మంగళవారం కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి ఊహించని అనుభవం ఎదురైంది. మధ్యప్రదేశ్‌లోని షాజాపూర్‌లో బీజేపీ కార్యకర్తలు మోదీ, మోదీ అంటూ నినాదాలు చేశారు. దీంతో రాహుల్ వారి వద్దకు వెళ్లి, కరచాలనం చేశారు. అనంతరం రాహుల్ తిరిగి వాహనంలోకి వెళ్తూ గాల్లోకి ముద్దులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ..దేశంలో ప్రతి రంగంలోనూ సామాజిక అన్యాయం జరుగుతూనే ఉందన్నారు. జనాభాలో 90 శాతం మేర ఉన్న వెనుకబడిన కులాలు, దళితులు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు కీలక బాధ్యతల్లో లేనే లేరన్నారు. ప్రైవేట్ ఆస్పత్రులు, కాలేజీలు, యూనివర్సిటీలు, చివరికి మీడియాలోనూ ఇవే పరిస్థితులు నెలకొన్నాయని చెప్పారు. సాయంత్రం ఉజ్జయినిలో జరిగిన కార్యక్రమంలో షాజాపూర్ ఘటనను వివరించారు. 'అప్పుడప్పుడు ఇలాంటివి జరుగుతాయి. నిజానికి బీజేపీ కార్యకర్తలు నగరంలో నాకు స్వాగతం పలికారు' అని అన్నారు. తర్వాత ఉజ్జయినిలో మహాకాళేశ్వర్ ఆలయంలో పూజలు చేశారు.

పురాతన లిప్‌స్టిక్ లభ్యం

టెహ్రాన్: అతివల అధరాల అందానికి మరింత మెరుగులద్దడంలో లిప్‌స్టిక్‌ది అందెవేసిన చేయి. ఆధునిక ప్రపంచంలో నగరాల్లో అధరాలకు లిప్‌స్టిక్‌తో కనిపించే అమ్మాయిలు ఎక్కువగానే కనిపిస్తుంటారు. అయితే ఈకాలంలోనే కాదు పురాతన కాలంలోనూ లిప్‌స్టిక్‌ను ధరించే వారని, సౌందర్యోపాసన ఆనాడే అద్భుతంగా ఉండేదని తెలిపే ప్రబల సాక్ష్యమొకటి తాజా పరిశోధనలో దొరికింది. దాదాపు 4,000 సంవత్సరాల క్రితంనాటి లిప్‌స్టిక్ ఆనవాళ్లను ఇరాన్‌లో శాస్త్రవేత్తలు గుర్తించారు. క్రీస్తుపూర్వం 1936 – 1687 సంవత్సరాల మధ్యకాలంలో వినియోగంలో ఉన్న ఆ లిప్‌స్టిక్ పేస్ట్ ముదురు ఎరుపు వర్ణంలో మెరిసిపోతుండటం విశేషం. క్లోరైట్‌తో చేసిన చిన్నపాటి సీసాలో ఈ పేస్ట్‌ను పూర్వీకులు భద్రపరిచారు. 2001 ఏడాదిలో ఇరాన్‌లోని జిరాఫ్ట్ ప్రాంతంలో హలీల్ నదికి వచ్చిన వరదల్లో ఇది బయటపడింది. హెమటైట్ ధాతువు సమ్మేళనంగా దానిని తయారుచేశారు. కాంస్యయుగం నాటికే అతివల సౌందర్య సాధనాల జాబితాలోకి లిప్‌స్టిక్ వచ్చి చేరిందని వారు తెలిపారు. తూర్పు ఇరాన్‌లో మర్‌హాసీ నాగరికత వెల్లివిరిసిన కాలంలో లిప్‌స్టిక్ వినియోగం ఉండేదని అభిప్రాయపడ్డారు. కనుబొమ్మలకు, కనురెప్పలకు వాడే సౌందర్య వస్తువులు, బుగ్గలకు రాసుకునే పౌడి సైతం అవశేషాల్లో లభ్యమయ్యాయి.

విమానంలో బీడీ కాల్చిన ప్రయాణికుడు

ముంబై: విమానంలో బీడీ కాల్చి బుక్కయిపోయి జైలు ఊచలు లెక్కపెడుతున్న ఒక కార్మికుడి గాథ ఇది. సౌదీ అరేబియాలో కార్మికునిగా పనిచేసే 42 ఏళ్ల మొహమ్మద్ ఫక్రుద్దీన్ మొహమ్మద్ అమ్రుద్దీన్ సోమవారం ఢిల్లీలో రియాద్‌కు వెళ్లే విమానం ఎక్కాడు. ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ సెక్యూరిటీ కళ్లుగప్పి బీడీలు, లైటర్ వెంట తెచ్చుకుని ఇండిగో విమానం ఎక్కేశాడు. విమానం మార్గమధ్యంలో ముంబైలో ఆగాల్సి ఉంది. ముంబైకి వచ్చేలోపే ఆకాశంలో ఉండగా ఫక్రుద్దీన్ బాత్రూమ్‌కు వెళ్లి బీడీ కాల్చాడు. విషయం తెలిసి విమానం ల్యాండ్ అవగానే ముంబై పోలీసులు అరెస్ట్‌చేసి స్థానికకోర్టులో హాజరుపరిచారు. ఇతడిని జ్యుడీషియల్ కస్టడీకి పంపుతూ స్థానిక కోర్టు ఉత్తర్వులిచ్చింది.

సాక్షి హైదరాబాద్

బుధవారం । 6 । మార్చి । 2024



సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయంలో ప్రధాని నరేంద్ర మోదీ





పటాన్‌చెరులో కార్యకర్తల ఆనందం..మోదీ అభివాదం





నమో మంత్ర

ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం గ్రేటర్ పరిధిలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మంగళవారం ఉదయం రాజ్‌భవన్ నుంచి నేరుగా ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి దేవాలయానికి వచ్చిన ఆయన..గర్భగుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి..అమ్మవారికి పండ్లు, పూలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. దాదాపు 15 నిమిషాల పాటు ఆలయంలో గడిపారు. అనంతరం ప్రధాని మోదీ ప్రధాన గేటు బయటకు రాగానే భవనం పైనున్న ప్రజలు జై శ్రీరాం అంటూ నినాదాలు చేశారు. దీంతో వారికి ఎదురుగా కొద్ది క్షణాలు నిలబడి అభివాదం చేస్తూ ముందుకు వెళ్లారు. ఇక మోదీ రాక నేపథ్యంలో ఆలయం చుట్టుపక్కల పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. అనంతరం ఎంఎంటీఎస్ రెండో దశలో భాగంగా నిర్మించిన ఘట్‌కేసర్–లింగంపల్లి రూట్‌లో ఎంఎంటీఎస్ రైళ్లను సంగారెడ్డిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధాని మోదీ జెండా ఊపి ప్రారంభించారు. అలాగే సనత్‌నగర్–మౌలాలి మధ్య రైల్వేలైన్ల డబ్లింగ్, విద్యుదీకరణ ప్రాజెక్టును, కొత్తగా నిర్మించిన మరో 6 ఎంఎంటీఎస్ స్టేషన్‌లను కూడా ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఆ తర్వాత పటాన్‌చెరులో జరిగిన సభలో ప్రజలనుద్దేశించి మాట్లాడారు.

నత్తనడకలో..

ఈ నెలాఖరులోగా ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ పూర్తి కష్టమే..

- ఆరు నెలలుగా లేని కదలిక నెల రోజుల్లో అసాధ్యం
- హెచ్‌ఎండీఏలో 3.44 లక్షల ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు పెండింగ్

సాక్షి, సిటీబ్యూరో: హెచ్‌ఎండీఏలో ఎల్‌ఆర్‌ఎస్ పథకం నత్తనడకన సాగుతోంది. ఒకవైపు సిబ్బంది కొరత, మరోవైపు ఇతర పనుల ఒత్తిళ్ల కారణంగా ఎల్‌ఆర్‌ఎస్ ఫైళ్లు ముందుకు సాగడం లేదు. ఆరు నెలల క్రితమే ఈ పథకాన్ని అప్పటి ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. 2020లో రూ.1000 ఫీజు చెల్లించి ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వాళ్లకు మార్చి నెలాఖరు వరకు ప్రొసీడింగ్స్ అందజేయనున్నట్లు ఇటీవల ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఆ గడువులోగా దరఖాస్తులను పరిష్కరించి ప్రొసీడింగ్‌లను అందజేయడం అసాధ్యమని అధికావర్గాలు పేర్కొంటున్నాయి. హెచ్‌ఎండీఏలోని నాలుగు జోన్‌ల పరిధిలో సుమారు 3.44 లక్షలకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో ఇప్పటి వరకు 50 వేలకు పైగా దరఖాస్తులు మాత్రం వివిధ దశల్లో అధికారుల వద్ద పరిశీలనలో ఉన్నాయి. రోజుకు ఒక్కో జోన్‌లో 40 నుంచి 50 ఫైళ్లు మాత్రమే పరిశీలన స్థాయికి చేరుకుంటున్నాయి. ఇలా పరిశీలన దశకు వచ్చిన వాటికి అవసరమైన డాక్యుమెంట్‌లను దరఖాస్తుదారుల నుంచి తెప్పించాల్సి ఉంటుంది. అనంతరం ఫీజు చెల్లింపు నోటీసులను అందజేస్తారు. దరఖాస్తుదారులు ఫీజులు చెల్లించిన అనంతరమే ఎల్‌ఆర్‌ఎస్ ప్రొసీడింగ్‌లను అందజేస్తారు. ఇలా ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న లక్షలాది దరఖాస్తులను కేవలం నెల రోజుల వ్యవధిలో పూర్తి చేయడం ఏ మాత్రం సాధ్యం కాదని హెచ్‌ఎండీఏ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు ఆరు నెలల క్రితమే ఈ ప్రక్రియను ప్రారంభించగా ఇప్పటి వరకు కేవలం 50 వేలు పరిశీలన దశకు వచ్చాయి. మరో 3 లక్షల దరఖాస్తులు ఈ స్థాయికి రావాలంటే ఆరు నెలల సమయం కూడా చాలదని హెచ్‌ఎండీఏ అధికారులు అభిప్రాయపడ్డారు. వీటిపైన ప్రభుత్వానికి ఫీజుల రూపంలోనే రూ.1000 కోట్లకు పైగా ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

ప్లానింగ్‌లో సిబ్బంది కొరత...

హెచ్‌ఎండీఏ ప్రణాళికావిభాగాన్ని సిబ్బంది కొరత వెంటాడుతోంది. ప్రస్తుతం శంకర్‌పల్లి, మేడ్చల్, ఘట్‌కేసర్, శంషాబాద్ జోన్‌ల పరిధిలో సుమారు 7 వేల చదరపు కిలోమీటర్‌ల వరకు హెచ్‌ఎండీఏ విస్తరించుకొని ఉంది. ఈ పరిధిలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు చెందిన దరఖాస్తులు ప్రస్తుతం హెచ్‌ఎండీఏ పరిష్కరించవలసి ఉంది. కానీ ఒక్కో జోన్‌లో ఏపీఓ, జేపీఓ స్థాయి అధికారులు, టెక్నికల్ సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. దీంతో 10 మంది చేయవలసిన పని కేవలం ముగ్గురు చేయవలసి వస్తుంది. ఫలితంగా ఫైళ్లు ముందుకు కదలడం లేదు. న్యాక్ నుంచి 80 మంది టెక్నీషియన్‌లను ఇటీవల ఔట్‌సోర్సింగ్ సిబ్బందిగా నియమించారు. కానీ ప్రణాళికా విభాగంలో ఉన్న పని భారానికి ఈ సిబ్బంది మాత్రం చాలని పరిస్థితి నెలకొంది. గతంలో ఎల్‌ఆర్‌ఎస్ అమలును ప్రభుత్వం జిల్లా కలెక్టర్‌లకు అప్పగించింది. కానీ మూడేళ్లు గడిచినా ఎలాంటి పరిష్కారానికి నోచలేదు. గతేడాది తిరిగి హెచ్‌ఎండీఏకే ఆ బాధ్యతలను అప్పగించారు. దీంతో హెచ్‌ఎండీఏ ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను చేపట్టింది. ఈ క్రమంలోనే ఎన్నికలు వచ్చాయి. కొత్తగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ప్రభుత్వం మారిన అనంతరం ఫైళ్ల పరిష్కారంలో మరింత జాప్యం ఏర్పడింది.

సోదాలతో టెన్షన్ టెన్షన్...

మరోవైపు ఇటీవల హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్ బాలకృష్ణపైన ఏసీబీ దాడుల అనంతరం నెలకొన్న పరిణామాలు కూడా అధికారులు, సిబ్బందిపైన ప్రతికూల ప్రభావం చూపాయి. ఏసీబీ అధికారులు హెచ్‌ఎండీఏ కార్యాలయంలోనూ వరుసగా సోదాలు నిర్వహించారు. దీంతో వాళ్లు కోరిన ఫైళ్లు, సమాచారాన్ని అందజేసేందుకు కూడా రాత్రింబవళ్లు పని చేయవలసి వచ్చింది. ఆ తరువాత విజిలెన్స్ సోదాలు జరుగుతాయన్న వార్తలు సైతం తారెత్తించాయి. ఈ క్రమంలోనే నెల రోజుల్లో ఎల్‌ఆర్‌ఎస్ అందజేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. పని భారం, సిబ్బంది కొరత దృష్ట్యా ఇది ఏ మాత్రం సాధ్యం కాదని, మరో 6 నెలలైనా పూర్తిచేయలేమని అధికారులు స్పష్టం చేయడం గమనార్హం.

తూర్పు పడమర కలిసేలా!



మూసీ వెంట ఈస్ట్‌-వెస్ట్ కారిడార్

- కోకాపేట నుంచి గౌరెల్లికి రోడ్డు, మెట్రోమార్గం
- రవాణా ఆధారిత అభివృద్ధితోనే మూసీ సుందరీకరణ
- సీఎం సూచనల మేరకు క్షేత్ర స్థాయిలో పరిశీలన
- డీపీఆర్ పనిలో నిమగ్నమైన అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: మూసీకేసి నగరవాసి చూసి ముక్కులు మూసి మొహం తిప్పుకునే దశను మార్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. నగరవాసులు సమీప భవిష్యత్తులో మూసీ చెంత ఆనందం, ఆహ్లాదం ఆస్వాదించేవిధంగా, సేద తీరే విధంగా తీర్చిదిద్దేందుకు అడుగులు వేస్తోంది. సందర్శకులకు ఇష్టమైన టూరిస్ట్ స్పాట్‌గా మార్చాలని నిర్ణయించింది. మూసీతీరం నగర సుందరతోరణంగా మార్చేందుకు కసరత్తు చేస్తోంది. పర్యాటకానికి ఆలవాలంగా చేయాలని భావిస్తోంది. నగర తుర్పు–పడమరలను కలుపుతూ మణిహారంగా ఉన్న మూసీ సుందరీకరణకు నడుంబిగించింది. ఈ విషయమై ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. అయితే కేవలం ల్యాండ్ స్కేపింగ్ పనులతోనే మూసీని అభివృద్ధి చేస్తే ఆదరణ ఉండదనేది ప్రభుత్వ అంచనా. రోడ్డు, మెట్రో రైలు వంటి రవాణా ఆధారిత అభివృద్ధితోనే మూసీ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని భావిస్తోంది. మూసీతీరం వెంబడి మెట్రోమార్గాన్ని ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. ఈస్ట్‌-వెస్ట్ కారిడార్‌కు సంబంధించి క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. దీనిపై ప్రభుత్వం సమగ్రంగా సమీక్షించిన తర్వాత సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక(డీపీఆర్) రూపొందించనున్నారు.

ఉపాధి అవకాశాలకు నిలయంగా...

మూసీని టూరిజం స్పాట్‌గా తీర్చిదిద్దడంతోపాటు ఇక్కడ ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెండుగా, దండిగా ఉండేవిధంగా మార్చాలనేది ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం. గ్రేటర్ చుట్టూ న్న ఔటర్ రింగ్ రోడ్డును ఈ తూర్పు- పడమరల మూసీ ప్రాజెక్ట్‌ను అనుసంధానించడం ద్వారా బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని గుర్తించింది. ఈ నేపథ్యంలోనే ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి మూసీ సుందరీకరణ ప్రాజెక్టుపై సమీక్ష చేసిన సమయంలో హైదరాబాద్ మెట్రో అధికారులతోనూ ప్రత్యేకంగా ఈస్ట్‌-వెస్ట్ కారిడార్‌పై ప్రధానంగా చర్చించారు. సీఎం ఆదేశాల మేరకు ఈ ఈ మెట్రో మార్గం నిర్మాణ సాధ్యాసాధ్యాలపై అధ్యయనానికి అధికారులు పూనుకున్నారు.

కోకాపేట నుంచి గౌరెల్లి..

ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్) తూర్పు నుంచి పశ్చిమం వైపు రావాలంటే దాదాపు 80 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. నగరం లోపలి నుంచి రహదారి ఉంటే ప్రయాణ దూరం సగానికి తగ్గుతుందని ఈ కొత్తమార్గాన్ని ప్రతిపాదించారు. మూసీ సుందరీకరణలో భాగంగానే రోడ్డు, మెట్రో రైలు మార్గాలను నిర్మించాలనేది సర్కారు ఆలోచన. పడమర దిక్కున కోకాపేట నుంచి మొదలుకొని తూర్పు దిక్కున గౌరెల్లి వరకు మూసీ మీదుగా ఎక్స్‌ప్రెస్ వేతోపాటు సమాంతరంగా మెట్రో రైలు మార్గాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మార్గంలో కొంతదూరం భూమార్గం మీదుగా మెట్రో తీసుకెళ్లవచ్చనే ఆలోచనను హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ(హెచ్ఎంఆర్) ప్రభుత్వం ముందుంచింది. ఎత్తుగా ఉన్న చోట ఈ తరహాలో చేయవచ్చని సూచించింది. నిర్మాణ వ్యయాన్ని తగ్గించేందుకు అవకాశం ఉన్న మార్గాలను అధ్యయనం చేస్తోంది.

ఇప్పట్లో కష్టమే!

కొత్త రేషన్ కార్డుల మంజూరు అసాధ్యమేనా?

- పెండింగ్‌లో నాలుగు లక్షలపైనే దరఖాస్తులు
- దరఖాస్తుకు సిద్ధంగా మరో ఆరు లక్షల కుటుంబాలు



ప్రజాపాలన సందర్భంగా దరఖాస్తులు

జోన్	కొత్త దరఖాస్తుల సంఖ్య
ఎల్‌బీనగర్	3,16,919
చార్మినార్	6,53,795
ఖైరతాబాద్	4,27,950
కూకట్‌పల్లి	4,04,746
శేరిలింగంపల్లి	2,29,355
సికింద్రాబాద్	3,91,160
కంటోన్మెంట్	50,400

సాక్షి, సిటీబ్యూరో: ఇప్పట్లో కొత్త రేషన్ కార్డుల మంజూరు అసాధ్యమే అనిపిస్తోంది. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలకు తెల్లరేషన్ (ఆహార భద్రత)కార్డు ప్రామాణికంగా చెప్పడంతో ప్రాధాన్యం పెరిగింది. ఇప్పటి వరకు రేషన్ కార్డు బహుళ ప్రయోజనకారిగా పని చేస్తూ వస్తోంది. గత పదేళ్లలో కొత్త కార్డుల మంజూరు అంతంతగా మారడంతో రేషన్ కార్డులు లేనివారి సంఖ్య బాగా పెరిగింది. ఇప్పటికే నాలుగు లక్షల పైన దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, మరో ఆరు లక్షల కుటుంబాలు కొత్త కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. గత నాలుగేళ్ల నుంచి పౌరసరఫరాల ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు స్వీకరించే లాగిన్‌ను నిలిపివేశారు. వాస్తవంగా 2021 మార్చి వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉన్నప్పటికి ఆమోదం లేకుండా పోయింది. ఆ తర్వాత కొత్త దరఖాస్తుల సమర్పించుకునేందుకు వెసులుబాటు లేకుండా పోయింది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం తెల్లరేషన్ కార్డులను ఆహార భద్రత కార్డులుగా మార్పు చేయడంతోపాటు కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి ఇబ్బడిముబ్బడిగా కొత్త కార్డులను ప్రభుత్వం మంజూరు చేసింది. కొంత కాలానికి అనర్హుల పేరిట కొన్ని కార్డులను ఏరివేసి హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా , మేడ్చల్ జిల్లా పరిధిలో కార్డుల సంఖ్యను 15,99,639 పరిమితం చేసింది. దీంతో తిరిగి కొత్త కార్డుల కోసం పెద్ద ఎత్తున సుమారు 3.40 లక్షల కుటుంబాలు దరఖాస్తులు చేసుకోగా, 2021 ఆగస్టులో దరఖాస్తులను వడబోసి కేవలం 1.21 లక్షల దరఖాస్తులను మాత్రమే ఆమోదించి కొత్త కార్డులు మంజూరు మంజూరు చేసింది.

10 లక్షల కుటుంబాలకు ఎదురుచూపులే..

మహానగరంలో మరో 10 లక్షల కుటుంబాలు కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్నాయి. ప్రస్తుతం 17.21 లక్ష కుటుంబాలు మాత్రమే తెల్ల రేషన్ కార్డులు కలిగి ఉన్నాయి. ఇక ఇటీవలి ప్రజాపాలనలో కొత్త రేషన్ కార్డుల కోసం సుమారు 5,73,069 కుటుంబాలు ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నాయి.

గిది అన్నమేనా?







ఉడికీ ఉడకని అన్నం, రుచీపచీ లేని కూరలు..నీళ్ల చారు..వండామా పెట్టామా అన్నరీతిలో నిర్లక్ష్యం.. వెరసి విద్యార్థులకు తీవ్ర ఆగ్రహం తెప్పించింది. పీజీ, డిగ్రీ కోర్సులు చదువుతున్న తాము ఇంత అధ్వానపు తిండి తిని ఎలా బతికేదని తిరగబడ్డారు. బషీరాబాగ్‌లోని నిజాం కళాశాల వసతి గృహంలో నాసిరకం ఆహారం పెడుతున్నారని మంగళవారం విద్యార్థులు నిరసనబాట పట్టారు. ఏకంగా అన్నం, కూర గిన్నెలను హాస్టల్ ఎదురుగా ఉన్న రహదారిపైకి తీసుకువచ్చి బైఠాయించారు. ఎన్నిమార్లు కళాశాల యాజమాన్యం దృష్టికి తీసుకువచ్చినా స్పందించక పోవడంతోనే తాము రోడ్డెక్కామని తెలిపారు. చివరగా పోలీసులు వచ్చి విద్యార్థులను అదుపులోకి తీసుకుని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. – గన్‌ఫౌండ్రీ

పీపుల్స్ ప్లాజా వేదికగా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సంస్కృతి మహోత్సవాలు మంగళవారం అట్టహాసంగా ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన 'శారీ వాకథాన్'కు మహిళల నుంచి విశేష స్పందన లభించింది. గవర్నర్ తమిళిసై హాజరై చీరకట్టు గొప్పదనం గురించి అందంగా వర్ణించారు. కాలేజ్ గర్ల్స్ అందరూ చీరలను ప్రమోట్ చేసేందుకు వారంలో ఒక రోజు తప్పకుండా శారీ ధరించాలని గవర్నర్ సూచించారు. వందలాది మంది మహిళలు, విద్యార్థినులు, యువతులు చీరలు ధరించి వాకథాన్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి దర్శన జర్దోష్ తదితరులు పాల్గొన్నారు. శారీ వాకథాన్ పీపుల్స్ ప్లాజా నుంచి రోటరీ చౌరస్తా మీదుగా తిరిగి పీపుల్స్ ప్లాజా వరకు సాగింది. ఈ సందర్భంగా డ్రోన్ సాయంతో మహిళలపై పూల వర్షం కురిపించారు.





సంస్కృతి ఉట్టిపడేట్టు..





చీరకట్టు.. అదిరేట్టు

అక్రమాలకే అండ?

జీహెచ్‌ఎంసీలో వింత ధోరణి

- అడ్‌హక్ కమిటీలతో కాలయాపన
- అక్రమాల కట్టడికి సత్వర చర్యలు ఏవీ?

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీలో జరుగుతున్న అక్రమాలను అరికట్టడం కంటే అక్రమార్కులకు అండగా ఉండేందుకే జీహెచ్‌ఎంసీ ప్రయత్నిస్తోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా ప్రకటనల విభాగం, పారిశుద్ధ్య విభాగంలోని అక్రమాలపై విచారణ జరిపే కమిటీలను స్టాండింగ్ కమిటీ ముందుంచడం ఇందుకు ఊతమిస్తోంది. ఇటీవల జరిగిన కౌన్సిల్ సర్వసభ్య సమావేశంలో పార్టీల కతీతంగా సభ్యులు పారిశుధ్యం, ప్రకటనల విభాగాల్లో జరుగుతున్న అక్రమాలపై మండిపడ్డారు. దాంతో వాటిల్లో అక్రమాల నిగ్గు తేల్చేందుకు స్పెషల్ ఆఫీసర్‌ను నియమించడంతో పాటు కార్పొరేటర్లతో హౌస్ కమిటీలు ఏర్పాటు చేస్తామని మేయర్ ప్రకటించారు. రెండు వారాలైనా సదరు కమిటీలు ఏర్పాటు కాలేదు. హౌస్‌కమిటీల బదులు నాలుగు రాజకీయ పార్టీల నుంచి ఇద్దరేసి సభ్యులతో అడ్‌హక్ కమిటీలను ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ మేరకు ప్రతిపాదనల్ని బుధవారం జరగనున్న కొత్త స్టాండింగ్ కమిటీ తొలి సమావేశం ముందుంచనున్నారు. అంతేకాదు..సదరు కమిటీకి కౌన్సిల్ సర్వసభ్య సమావేశం ఆమోదం కూడా అవసరమని పేర్కొన్నారు. అక్రమాలను అరికట్టేందుకు నిర్ణయం తీసుకున్నదే సర్వసభ్య సమావేశంలో కాగా, తిరిగి మళ్లీ ఈ నిబంధన ఎందుకు చేర్చారో అంతుపట్టడం లేదు. గతంలో కుక్కల నియంత్రణ కోసం కార్పొరేటర్లతోనే ఓ హైలెవెల్ కమిటీని ఏర్పాటు చేశారు. కమిషనర్ ఉత్తర్వుతోనే దాన్ని ఏర్పాటు చేయగా దాని పని అది చేసింది. అప్పుడు స్టాండింగ్ కమిటీ, కౌన్సిల్‌ల ఆమోదాల వంటివి లేవు. కాగా, ఇప్పుడు స్టాండింగ్‌కమిటీ, కౌన్సిల్ సమావేశాల ఆమోదం వంటివి అక్రమార్కులు తప్పించుకునేందుకు సమయమిచ్చేలా కాలయాపనలకే నన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రకటనల విభాగంలో అక్రమాల కారణంగా జీహెచ్‌ఎంసీకి వందల కోట్ల నష్టం వాటిల్లుతున్నట్లు దృష్టికి వచ్చినప్పటికీ సంబంధిత దీఈఈని కేవలం బదిలీ చేయడం తప్ప ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఈ సందర్భంగా గమనార్హం. పారిశుధ్యం, ప్రకటనల విభాగం రెండు కమిటీలకూ మేయరే చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. మేయర్ తరఫున సమావేశాలు ఏర్పాటు చేయడానికి సదరు అంశాల్లో నిపుణులైన వారిని కోఆర్డినేటర్ లేదా కన్వీనర్‌గా నియమించనున్నారు.



అడ్‌హక్ కమిటీ సభ్యులు వీరే..

పారిశుధ్యంపై: రావుల శేషగిరి(గాజులరామారం), సామల హేమ(సీతాఫల్‌మండి),ఎం రజిత(ఉప్పల్),వి.జగదీశ్వర్‌గౌడ్(మాదాపూర్),బి.సురేఖ(గన్‌ఫౌండ్రి), శ్రావణ్ ఊరపల్లి(మల్కాజిగిరి), సయ్యద్ సోహైల్ ఖాద్రి(పత్తర్‌గట్టి), ఆయేషాహుమేరా(టోలిచౌకి).

ప్రకటనలపై: వి.సింధు(భరత్‌నగర్), మెట్టు కుమార్‌యాదవ్(పటాన్‌చెరు), డి.రాజశేఖర్‌రెడ్డి(లింగోజీగూడ), పి.విజయారెడ్డి(ఖైరతాబాద్), వంగా మధుసూదన్‌రెడ్డి(చంపాపేట), కొప్పుల నరసింహారెడ్డి(మన్సూరాబాద్), సయ్యద్ మిన్హాజుద్దీన్(అక్బర్‌బాగ్), బాతా జబీన్ (విజయనగర్‌కాలనీ).

డాక్టర్ శివప్రసాద్‌కు ఈలపాట రఘురామయ్య పురస్కారం


డాక్టర్ శివప్రసాద్‌కు ఈలపాట రఘురామయ్య పురస్కారం అందజేస్తున్న మధుసూదనాచారి తదితరులు

సనత్‌నగర్: అతి పురాతన కళా ప్రక్రియ ఈల పాటకు ప్రాచుర్యం కల్పించిన కళాకారుడు రఘురామయ్య అని మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. బేగంపేట కుందన్‌బాగ్‌లో మంగళవారం 'ఆకృతి' సంస్థ ఆధ్వర్యంలో ఈలపాట రఘురామయ్య 123వ జయంతి పురస్కారాన్ని ఈ తరం ఈలపాట గాయకుడు, విజిల్ విజార్డ్ కే శివప్రసాద్‌కు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మధుసూదనాచారి మాట్లాడుతూ ఈలపాట చాలా కష్టతరమైన ప్రక్రియ..నిరంతర సాధన చేస్తే తప్ప రాణించడం కష్టమన్నారు. రఘురామయ్య గొప్ప రంగస్థల, సినీనటుడు, గొప్ప సంగీతజ్ఞుడు అన్నారు. సుదీర్ఘ రాగాలాపనలో ఆయనకు ఆయనే సాటి అని కొనియాడారు. ఆయన వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న శివప్రసాద్‌కు రఘురామయ్య పురస్కారం అందజేయడం అభినందనీయమన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన కేంద్ర మాజీ సమాచార శాఖ కమిషనర్ డాక్టర్ మాడభూషి శ్రీధర్ మాట్లాడుతూ గొప్ప కళాకారులను గుర్తుపెట్టుకుని వారు చూపిన మార్గంలో పయనిస్తున్న ఈతరం కళాకారులను సన్మానించడం మంచి సంప్రదాయం అన్నారు. ఏపీ సంగీత నాటక అకాడమీ మాజీ అధ్యక్షుడు గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ పద్యాలాపనలో తమ తొలి గురువు రఘురామయ్య అని, ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ఈలపాట శివప్రసాద్ దేశ, విదేశాల్లో ఈలపాట ప్రదర్శనలు ఇచ్చారన్నారు. పురస్కార గ్రహీత ఈలపాట శివప్రసాద్ మాట్లాడుతూ తొలిసారిగా గుంటూరులో కోన ప్రభాకర్‌రావు ద్వారా రఘురామయ్యను కలుసుకుని ఆయన ముందుపాడి బహుమతి అందుకోవడం ఎప్పటికీ మర్చిపోలేనన్నారు. ప్రేక్షకుల కోరిక మేరకు కొన్ని భక్తి గీతాలు ఈలతో పాడి వినిపించి అలరించారు. ఆకృతి సుధాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ మల్లికార్జున్ వసుమర్తి, ఎల్వికుమార్, సుధాకర్ ఓరుగంటి, వాసవి ఈశ్వర్, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కీసరగుట్టలో బ్రహ్మోత్సవాలు



కీసర: ప్రఖ్యాత శైవ క్షేత్రమైన కీసరగుట్టలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆలయంలో నేటి నుంచి 11వ తేదీ వరకు ఆరు రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. టీటీడీ వేదపాఠశాల ఆచార్య పుల్లేటికుర్తి గణపతిశర్మ ప్రధాన సంధానకర్తగా వైదిక కార్యక్రమాలు కొనసాగుతాయి. ఉదయం 11 గంటలకు ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం దంపతులచే ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటలకు అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణ, హారతి, రాత్రి 7 గంటలకు మంత్రపుష్పం, రాత్రి 8 గంటలకు శ్రీస్వామివారిని కీసరగుట్ట నుంచి కీసర గ్రామానికి ఊరేగింపుగా తీసుకువస్తారు.

జీవిత ఖైదీల ఫైల్‌ను గవర్నర్ ఆమోదించాలి


ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఖైదీల కుటుంబ సభ్యులు

పంజగుట్ట: జైళ్లల్లో మగ్గుతున్న జీవిత ఖైదీల విడుదల ఫైల్ గవర్నర్ వెంటనే ఆమోదించి 231 కుటుంబాల్లో వెలుగులు నింపాలని తెలంగాణ జీవిత ఖైదీల కుటుంబాలు విజ్ఞప్తి చేశాయి. మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జీవిత ఖైదీల కుటుంబ సభ్యులు రమణ, రాజేష్, నాగమణి, రాధ, విఠల్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 231 మంది జీవిత ఖైదీల విడుదలకు జనవరి 24న జీఓ. నెంబర్ 2ను విడుదల చేసిందన్నారు. తాము జనవరి 26న తమ వారు విడుదల అవుతారని జైళ్లవద్ద ఎదురుచూసినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఆరా తీయగా సదరు ఫైల్ గవర్నర్ వద్ద ఫైలు ఆగిపోయిందని తెలిసిందని, గవర్నర్ ఫైలును ఆమోదించి తమ కుటుంబాల్లో వెలుగు నింపాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోనూ విడుదల జీవో వచ్చినా అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 231 మందిలో 200 మందికి పైగా 14 ఏళ్ల శిక్ష పూర్తిచేసుకున్న వారు ఉన్నారని కొందరు 18 నుంచి 24 ఏళ్లుగా జైళ్లలోనే మగ్గుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే గవర్నర్ ఫైల్‌ను ఆమోదం తెలపాలని విజ్ఞప్తి చేశారు.

మాకొద్దీ పోస్టింగ్!

- రాచకొండ సైబర్ ఠాణాలో కుర్చీలన్నీ ఖాళీ
- ఇక్కడ పని చేసేందుకు అధికారుల నిరాసక్తత
- పోస్టింగ్ ఇచ్చినా ఒక ట్రెండు రోజులకే వేరే చోటుకు బదిలీ
- జేబుకు చిల్లు, కేసుల ఒత్తిడే ప్రధాన కారణం
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక అటకెక్కిన దర్యాప్తు
- స్టేషన్ చుట్టూ బాధితుల ప్రదక్షిణలు

సాక్షి, సిటీబ్యూరో: రాచకొండ సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్ ఉత్సవ విగ్రహంలా మారింది. రోజురోజుకూ సైబర్ నేరాలు పెరిగిపోతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. రాచకొండ సైబర్ ఠాణాలో పనిచేసేందుకు అధికారులు ఆసక్తి చూపించడం లేదు. ఇక్కడికి పోస్టింగ్ ఇచ్చినా పైరవీలతో ఒక ట్రెండు రోజుల్లోనే వేరే చోటుకు బదిలీ చేయించుకుంటున్నారు. పర్యవేక్షణ అధికారులు లేక కేసుల దర్యాప్తు అటకెక్కింది. దీంతో బాధితులు రోజు స్టేషన్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

మిగిలింది ఒక్క ఇన్‌స్పెక్టరే..

రాచకొండ సైబర్ క్రైమ్ పీఎస్‌లో డీసీపీ నుంచి కానిస్టేబుల్ వరకు సుమారు 70 మంది సిబ్బంది ఉంటారు. కొత్త ప్రభుత్వ కొలువుదీరిన తర్వాత పోలీసు శాఖలో బదిలీల క్రమంలో అప్పటి మహిళా డీసీపీ వేరే చోటుకు బదిలీ అయ్యారు. ఆ తర్వాత కొన్ని నెలల పాటు ఖాళీగా ఉన్న ఈ పోస్టు ఇటీవలే భర్తీ అయింది. ఇదే సమయంలో ఏసీపీని సైతం భర్తీ చేశారు. కానీ, రెండు రోజులకే మల్టీజోన్-2కు తిరిగి బదిలీపై వెళ్లారు. దీంతో ఈ పోస్టు మళ్లీ ఖాళీ అయింది. ఇక ఇన్‌స్పెక్టర్లు మాకొద్దీ పోస్టింగ్ అంటూ పారిపోతున్నారు. ఒకప్పుడు రాచకొండ సైబర్ క్రైమ్ పీఎస్‌లో ఏడుగురు ఇన్‌స్పెక్టర్లు ఉండగా.. ప్రస్తుతం ఒక్కరే మిగిలారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. లోకసభ ఎన్నికల కోడ్ నేపథ్యంలో బదిలీ అయిన ఇన్‌స్పెక్టర్ల స్థానంలో కొత్త వారిని నియమించారు. కానీ, రిపోర్ట్ కూడా చేయకుండానే పైరవీలతో ఒక ట్రెండు రోజుల్లోనే వేరే చోటుకు బదిలీ కావడం కొసమెరుపు.

కానిస్టేబుళ్ల తీరు వేరు..

రాచకొండ సైబర్ ఠాణాలోని కానిస్టేబుళ్ల పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఐదారేళ్ల నుంచి ఇదే ఠాణాలో పని చేస్తున్న కానిస్టేబుళ్లు పది మంది ఉన్నారు. కానిస్టేబుళ్ల నుంచి హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి లభించినా ఇక్కడే తిష్ట వేసుకు కూర్చున్నారు. వేరే చోటుకు వెళితే పని భారం పెరుగుతుందనో, లేక ఇక్కడి లొసుగులతో అమ్యామ్యాలు రావనే భావనలో ఉన్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్నికల కోడ్ వీరికి వర్తించదా అని పలువురు వాపోతున్నారు.

ఇక్కడ జేబుకు చిల్లే..

ఇతర రాష్ట్రాల్లో దాక్కున నిందితులను పట్టుకునేందుకు విచారణాధికారులు అక్కడికి వెళ్లాల్సి ఉంటుంది. అయితే రాచకొండలో ఈ ప్రక్రియ మూలనపడింది. ఇతర రాష్ట్రాలకు వెళ్లి నాలుగైదు రోజులు అక్కడ ఉండాలంటే జేబు గుల్ల తప్ప ప్రయోజనం ఉండటం లేదని పలువురు పోలీసుల అధికారులు వాపోయారు. కష్టపడి నిందితులను పట్టుకుని రిమాండ్‌కు తరలిస్తే ఉన్నతాధికారుల దృష్టిలో గుర్తింపు ఉంటుందా అంటే అదీ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి బదులుగా ఇతర విభాగంలో డ్యూటీ చేయడమే ఉత్తమమని భావిస్తున్నారు. మరోవైపు రోజురోజుకూ పెరిగిపోతున్న కేసులతో ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి, పనిభారం పెరిగింది. కేసుల దర్యాప్తు వేగంగా, పారదర్శకంగా చేసే క్రమంలో ఏ చిన్న పొరపాటు జరిగినా తమ కెరీర్‌కు ఇబ్బంది అవుతుందని ఇన్‌స్పెక్టర్లు భావిస్తున్నారు.

బల్దియాలో ఆగని అక్రమాలు

- బర్త్ సర్టిఫికెట్ల జారీలో అవకతవకలు మళ్లీ తెరపైకి..
- ఇటీవలే దొరికిన నకిలీ వేలిముద్రలు

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీలోని వివిధ విభాగాల్లో అక్రమాలు ఆగడం లేవు. పలు సందర్భాల్లో అక్రమాలు వెలుగులోకి వచ్చినప్పటికీ, బాధ్యులపై కఠిన చర్యలు లేకపోవడంతో వాటికి అడ్డుకట్ట పడటం లేదు. గత సంవత్సరం దాదాపు 25వేల బర్త్ సర్టిఫికెట్లు తగిన పత్రాలు (నాన్ అవైలబిలిటీ సర్టిఫికెట్లు) లేకుండానే జారీ అయినట్లు గుర్తించినప్పటికీ, ఇప్పటి వరకు ఎవరిపైనా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ నేపథ్యంలో వివిధ సర్కిళ్లలో, ముఖ్యంగా పాతబస్తీపరిధిలో ఈ అక్రమాల పరంపర ఇంకా కొనసాగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తడంతో సంబంధిత అధికారులు విచారణ జరుపుతున్నట్లు తెలుస్తోంది. బర్త్, డెత్ సర్టిఫికెట్ల జారీలో అక్రమాలు వెలుగుచూసినప్పటికీ ఎవరిపైనా ఎలాంటి చర్యలు లేకపోవడంతో కిందిస్థాయి సిబ్బంది నుంచి సంబంధిత విభాగంలోని ఉన్నతాధికారుల వరకూ నగదు చేతులు మారుతోందనే ఆరోపణలకు ఊతమిస్తోంది. పారిశుధ్య కార్మికుల హాజరుకు సంబంధించిన నకిలీ వేలిముద్రల వ్యవహారంలోనూ ఇదే తంతు కొనసాగుతోంది. గతంలో పలు పర్యాయాలు పట్టుబడినప్పటికీ తగిన చర్యలు లేనందునే వాటికీ అడ్డుకట్ట పడలేదని సమాచారం. ఇటీవల మళ్లీ నకిలీ వేలిముద్రల వ్యవహారం బయటకు రావడంతో 14 మందిని విధుల నుంచి తొలగించారు. తప్పనిసరి పరిస్థితుల్లో తూతూమంత్రంగా ఇలా కొందరు దిగువస్థాయి సిబ్బందిపై చర్యలు తీసుకోవడం తప్ప, పైస్థాయి వారి జోలికి వెళ్లడం లేదు. అక్రమాలు వెలుగు చూసినప్పుడైనా సంబంధిత విభాగంలోని అధికారులపై కఠిన చర్యలు తీసుకోకపోవడమే కాకుండా..తిరిగి అక్రమాలు జరగకుండా ఉండేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టకపోవడం వల్లే చర్విత చరణమవుతున్నాయని జీహెచ్ఎంసీ గురించి తెలిసిన వారు చెబుతున్నారు. వివిధ అవసరాలకు ఎంతో కీలకంగా ఉపకరించే బర్త్, డెత్ సర్టిఫికెట్ల జారీలో జరుగుతున్న అక్రమాలను అరికట్టకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట అంటున్నారు. ఆస్తిపన్ను సెల్ఫ్‌అసెస్‌మెంట్లలోనూ, ప్రకటనల విభాగంలోనూ, పారిశుద్ధ్యం అంశాల్లోనూ భారీ అవకతవకలు వెలుగు చూశాయి. అయినా చర్యలు లేవు.

గతంలో ఇలా...

గతంలోనూ నిర్ణీత వ్యవధిలో 'నాన్‌ఎవైలబిలిటీ' కింద 27,328 బర్త్ సర్టిఫికెట్లు జారీ కాగా, వాటిల్లో 25,322 బర్త్ సర్టిఫికెట్లు సంబంధిత పత్రాలు లేకుండానే జారీ అయినట్లు గుర్తించారు. 4,126 డెత్ సర్టిఫికెట్లు జారీ కాగా 3,510 పత్రాలు అక్రమంగా జారీ అయినట్లు గుర్తించారు. అయినప్పటికీ ఎవరిపైనా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అందువల్లే ఈ దందాకు అడ్డుకట్ట పడకుండా సాగుతోందని ప్రజలంటున్నారు.

పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ

హిమాయత్‌నగర్: హైదరాబాద్ జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ అన్నారు. మంగళవారం జీహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో ఎన్నికల సంఘం పార్లమెంట్ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉందన్నారు. ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం అన్ని విధాల సిద్ధంగా ఉందన్నారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల తనిఖీ పూర్తయిందని, 16 ఈవీఎం డెమాన్‌స్ట్రేషన్ కేంద్రాల ద్వారా ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు అన్ని నియోజకవర్గాల్లో ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితాను ప్రచురించడం జరిగిందని, తుది ఓటరు జాబితా మేరకు జిల్లాలో 45,70,138 మంది ఓటర్లు ఉన్నారని, అందులో 23,30,574 మంది పురుషులు, 22,39,240 మహిళలు, ఇతరులు 324 మంది ఉన్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 3,986 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఓటరు జాబితాలో తప్పనిసరిగా పేరు ఉంటేనే ఓటు వేయడానికి వీలవుతుందని, ఎపిక్ కార్డు ఉన్నంత మాత్రాన ఓటు ఉన్నట్లు కాదన్నారు. ఓటరు జాబితాలో పేరు ఉందో లేదా పరిశీలించుకోవాలని సూచించారు. నియోజకవర్గ స్థాయిలో ప్రతి బుధవారం రాజకీయ పార్టీల సమావేశాలు నిర్వహిస్తున్నామని, కుటుంబంలో ఓటర్లందరూ ఒకే పోలింగ్ బూత్‌లో ఓటు వేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎంఐఎం పార్టీ ప్రతినిధి, కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్, బీఎస్పీ ప్రతినిధి కల్యాణి నందీష్, బీజేపీ ప్రతినిధి వి.ఎస్ భరద్వాజ్, కాంగ్రెస్ తరపున జి.నిరంజన్, బీఆర్ఎస్ ప్రతినిధి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్

అంతర్గత సౌందర్యం ముఖ్యం: కాజల్

ప్రముఖ ఫ్యాషన్ బ్రాండ్ 'కల్కి' స్టోర్ ప్రారంభం



సాక్షి, సిటీబ్యూరో: సినీనటిగా అగ్రస్థానంలో ఎలాంటి సంతృప్తిని పొందానో ప్రస్తుతం ఒక తల్లిగానూ అంతకు మించిన అనుభూతిని పొందుతున్నానని ప్రముఖ సినీతార కాజల్ అగర్వాల్ అన్నారు. మంగళవారం బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 10లో ప్రముఖ ఫ్యాషన్ బ్రాండ్ 'కల్కి' నూతన స్టోర్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కాజల్ 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడుతూ..అందం మనసుకు సంబంధించినదని, మంచి హృదయం - మంచి ఆలోచనలుంటే బాహ్య సౌందర్యం మరింత ప్రకాశవంతంగా ఉంటుందన్నారు. హైదరాబాద్‌తో తనకు 20 ఏళ్ల అనుబంధం ఉందని, అభిమానుల ప్రేమాభిమానాలు తనకెప్పుడూ ప్రత్యేకమన్నారు. దేశ వ్యాప్తంగా ఫ్యాషన్ రంగంలో రాణిస్తున్న నగరాల్లో హైదరాబాద్ ఎప్పుడూ ముందుంటుందన్నారు. వెడ్డింగ్ వేర్, ప్రత్యేకమైన లెహంగాస్ తదితర ఫ్యాషన్ వేర్‌కు దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన 'కల్కి' ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ ఏడాదిలోనే సత్యభామ, ఇండియన్-2 సినిమాలు విడుదల కానున్నాయని, మరో 2 సినిమాల్లోనూ నటిస్తున్నట్లు తెలిపారు.కల్కి డైరెక్టర్ నిషిత్ గుప్తా మాట్లాడుతూ.., దక్షిణాదిన ఈ ఫ్యాషన్ స్టోర్ ప్రారంభించడం తమ బ్రాండ్‌కు దక్కిన గౌరవంగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టాప్ మోడల్స్ అద్భుతమైన వస్త్రాలంకరణతో ఆకట్టుకున్నారు.

మల్లారెడ్డి కళాశాల ఎదుట ఆందోళన


కళాశాల ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల మెయిన్ క్యాంపస్ ఎదుట మంగళవారం విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ, ఏబీవీపీ నాయకులు ఆందోళన నిర్వహించారు. మల్లారెడ్డి గ్రూప్స్ విద్యాసంస్థల హాస్టళ్లలో నెల రోజుల వ్యవధిలో నాల్గోసారి భోజనంలో పురుగులు వచ్చిన ఘటన చోటు చేసుకోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన ఎస్ఎఫ్ఐ, ఏబీవీపీ నాయకులు విద్యార్థులు కలిసి కళాశాల గేటు ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. రూ.లక్షల్లో ఫీజులు తీసుకుంటూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించకుండా వారి ప్రాణాలతో యాజమాన్యం చెలగాటం ఆడుతోందని ఎస్ఎఫ్ఐ కార్యదర్శి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. ఇటీవల యూనివర్సిటీ గర్ల్స్ హాస్టల్‌లో ఘటన చోటుచేసుకోగా మారోమారు ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే, మల్లారెడ్డి గ్రూప్స్ చైర్మన్ మల్లారెడ్డి, కార్యదర్శి మహేందర్‌రెడ్డి పట్టించుకోకపోవడం వల్లే మరో కళాశాల హాస్టల్‌లో భోజనంలో పురుగుల ఘటన చోటు చేసుకుందన్నారు. ప్రభుత్వం కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఘటనా స్థలికి చేరుకుని ఆందోళన విరమింపజేసిన పేట్‌బషీరాబాద్ పోలీసులు అనంతరం యాజమాన్యం- విద్యార్థి సంఘాల నాయకుల మధ్య సమావేశం ఏర్పాటు చేయగా విద్యార్థుల సమస్యలు తెలుసుకునేందుకు తమకు అవకాశం కల్పించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు.

నాణ్యమైన భోజనం అందిస్తాం..

తమ విద్యార్థులు తాము వారం రోజుల్లో సమావేశమై ఎలాంటి సమస్య తలెత్తకుండా చూస్తానని చామకూర మహేందర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లారెడ్డి విద్యా సంస్థల్లో తాము ఎల్లప్పుడూ నాణ్యమైన విద్య అందించడమే కాకుండా నాణ్యత ప్రమాణాలతో విద్యా ర్థులకు భోజనం అందిస్తామని తెలిపారు. నెల రోజుల వ్యవధిలోనే ఇలాంటి ఘటనలు తరచూ జరగడం ఆశ్చర్యంగా ఉందని, కొంతమంది కావాలనే విద్యార్థులను రెచ్చగొట్టి ఇలాంటి కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు అనుమానం కలుగుతుందని తెలిపారు. మరోమారు ఇలాంటి ఘటన చోటుచేసుకోకుండా చర్యలు చేపడతామని తెలిపారు.

బాధ్యతల స్వీకరణ



సాక్షి,సిటీబ్యూరో: రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా తహర్ బిన్ హమ్దన్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం హైదరాబాద్ హజ్‌హౌస్‌లోని ఉర్దూ అకాడమీ కార్యాలయంలో ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీ, మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబైదుల్లా కొత్వాల్, తెలంగాణ స్టేట్ ఉర్దూ అకాడమీ కార్యదర్శి షేక్ లియాకత్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు బాసట


మ్యాన్‌హోల్ బాధిత కుటుంబాలకు చెక్కులు అందజేస్తున్న దృశ్యం

సాక్షి,సిటీబ్యూరో: ఇటీవల నగరంలోని జియాగూడ బైపాస్ రోడ్డులో సీవరేజీ నెట్‌వర్క్ పైప్‌లైన్ పనుల కోసం మ్యాన్ హోల్‌లో ప్రమాదవశాత్తు మృతి చెందిన ముగ్గురు కార్మికుల కుటుంబ సభ్యులకు ప్రభుత్వం అండగా నిలిచింది. జాతీయ సఫాయి కర్మచారి చైర్ పర్సన్ ఎం.వెంకటేషన్ మంగళవారం ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయంలో బాధిత కుటుంబాలతో మాట్లాడారు. తక్షణ సాయంగా ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున రూ.30 లక్షల విలువైన చెక్కులను జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డి, డైరెక్టర్లతో కలిసి అందజేశారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు అనుసరించి బాధిత కుటుంబాలను ఆదుకోవాలనే ఉద్దేశంతో ఈ సాయం అందజేశారు. అంతకుముందు ఆయన జలమండలి ఉన్నతాధికారులతో కలిసి ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని సందర్శించారు. ఘటనకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా.ఎం.సత్యనారాయణ, ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ బాబు, సీజీఎంలు రఘు, మహమ్మద్ అబ్దుల్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు

ఆ ప్లాంట్ నీటి చౌర్యంపై వివరణ ఇవ్వండి

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు
- శిల్పా వాటర్ ప్లాంట్‌కు తాఖీదులు

సాక్షి, హైదరాబాద్: నగరంలోని కాచిగూడ శ్మశానం ఎదురుగా ఉన్న భూగర్భ నీటి పైప్‌లైన్ నుంచి శిల్పా వాటర్ ప్లాంట్ నీటి చౌర్యం చేస్తోందంటూ దాఖలైన పిటిషన్‌పై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ ముఖ్య కార్యదర్శి, జీహెచ్ఎంసీ కమిషనర్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ సహా పలువురు అధికారులకు, శిల్పా వాటర్ ప్లాంట్‌కు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. శిల్పా వాటర్ ప్లాంట్ యజమాని మిస్టర్ డాంగే సింగ్‌పై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ హైదరాబాద్‌లోని ఉస్మాన్ గంజ్‌కు చెందిన సామాజిక కార్యకర్త మహమ్మద్ సల్మాన్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఫిర్యాదు చేసిన వారిని డాంగే తీవ్ర భయభ్రాంతులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. ఫైలింగ్ నంబర్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. పిటిషన్‌కు పిల్‌గా నంబర్ చేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. నాలుగు వారాల్లోగా సమాధానం చెప్పాలని అధికారులను ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేసింది.

మహిళలు అన్ని రంగాల్లో సత్తా చాటాలి


మహిళలకు కుట్టు మిషన్లు అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా తదితరులు

నాగోలు: మహిళలు అన్ని రంగాల్లో సత్తా చాటాలని అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్(ఐవీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు, టూరిజం కార్పొరేషన్ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. సోమవారం రాత్రి నాగోలు బండ్లగూడలోని పీబీఆర్ కన్వెన్షన్ లో అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర మహిళా విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉప్పల శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ ఐవీఎఫ్ ఆధ్వర్యంలో నిరంతర సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు., ప్రిలిమినరీ పాసైన 40 మంది సివిల్స్ అభ్యర్థులకు రూ. లక్ష చొప్పున ఆర్థిక సహాయం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాకు చెందిన పేద మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ అందజేశారు. అనంతరం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఐవీఎఫ్ జాతీయ నాయకులు గంజి రాజమౌళి గుప్తా మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కుటుంబ అభివృద్ధిలో గృహిణిగా స్త్రీ పాత్ర ఎంతో గొప్పదన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, రమేష్, కాచిగూడ వైశ్య హాస్టల్ ప్రెసిడెంట్ ఉప్పల రాజేశ్వర్, ఉప్పల స్వప్న, నిలోఫర్ కేఫ్ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్య

కొన్ని గంటల్లో ప్రీ వెడ్డింగ్ షూట్

గచ్చిబౌలి: మరి కొద్ది గంటల్లో ప్రీ వెడ్డింగ్ షూట్ జరగాల్సి ఉంది. కాబోయే భర్త మాట్లాడి వెళ్లి కొద్ది సేపటికే ఓ మహిళా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ భాను ప్రసాద్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా, గొసుకులపల్లికి చెందిన ముద్దం విద్యశ్రీ(23) కొత్తగూడలోని పీజీ హాస్టల్‌లో ఉంటూ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తోంది. సోమవారం సాయంత్రం హాస్టల్‌లోని బాత్ రూమ్‌కు వెళ్లిన ఆమె బయటికు రాకపోవడంతో రూమ్‌మేట్స్ తలుపులు తెరిచి చూడగా. టవల్‌తో షవర్ రాడ్‌కు ఉరి వేసుకుని కనిపించింది. దీంతో వారు ఆమె సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందింది. కాగా ఇటీవల ఆమెకు పెళ్లి నిశ్చయమైంది. పెళ్లి కార్డులు పంపిణీ చేసి షాపింగ్ పూర్తి చేసింది. బుధవారం ప్రీ వెడ్డింగ్ షూట్ జరగాల్సి ఉంది. ఆమెకు కాబోయే భర్త హాస్టల్ వద్దకు మాట్లాడి వెళ్లిన తర్వాత ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్ర హజ్ కమిటీ నియామకం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి సయ్యద్ ఉమర్ జలీల్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం ఆరు కేటగిరిల కింద మొత్తం 15 మంది సభ్యులను నియమించింది. కమిటీ సభ్యులుగా కేటగిరి-1 కింద అసదుద్దీన్ ఒవైసీ (హైదరాబాద్ ఎంపీ), జాఫర్ హుస్సేన్ మేరాజ్ (నాంపల్లి ఎమ్మెల్యే), కేటగిరి -2 కింద మహ్మద్ షర్ఫుద్దీన్ (యాదాద్రి), ఖాజా సన (పెద్దపల్లి), మహ్మద్ ముజీబుద్దీన్ (రంగారెడ్డి జిల్లా), కేటగిరి-3 కింద ఇలియాస్ హమీద్ ఖాస్మీ(నిర్మల్), సయ్యద్ ఎసానుద్దీన్ (నల్లగొండ), సయ్యద్ తాఖీ రజియోద్దీన్ (హైదరాబాద్), కేటగిరి-4 కింద ఫరీదా బేగం (వికారాబాద్), మహ్మద్ లయీఖ్ (రంగారెడ్డి జిల్లా), మహ్మద్ యూనుస్(వికారాబాద్), సయ్యద్ అజ్హర్ అలీ(హైదరాబాద్), సయ్యద్ గులాం అఫ్జల్ బియాబానీ(హన్మకొండ), కేటగిరి -5 కింద వక్ఫ్ బోర్డు చైర్మన్, కేటగిరి -6కింద ఎక్స్ అఫీషియో సభ్యుడిగా హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ అధికారిని నియమించింది. కమిటీ చైర్మన్ ఎన్నిక కోసం ఎన్నికల అధికారిగా వక్ఫ్‌బోర్డు సీఈఓ ఖాజా మోహియోద్దీన్‌ను నియమించింది. హజ్‌హౌజ్‌లోని ఈ నెల 7న ఉదయం 11.30 గంటలకు కమిటీ మొదటి సమావేశం నిర్వహించి చైర్మన్ ఎన్నిక ప్రక్రియ పూర్తి చేయాలని ఎన్నికల అధికారికి జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా కమిటీ చైర్మన్‌గా సయ్యద్ గులాం అఫ్జల్ బియాబానీ ఎన్నిక లాంఛనమే.

ముమ్మరంగా 'మంచినీటి' పనులు



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్డు నంబర్–10లోని సింగాడ కుంట బస్తీలో మంచినీటి సమస్య పరిష్కారం కోసం రూ.15 లక్షలతో చేపట్టిన వాటర్ పైపులైన్ పనులు చురుకుగా సాగుతున్నాయి. పనులను వెంకటేశ్వర కాలనీ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి బస్తీ కమిటీ సభ్యులతో కలిసి మంగళవారం పరిశీలించారు. వేసవికాలంలో నీటి సమస్య పరిష్కారం కోసం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆమె అధికారులను కోరారు.

నిమ్స్ వద్ద చలివేంద్రం ప్రారంభం

పంజగుట్ట: రోగులు, వారి సహాయకులతో నిత్యం రద్దీగా ఉండే పంజగుట్ట నిమ్స్ ఆస్పత్రి వద్ద మంచుకొండ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం చలివేంద్రం ప్రారంభించారు. నిమ్స్ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నిమ్మ సత్యనారాయణ, ఫౌండేషన్ డైరెక్టర్ మంచుకొండ ప్రకాశం ఈ చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ కృష్ణారెడ్డి, ఫౌండేషన్ డైరెక్టర్లు రవికుమార్, సురేందర్, వరుణ్ కుమార్, అరుణ్ కుమార్, కో–ఆర్డినేటర్ శ్రావణ్ కుమార్ ఉన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

పంజగుట్ట: భువనగిరి హాస్టల్లో అనుమానాస్పదంగా మృతిచెందిన భవ్య, వైష్ణవి కేసును సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని డిమాండ్ చేస్తూ ధర్నాచౌక్ వద్ద నిరసన తెలిపితే రాష్ట్రప్రభుత్వం అన్యాయంగా అరెస్టు చేయించిందని బహుజన సేన కార్యనిర్వాహక అధ్యక్షుడు వాసు కే యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో భవ్య, వైష్ణవి న్యాయ పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల మరణాలకు కారణమైన వార్డెన్, ఆటోడ్రైవర్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కోడి సుధీర్, కోడి కృష్ణ, శ్రీనివాస్, సోమయ్య వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు

బంజారాహిల్స్: జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన హేమంత్ బోర్కాడేను మంగళవారం వివిధ సర్కిళ్ల అధికారులు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆసిఫాబాద్ కలెక్టర్‌గా ఆయన పనిచేసి ఇక్కడకు వచ్చారు. జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 ఉప కమిషనర్ ప్రశాంతితో పాటు అధికారులు కమిషనర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

ఆటో కార్మికుల సమస్యలపై వినతి

లిబర్టీ: ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి ఆటో కార్మికుడికి రూ.12 వేలు చెల్లించాలని భారతీయ మజ్దూర్ సంఘ్ ఆటో విభాగం ప్రధాన కార్యదర్శి రుద్రాక్ష మల్లేశ్ రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం మంత్రిని కలిసి వినతిపత్రం అందించారు.

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి

రహమత్‌నగర్: శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులకు ప్రజలు సహకరించాలని బోరబండ ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు చేపట్టిన వీరశేఖర్ కోరారు. ఈమేరకు పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. అసాంఘిక కార్యక్రమాలను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

వ్యాపార కేంద్రాల తొలగింపు

రహమత్‌నగర్: బోరబండ సైట్–3లోని వ్యాపార కేంద్రాలను జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ సిబ్బంది మంగళవారం తొలగించారు. ఈ సందర్భంగా వ్యాపారులకు టౌన్ ప్లానింగ్ ఏసీపీ మధ్య కాసేపు వాగ్వాదం జరిగింది. దీంతో ఆ ప్రాంతంలో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. అందరి వ్యాపార కేంద్రాలు కాకుండా తమవే తొలగించడం అన్యాయమని ఈ సందర్భంగా బాధితులు ఆరోపించారు.

'ఆరు గ్యారంటీలు ప్రజలకు వరం'

రహమత్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆరు గ్యారంటీ పథకాలు పేద ప్రజలకు వరంగా మారుతున్నాయని నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి భవానీ శంకర్ కొనియడారు. ఎస్పీఆర్ హిల్స్‌లోని సుభాష్ చంద్రబోస్ నగర్‌లో మంగళవారం 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు బిల్లుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా భవానీ శంకర్ మాట్లాడుతూ.. ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీ పథకాలు అమలు పరుస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు జేజేలు పలుకుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు గ్యార నాగరాజు, జాఫర్, యాదయ్య, కేశవులు, అరుణ్‌గౌడ్, రాంబాబు, సుందర్, మాలాకీ, బెన్నార్, సాయి, సువర్ణ, వెంకటేష్, దేవేందర్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ బూత్‌లో మృతదేహం

బంజారాహిల్స్: రోడ్డు నంబర్–1లోని తాజ్‌కృష్ణా హోటల్ చౌరస్తాలో ఉన్న ట్రాఫిక్ బూత్ అంబ్రిల్లాలో అనుమానాస్పద మృతదేహాన్ని బంజారాహిల్స్ పోలీసులు స్వాధీనం చేసుకుని ఉస్మానియాకు తరలించారు. తాజ్‌కృష్ణా చౌరస్తాలోని ట్రాఫిక్ బూత్‌లో గుర్తుతెలియని మృతదేహం(32) ఉన్నట్టు మంగళవారం ఉదయం విధుల్లోకి వచ్చిన ట్రాఫిక్ కానిస్టేబుల్ పోలీసులకు సమాచారం అందించాడు. వెంటనే అక్కడికి చేరుకున్న బంజారాహిల్స్ పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని బంజారాహిల్స్ సీఐ రాఘవేందర్ తెలిపారు. ఆరా తీయగా ఫుట్‌పాత్‌లపై పడుకునే నిరాశ్రయుడిగా తేలిందని ఆయన చెప్పారు. తలకు వెనకాల గాయమైందని.. రోడ్డు దాటుతున్నప్పుడు ఏదైనా వాహనం ఢీకొట్టిందా? లేక ప్రమాదవశాత్తూ కిందపడ్డాడా? అనే విషయాలు తెలియాల్సి ఉందన్నారు.

నాసిరకం మందుల విక్రేతలపై ఫిర్యాదు

హిమాయత్‌నగర్: నాసిరకం మందుల విక్రయాలతో పాటు అనధికారికంగా కొనసాగుతున్న మెడికల్ షాపులు, క్లినిక్‌లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్ వీబీ కమలహాసన్ రెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కె.ధర్మేంద్ర మాట్లాడుతూ.. మెడికల్ షాపుల్లో యాంటీ బయోటిక్స్ ఇంజక్షన్‌లను విచ్చలవిడిగా విక్రయిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.సత్యప్రసాద్, శ్రీమాన్ పాల్గొన్నారు.

ఉద్యోగినులకు ఉచిత వైద్య శిబిరం

సాక్షి, సిటీబ్యూరో: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని జలమండలి ఉద్యోగినులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మెడికల్ క్యాంప్‌ని జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో కిమ్స్ ఆస్పత్రి వైద్యుడు డా.శశిధర్‌రెడ్డి, క్యాంపు కో–ఆర్డినేటర్ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం



ఎన్బీటీనగర్‌లో కేక్ కట్ చేస్తున్న మేయర్ విజయలక్ష్మి



మహిళలతో కలిసి కేక్ కట్ చేస్తున్న కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి

బంజారాహిల్స్: నియోజకవర్గ వ్యాప్తంగా మహిళా దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. బంజారాహిల్స్‌లో వెంకటేశ్వరకాలనీ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షురాలు యందూరి మాధవి, పార్టీ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఫిలింనగర్‌లో మహిళా సమాఖ్యల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో డీపీఓ ఆశ పాల్గొని కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్యల ప్రతినిధులు పి.పద్మ, సుగుణ, ధనమ్మ, సులోచన, నాగమణి, చంద్రమ్మ దీపాదేవి తదితరులు పాల్గొన్నారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12లోని ఎన్బీటీనగర్ బస్తీలో ఎస్‌ఎల్‌ఎఫ్ 4, 5 ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకలకు మేయర్ విజయలక్ష్మి హాజరై కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో వసంత, గీతారాణి తదితరులు పాల్గొన్నారు.

గౌతంనగర్ కమ్యూనిటీ హాల్లో..

ఫిలింనగర్‌లోని గౌతంనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఫిలింనగర్ 18 బస్తీల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగరావు కార్యక్రమంలో పాల్గొని మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు.

సురక్షిత ప్రాంతంలోనే వీధి వ్యాపారాలు

స్ట్రీట్ వెండింగ్ కమిటీ సమావేశంలో నిర్ణయం



మాట్లాడుతున్న ఉప కమిషనర్ ప్రశాంతి

బంజారాహిల్స్: సురక్షితమైన ప్రాంతంలో వీధి వ్యాపారాలు కొనసాగించడంతో పాటు ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకునేందుకు స్ట్రీట్ వెండర్స్ కోసం ప్రత్యేక జోన్లు గుర్తించాలని ప్రభుత్వం ఇటీవల ఆదేశించింది. దీంతో జీహెచ్‌ఎంసీ అధికారులు చర్యలు తీసుకునేందుకు సమాయత్తమయ్యారు. ఈక్రమంలో జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట డివిజన్ల పరిధిలో 4,900 మంది వీధి వ్యాపారులను గుర్తించారు. తాజాగా మంగళవారం ఖైరతాబాద్‌లోని జూబ్లీహిల్స్ సర్కిల్ కార్యాలయంలో చైర్మన్, ఉప కమిషనర్ ప్రశాంతి అధ్యక్షతన టౌన్ వెండింగ్ కమిటీ సమావేశం జరిగింది. ట్రాఫిక్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, యూసీడీ, రీసోర్స్ పర్సన్లు, పోలీసు, వీధి వ్యాపారాలకు చెందిన 11 మంది సభ్యులతో ఏర్పాటైన కమిటీ ఈ సమావేశంలో పాల్గొంది. 24 గంటలు వ్యాపారాలు నిర్వహించే ప్రాంతాన్ని గ్రీన్‌జోన్‌గా, కొంత సమయం పాటు ఉండే ప్రాంతాన్ని అంబర్ జోన్‌గా, భద్రత లేకుండా ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించే ప్రాంతాన్ని రెడ్‌జోన్‌గా వ్యవహరిస్తున్నామని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. రెడ్‌జోన్‌లో ఉన్నవారిని గ్రీన్ జోన్‌లోకి మార్చేందుకు తగిన ప్రణాళికలు రూపొందించాలని ఉప కమిషనర్ ప్రశాంతి సూచించారు. ఇటీవల రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్, ట్రాఫిక్ పోలీసులు ఫిలింనగర్ కొత్త చెరువు, దీన్‌దయాళ్ నగర్, నందినగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి అక్కడి వీధి వ్యాపారుల పరిస్థితిని అంచనా వేశామని ఈ సందర్భంగా ఉప కమిషనర్ ప్రశాంతి తెలిపారు.

ఘనంగా ఎన్‌సీసీ వీడ్కోలు సభ



వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ తదితరులు

బంజారాహిల్స్: యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ కళాశాలలో మంగళవారం ఎన్‌సీసీ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఘనంగా జరిగింది. జూనియర్ విద్యార్థులు సీనియర్లకు వీడ్కోలు పలుకుతూ ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జె.లక్ష్మణ్‌నాయక్ మాట్లాడుతూ.. సైఫాబాద్ సైన్స్ కాలేజ్ ఎన్‌సీసీ విద్యార్థులు సమాజ సేవలో ముందుండాలని ఆకాంక్షించారు. భవిష్యత్తును తీర్చిదిద్దుకోవడానికి క్రమశిక్షణ, ఉద్యోగాలు సాధించేందుకు ఎన్‌సీసీ దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో 3 తెలంగాణ బెటాలియన్, 16(ఏ) కాయ్ తరుపున ఆర్మీ అధికారులు గోపాల్‌తో పాటు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నవనీత, క్యాడెట్ ట్రైనింగ్ అధికారి డాక్టర్ పల్లాటి నరేశ్, ప్రొఫెసర్ జయప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

లేపాక్షిలో వార్షిక క్లియరెన్స్ మేళా

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని నందగిరిహిల్స్‌లో ఉన్న లేపాక్షి హ్యాండిక్రాఫ్ట్స్ ఎంపోరియంలో వార్షిక క్లియరెన్స్ సేల్ మేళా చేపట్టినట్టు సంస్థ మేనేజర్ మురళీబాబు మంగళవారం తెలిపారు. పోచంపల్లి బెడ్‌షీట్లు, కలంకారీ బ్యాగులు, ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలు, హ్యాండిక్రాఫ్ట్స్‌లో ఎంపిక చేసిన వస్తువులపై 10 నుంచి 40 శాతం వరకు రాయితీ ఇస్తున్నట్టు తెలిపారు. ఈ నెల 31 వరకు క్లియరెన్స్ సేల్ మేళా జరుగుతుందన్నారు.

బస్తీల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

రహమత్‌నగర్: బస్తీల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని కార్పొరేటర్ సీఎన్ రెడ్డి గుర్తు చేశారు. ఎస్పీఆర్ హిల్స్ మహాత్మనగర్‌లో మంగళవారం పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బస్తీ ఆయన మాట్లాడుతూ.. మహాత్మనగర్ బస్తీలో పెండింగ్ పనులను త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు జేపీ జ్ఞానేశ్వర్, భాస్కర్, మన్సూర్, వేముల యాదయ్య, ఎక్బాల్, షరీఫ్ తదితరులున్నారు.

అంబేడ్కర్ వర్సిటీతో 'రాంరెడ్డి' ట్రస్ట్ ఒప్పందం

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, ప్రొఫెసర్ జి.రాంరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈమేరకు మంగళవారం విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.సీతారామారావు సమక్షంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఏవీఆర్‌ఎన్ రెడ్డి, ప్రొఫెసర్ జి.రాంరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ కార్యదర్శి హరగోపాల్ ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. అంబేడ్కర్ వర్శిటీ వ్యవస్థాపక వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రాంరెడ్డి ఆశయాలను భవిష్యత్తు తరాలకు చేరేలా, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉపయోగపడేలా ఏటా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ రాంరెడ్డి స్మారక కార్యక్రమాల నిర్వహణ కోసం రూ.11,50,000 చెక్కును ట్రస్ట్ కార్యదర్శి ప్రొఫెసర్ హరగోపాల్, ట్రస్ట్ సలహాదారు, మాజీ వీసీ వీఎస్‌ప్రసాద్ తదితరులు రిజిస్ట్రార్ ఏవీఆర్‌ఎన్ రెడ్డికి అందించారు. సమావేశంలో విశ్వవిద్యాలయం డైరెక్టర్లు పుష్ప చక్రపాణి, సుధారాణి, ప్రొఫెసర్ రాంరెడ్డి కుమార్తె జ్యోతి, మాజీ ప్రొఫెసర్లు ఘంటా చక్రపాణి, వెంకటయ్య, మధుసూదనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టైప్–1 డయాబెటిస్‌పై పరిశోధనకు అవార్డు

బంజారాహిల్స్: విద్య, వైద్య, ఎంట్రప్రెన్యూయర్ రంగాల్లో విశేష సేవలు అందించిన వారిని ప్రోత్సహించేందుకు పవర్ కారిడార్ నేషనల్ మేగజిన్ అందించే ప్రతిష్టాత్మకమైన పీసీ ఇండియన్ అచీవర్స్ అవార్డ్‌ను నగరానికి చెందిన ప్రముఖ డయాబెటాలజిస్ట్ డాక్టర్ కోమటిరెడ్డి సూర్యపవన్ రెడ్డి ఇటీవల అందుకున్నారు. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా బంజారాహిల్స్‌లోని తాజ్‌దక్కన్ హోటల్‌లో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సూర్యపవన్‌రెడ్డి మాట్లాడుతూ.. చిన్నారుల్లో వచ్చే టైప్–1 డయాబెటిస్‌పై తాను 20 ఏళ్లుగా చేస్తున్న రీసెర్చ్‌ను గుర్తించి ఈ అవార్డు అందించారని తెలిపారు.

తెలంగాణ 'దండోరా' కొత్త కమిటీ ఎన్నిక

పంజగుట్ట: తెలంగాణ మాదిగ హక్కుల దండోరా పాత కమిటీని రద్దుచేస్తూ నూతన కమిటీని ఎన్నుకున్నట్టు దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు మరమ్మల మల్లేశ్ మాదిగ తెలిపారు. ఈమేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ మాదిగ హక్కుల దండోరా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. నూతన వ్యవస్థాపక అధ్యక్షుడిగా మల్లేశ్ యాదిగ, రాష్ట్ర అధ్యక్షుడిగా మొండికత్తి లింగన్న మాదిగ, రాష్ట్ర అధికార ప్రతినిధిగా మెట్టుపల్లి కొమురయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సంకటి శామ్యూల్, ఉపాధ్యక్షులుగా ఎర్రా ఆంజనేయులు, కొండూరి రాజు, బొట్ల రమేశ్, రాష్ట్ర ఇన్‌చార్జి ధర్మతేజ ఎన్నికయ్యారు. ఎస్సీ వర్గీకరణ బిల్లుకు పార్లమెంటులో తక్షణమే చట్టబద్ధత కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

'మాకు ఉద్యోగాలిచ్చి ఆదుకోండి'

లక్డీకాపూల్: హైకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు తమకు ఉద్యోగాలు ఇచ్చి ఆదుకోవాలని డీఎస్సీ–2008 బాధిత అభ్యర్థులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం అభ్యర్థులు పెద్ద సంఖ్యలో ప్రజాభవన్‌కు తరలివచ్చారు. డీఎస్సీ ద్వారా ఎంపికైన తమకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతూ ప్రజావాణిలో విన్నవించుకున్నారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలలోనే 30 వేల మందికి ఉద్యోగ నియామకపత్రాలు ఇచ్చి వారి జీవితాల్లో వెలుగు నింపిన ప్రభుత్వం తమ సమస్యపై సానుకులంగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు. మెరిట్ అభ్యర్థులు సెకండ్ గ్రేడ్ టీచర్లుగా నియమించాలన్న తెలంగాణ రాష్ట్ర హైకోర్టు మధ్యంతర తీర్పును అమలు చేయాలని కోరారు. తాజా తీర్పు ప్రకారం ప్రస్తుతం ఖాళీల్లో తమని భర్తీ చేయాలని లేనిపక్షంలో బీఎడ్ అభ్యర్థులకు కాంట్రాక్ట్ పద్ధతిలోనైనా ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతూ ప్రజాభవన్ వద్ద బైఠాయించారు. దీంతో ప్రజావాణి నోడల్ అధికారి దివ్య దేవరాజన్ అభ్యర్థులతో చర్చలు జరిపారు. డీఎస్సీ అభ్యర్థులపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని.. త్వరలోనే న్యాయం జరుగుతుందనని చెప్పడంతో ఆందోళన విరమించామని డీఎస్సీ–2008 అభ్యర్థుల ప్రతినిధి ఉమామహేశ్వరరెడ్డి తెలిపారు.

'మతతత్వ భావజాలం ప్రమాదకరం'

హిమాయత్‌నగర్: మోదీ ప్రభుత్వం మతతత్వ భావజాలన్ని ప్రోత్సహించడం దేశానికి అత్యంత ప్రమాదకరమని భారత జాతీయ మహిళా సమాఖ్య సీనియర్ నాయకురాలు డాక్టర్ బీవీ విజయలక్ష్మి అన్నారు. హిమాయత్‌నగర్ రాజ్ బహదూర్ గౌర్ హాల్‌లో మంగళవారం భారత జాతీయ మహిళా సమాఖ్య, తెలంగాణ రాష్ట్ర సమితి, తెలంగాణ రాష్ట్ర శ్రామిక మహిళా ఫోరం సంయుక్తాధ్వర్యంలో 114 వ అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 'ద్వేషపూరిత రాజకీయాలు తిరస్కరిద్దాం–లౌకిక, ప్రజాస్వామ్య, రాజ్యాంగాన్ని రక్షించుకుందాం' అనే అంశం ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.సదాలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ.. అనేక దేశాల్లో మహిళల విజయాలను ప్రచారం చేస్తూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటారని గుర్తు చేసారు. సదస్సులో ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, ఉపాధ్యక్షులు ఎస్.ఛాయాదేవి, బి.జంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

'అన్ని ఎంపీ స్థానాల్లో పోటీ చేస్తాం'

లిబర్టీ: వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు కేబీ శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు లిబర్టీ ప్లాజాలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని 17 పార్లమెంటు నియోజకవర్గాల్లో తమ అభ్యర్థులను బరిలోకి దింపుతామన్నారు. సమావేశంలో నాగిళ్ల నవీన్‌కుమార్, అరుణ రెడ్డి, నందికొండలరావు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం కన్వీనర్‌గా 'కందాల'

హిమాయత్‌నగర్: తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కన్వీనర్‌గా కందాల బలదేవరెడ్డిని నియమిస్తున్నట్టు ఫోరం రాష్ట్ర చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం బషీర్‌బాగ్‌లో బలదేవరెడ్డికి నియామకపత్రం అందజేశారు. రాష్ట్ర కన్వీనర్ బలదేవరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ఉద్యమకారులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

'మాదిగల డిమాండ్ సరైనది కాదు'

లిబర్టీ: దళిత జాతి మొత్తానికి చెందాల్సి ఎస్సీ రిజర్వేషన్లను ఒకే సామాజిక వర్గం కావాలని అడగటం సబబు కాదని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ బీఎల్ రాజు అన్నారు. ఉప కులాలకు రిజర్వేషన్లు లేకుండా చేసేందుకు కుట్ర జరుగుతోందని ఆయన ఆరోపించారు. మాల మహానాడు కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత జాతి మొత్తానికి చెందాల్సిన ఎస్సీ రిజర్వేషన్లలో 12 శాతం తమకే కావాలని మాదిగలు కోరడం సమంజసం కాదన్నారు. రిజర్వేషన్లపై కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్, టీడీపీలోని మాల ప్రజాప్రతినిధులు బలమైన గళం వినిపించాలని డిమాండ్ చేశారు.

'సూత్ర' ఎగ్జిబిషన్ ప్రారంభం

బంజారాహిల్స్: తాజ్‌కృష్ణా హోటల్‌లో మంగళవారం సూత్ర ఫ్యాషన్ డిజైనింగ్ ఎగ్జిబిషన్‌ను నటి వర్ష ప్రారంభించారు. ఇందులో హస్తకళలు, జ్యువెలర్స్, గిఫ్ట్ ఐటమ్స్, గృహాలంకరణ తదితర వస్తువులు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రదర్శన 7వ తేదీ వరకు కొనసాగనుంది.

బాధ్యతల స్వీకరణ



బంజారాహిల్స్: బంజారాహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా బి.సాయిప్రకాశ్ గౌడ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. 2009 బ్యాచ్‌కు చెందిన ఆయన ఇప్పటి వరకు కుషాయిగూడ డీఐగా పనిచేశారు. బంజారాహిల్స్ ట్రాఫిక్ సీఐగా పనిచేసిన అడావత్ హరి మల్టీజోన్–2లో రిపోర్ట్ చేశారు.

డ్రగ్స్ పేరుతో బెదిరింపులు..

హిమాయత్‌నగర్: డ్రగ్స్ కొరియర్ చేస్తున్నారంటూ సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. నగర సైబర్ క్రైమ్ పోలీసులు వివరాలు.. నగరానికి చెందిన ఓ బాధితుడికి సీబీఐ అధికారులమంటూ ఒక కాల్ వచ్చింది. అనంతరం బాధితుడి ఆధార్ కార్డు నంబర్‌తో డ్రగ్స్‌ను తైవాన్‌కు కొరియర్ చేస్తున్నారని పోలీసులు కేసు నమోదు చేసారని చెప్పారు. కేసు లేకుండా చేయాలంటే ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం ముంబై సీబీఐ ఖాతాకు డబ్బు డిపాజిట్ చేయాలని చెప్పారు. దీంతో ఆందోళన చెందిన బాధితుడు వారి చెప్పిన అకౌంట్‌కు రూ.12, 49,633 ట్రాన్స్‌ఫర్ చేశాడు. డబ్బు తిరిగి రాకపోవడంతో పాటు వారి నంబర్లు పనిచేయకపోవడంతో మోసపోయినట్టు గ్రహించి ఫిర్యాదు చేసినట్టు నగర సైబర్ క్రైమ్ ఏసీపీ శివమారుతి మంగళవారం తెలిపారు.

పార్శిల్ పేరుతో మోసం..

వెంగళరావునగర్: పార్శిల్ వచ్చిందని ఆన్‌లైన్‌లో నగదు కొట్టేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. వివరాలు.. మధురానగర్‌లో నివసించే అట్లాడ కిశోర్‌కు గత నెల 7వ తేదీన ఫెడ్‌ఎక్స్ కొరియర్ ఆఫీస్ పేరుతో ఫోన్ వచ్చింది. ఫోన్ చేసిన వ్యక్తి ముంబై నుంచి తైవాన్‌కు పార్శిల్ చేశారని, దానిని కస్టమ్స్ ఆఫీసర్ బ్లాక్ చేశాడని తెలిపారు. నాలుగు పాస్‌పోర్ట్స్, మూడు సిమ్‌లు, డ్రగ్స్ ఉన్నందున సీజ్ చేసినట్టు కస్టమ్స్ ఆఫీసర్ పేరుతో మరో వ్యక్తి మాట్లాడాడు. మీ షో ఆన్‌లైన్ అకౌంట్‌కు రూ.55 వేలు పంపాలని అకౌంట్ నంబర్ ఇచ్చాడు. దాని ద్వారా కిశోర్ వారికి రూ.55 వేలు పంపాడు.అనంతరం విచారించగా అది ఫేక్ కాల్‌గా గుర్తించాడు. దీంతో కిశోర్ మంగళవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.

'మాకు మూడు ఎంపీ సీట్లు ఇవ్వాలి'

హిమాయత్‌నగర్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ వరంగల్, పెద్దపల్లి, నాగర్ కర్నూల్ సీట్లను మాదిగలకు కేటాయించాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ డిమాండ్ చేశారు. మాదిగ యువసేన కో–ఆర్డినేటర్ మంచాల యాదగిరి మాదిగ ఆధ్వర్యంలో మంగళవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగలకు సీట్లు ఇవ్వకుండా మాలలకు కేటాయిస్తే ఓడిస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, ఉద్యోగ రంగాలలో మాదిగ యువతకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు. అనంతరం యాదగిరి మాదిగ మాట్లాడుతూ.. గ్రామాల్లో తమపై దాడులు పెరిగిపోతున్న నేపథ్యంలో మాదిగ యువతీ యువకుల రక్షణ దళం పేరిట శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఎమ్మార్పీఎస్ నాయకులు పి.గెల్వయ్య, ఐలయ్య మాదిగ, రమణ మాదిగ, పోచక్క, రుక్కమ్మ పాల్గొన్నారు.

నాణ్యమైన ఉన్నత విద్యే లక్ష్యం



మాట్లాడుతున్న డాక్టర్ షకీలా శంసు

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, సెంటర్ ఫర్ ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రసంగాల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన మూడో ప్రసంగానికి భారత విద్యా మంత్రిత్వ శాఖ మాజీ ఓఎస్డీ, జాతీయ విద్యా విధానం డ్రాఫ్ట్ కమిటీ కార్యదర్శి డాక్టర్ షకీలా శంసు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 'జాతీయ విద్యా విధానం–2020 ద్వారా ఉన్నత విద్య, దూర విద్యా విధానంలో మార్పులు' అనే అంశంపై ఆమె మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్నత విద్యా విధానంలో అనేక మార్పులు వస్తున్నాయని, వీటిని దృష్టిలో పెట్టుకొని విద్యా వ్యవస్థలో ఆధునిక పరిజ్ఞాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు. ఉన్నత విద్యా విధానంలో ఆన్‌లైన్ కోర్సుల అభివృద్ధికి ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ కొత్త విద్యా విధానం ఐసీటీ ద్వారా డ్యూయల్ మోడ్ ఎడ్యుకేషన్ సిస్టమ్, హైబ్రిడ్ అండ్ బ్లెండెడ్ లెర్నింగ్, డిజిటల్ అండ్ వర్చువల్ విశ్వవిద్యాలయాలను విస్తృతపరచాలని సూచించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.సీతారామారావు, అకడమిక్ డైరెక్టర్ పుష్ప చక్రపాణి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఏవీఆర్‌ఎన్ రెడ్డి, సికా డైరెక్టర్ శ్రీదేవి, విశ్వవిద్యాలయ డైరెక్టర్లు, డీన్స్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో రెండు చోరీలు

వెంగళరావునగర్: రెండు వేర్వేరు సంఘటనల్లో టీవీ, ద్విచక్ర వాహనం చోరీకి గురైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలు.. బి.రజిని మధురానగర్‌కాలనీలోని హాస్టల్ నిర్వహిస్తుంది. ఈనెల 4వ తేదీ తెల్లవారుజామున 3 గంటలకు ఓ గుర్తుతెలియని వ్యక్తి మాస్క్ ధరించి హాస్టల్‌లోని టీవీ, రిమోట్ తీసుకొని నంబర్ ప్లేట్‌లేని బైక్‌పై పారిపోయాడు. ఉదయం సీసీ టీవీలో గుర్తించిన రజిని పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేసింది. మరో ఘటనలో వెంగళరావునగర్‌కు చెందిన ఆర్.శ్రీనివాస్ ఈనెల 4న రాత్రి 8.10 గంటల సమయంలో మెయిన్‌రోడ్డులోని సత్యం ఫుడ్స్ వద్ద తన ద్విచక్ర వాహనాన్ని పార్క్ చేశారు. లోనికి వెళ్లి టిఫిన్ తీసుకుని తిరిగి వచ్చి చూడగా పార్క్ చేసిన వాహనం కలిపించలేదు. చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో మంగళవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు.

కుర్చీ తాతపై మరోసారి ఫిర్యాదు

వెంగళరావునగర్: బూతు పురాణాలతో మరోసారి కుర్చీతాత రచ్చకెక్కాడు. గతంలో అనేకమార్లు ప్రముఖ యూట్యూబ్ స్టార్స్ స్వాతినాయుడు, వైజాగ్ సత్యపై దుర్భాషలాడి పలు కేసుల్లో ఇరుక్కున్నాడు. చివరకు క్షమాపణలు కోరుతూ కేసులు లేకుండా చేసుకున్నాడు. అయితే మళ్లీ అదే తరహాలో బూతులు మాట్లాడుతున్నాడని బాధితులు మంగళవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు, బాధితులు తెలియజేసిన వివరాలు.. రహమత్‌నగర్‌కు చెందిన కాలా పాషా అలియాజ్ కుర్చీ తాత మహేశ్‌బాబు సినిమాలోని కుర్చీ పాట ద్వారా యూ ట్యూబ్‌లో ఫేమస్ అయ్యాడు. అయితే, యూ ట్యూబ్‌లో షార్ట్ ఫిల్మ్ తీసే స్వాతినాయుడు, వైజాగ్ సత్యతో గతంలో సన్నిహితంగా ఉండేవాడు. అతని చెడు ప్రవర్తన కారణంగా వారు అతనిని దూరంగా ఉంచారు. దాంతో గతంలో వారిని తీవ్ర అసభ్య పదజాలంతో దుర్భాషలాడటంతో బాధితులు జూబ్లీహిల్స్, తర్వాత మధురానగర్ పీఎస్‌లో కేసులు పెట్టారు. అనంతరం కుర్చీతాత వారితో రాజీ కుదుర్చుకున్నాడు. తాజాగా మళ్లీ తమను తిడుతున్నాడంటూ స్వాతినాయుడు, వైజాగ్ సత్యలు మంగళవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా, రెండు రాష్ట్రాలకు చెందిన ప్రస్తుత, మాజీ సీఎంలను, సినీరంగ ప్రముఖులను సైతం తిడుతున్నాడని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు.

విశాఖలో ప్రమాణం

ఎన్నికల్లో గెలిచి అక్కడి నుంచే పాలన: సీఎం జగన్ • రాష్ట్రానికి వైజాగ్ గ్రోత్ ఇంజన్ లాంటిది



విజన్ విశాఖ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం వైఎస్ జగన్. చిత్రంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: రానున్న ఎన్నికల్లో గెలిచిన తర్వాత విశాఖపట్నం నుంచే పరిపాలన సాగించనున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. రెండోసారి అధికారంలోకి వచ్చాక వైజాగ్‌లోనే ప్రమాణ స్వీకారం కూడా చేయనున్నట్లు ప్రకటించారు. రాష్ట్రానికి వైజాగ్ గ్రోత్ ఇంజన్ లాంటిదని సీఎం అభిప్రాయపడ్డారు. రాష్ట్రం ఆర్థికంగా సమగ్రాభివృద్ధి చెందాలంటే విశాఖ పరిపాలన రాజధాని కావాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చే ఐదేళ్లలో విశాఖ అభివృద్ధికి రూ.లక్ష కోట్ల మేర వ్యయం చేయనున్నట్లు చెప్పారు. అయితే తాను ఏ ప్రాంతానికీ వ్యతిరేకం కాదని, రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసమే విశాఖను పరిపాలన రాజధానిగా, శాసన రాజధానిగా అమరావతిని, న్యాయ రాజధానిగా కర్నూలును ప్రతిపాదించామని స్పష్టం చేశారు. ఇప్పటికే కనీస మౌలిక సదుపాయాలున్న విశాఖ నగరంపై కొద్దిగా శ్రద్ధ పెడితే పదేళ్లల్లో హైదరాబాద్, బెంగళూరు, చెన్నై లాంటి నగరాలతో పోటీపడుతుందన్నారు. 'విజన్ విశాఖ' సదస్సులో భాగంగా మంగళవారం విశాఖలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 2 వేల మందికిపైగా పారిశ్రామిక, వాణిజ్య వర్గాలతో సీఎం జగన్ సమావేశమయ్యారు. 'ఏపీ డెవలప్‌మెంట్ డైలాగ్ విత్ సీఎం' అంశంపై ప్రసంగించి విజన్ విశాఖ డాక్యుమెంటరీని తిలకించారు. రానున్న ఐదేళ్లలో విశాఖ అభివృద్ధి ప్రణాళికతో కూడిన 'విజన్ విశాఖ' పుస్తకాన్ని ఆవిష్కరించారు. పరిపాలన రాజధాని విశాఖలో ఐకానిక్ కన్వెన్షన్ సెంటర్, అంతర్జాతీయ స్టేడియంతో పాటు ఐకానిక్ సెక్రటేరియట్‌ను నిర్మించనున్నట్లు ప్రకటించారు. ఐకానిక్ సెక్రటేరియట్ భవన నమూనాను కూడా సీఎం జగన్ ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన ఇంకా ఏమన్నారంటే..

ఆర్థికాభివృద్ధిలో నగరాభివృద్ధి కీలకం...

రాష్ట్రానికి విశాఖ ఎందుకు అవసరం? నగరాన్ని ఎలా తీర్చిదిద్దాలి? అనే అంశాలపై మనం చర్చించాల్సిన అవసరం ఉంది. విభజన తర్వాత ఏపీ వ్యవసాయాధారిత రాష్ట్రంగా మిగిలిపోయింది. దేశవ్యాప్తంగా జీఎస్‌డీపీలో వ్యవసాయం వాటా సగటున 17–18 శాతం ఉంటే మన రాష్ట్రంలో 35 శాతం ఉంది. ద్వితీయ, తృతీయ రంగాలైన తయారీ, సేవా రంగాలు వృద్ధి చెందకుంటే రాష్ట్రం ఆర్థికంగా నిలబడలేదు. అవి శరవేగంగా వృద్ధి చెందితేనే మన ముందున్న సవాళ్లను అధిగమించి ఆశించిన మేరకు ఆర్థికాభివృద్ధిని సాధించగలం. విభజనతో హైదరాబాద్ నగరాన్ని కోల్పోవడం వల్ల రాష్ట్రం మీద పెను ప్రభావం పడింది. ఏ రాష్ట్రమైనా ఆర్థికంగా పురోగమించాలంటే ఒక చోదకశక్తి అవసరం. ఉమ్మడి రాష్ట్రంలో అలాంటి ఆర్థిక చోదక శక్తి అయిన హైదరాబాద్‌ను మనం కోల్పోయాం. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలైన ఐడీపీఎల్, ఎన్ఎండీసీ, ఎన్ఎఫ్‌సీ, ఐఐసీటీ లాంటివన్నీ అక్కడే ఉండటంతో పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చాయి. అలాంటి సంస్థలు వస్తే అభివృద్ధి పరంగా వెంటనే మంచి మార్పు కనిపిస్తుంది. ఆ ప్రాంతంలో మంచి జీతాలు లభిస్తున్న ఉద్యోగులు ఉంటారు. మంచి సంస్థలు రావడం, మంచి ఆర్థిక ప్రగతి నమోదు ఒక సైకిల్ లాగా జరుగుతుంది. తద్వారా ఆ నగరం బాగా విస్తరిస్తుంది. ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన ప్రభుత్వ రంగ సంస్థల్లో 90 శాతం హైదరాబాద్‌లోనే స్థాపించడంతో ఇతర ప్రాంతాలతో పోలిస్తే శరవేగంగా అభివృద్ధి చెందింది. దురదృష్టవశాత్తూ ఉమ్మడి రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల్లో అలా జరగలేదు.

విశాఖతో సేవా రంగం వాటా పెరుగుతుంది..

ఆర్థిక రంగాన్ని ముందుకు నడిపేది సేవారంగమే. జాతీయ స్థాయిలో చూస్తే జీఎస్‌డీపీలో సేవారంగం వాటా 55 శాతంగా ఉంది. తెలంగాణలో సేవా రంగం వాటా దాదాపు 62.87 శాతం. ఇందులో మెజార్టీ హైదరాబాద్ నుంచే వస్తోంది. మన రాష్ట్రంలో సేవారంగం వాటా 40 శాతం మాత్రమే ఉంది. తయారీ రంగంలో జాతీయ స్థాయితో పోలిస్తే సమాన స్థాయిలో ఉన్నప్పటికీ సేవా రంగం విషయంలో మనం గణనీయ ప్రగతి సాధించాల్సిన అవసరం ఉంది. అది పెరిగినప్పుడే మన ఎకానమీ పెరుగుతుంది. 2022–23లో ఆంధ్రప్రదేశ్ తలసరి ఆదాయం రూ.2,19,518 కాగా తెలంగాణలో రూ.3,12,398గా ఉంది. తెలంగాణ తలసరి ఆదాయంలో అత్యధిక భాగం హైదరాబాద్ నుంచే వస్తోంది.

మన రాష్ట్రంలో సేవా రంగం వాటా పెరగాలంటే హైదరాబాద్ లాంటి నగరాన్ని మనం నిర్మించుకోవాలి. హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలతో పోటీపడే సత్తా ఉన్న నగరం విశాఖ మాత్రమే.

మన బలం.. మన తీరమే

సహజసిద్ధంగా మనకున్న బలాలను వినియోగించుకుంటూ ఆర్థిక పురోగతితో ముందుకు సాగాలి. దేశంలోనే రెండో అతిపెద్ద సముద్రతీర ప్రాంతం మనకు ఉంది. 974 కి.మీ పొడవైన తీరం వల్ల పోర్టు ఆధారిత అభివృద్ధికి అవకాశం ఉంది. తద్వారా తయారీ రంగానికి మంచి అవకాశాలుంటాయి. పోర్టులను అభివృద్ధి చేయడం ద్వారా తయారీ రంగానికి సహకారాన్ని అందిస్తూ తీరం వెంట పారిశ్రామిక వాడలు, విశాఖను అభివృద్ధి చేసుకుంటూ ముందుకు వెళ్లాలి. అవి రాష్ట్రానికి మంచి ఆర్థిక ప్రగతిని అందిస్తాయి. 2019కు ముందు ఏపీలో కేవలం 4 చోట్ల నుంచే ఎగుమతులు జరగగా మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.16 వేల కోట్లకుపైగా వ్యయంతో మరో నాలుగు పోర్టులను అభివృద్ధి చేస్తున్నాం. ఇప్పటికే రూ.4 వేల కోట్ల పైచిలుకు నిధులు ఖర్చు చేశాం. రామాయపట్నం పోర్టుకు వచ్చే నెలలోనే షిప్పులు వచ్చే పరిస్థితి ఉంది. కాకినాడలోని ప్రైవేట్ పోర్టుతోపాటు మచిలీపట్నం, మూలపేట పోర్టుల పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. బ్లూ ఎకానమీకి (నీలి విప్లవం) ఊతమిచ్చేలా 10 ఫిషింగ్ హార్బర్లను నిర్మిస్తున్నాం. తీరం వెంట ప్రతి 50 కిలోమీటర్లకు ఒక పోర్టు లేదా ఒక ఫిషింగ్ హార్బర్‌ను అందుబాటులోకి తెస్తున్నాం. అలాగే 6 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లను కూడా ఏర్పాటు చేస్తున్నాం.

మూడు భారీ పారిశ్రామిక పార్కులు..

పారిశ్రామిక నోడ్స్‌లో భాగంగా వైఎస్సార్ కడప జిల్లాలోని కొప్పర్తిలో ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ జోన్‌ను నెలకొల్పాం. అచ్యుతాపురం, ఓర్వకల్లు, కృష్ణపట్నంలలో భారీ పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేస్తున్నాం. రాష్ట్రమంతటా సమతుల్య అభివృద్ధి ఉండేలా చూస్తున్నాం. ప్రభుత్వం తీసుకుంటున్న సానుకూల చర్యలు, వ్యాపార అనుకూల వాతావరణం వల్ల గత మూడేళ్లుగా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఏపీ మొదటి స్థానంలో నిలిచింది. విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు సందర్భంగా రూ.13 లక్షల కోట్లకుపైగా విలువైన 352 ఒప్పందాలు కుదిరాయి. దాదాపు 6 లక్షల మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. ఇందులో 39 శాతం ఒప్పందాలు కార్యరూపంలోకి రాగా మిగిలినవి శరవేగంగా అమల్లోకి వస్తున్నాయి.

స్వయం ఉపాధికి ప్రోత్సాహం... కొత్తగా 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు

కేవలం భారీ పరిశ్రమల ద్వారా మాత్రమే ఆర్థికాభివృద్ధి సాధ్యం కాదు. అందుకే గత ఐదేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ స్వయం ఉపాధి మార్గాల వైపు నడిపిస్తోంది. లంచాలకు తావులేకుండా, దళారీలు లేకుండా డీబీటీ పద్ధతిలో ప్రయోజనాన్ని అందిస్తున్నాం. ఉదాహరణకు చేయూత పథకాన్నే తీసుకుంటే క్రమం తప్పకుండా ఒక్కో మహిళకు రూ.18,750 చొప్పున నాలుగేళ్లపాటు స్థిరంగా ఇచ్చాం. లబ్ధిదారులైన ఆ మహిళలను బ్యాంకులతో అనుసంధానం చేశాం. అమూల్, ఐటీసీ, రిలయన్స్, పీ అండ్ జీ లాంటి పెద్ద కంపెనీల భాగస్వామ్యంతో వారికి స్వయం ఉపాధి మార్గాలు చూపించి సొంత కాళ్లపై నిలబడేలా ప్రోత్సహిస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఐదేళ్లలో ప్రతి సంక్షేమ కార్యక్రమాన్ని ఇలాగే అమలు చేసింది. జీవనోపాధి పొందుతున్న మార్గాన్ని బలోపేతం చేయడం లేదా కొత్త ఉపాధి మార్గాలను కల్పించాం. వాస్తవానికి ఉపాధి అవకాశాల్లో ప్రభుత్వ రంగ వాటా కొద్ది శాతమే. మేం అధికారంలోకి రాకముందు ప్రభుత్వ రంగంలో ఉన్న ఉద్యోగుల సంఖ్య 4 లక్షలు కాగా మేం వచ్చాక మరో 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను అదనంగా కల్పించాం. దశాబ్దాలపాటు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య నాలుగు లక్షలే కాగా 50 శాతం కొత్త ఉద్యోగాలను మేం వచ్చాక సృష్టించగలిగాం. ఉపాధిలో వ్యవసాయానిది కూడా ప్రముఖ పాత్ర. మన వ్యవసాయ రంగంపై 62 శాతం మంది ప్రజలు ఆధారపడి ఉన్నారు. 52 శాతం మంది రైతులకు అర హెక్టారు లోపే భూమి ఉంది. 70 శాతం మందికి హెక్టారు లోపే పొలం ఉంది. రాష్ట్రంలో సన్న, చిన్నకారు రైతులు పెద్ద ఎత్తున ఉన్నారు. వీరు ఆదాయాలు పొందలేకపోతే ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోతుంది. అందుకే రైతులకు చేయూతనిచ్చి నడిపించేలా ఆర్బీకేలు, అగ్రికల్చర్ అసిస్టెంట్ల ద్వారా తోడుగా నిలుస్తున్నాం.

పదేళ్ల విజన్‌తో విశాఖ

విశాఖ అభివృద్ధి కోసం పదేళ్ల విజన్‌తో వాస్తవిక దృక్పథంతో ప్రణాళిక రూపొందించాం. రాష్ట్ర ప్రభుత్వమే కాకుండా కేంద్రం, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) పద్ధతుల్లో అందరూ ఇందులో భాగస్వాములు కావాల్సిన అవసరం ఉంది. పదేళ్లలో హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాలకు పోటీగా విశాఖను తీర్చిదిద్దేలా ఈ విజన్ ఉంటుంది. రాజధానిగా అమరావతి ఆలోచనను నేను ఎందుకు వ్యతిరేకించాలి? అలాంటి వ్యతిరేకత కూడా నాకేమీ లేదు. పైగా శాసన రాజధానిగా అమరావతిని ప్రకటించిందీ, నిర్ణయించిందీ నేనే. కర్నూలును కూడా న్యాయ రాజధానిగా ప్రకటించిందీ నేనే. నాకేమీ ఎలాంటి వ్యతిరేకతా లేదు.

ఎందుకీ ఏడుపులు..?

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను శరవేగంగా ముందుకు ఎలా తీసుకెళ్లాలన్న దానిపై ఇప్పుడు మనం ఆలోచన చేయాలి. విశాఖ విషయంలో మనం ఏం చేయాలి? నగర అభివృద్ధి చరిత్రను ఎలా మార్చాలి? వచ్చే పదేళ్లలోగా మనం హైదరాబాద్, చెన్నై, బెంగళూరు లాంటి మహా నగరాలతో ఎలా పోటీపడాలి? అన్నదానిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఇదే విజన్ విశాఖకు అర్థం, పరమార్థం కావాలి. ఈ ప్రాంతం, నగరం పట్ల అభిరుచి, అంకిత భావం, చిత్తశుద్ధి లేకపోతే ఈ విజన్ సాకారం కాదు. వాస్తవంలోకి రాదు. అన్నిటికంటే ముందు.. ఒక ముఖ్యమంత్రిగా ఉన్న నేను ఇక్కడకు వచ్చి నివాసం ఉండాలి. నేను ఈ మాట చెప్పగానే మన రాష్ట్రంలో ఉన్న ప్రతిపక్షాలు, సొంత ప్రయోజనాలున్న నెగెటివ్ మీడియా ఒక్కసారిగా భోరున విలపిస్తాయన్న సంగతి మీ అందరికీ తెలిసిందే. వైజాగ్‌కు మారుస్తున్నామంటే చాలు.. భూములు కబ్జా చేయడానికే వస్తున్నారంటూ సిగ్గు లేకుండా రకరకాల తప్పుడు కథనాలు వ్యాప్తి చేస్తున్నారు. కోర్టులకు వెళ్లి కేసులు వేస్తున్నారు. ఇవన్నీ వాళ్లు ఎందుకు చేస్తున్నారంటే?.. ముఖ్యమంత్రి అనే వ్యక్తి ఇక్కడకు వస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది! ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్‌గా పురోగతి సాధిస్తుంది! అందుకే సీఎం ఇక్కడకు రాకూడదని అడ్డుపడుతున్నారు. దీనివెనుక వారికి స్వార్థ ప్రయోజనాలున్నాయి. అక్కడ (అమరావతి) రాజధాని ప్రకటనకు ముందే వేలాది ఎకరాలను బినామీల పేర్లతో కొనుగోలు చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తెర తీశారు.

ముందుగానే రూ.లక్ష కోట్లు ఖర్చు

అమరావతి అనేది 50 వేల ఎకరాల ఖాళీ భూమి. రోడ్లు, నీళ్లు, విద్యుత్ లాంటి కనీస సదుపాయాలు కల్పించడానికే వాళ్లు ఇచ్చిన డీపీఆర్ ప్రకారం ఎకరాకు రూ.2 కోట్లు ఖర్చు అవుతుంది. అమరావతి ప్రాంతంలో భవనాలు రావాలంటే ముందు కనీసం రూ.లక్ష కోట్లు పైనే ఖర్చు చేయాల్సి వస్తుంది. ఇవాళ మనం ఒక లక్ష కోట్లు అనుకుంటే 20 ఏళ్లలో ఏటా రూ.5 వేల కోట్లు చొప్పున వేసుకుంటే సుమారుగా రూ.10 లక్షల కోట్లో, ఖర్చులు పెరిగి రూ.15 లక్షల కోట్లో అయినా అవుతుంది. అందుకనే అక్కడ అది చేయలేమని అంటున్నాం. అమరావతి ఆలోచనకు నేను వ్యతిరేకం కాదు. వైజాగ్‌లో ఇప్పటికే కనీస మౌలిక సదుపాయాలున్నాయి. మంచి రోడ్లు, కరెంటు, తాగునీటి సదుపాయం.. ఇలా అన్నీ ఉన్నాయి. కొన్ని మెరుగులు దిద్దితే సరిపోతుంది. వీటితో సిటీ రూపురేఖలు గణనీయంగా మారుతాయి. కార్యనిర్వాహక రాజధానిగా ఇక్కడకు మారే సమయంలో ఉద్యోగులు పనిచేసుకునేందుకు ఐకానిక్ సెక్రటేరియట్ ఉండాలి. అది దేశం దృష్టిని ఆకర్షించాలి. దేశం అంతా ఇటు చూసేలా ఐకానిక్ కన్వెన్షన్ సెంటర్, అహ్మదాబాద్ తరహాలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం కూడా ఉండాలి. వాటి రాకతో వైజాగ్ స్థాయి పెరుగుతుంది. దేశమే కాకుండా ప్రపంచం మొత్తం విశాఖ వైపు చూస్తుంది. ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక అంశాలను బోధించేలా ఎమర్జింగ్ టెక్నాలజీ యూనివర్సిటీ కూడా రావాలి. రానున్న 15–18 నెలల్లో పూర్తి చేసేలా భోగాపురం విమానాశ్రయ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. భోగాపురం ఎయిర్ పోర్టును అనుసంధానించేలా ఆరు లేన్లతో అందమైన బీచ్ కారిడార్ రోడ్డు ప్రాజెక్టు కూడా రావాల్సి ఉంది. మెట్రో రైలు ప్రాజెక్ట్, ఏడాదిలోగా ప్రారంభమయ్యే మూలపేట పోర్టుతో హారిజాంటల్ గ్రోత్ కారిడార్ ఏర్పడుతుంది. డేటా సెంటర్‌తో పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తాయి. ఆతిథ్య రంగంలో ఒబెరాయ్, మై ఫెయిర్ పెట్టుబడులు పెట్టబోతున్నాయి. నగరానికి అత్యుత్తమ ఫైవ్ స్టార్ సదుపాయాలు సమకూరుతాయి. ఎన్టీపీసీ, గ్రీన్ హైడ్రోజన్ రూపంలో రూ.30 వేల కోట్ల పెట్టుబడులు రాబోతున్నాయి. ప్రధాని తాజాగా దీనికి వర్చువల్‌గా శంకుస్థాపన కూడా చేశారు. ఇవన్నీ సాధ్యం కానివేమీ కాదు. ఇవన్నీ వాస్తవ రూపంలోకి వచ్చేవే. వచ్చే పదేళ్లలో ఇవన్నీ రాబోతున్నాయి. హైస్పీడ్ రైలు కారిడార్లపై కూడా ప్రధానితో మాట్లాడుతున్నాం. హైదరాబాద్ – వైజాగ్, విజయవాడ– బెంగళూరుల మధ్య హైస్పీడ్ రైల్ కారిడార్లకోసం సంప్రదిస్తున్నాం. ఇవన్నీ రావడమే కాకుండా ముఖ్యమంత్రి కూడా ఇక్కడకు వస్తే పదేళ్లలో వైజాగ్ ప్రపంచంలో అత్యుత్తమ నగరాలతో పోటీపడుతుంది. ఎన్ని అడ్డంకులున్నా, అవరోధాలున్నా విశాఖ నగర వాసులకు నేను ఒకటే చెబుతున్నా.. మనం తప్పకుండా విజయం సాధిస్తాం.

స్వప్రయోజనం ఆశిస్తే కడప అనలేనా?

హైదరాబాద్, చెన్నై, బెంగళూరుతో మనం పోటీపడాలంటే వైజాగ్ ఎకనామిక్ గ్రోత్ ఇంజన్ లాంటిది. రాష్ట్ర అభివృద్ధికి ఆర్థిక చోదకశక్తి కావాల్సిందే. నిజంగా నాకేమైనా స్వప్రయోజనం ఉంటే నేను కడప గురించి మాట్లాడేవాడిని. భవిష్యత్తు తరాలకు ఏది చేస్తే మంచిది? ఏం చేయడం వల్ల రాష్ట్ర ఆదాయాలు పెరుగుతాయి? దేనివల్ల ఆర్థికంగా పురోగమిస్తాం? అనే ఆలోచన చేయకపోతే అన్యాయం చేసిన వాళ్లమవుతాం. ఈ కోణంలో మనం వైజాగ్ గురించి ఆలోచించలేకపోతే ఇంకెవరు ఆలోచిస్తారు? అని అంతా ప్రశ్నించుకోవాలి. నాయకుడి దార్శనికత సరిగా లేకపోతే వైజాగ్ అభివృద్ధి చెందదు. నగరం విస్తరించదు. కార్యనిర్వాహక రాజధానిగా విశాఖపట్నం కోసం ఎవరైనా గట్టిగా నిలబడ్డారంటే.. అది నేను మాత్రమే. ఇది వాస్తవం. విశాఖ కోసం ప్రతిపక్షాలతో, స్వప్రయోజనాలున్న మీడియాతో పోరాడుతున్నాం. వారిలో ప్రతి ఒక్కరూ విశాఖ కార్యనిర్వాహక రాజధాని కాకూడదని కోరుకుంటున్నారు. ఒకవైపు కోర్టు కేసులు నడుస్తున్నాయి. మరోవైపు కొందరు విశాఖను వ్యతిరేకిస్తున్నప్పటికీ ఎన్నికలు ముగిసిన తర్వాత నేను విశాఖలోనే నివాసం ఉంటా. నా ప్రమాణ స్వీకారోత్సవం కూడా విశాఖలోనే జరుగుతుంది. వైజాగ్ పట్ల నాకున్న కృతనిశ్చయం ఇది.

'వెలిగొండ'.. కల సాకారం

- యుద్ధప్రాతిపదికన ప్రాజెక్టు జంట సొరంగాలు పూర్తి
- నేడు జాతికి అంకితం చేయనున్న సీఎం వైఎస్ జగన్

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

సాక్షి, అమరావతి: ప్రజాసంకల్ప పాదయాత్రలో రైతులకిచ్చిన మరో మాటను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలబెట్టుకున్నారు. ప్రకాశం, నెల్లూరు, వైఎస్సార్ జిల్లాల్లో దుర్భిక్ష ప్రాంతాల ప్రజల దశాబ్దాల కల వెలిగొండ ప్రాజెక్టును సాకారం చేశారు. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి వెలిగొండ ప్రాజెక్టులో అంతర్భాగమైన నల్లమలసాగర్‌కు కృష్ణా జలాలను తరలించేందుకు వీలుగా మొదటి టన్నెల్‌ను 2021, జనవరి 13 నాటికి పూర్తిచేయించిన సీఎం జగన్.. రెండో టన్నెల్ తవ్వకం పనులను ఈ ఏడాది జనవరి 21 నాటికి పూర్తిచేయించారు. ఆసియా ఖండంలోనే అత్యంత పొడవైన నీటిపారుదల సొరంగాల (ఇరిగేషన్ టన్నెల్స్)ను రికార్డు సమయంలో పూర్తిచేయడం ద్వారా ముఖ్యమంత్రి చరిత్ర సృష్టించారని సాగునీటిరంగ నిపుణులు ప్రశంసిస్తున్నారు. ఈ జంట సొరంగాలను బుధవారం సీఎం జాతికి అంకితం చేయనున్నారు. వచ్చే సీజన్‌లో శ్రీశైలం ప్రాజెక్టుకు కృష్ణా వరద జలాలు చేరి, నీటి మట్టం కనీస స్థాయికి అంటే 854 అడుగులకు చేరుకున్న వెంటనే వెలిగొండ జంట సొరంగాల ద్వారా ఆ ప్రాజెక్టులో అంతర్భాగమైన నల్లమలసాగర్‌కు తరలించడానికి రంగం సిద్ధంచేశారు. తీగలేరు, గొట్టిపడియ, తూర్పు (వెస్ట్రన్), పశ్చిమ (వెస్ట్రన్) కాలువల ద్వారా ఆయకట్టుకు నీళ్లందించి.. రైతులకు వెలిగొండ ప్రాజెక్టు ఫలాలను అందించనున్నారు. ఈ ప్రాజెక్టును పూర్తిచేయడం ద్వారా ఎన్నికల్లో తమకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని రైతులు ఆనందోత్సాహాలు వ్యక్తంచేస్తున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రకాశం, నెల్లూరు, వైఎస్సార్ జిల్లాల్లో దుర్భిక్ష ప్రభావిత 30 మండలాల్లోని 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు.. 15.25 లక్షల మందికి తాగునీరు అందుతుంది. ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో కనిగిరి, యర్రగొండపాలెం, గిద్దలూరు, మార్కాపురం, ఉదయగిరి నియోజకవర్గాల్లో దశాబ్దాలుగా పీడిస్తున్న ఫ్లోరైడ్ సమస్యను కూడా ఈ ప్రాజెక్టు పూర్తి ద్వారా సీఎం జగన్ శాశ్వతంగా పరిష్కరించారు.

మహానేత వైఎస్ ముందుచూపునకు తార్కాణం..

శ్రీశైలం ప్రాజెక్టుకు వరద వచ్చే 45 రోజుల్లో రోజుకు 85 క్యూమెక్కులు (3,001 క్యూసెక్కులు) చొప్పున తరలించే సామర్థ్యంతో ఏడు మీటర్ల వ్యాసం, 18.80 కిమీల పొడవుతో సొరంగం తవ్వి.. వెలిగొండ కొండల్లో నిర్మించే నల్లమలసాగర్‌కు తరలించి ప్రకాశం జిల్లాలో దుర్భిక్ష ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించాలని 1993–94లో డీపీఆర్ (సమగ్ర ప్రాజెక్టు నివేదిక) రూపొందించారు. కానీ, 2004 వరకూ ఈ ప్రాజెక్టు పనులను ఎవరూ పట్టించుకోలేదు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా బాధ్యతలు స్వీకరించాక నదీ జలాలను మళ్లించి తెలుగు నేలను సుభిక్షం చేయడానికి జలయజ్ఞం చేపట్టారు. ఈ క్రమంలో వెలిగొండ ప్రాజెక్టు డీపీఆర్‌ను సమూలంగా మార్చేశారు. కృష్ణా నదికి వరద రోజులు క్రమేణ తగ్గుతున్న నేపథ్యంలో.. శ్రీశైలానికి వరద వచ్చే 45 రోజుల్లోనే రోజుకు 11,584 క్యూసెక్కులు చొప్పున 43.50 టీఎంసీలను తరలించేలా జంట సొరంగాలు (మొదటిది 85 క్యూమెక్కుల సామర్థ్యం, రెండోది 243 క్యూమెక్కుల సామర్థ్యం) తవ్వి.. కొత్తగా 53.85 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించే నల్లమలసాగర్‌లో నిల్వచేసి.. ప్రకాశం, నెల్లూరు, వైఎస్సార్ జిల్లాల్లో వర్షాభావ ప్రాంతాల్లో 4,47,300 (తీగలేరు కెనాల్ ద్వారా 62 వేలు, తూర్పు ప్రధాన కాలువ ద్వారా 3,70,800, గొట్టిపడియ కాలువ ద్వారా 9,500 ఎకరాలు) ఎకరాల ఆయకట్టుకు నీళ్లందించడంతోపాటు.. ఆ మూడు జిల్లాల్లో 30 మండలాల్లోని 15.25 లక్షల మంది దాహార్తిని శాశ్వతంగా తీర్చాలనే లక్ష్యంతో దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి 2004, అక్టోబర్ 27న శ్రీకారం చుట్టారు. జలయజ్ఞంలో భాగంగా వెలిగొండ ప్రాజెక్టుకు రూ.3,610.38 కోట్లు ఖర్చుచేసి.. నల్లమలసాగర్‌తోపాటు సొరంగాల్లో చాలావరకు పనులు పూర్తిచేయించారు. సొరంగాలను నల్లమలసాగర్‌ను అనుసంధానం చేసేలా 23 కిమీల పొడవున 11,585 క్యూసెక్కులను తరలించేలా ఫీడర్ ఛానల్ పనులను చేయించారు. తీగలేరు కెనాల్, తూర్పు, పశ్చిమ ప్రధాన కాలువ, గొట్టిపడియ కెనాల్ పనులను చేపట్టారు.

బీసీలకు అండగా ఉంటాం

పవన్‌తో కలిసి బీసీ డిక్లరేషన్ ప్రకటించిన చంద్రబాబు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: వెనుకబడిన కులాల దశ, దిశ మార్చేలా బీసీ డిక్లరేషన్ ఉంటుందని తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు అన్నారు. గుంటూరు జిల్లా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వద్ద మంగళవారం సాయంత్రం 'జయహో బీసీ' పేరుతో నిర్వహించిన సభలో చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కలిసి బీసీ డిక్లరేషన్ విడుదల చేశారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ.. సమాజం కోసమే జనసేనతో కలిశామన్నారు. బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉండేందుకు టీడీపీ, జనసేన సమష్టిగా ఈ డిక్లరేషన్ పెడుతున్నామన్నారు. 40 సంవత్సరాలుగా బీసీలకు అండగా ఉన్న పార్టీ తెలుగుదేశమని చెప్పారు. బీసీల డీఎన్ఏలోనే టీడీపీ ఉందన్నారు. వారి రుణం తీర్చుకోవడానికే 10 సూత్రాలతో డిక్లరేషన్ ఇస్తున్నామన్నారు. వైఎస్ జగన్ సామాజిక న్యాయం కంటే సామాజిక ద్రోహం ఎక్కువ చేశారన్నారు. బీసీలంటే బ్యాక్‌వర్డ్ క్లాస్ కాదు వారిని బ్యాక్ బోన్ సొసైటీగా నిలబెడతామన్నారు. కాగా, జయహో బీసీ సభకు లక్ష మంది వరకూ బీసీలు వస్తారని తెలుగుదేశం నాయకులు ఊదరగొట్టారు. ఈ మేరకు జనసేన నేతలు కూడా పెద్దఎత్తున ప్రచారం చేశారు. అయితే ఈ సభకు స్పందన కనపడలేదు.

అప్పుడు విస్మరించి ఇప్పుడు డిక్లరేషనా?

బీసీల గురించి మాట్లాడే అర్హత బాబుకు లేదు: సజ్జల



సాక్షి, అమరావతి : టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు బీసీలను విస్మరించిన చంద్రబాబుకు బీసీల గురించి మాట్లాడే అర్హతలేదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. బాబు అధికారంలో ఉండగా కేవలం వారిని ఓటు బ్యాంకుగా మాత్రమే చూశారని మండిపడ్డారు. ఇప్పుడు బీసీ డిక్లరేషన్ అంటూ మాయమాటలు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం వడ్డెరల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా 'సజ్జల' పాల్గొని మాట్లాడారు. ''బీసీలను ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఉన్నత స్థానాల్లోకి తీసుకొచ్చి తద్వారా సామాజిక సాధికారత దిశగా సీఎం జగన్ అడుగులు వేస్తున్నారు. అందులో భాగంగానే మంత్రివర్గం నుంచి స్థానిక సంస్థల వరకు బీసీలకు అత్యంత ప్రాధాన్యత కల్పిస్తున్నారు. శాసనమండలి సభ్యులుగాను, స్థానిక సంస్థలలోను మెజారిటీ పదవులు వారికే దక్కాయి. సంక్షేమ ఫలాల్లోనూ మెజారిటీ మొత్తం బీసీలకే దక్కింది. అదే బీసీలపట్ల చంద్రబాబుకు ఎంతమాత్రం చిత్తశుద్ధిలేదు. కొత్తగా వచ్చిన పార్టీలా ఆయన బీసీలపై హామీలిస్తున్నారు'' అని విమర్శించారు.

కేబినెట్ నుంచి మంత్రి గుమ్మనూరు భర్తరఫ్

సాక్షి,అమరావతి: రాష్ట్ర మంత్రివర్గం నుంచి మంత్రి గుమ్మనూరి జయరాం భర్తరఫ్ అయ్యారు. సీఎం జగన్ సిఫార్సు మేరకు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ మంగళవారం మంత్రిని మంత్రివర్గం నుంచి భర్తరఫ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

రాష్ట్రీయం

ఔట్ సోర్సింగ్ ఉద్యోగి బలవన్మరణం
సెల్ఫీ వీడియో తీసుకుని ఆత్మహత్య

- తన చావుకి డాక్టర్, ఎస్ఐ కారణమని లేఖ


జయంత్ (ఫైల్)


సూసైడ్ నోట్

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్, ఎస్ఐ వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ సెల్ఫీ వీడియో తీసుకుని ఓ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి బలవన్మరణానికి పాల్పడిన ఘటన ఇబ్రహీంపట్నం ఠాణా పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన ఎనుముల విజయలక్ష్మి, శ్రీనివాస్ దంపతుల కుమారుడు జయంత్(22) ఇబ్రహీంపట్నం ప్రభుత్వాస్పత్రిలోని పోస్టుమార్టం గదిలో అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. పోస్టుమార్టం గదికి ఎదురుగా పనిచేస్తున్న ఓ వ్యక్తిని చంపేస్తామంటూ బెదిరించాడనే కేసుతో పాటు వైద్యులు, సిబ్బందితో దురుసుగా ప్రవర్తిస్తున్నాడనే కారణంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ ఫిబ్రవరి 29న ఇతన్ని విధుల నుంచి తొలగించారు. అనంతరం ఇదే విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో జయంత్ కూడా తన తల్లిదండ్రులతో కలిసి పీఎస్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా న్యాయం జరగలేదని మనస్తాపానికి గురయ్యాడు. దీంతో స్థానిక లక్ష్మీనర్సింహస్వామి ఆలయ సమీపంలోని ఓ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

చొక్కాపై సీఎంకు సూసైడ్ నోట్

''నా చావుకు ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ రఘునాథ్, ఇబ్రహీంపట్నం ఎస్ఐ ఎస్‌కె మైబెల్లి కారణం.. నన్ను హింసించినందున ఆత్మహత్య చేసుకుంటున్నాను. ఈ ఇద్దరికీ కఠిన శిక్ష వేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి మనవి. ''అని చొక్కాపై వెనకాల సూసైడ్ నోట్ రాశాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు ఏసీపీ రాజు తెలిపారు. కాగా, జయంత్ ఉద్యోగంలో చేరినప్పటి నుంచి ప్రవర్తన బాగోలేదని, నిత్యం సహోద్యోగులతో, వైద్యులతో గొడవలు పడుతుండే వాడని, గంజాయికి బానిసగా మారడంతో మతిస్థిమితం సక్రమంగా లేదని ఏసీపీ చెప్పుకొచ్చారు.

ప్రజల్లోకి మోదీ గ్యారంటీలు

ఎల్ఈడీ స్క్రీన్ ప్రచార వాహనాలు ప్రారంభించిన కిషన్‌రెడ్డి


ప్రచార వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న కిషన్‌రెడ్డి, కె.లక్ష్మణ్, డీకే అరుణ. చిత్రంలో రాంచందర్‌రావు తదితరులు

సాక్షి, హైదరాబాద్: వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా మోదీ గ్యారంటీలకు సంబంధించిన ఎల్ఈడీ స్క్రీన్‌ప్రచార వాహనాలను కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. మంగళవారం పార్టీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్, జాతీయ ఉపాధ్య క్షురాలు డీకే అరుణ, బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు ఎన్.రామచంద్రరావు, మాకం రంగారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్రం గత పదేళ్లుగా దేశానికి, తెలంగాణకు ఏం చేసిందనే విషయాన్ని ఎల్ఈడీ స్క్రీన్ వ్యాన్ల ద్వారా ప్రజలకు తెలియజేస్తామన్నారు. ఎన్ని కల ప్రణాళిక కోసం ప్రజల నుంచి సలహాలు, సూచనలు తీసుకునే కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా ముందుకు తీసుకెళ్తామని, బుధ వారం నుంచి అన్ని జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాల్లో ఈ సలహాల బాక్సులను ఏర్పాటు చేస్తామని చెప్పారు.

'మన మోదీ', 'ప్రశ్నిస్తున్న తెలంగాణ'

'మన మోదీ', 'ప్రశ్నిస్తున్న తెలంగాణ' పేరిట రెండు డిజిటల్ క్యాంపెయిన్లను ప్రారంభి స్తున్నట్టు కిషన్‌రెడ్డి తెలిపారు. మొదటి క్యాంపెయిన్‌లో భాగంగా..గత పదేళ్లుగా మోదీ ప్రభుత్వ మౌలికవసతుల సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు తెలియజేస్తామని చెప్పారు. రెండో క్యాంపెయిన్‌లో...'కాంగ్రెస్ పార్టీ అట్టహాసంగా తెలంగాణ ప్రజలకు 6 గ్యారంటీలు ఇచ్చింది. కానీ వీటి అమలు విషయంలో ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. అసలు కాంగ్రెస్ నాయకత్వానికే వీటి అమలు మీద స్పష్టత లేదు. దీనిపై తెలంగాణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దీనిని 'ప్రశ్నిస్తున్న తెలంగాణ' పేరిట ప్రజల్లోకి తీసుకెళ్తాం..' అని వివరించారు.

నేడు రాష్ట్రానికి ఎన్డీఎస్ఏ బృందం

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల డిజైన్లు, నిర్మాణాన్ని పరీక్షించేందుకు కేంద్ర జలసంఘం మాజీ చైర్మన్ జె.చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) ఏర్పాటు చేసిన ఆరుగురు సభ్యుల కమిటీ బుధవారం రాష్ట్రానికి రానుంది. బుధవారం మధ్యాహ్నం జలసౌధలో నీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్సీలతో సమావేశం కానుంది. ఈ నెల 7, 8వ తేదీల్లో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను సందర్శించి తనిఖీలు నిర్వహించనుంది. మళ్లీ 9న హైదరాబాద్‌లో అధికారులు, నిర్మాణ సంస్థలతో సమావేశం కానుంది. అదేరోజు సాయంత్రం ఢిల్లీకి తిరిగి వెళ్లనుంది. మరోవైపు బ్యారేజీల డిజైన్లు మొదలు నిర్మాణం వరకు ఇందులో పాలుపంచుకున్న అధికారులు తమ వెంట ఉండేలా చూడాలని ప్రభుత్వాన్ని కమిటీ కోరింది. అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించిన 19 రకాల సమాచారం అందించాలని లేఖ రాసింది.

ర్యాఫ్ట్–సెకెంట్ పైల్స్ మధ్య.. భారీ అగాధం!

తేల్చిచెప్పిన ఎలక్ట్రో రెసిస్టివిటీ టెస్ట్?

సాక్షి, హైదరాబాద్: మేడిగడ్డ బ్యారేజీ ర్యాఫ్ట్ (పునాది)–సెకెంట్ పైల్స్ మధ్య ఉండే ఇసుక కొట్టుకుపోవడంతో భూగర్భంలో అగాధం ఏర్పడి బ్యారేజీ కుంగిందని ఎలక్ట్రో రెసిస్టివిటీ టోమోగ్రఫీ (ఈఆర్టీ) టెస్ట్ నివేదికలో వెల్లడైనట్లు తెలిసింది. బ్యారేజీలో నిరంతరం భారీగా నీటిని నిల్వ చేయడంతో ఒత్తిడి పెరిగి రాఫ్ట్–సెకెంట్ పైల్స్ మధ్య ఉన్న ఇసుక జారేలా చేసిందని ఈ నివేదిక ఆధారంగా నీటిపారుదల శాఖ వర్గాలు ఓ అంచనాకు వచ్చాయి. డైనోసర్ అనే సంస్థ ఆధ్వర్యంలో ఈ పరీక్ష నిర్వహించగా ఆ సంస్థ సరిగ్గా చేయలేదనే భావనతో మరో సంస్థ ఆధ్వర్యంలో రెండోసారి ఈ పరీక్ష జరిపిస్తున్నామని అధికారులు పేర్కొంటున్నారు. మేడిగడ్డ బ్యారేజీకి సంబంధించిన 7వ బ్లాక్‌కు జనవరి 4 నుంచి 9 వరకు డైనోసర్ సంస్థ ఈఆర్టీ పరీక్షలు జరిపింది. ఎట్టకేలకు ఈ పరీక్ష నివేదికను నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ తాజాగా నీటిపారుదల శాఖకు అందజేసినట్లు తెలిసింది. గతేడాది అక్టోబర్ 21న మేడిగడ్డ బ్యారేజీ ఏడో బ్లాకులోని 19, 20, 21 పిల్లర్లు కుంగిపోగా అందుకుగల స్పష్టమైన కారణాలు ఇంకా వెల్లడికాలేదు. బ్యారేజీ నిర్మాణంలో చోటుచేసుకున్న లోపాలను గుర్తించడానికి వివిధ రకాల జియోఫిజికల్, జియోలాజికల్ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

గుడ్ టచ్- బ్యాడ్ టచ్



మీ అమ్మాయికి చెప్పండి!

**మీ ఇంట్లో, మీ పక్కింట్లో, ఎదురింట్లో, పొరుగింట్లో కూతుళ్లు ఉండే ఉంటారు.
నవ్వుతూ తుళ్లుతూ స్కూళ్లకు వెళుతుంటారు.
కొన్ని కళ్లు చూపులతోనూ, మరికొన్ని చేతలతోనూ
ఆ నవ్వులను చిదిమేయడానికి పొంచి ఉంటాయి.
ఆమెకు చెప్పండి 'గుడ్ టచ్ బ్యాడ్ టచ్' అంటే ఏమిటో...
జాగ్రత్తగా ఎందుకు ఉండాలో.
'మీ పక్కింట్లో, ఎదురింట్లో, పొరుగింట్లో, వెనకింట్లో
ఉన్న అమ్మలు ఒక్కటవ్వండి. పరువు పరదాల మాటున
పసిపిల్లలపై జరుగుతున్న అకృత్యాలకు అడ్డుకట్ట వేయండి..'
అని చెబుతున్నారు హైదరాబాద్ వాసులైన మమత, శైలజ, జయవర్ధని, పుష్పలత, లక్ష్మి.**

ఆడపిల్లల భవిత బాగుండాలంటే వారు ఈ రోజు సురక్షితంగా ఉండాలి. చెడు చేతల బారిన పడకుండా 'గుడ్ టచ్- బ్యాడ్ టచ్' గురించి బడులు, మురికివాడలు, అపార్ట్‌మెంట్లు.. మొదలైన ప్రాంతాల్లో మమత, శైలజ, జయవర్ధిని, పుష్పలత, లక్ష్మి.. లు 'అభయ భవిత' కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. వీరు చేసే ఈ అవగాహన కార్యక్రమం ఎంతోమందికి స్ఫూర్తినిస్తోంది. మహిళా దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా తెలుగు రాష్ట్రాలోని గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లోకీ తీసుకెళుతున్నామని తెలియజేశారు.



పిల్లల భావాలను గ్రహించండి..

మూడు నుంచి పదేళ్లలోపు పిల్లలు ఈ సమస్యను ఎదుర్కొంటున్నారని జాతీయ, అంతర్జాతీయ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.'ఆ పై వయసు పిల్లలు కూడా ఎదురు చెప్పలేని, ఎదుర్కోలేని స్థితిలో ఉన్నారని గమనిస్తున్నాం' అంటున్నారు చైల్డ్ సైకాలజిస్టులు. పిల్లల్లో ఆకలి తగ్గిపోవడం, ఎవరితో కలవకపోవడం, నిద్రలో ఉలిక్కి పడి లేవడం, ప్రతి విషయానికి చికాకు పడటం, చదువులో వెనకబడిపోవడం .. వంటి సమస్యలన్నీ చెడు స్పర్శకు గురైన పిల్లల్లో చూస్తుంటాం. ఈ ప్రభావం వారి భవిష్యత్తును దెబ్బతీయకుండా ఉండాలంటే పిల్లల్లో ఇలాంటి భావాలేమైనా ఉంటే వాటిని తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలి. అబ్బాయిలనూ చెడు స్పర్శ సమస్య వెంటాడుతుంది. కాబట్టి, ఈ సమస్య అమ్మాయిలది మాత్రమే అని అనుకోవద్దు. పిల్లల ప్రవర్తనలో తేడాలు గమనించడం, నిపుణుల సాయం తీసుకోవడం సముచితం' అని తెలియజేస్తున్నారు.

తల్లిదండ్రులుగా మీరేం చేయాలంటే..

ఎవరైనా అమ్మాయిల తలపై, వీపుపై తట్టడం .. వంటి స్పర్శ వారిపై చూపించే శ్రద్ధగానే అనిపిస్తుంది. కానీ, వారి శరీరంలోని ప్రైవేట్ పార్ట్‌లను తడమడం, తాకడం, కొట్టడం.. వంటివి పిల్లల భావాలపై తీవ్రమైన చెడు ప్రభావం చూపుతుంది. స్నేహితులు, కుటుంబ సభ్యులు, అపరిచిత వ్యక్తులు ఎవరైనా సరే వారు స్పర్శించిన తీరు నచ్చకపోతే వెంటనే 'నో' చెప్పాలనే విషయాన్ని పిల్లలకు తెలియజేయాలి. ఎవరైనా అనుచితంగా ప్రవర్తిస్తున్నట్టుగా అనిపిస్తే .. ● అప్రమత్తంగా ఉండమని చెప్పండి ● భద్రత కోసం ఏదైనా వస్తువును ఉపయోగించమనండి ● ఎవరినైనా సాయం కోరమనండి ● గట్టిగా అరవమనండి ● చెడు స్పర్శ వద్దే వద్దు అని చెప్పండి. ● నిర్భయంగా ఉండమనండి ● నీలో ఎంతో శక్తి ఉంది అది గ్రహించు అని చెప్పండి ● సంఘటనను బట్టి వెంటనే ప్రతిఘటించమనండి ● ఎలాంటి బాధ అయినా పంచుకోమని చెప్పండి. ఎవరికీ చెప్పుకోలేని సమస్య ఎదురైతే వెంటనే హెల్ప్‌లైన్ 1098 లేదా 100కు ఫోన్ చేయమనండి.

– నిర్మలారెడ్డి

బోర్డుపైన బొమ్మలు వేయించి

పదేళ్లుగా సామాజిక కార్యకలాపాల్లో పాల్గొంటున్నాను. పిల్లల ఆరోగ్యం గురించి, మహిళలకు స్కిల్ ట్రెనింగ్ చేస్తుండేవాళ్లం. ఇప్పుడు పిల్లలకు గుడ్ టచ్- బ్యాడ్ టచ్ మీద అవగాహన కల్పిస్తున్నాను. బళ్లారిలోని గవర్నమెంట్ స్కూల్‌లో ఇద్దరు అమ్మాయిలను నిలబెట్టి మిగతా అందరికీ అర్థమయ్యేలా వివరించాం. పిల్లల చేతనే బోర్డు మీద బాడీలో ఏయే పార్ట్స్ తాకితే బ్యాడ్ టచ్ అనే విషయాలను బొమ్మలు వేయించి, రాయించి తెలియజేశాను. ఈ కార్యక్రమంలో పిల్లలు వాళ్ల ఎక్స్‌పీరియన్స్‌ను షేర్ చేసుకోవడం, తాము ఎలా ప్రతిస్పందించాలో ఒకటొకటిగా చెబుతుంటే ఆనందంగా అనిపించింది.

– పుష్పలత

సమాచారం ఉన్నా అవగాహన లేదు

బిజినెస్ ఉమన్‌గా నా పనులు చేసుకుంటూనే స్వచ్ఛంద కార్యక్రమాలలో పాల్గొంటుంటాను. కార్పొరేట్ స్కూళ్లలో మా ఫ్రెండ్ వాళ్లు స్టూడెంట్స్‌కు సంబంధించిన అవగాహన కార్యక్రమాలు చేస్తుంటారు. ఒక్కో కార్యక్రమానికి స్కూల్ నుంచి కొంత మొత్తం తీసుకుంటారు. కానీ, గవర్నమెంట్, ఇతర కాన్వెంట్ స్కూళ్లకు ఆ అవగాహన కల్పించే వారు తక్కువగా ఉన్నారు. మేము భవిత ప్రోగ్రామ్ ద్వారా ఉచితంగా అవగాహన కార్యక్రమాలు చేస్తున్నాం. ఇటీవల హన్మకొండ జిల్లా వంగరలోని స్కూల్ పిల్లలకు గుడ్‌టచ్ బ్యాడ్ టచ్ పై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాం. ఇందుకు సంబంధించిన సమాచారం ఇప్పుడు చాలామంది దగ్గర ఉన్నప్పటికీ ఈ విషయంపై పిల్లలకు ఎంతవరకు అవగాహన కల్పిస్తున్నారు అనేది తెలియడం లేదు. ఒకసారి చెప్పి వదిలేస్తే ఎలాంటి ప్రయోజనం ఉండదు. ఈ సమస్యకు సంబంధించిన అప్‌డేట్స్ ఎప్పుడూ ఇస్తూ ఉండాలి.



– జయవర్ధని

రక్షించుకోవాలనే ఆలోచన కలగాలి

ఖమ్మంలో నా ఫ్రెండ్ డాక్టర్ ప్రశాంతితో కలిసి నిన్ననే ఒక స్కూల్ విద్యార్థులను కలిశాం. టీచర్‌గా, చైల్డ్ సైకాలజిస్ట్‌గా పిల్లలను ధైర్యవంతులను ఎలా చేయాలి అనే అంశాలపై చర్చించుకుంటూ ఉంటాం. పిల్లల మీద దాడులు జరిగినప్పుడు పెద్దలు ఆ విషయాలను బయటకు రానివ్వరు. ఎప్పుడో ఒకటో రెండో సంఘటనలు బయటకు వస్తాయి. ఈ కారణంగా చిన్నవయసులోనే పిల్లలు గర్భవతులు అవడం, ఆసుపత్రుల పాలవడం కూడా చూశాం. మేం చేసే ఈ కార్యక్రమం ద్వారా సమస్యను కొంతవరకైనా తగ్గించగలుగుతాం అనే ఆలోచనతో మొదలుపెట్టాం. కరోనాకు ముందు స్కూల్, కాలేజీలలో దాదాపు పదివేల మంది పిల్లలకు గుడ్ టచ్-బ్యాడ్ టచ్ గురించి వివరించాం. ఇది పిల్లలున్న ప్రతి ఇంట్లో అవసరమైన టాపిక్. ఒక కథ లాగా చెప్పడం, తాము ఎవరి సమక్షంలో అయినా ఉన్నప్పుడు సురక్షితంగా అనిపించకపోతే గట్టిగా అరవడం, కొరకడం, నెట్టేయడం.. వంటివి చేయడం గురించి చెప్పాం. కరోనా టైమ్‌లో చాలా మంది పిల్లలు ఈ విధానం వల్ల రక్షింపబడ్డారని వారి పేరెంట్స్ వచ్చి చెప్పినప్పుడు చాలా ఆనందం అనిపించింది. అనాథాశ్రమాల్లోనూ ఈ కార్యక్రమాన్ని చేపడుతుంటాం. తమని తాము ఎలా రక్షించుకోవాలనే ఆలోచనను పిల్లల్లో కలిగించడానికి వీలైనన్ని కాన్సెప్ట్స్ ఇస్తుంటాం. అభయ భవిత కార్యక్రమం ద్వారా వీలైనంత మందిమి గ్రూప్‌గా అవుతున్నాం. స్లమ్స్, ఇండ్లలోని వారిని కూడా కలుస్తున్నాం. తమ తమ ప్రాంతాల్లోనే ఉంటూ ఎవరైనా ఆడపిల్లల రక్షణ కోసం అవగాహన కల్పించవచ్చు.



– ఏలూరి మమత

పిల్లల మానసిక స్థితిని అర్థం చేసుకోవాలి

పోక్సో అండ్ పోష్ రెండూ సర్టిఫికేషన్ చేశాను. వీటిలో శిక్షణ తీసుకున్నాను. పిల్లలపై జరిగే అకృత్యాలు, దాడులకు సంబంధించిన చట్టాలు, ఎలా నియంత్రించవచ్చు... అనే దానిపై వర్క్ చేస్తుంటాను. మా ఫ్రెండ్ ఎన్జీవో నుంచి వాలంటీర్‌గా పిల్లలకు స్వీయ రక్షణ కార్యక్రమాలు చేశాం. ఇప్పుడు గవర్నమెంట్ స్కూల్ ప్రిన్సిపల్స్‌ను కలిసి, పిల్లలకు శిక్షణ తీసుకుంటూ ఉంటాను. ఇటీవల గోల్కొండ ప్రాంతంలోని గవర్నమెంట్ స్కూల్‌కి వెళ్లినప్పుడు 9వ తరగతి చదువుతున్న ఒక అమ్మాయి గురించి తెలిసింది. ఆ అమ్మాయి మొదట్లో చాలా చురుకుగా ఉండేది. ఇప్పుడు మానసికంగా చాలా దెబ్బతింది. తనతో మాట్లాడితే హాస్టల్‌లో లైంగిక వేధింపులకు గురైన విషయం తెలిసింది. ఎప్పుడూ ముభావంగా ఉండటం, సరిగా చదవకపోవడం, చిరాకు పడటం.. వంటివన్నీ ఉన్నాయి. లైంగిక వేధింపుల కారణంగా మానసికంగా దెబ్బతిన్న పిల్లలను చూస్తుంటే చాలా బాధ కలుగుతుంది.



– శైలజ యడవల్లి

ఎదుర్కోవడానికి సిద్ధం చేయాలి

మేం ఉంటున్న ఉప్పల్ ప్రాంతంలోనే ఉన్న కాన్వెంట్ స్కూల్‌కి వెళ్లి అక్కడి ప్రిన్సిపల్ అనుమతితో స్కూల్ అమ్మాయిలతో కలిసి, మాట్లాడాను. పిల్లల చేతనే గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి చిన్న చిన్న స్కిట్స్ చేయించాను. తోటి పిల్లల్లో ఎవరైనా ఎవ్వరితోనూ మాట్లాడకుండా, ముభావంగా ఉంటూ, సరిగ్గా చదవకుండా ఉన్నట్టు గమనిస్తే సమస్యను తెలుసుకుని టీచర్లకు తెలియజేయండి అని వివరించాను. పిల్లలు బాగా స్పందించారు. రెండు గంటలపాటు చేసిన ఈ కార్యక్రమంలో పిల్లలు ఆత్మరక్షణతో ప్రతిరోజూ ఎలా ఉండాలో, ఏదైనా చెడు సంఘటన జరుగబోతోందని అర్థమయిన వెంటనే ఎలా ఎదుర్కోవాలో వివరించాను. పదవతరగతి లోపు పిల్లలందరికీ ఎలాంటి చెడు సంఘటన ఎదురు కాకుండా ఉంటే ఆ తర్వాత వాటిని ఎలా ఎదుర్కోవాలో అర్థం చేసుకోగలరు. లేదంటే, వారి భవిష్యత్తుకు ప్రమాదం అవుతుంది. ఈ విషయం గుర్తించి అవగాహన కల్పిస్తున్నాను.



– లక్ష్మి

విమెన్స్ డే స్పెషల్

పర్పుల్ కలర్ ఎందుకు?

ఉమెన్స్ డే సందర్భంగా కనిపించే పోస్టర్లు, ప్రచార సందేశాలకు పర్పుల్ కలర్‌ను ఉపయోగిస్తారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి ఈ పర్పుల్ కలర్‌కి సంబంధం ఏమిటి? ఆ విశేషాలు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా లోగోలు, పోస్టర్లు, ప్రచార చిత్రాల్లో పర్పుల్ కలర్ కనిపిస్తుంది. గూగుల్ కూడా తన లోగోలో ఈ రంగే వాడుతుంది. ర్యాలీల్లో మహిళలు ఈ రంగు దుస్తులు ధరిస్తారు. దీనికి కారణం ఏమిటి? పర్పుల్ రంగు హుందాతనానికి గుర్తు. దీనిని దర్పానికి, సృజనాత్మకతకి, ఆధ్యాత్మికతకు సంకేతంగా ఉపయోగిస్తారు. ఒకప్పుడు అమెరికాలో మహిళలు ఓటు హక్కు కోసం ఉద్యమించినప్పుడు తెలుపు, ఆకుపచ్చ, పర్పుల్ రంగులను ఉద్యమంలో ఉపయోగించారు. తెలుపు స్వచ్ఛతకు, ఆకుపచ్చ ఆశకు, పర్పుల్ హుందాతనానికి చిహ్నంగా వ్యాఖ్యానించారు. అప్పటి నుంచి పర్పుల్ స్త్రీల ఉద్యమ రంగు అయ్యింది. ఆ రోజుల్లో పర్పుల్ రంగును 'డై' చేయాలంటే ఖర్చుగా ఉండేది. కులీన వంశస్థుల స్త్రీలే పర్పుల్ రంగు గౌన్లు ధరించేవారు. 'స్త్రీల అమూల్యతను' తెలపడానికి పర్పుల్ ఆ విధంగా చిహ్నమైంది. మరో విషయం ఏమిటంటే పింక్, బ్లూ కలర్స్ కలిపితే పర్పుల్ అవుతుంది. పింక్ కలర్ స్త్రీత్వానికి గుర్తు అయితే బ్లూ పురుష సామర్థ్యానికి చిహ్నం. స్త్రీ పురుషులు సమానం అని చెప్పడానికి పర్పుల్ కచ్చిత నిర్వచనంగా నిలుస్తుంది. మార్చి 8న అంతర్జాతీయ దినోత్సవాన్ని పర్పుల్ కలర్‌తో సెలబ్రేట్ చేసుకోవాలి. ఆఫీసుల్లో హెచ్ఆర్‌లో ఈ కలర్ రిబ్బన్స్ అలంకరించడం ద్వారా మహిళా ఉద్యోగుల పట్ల వారి ఆకాంక్షల పట్ల సంఘీభావం తెలపాలి.



వారి చెమట చుక్కలే కుట్టుకోలతలు



మహిళలకు ఉపాధి దానివల్ల వారికి ఆర్థిక స్వావలంబన సమాజంలో లైంగిక వివక్షను చెరపగలదు. కాని స్త్రీ, పురుషులకు ఉపాధి కల్పించడంలో వివక్ష కొనసాగుతూనే ఉంది. తమ జీతభత్యాల బేరసారాల్లో స్త్రీల గొంతు బలపడుతున్నా వారు పొందుతున్నది తక్కువే. ఇక పనిచోట వారి శ్రమదోపిడి తీవ్రం. తమిళనాడులో విస్తారంగా ఉన్న రెడిమేడ్ దుస్తుల రంగంలో స్త్రీల పని పరిస్థితులు ఒక నమూనా. శ్రమ తప్ప ఆదాయం లేని ఉపాధి స్త్రీలకు కొనసాగాల్సిందేనా?

స్త్రీలు ఉపాధి పొందాలంటే అంత సులభమా? చెంగల్పట్టులో ఉన్న అనేక ఎక్స్‌పోర్ట్ గార్మెంట్స్ మాన్యుఫ్యాక్చర్ కంపెనీల్లో ఆ చుట్టుపక్కల పల్లెల్లోని స్త్రీలు వేలాదిగా పని చేస్తారు. వారంతా ఉదయం నాలుగున్నరకే లేచి ఇంట్లో వంట చేసి పిల్లలకు క్యారేజీలు కట్టి తాము టిఫిన్, లంచ్ కట్టుకుని ఏడూ ఏడున్నరకంతా కంపెనీ బస్సు కోసం నిలుచోవాలి. 9 గంటలకు ఫ్యాక్టరీలో డ్యూటీ ఎక్కితే తిరిగి సాయంత్రం 6 గంటల వరకూ నిలుచునే పని చేయాలి. మళ్లీ బస్సెక్కి ఇల్లు చేరి రాత్రి వంటకు పూనుకోవాలి. ఇంతా చేసి వారికి నెలకు దక్కేది ఎంతో తెలుసా? 9,500 రూపాయలు. సీనియర్లకైతే 10,500 రూపాయలు. ట్రాన్స్‌పోర్ట్ కటింగు, ఫ్యాక్టరీలో ఇచ్చిన టీ, బిస్కెట్ల కటింగు పోను వచ్చే జీతం ఇంతే. కాని వీరు తయారు చేసిన బట్టలు పోలో, ఇండియన్ టెర్రైన్ వంటి బ్రాండ్లుగా యూరప్, జపాన్, కెనడా, అమెరికాల్లో ఖరీదైన వెలకు అమ్ముడుపోతాయి.

తమిళనాడులో గార్మెంట్ ఫ్యాక్టరీల్లో 5 లక్షల మంది స్త్రీలు పని చేస్తున్నారు. మొత్తం ఆ రాష్ట్రంలో 18 లక్షల మంది టైలరింగ్ ఉపాధిలో ఉంటే వారిలో 60 శాతం మంది మహిళలు. తమిళనాడులో వ్యవసాయం తగ్గాక రైతు కూలీలుగా పని చేసే స్త్రీలు ఫ్యాక్టరీల వైపు అడుగులు వేస్తున్నారు. కాని వారి శ్రమను దోచుకునే సమస్త ఏర్పాట్లు ఇదివరకే జరిగిపోయి ఉన్నాయి. అందుకే ఇటీవల చెన్నైలో ఈ ఫ్యాక్టరీలలో పని చేసే స్త్రీలు నిరసన వ్యక్తం చేశారు. కోర్టులు కూడా వీరి జీతం పెంచమని చెప్పినా తమిళనాడులోని 500 మంది గార్మెంట్ ఫ్యాక్టరీల యజమానులు జీతాలు పెంచితే ఖర్చు పెరిగి ఆర్డర్లు తగ్గుతాయని, దుస్తుల కంపెనీలు ఆర్డర్లను శ్రీలంక, బంగ్లాదేశ్, పాకిస్తాన్ వంటి దేశాలకు చీప్ కూలీల కోసం తరలిస్తాయని అభ్యంతరం చెబుతున్నారు. అయితే ఆ మాటలన్నీ సాకులే అని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. కొత్త జీతాలైనా ఎంతని? 15,000 మాత్రమే. ఆ 15 వేలు కూడా ఇవ్వం అంటున్నారు.

స్త్రీలు ఉపాధి పొందితే ఆ ఆర్థిక స్వావలంబనతో వారిలో ఆత్మవిశ్వాసం కలుగుతుంది. కుటుంబ అవసరాలు, పిల్లల చదువులు వారి అభిలాషల మేరకు నెరవేర్చుకోవచ్చు. భర్తమీద ఆధారపడవలసిన పని లేకుండా నిర్ణయాలు తీసుకోవచ్చు. కాని వారికి లభిస్తున్న ఉపాధి వారికి ఏ ఆదాయమూ మిగల్చనిది అయితే ఆ శ్రమకు అర్థం లేదు.

జీతాలు ఎప్పుడూ పురుషుల కోసమే అనే మైండ్‌సెట్ సమాజంలో పోలేదు. స్త్రీల జీతం కోసం పెంపునకు యోగ్యమైనదే అని గ్రహించినప్పుడే పరిస్థితిలో కొద్దిగానైనా మార్పు వస్తుంది.

యూత్ పల్స్

బిగ్ టాక్

కమ్మని కాఫీలాంటి కబుర్లు

**కబుర్లు అంటే...
ఏ సినిమా చూశావు?
ఓటీటీలో ఆ షో నచ్చిందా?
ఆ గాసిప్ గురించి విన్నావా?
ఇన్‌స్టాగ్రామ్‌లో నా లేటెస్ట్ ఇమేజ్‌లు చూశావా?... ఇలాంటి కబుర్లేనా?
యువతరం తాజా ధోరణి 'కానే కాదు' అంటుంది.
'స్మాల్ టాక్' కంటే
'బిగ్ టాక్'కు ప్రాధాన్యత ఇస్తోంది...**



యువతరంలో నలుగురు ఒక దగ్గర కూడితే ఏం జరుగుతుంది? సరదా సరదా మాటలు, జోక్స్, సినిమా కబుర్లు, సోషల్ మీడియా సంగతులూ వినిపిస్తాయి. అయితే యువతరంలో కాలక్షేపం కబుర్లు కాకుండా కాస్త సీరియస్ విషయాల గురించి చర్చించే ధోరణి పెరుగుతోంది. ఈ సరికొత్త ధోరణిని 'బిగ్ టాక్' ట్రెండ్ అంటున్నారు.

'బిగ్ టాక్' అనేది 'టాప్ ట్రెండ్స్ ఫర్ 2024' ఒకటిగా నిలిచింది. ఇది'స్మాల్ టాక్'కు అపోజిట్ ట్రెండ్. 'స్మాల్ టాక్' అంటే కాలక్షేపం కబుర్లలాంటివి.

'బిగ్ టాక్ ట్రెండ్ గురించి విన్నప్పుడు ఆసక్తిగా అనిపించింది. డిగ్రీ ఫ్రెండ్స్‌లో కొందరం వారానికి ఒకసారి కలుసుకొని కబుర్లు చెప్పుకుంటాం. ఎప్పుడూ కాలక్షేప కబుర్లేనా? సీరియస్ టాపిక్స్‌పై కూడా మాట్లాడుకుందాం అనే ప్రపోజ్‌కు వెంటనే కాకపోయినా కాస్త లేటుగా అయినా ఫ్రెండ్స్ ఒకే అన్నారు. అయితే బిగ్ టాక్ అనేది అంత తేలిక కాదు. ఎప్పుడూ సరదాగా మాట్లాడే ఫ్రెండ్స్‌తో ఉన్నట్టుంటి పర్యావరణ విషయాలు, రాజకీయ పరిణామాలు... మొదలైన విషయాల గురించి మాట్లాడడం అంతా ఈజీ కాదు. వినే వాళ్లు లెక్చర్ విన్నట్టుగా ఫీలవుతారు. ఎన్ని అడ్డంకులు ఉన్నా ఒకసారి ట్రై చేసి చూద్దాం అని మొదలు పెట్టాం. వారం వారం ఒక్కొక్కరు ఒక్కో టాపిక్‌పై మాట్లాడాలని నిర్ణయించుకున్నాం' అంటుంది ముంబైకి చెందిన ప్రణతి.

ఇక యువ ఉద్యోగుల విషయానికి వస్తే...'బిగ్ టాక్'లో భాగంగా ప్రొఫెషనల్‌గా, పర్సనల్‌గా ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాల గురించి మాట్లాడుకుంటున్నారు.

'నా కొలీగ్ చిన్న విషయాలకు భయపడుతుంటాడు. ఏఐ టెక్నాలజీ వల్ల మన ఉద్యోగాలు ఉండవేమో అన్నట్లుగా మాట్లాడేవాడు. దీన్ని దృష్టిలో పెట్టుకొని మనం బిగ్ టాక్‌లో కూర్చుందాం అన్నాను. అతడికి ఏమీ అర్థం కాలేదు. ఒక ఆదివారం కేఫ్ కాఫీ కార్నర్‌లో బిగ్ టాక్ కోసం కూర్చున్నాం' అంటున్నాడు నాగ్‌పూర్‌కు చెందిన నిఖిల్ మిత్ర.

బిగ్ టాక్‌లో భాగంగా...

జాబ్ మార్కెట్‌పై ఏఐ చూపించే ప్రభావం?
ప్రపంచవ్యాప్తంగా ఫుల్-టైమ్ జాబ్స్‌పై 'చాట్‌జీపీటీ'లాంటి జెనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ సిస్టమ్ చూపించే ప్రభావం, మోస్ట్ హైలీ క్వాలిఫైడ్ వర్కర్స్ ఎలాంటి అడ్జెస్ట్‌మెంట్స్‌కు ప్రిపేర్ కావాల్సి ఉంటుంది, సీనియర్‌లతో పోల్చితే జెన్ జెడ్ ఏఐ గురించి ఎందుకు ఎక్కువగా భయపడుతున్నారు? ఏఐని ఫేస్ చేయడానికి ఎలా సన్నద్ధం కావాలి?... మొదలైన ఎన్నో టాపిక్‌లపై కొలీగ్‌తో మాట్లాడాడు నిఖిల్ మిత్ర. మిత్రుడిలోని అకారణ భయాలను దూరం చేయడంలో సక్సెస్ అయ్యాడు.

'బిగ్ టాక్' అయినంత మాత్రాన సమావేశం మొత్తం ముఖం సీరియస్‌గా పెట్టుకొని, అత్యంత గంభీరంగా మాట్లాడాలని కాదు. కాలహరణ కబుర్లకు తక్కువ ప్రాముఖ్యం ఇచ్చి, మనకు ఉపయోగపడే విషయాలకు ప్రాధాన్యత ఇవ్వడమే 'బిగ్ టాక్' ట్రెండ్ సారాశం.

పారదర్శక సంభాషణ

స్నేహానికి సంభాషణే ప్రధాన ద్వారం. యంగ్ ప్రొఫెషనల్స్‌కు కొలీగ్స్‌తో ఉండే స్నేహం ఆఫీస్ టైమింగ్స్ వరకు మాత్రమే పరిమితమా? గత జెనరేషన్ ఉద్యోగులలో చాలామంది పాటించిన సెల్ఫ్-సెన్సర్ విధానం వీరిలోనూ ఉందా? అనే ప్రశ్నలకు 'లేదు' అనే సమాధానం వినిపిస్తుంది.

ముఖ్యమైనవి అనుకునే అంశాలపై మాట్లాడడానికి, తమ అభిప్రాయాన్ని వినిపించడానికి యంగ్ ప్రొఫెషనల్స్‌లో ఎలాంటి సంకోచాలు లేవు. ఎడోబ్ సర్వే ప్రకారం సెన్సిటివ్ టాపిక్స్ గురించి కొలీగ్స్‌తో మాట్లాడటాన్ని సౌకర్యంగా ఫీలవుతున్నారు.

కిచెన్ టిప్స్



● చేపలూ, ఉల్లిపాయ, వెల్లుల్లి.. వంటివి తరిగినప్పుడు వాటి వాసన చేతులకు అంటుకుంటుంది. అప్పుడు టీపొడిని కొద్దిగా రాసుకుని ఐదు నిమిషాలయ్యాక సబ్బుతో కడిగేస్తే చాలు.
● కాయగూరలు తరిగే చెక్కని నిమ్మచెక్కతో రుద్ది కాసేపయ్యాక కడిగేయండి. మరకలు పోతాయి. ఎప్పుడైనా దానిపై మాంసం కోసినా.. నిమ్మచెక్కతో రుద్దితే క్రిములు వృద్ధి చెందకుండా ఉంటాయి
● నిమ్మచెక్కలని సన్నగా తరిగి కాసిని నీళ్లలో వేసి ఆ పాత్రని మైక్రో ఓవెన్‌లో కొన్ని నిమిషాలు ఉంచి తీసేయండి. అలా చేస్తే దుర్వాసనలు తొలగిపోవడంతో పాటూ లోపల పడి ఉన్న పదార్థాలని శుభ్రం చేయడం కూడా తేలికవుతుంది.
● ఫ్రిజ్‌లో ఓ మూలగా నిమ్మచెక్కని పెట్టి చూడండి. అందులోంచి వచ్చే దుర్వాసనలు పోతాయి.
● స్టీలు కుళాయిలపై నీటిమరకలు పడుతుంటాయి. అవి తెల్లగా మారాలంటే వాటిని నిమ్మచెక్కతో రుద్ది కడిగితే చాలు.



● వేపుడు కూరలనగానే నూనె గుర్తొచ్చి భయం వేస్తుంది. కానీ ఇలా చేస్తే నూనె తక్కువగా రుచికరమైన వేపుడు కూరలను ఆస్వాదించవచ్చు. ● బెండకాయ వేపుడులో నూనె తగ్గిస్తే జిగురు అడుగున నల్లగా పట్టేస్తుంటుంది. కాబట్టి అడుగు పట్టకుండా వేగడానికి నూనె ఎక్కువ వేయాల్సి వస్తుంది. బెండకాయ ముక్కల్లో ఒక స్పూన్ పెరుగు లేదా మజ్జిగ లేదా పాలు వేస్తే జిగురు విరిగిపోయి ముక్కలు అతుక్కోకుండా విడివిడిగా ఉంటాయి, తక్కువ నూనెతో చక్కగా వేగుతాయి.
● దొండకాయ వేపుడు చేసేటప్పుడు ధనియాల పొడి వేస్తే నూనె ఎక్కువ వేయాల్సిన పని ఉండదు.





మెయిన్ 'డ్రా'కు గెలుపు దూరంలో...

ఇండియన్ వెల్స్ మాస్టర్స్ సిరీస్-1000 టెన్నిస్ టోర్నీలో భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ మెయిన్ 'డ్రా'కు విజయం దూరంలో నిలిచాడు. కాలిఫోర్నియాలో జరుగుతున్న ఈ టోర్నీలో క్వాలిఫయింగ్ తొలి రౌండ్ మ్యాచ్‌లో ప్రపంచ 101వ ర్యాంకర్ సుమిత్ 6-2, 6-2తో ప్రపంచ 580వ ర్యాంకర్ స్టెఫాన్ డొస్టానిక్ (అమెరికా)పై గెలిచాడు. 70 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సుమిత్ ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశాడు. క్వాలిఫయింగ్ రెండో రౌండ్‌లో కొరియా ప్లేయర్ సియోంగ్‌చన్ హాంగ్‌తో సుమిత్ తలపడతాడు.

నాలుగో బాక్సర్ కూడా తొలి రౌండ్‌లోనే...

పారిస్ ఒలింపిక్స్ బాక్సింగ్ వరల్డ్ క్వాలిఫయింగ్ టోర్నీలో భారత బాక్సర్ల పేలవ ప్రదర్శన కొనసాగుతోంది. ఇప్పటికే దీపక్, నరేందర్, జాస్మిన్ తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టగా... తాజాగా వీరి సరసన మరో భారత బాక్సర్ లక్ష్య చహర్ కూడా చేరాడు. ఇటలీలో జరుగుతున్న ఈ టోర్నీలో పురుషుల 80 కేజీల విభాగం తొలి రౌండ్ బౌట్‌లో ఇరాన్ బాక్సర్ గెప్‌లగి మేసమ్ భారత జాతీయ చాంపియన్ లక్ష్య చహర్‌ను నాకౌట్ చేశాడు.



ప్రిక్వార్టర్స్‌లో గాయత్రి జోడీ



పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల డబుల్స్ విభాగంలో పుల్లెల గాయత్రి-ట్రిసా జాలీ (భారత్) జోడీ ప్రిక్వార్టర్ ఫైనల్ చేరుకుంది. మంగళవారం జరిగిన తొలి రౌండ్‌లో గాయత్రి-ట్రిసా ద్వయం 16-21, 21-19, 21-17తో భారత్‌కే చెందిన అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో జంటను ఓడించింది. పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) ద్వయం శుభారంభం చేసింది. తొలి రౌండ్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ 21-13, 24-22తో ఒంగ్ యె సిన్-తియో ఈ యి (మలేసియా) జంటపై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో లక్ష్య సేన్ (భారత్) 15-21, 21-15, 21-3తో కాంటా సునెయామా (జపాన్)పై నెగ్గగా... ప్రియాన్షు రజావత్ (భారత్) 8-21, 15-21తో ప్రపంచ నంబర్‌వన్ అక్సెల్‌సన్ (డెన్మార్క్) చేతిలో ఓడిపోయాడు.

షహబాజ్ నదీమ్ వీడ్కోలు



కోల్‌కతా: భారత్ తరఫున రెండు టెస్టులు ఆడిన జార్ఖండ్ లెఫ్టార్మ్ స్పిన్నర్ షహబాజ్ నదీమ్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. 34 ఏళ్ల నదీమ్ 2019లో దక్షిణాఫ్రికాపై రాంచీలో తొలి టెస్టు... 2021లో ఇంగ్లండ్‌పై చెన్నైలో రెండో టెస్టు ఆడి ఎనిమిది వికెట్లు తీశాడు. 'భవిష్యత్‌లో భారత జట్టుకు ఆడే అవకాశాల్లేవని తెలుసుకున్నాను. ఈ నేపథ్యంలో భారత క్రికెట్ నుంచి వీడ్కోలు తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నాను. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న టి20 ఫ్రాంచైజీ లీగ్‌లో నా అదృష్టాన్ని పరీక్షించుకుంటాను' అని షహబాజ్ తెలిపాడు. దేశవాళీ క్రికెట్‌లో బిహార్, జార్ఖండ్ జట్లకు ప్రాతినిధ్యం వహించిన షహబాజ్ ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 542 వికెట్లు, లిస్ట్-ఎ క్రికెట్‌లో 175 వికెట్లు, టి20ల్లో 125 వికెట్లు పడగొట్టాడు. ఐపీఎల్‌లో ఢిల్లీ డేర్‌డెవిల్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, లక్నో సూపర్ జెయింట్స్ జట్ల తరఫున బరిలోకి దిగాడు.

'వంద'కు అటు ఇటు...

100వ టెస్టు ఆడనున్న అశ్విన్, బెయిర్‌స్టో

రేపటి నుంచి ధర్మశాలలో భారత్, ఇంగ్లండ్ ఐదో టెస్టు



ధర్మశాల: టి20ల మెరుపులతో సంప్రదాయ టెస్టు సిరీస్‌లే కుదించబడుతున్నాయి. 3, 5 టెస్టుల సిరీస్ నుంచి 2, 3 టెస్టుల సిరీస్ లేదంటే అనామక జట్లయితే మొక్కుబడిగా ఏకైక టెస్టుతో ఐదు రోజుల ఆటను కానిచ్చేస్తున్నారు. మరోవైపు ఆటగాళ్లు కూడా ధనాధన్ ఆట మాయలో అసలైన ఫార్మాట్‌కు మంగళం పాడి లీగ్, పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లతోనే కెరీర్‌ను కొనసాగిస్తున్నారు. ఇలాంటి తరుణంలో ఒక క్రికెటర్ 100వ టెస్టు ఆడటం ఆ ఆటగాడికే కాదు... ఇప్పుడు టెస్టు ఫార్మాట్‌కే మైలురాయిగా మారిందనడంలో అతిశయోక్తి లేదు. మరి ప్రత్యర్థి జట్ల నుంచి చెరొకరు 100వ టెస్టు ఆడటమైతే అనూహ్యం! ఆతిథ్య భారత్ నుంచి దిగ్గజ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్, ఇంగ్లండ్ బృందం నుంచి బెయిర్‌స్టోలకు రేపటి నుంచి ఇరు జట్ల మధ్య ధర్మశాలలో జరిగే ఐదో టెస్టు చిరస్మరణీయం కానుంది. ఈ ఇద్దరు 99 మ్యాచ్‌లాడి టెస్టు క్రికెట్‌కు అభి'వంద'నం పలుకేందుకు సిద్ధమయ్యారు.

14వ భారత క్రికెటర్‌గా...

భారత క్రికెట్‌లోనే విజయవంతమైన సారథులుగా వెలుగొందిన అజహరుద్దీన్ (99), ధోని (90)లు కూడా 100 టెస్టులు ఆడలేకపోయారు. జహీర్ ఖాన్ (92) సైతం 'వంద' భాగ్యానికి నోచుకోలేకపోయాడు. కొందరికే సాధ్యమైన ఈ మైలురాయిని అందుకోవడానికి అశ్విన్ సిద్ధమయ్యాడు. ఇటీవలే 500 వికెట్ల క్లబ్‌లో చేరిన అశ్విన్... కుంబ్లే తర్వాత ఈ మైలురాయి అందుకున్న రెండో భారత బౌలర్‌గా రికార్డుల్లోకెక్కాడు. 2011లో వెస్టిండీస్‌పై ఢిల్లీ టెస్టులో అరంగేట్రం చేసిన అశ్విన్ 13 ఏళ్ల కెరీర్‌లో ఎన్నో ఘనతలు సాధించాడు. టెస్టుల్లో టీమిండియా ఘనవిజయాల్లో భాగమైన అశ్విన్... ధోని సారథ్యంలో తురుపుముక్కగా రాటుదేలాడు. 99 టెస్టులాడి 507 వికెట్లు పడగొట్టాడు. 35 సార్లు ఐదేసి వికెట్లు, 8 సార్లు 10 వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి బ్యాటర్లను తిప్పేశాడు. వందో టెస్టు ఆడుతున్న 14వ భారత ఆటగాడిగా అశ్విన్ ఘనత వహిస్తాడు.

> ఇది అతిపెద్ద సంబరం. ఎందుకంటే నా కెరీర్‌లో ఇది గమ్యాన్ని మించిన పయనం. ఎప్పటికీ ప్రత్యేకం. ఎన్నో ఎత్తుపల్లాల్ని చూశాను. ఎంతో నేర్చుకున్నాను. 2012లో సొంతగడ్డపై ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టు సిరీస్ నా కెరీర్‌కు టర్నింగ్ పాయింట్. నాలుగు టెస్టుల్లో 52.64 సగటుతో 14 వికెట్ల పేలవ ప్రదర్శనతో విమర్శలెదుర్కొన్నా. కెరీర్ ఆరంభంలోనే పనైపోయిందనుకున్న ప్రతీసారి నన్ను నేను మార్చుకుంటూ సరికొత్త బౌలింగ్ అస్త్రాలతో ఇక్కడిదాకా ప్రయాణించడం గొప్ప అనుభూతిని ఇస్తోంది. -అశ్విన్

> ఇది నాకు భావోద్వేగానికి గురిచేసే మ్యాచ్. ప్రొఫెషనల్ క్రికెటర్ కావాలనే అందరూ కలలు కంటారు. నేనైతే ఆ కలల్ని నిజం చేసుకొని కెరీర్‌లో వందో ఆటకు రెడీ కావడం చాలా గొప్పగా అనిపిస్తుంది. 8 ఏళ్ల వయసులో తండ్రిని కోల్పోయిన నాకు నా తల్లే సర్వస్వం. అందుకే ఈ ఘనత ఆమెకే అంకితం. -బెయిర్‌స్టో

17వ ఇంగ్లండ్ ప్లేయర్ బెయిర్‌స్టో



ఇంగ్లండ్ వికెట్ కీపర్, బ్యాటర్ జానీ బెయిర్‌స్టో గురించి మనవాళ్లకి, ప్రత్యేకించి హైదరాబాద్ వాసులకి బాగా తెలుసు. సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓపెనర్‌గా వార్నర్‌తో కలిసి మెరిపించాడు. టెస్టుల్లో నిలకడైన బ్యాటర్. 2012లో వెస్టిండీస్‌తో అరంగేట్రం చేసిన బెయిర్‌స్టో 99 టెస్టుల్లో 36.42 సగటుతో 5974 పరుగులు చేశాడు. ఇందులో 12 శతకాలు, 26 అర్ధ శతకాలున్నాయి. కీపర్‌గా 242 క్యాచ్‌ల్ని పట్టడంతో పాటు 14 స్టంపౌట్లు చేశాడు. వందోటెస్టు ఆడుతున్న స్టార్ వికెట్ కీపర్ ఈ ఘనతకెక్కనున్న 17వ ఇంగ్లండ్ క్రికెటర్. వన్డేల్లో వందో మ్యాచ్ కూడా ధర్మశాలలోనే ఆడిన బెయిర్‌స్టో ఇప్పుడు అక్కడే మరో 100కు సై అంటున్నాడు.

అర్జున్ ఐదో రౌండ్ గేమ్ 'డ్రా'



న్యూఢిల్లీ: షెన్‌జెన్ లాంగాంగ్ మాస్టర్స్ క్లాసిక్ చెస్ టోర్నమెంట్‌లో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ తొలి 'డ్రా' నమోదు చేసుకున్నాడు. యు యాంగి (చైనా)తో జరిగిన ఐదో రౌండ్ గేమ్‌ను అర్జున్ 25 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించాడు. ఎనిమిది మంది గ్రాండ్‌మాస్టర్ల మధ్య జరుగుతున్న ఈ టోర్నీలో ఐదో రౌండ్ తర్వాత అర్జున్ 3.5 పాయింట్లతో మరో ఇద్దరితో కలిసి ఉమ్మడిగా అగ్రస్థానంలో ఉన్నాడు.

రష్మిక జోడీ శుభారంభం



నాగ్‌పూర్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి శ్రీవల్లి రష్మిక డబుల్స్ విభాగంలో క్వార్టర్ ఫైనల్ చేరింది. మంగళవారం జరిగిన తొలి రౌండ్‌లో రష్మిక-వైదేహి (భారత్) ద్వయం 6-2, 6-1తో సౌజన్య బవిశెట్టి (భారత్)-మె హసెగావా (జపాన్) జంటను ఓడించింది. సింగిల్స్ విభాగంలో హైదరాబాద్‌కే చెందిన సౌజన్య బవిశెట్టి, హుమేరా బహార్మస్ తొలి రౌండ్‌లోనే ఓడిపోయారు.

ఢిల్లీ ధమాకా...

- జెమీమా, మెగ్ లానింగ్ మెరుపులు
- 29 పరుగులతో ఓడిన ముంబై ఇండియన్స్

న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నీ రెండో సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు హవా కొనసాగుతోంది. సొంతగడ్డపై మొదలైన రెండో అంచె పోటీలో ఢిల్లీ గర్జించింది. మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో 29 పరుగుల తేడాతో డిఫెండింగ్ చాంపియన్స్ ముంబై ఇండియన్స్‌ను ఢిల్లీ ఓడించింది. ఈ గెలుపుతో ఢిల్లీ 8 పాయింట్లతో ఒంటరిగా అగ్రస్థానంలోకి దూసుకొచ్చింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన క్యాపిటల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 192 పరుగుల భారీస్కోరు చేసింది. మిడిలార్డర్ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ (33 బంతుల్లో 69 నాటౌట్; 8 ఫోర్లు, 3 సిక్స్‌లు) ధనాధన్ ఇన్నింగ్స్ ఆడింది. కేవలం 27 బంతుల్లోనే ఆమె అర్ధ శతకాన్ని పూర్తిచేసింది. ఓపెనర్, కెప్టెన్ మెగ్ లానింగ్ (38 బంతుల్లో 53; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) కూడా ధాటిగా ఆడింది. లానింగ్‌తో కలిసి ఇన్నింగ్స్ ఆరంభించిన షఫాలీ వర్మ (12 బంతుల్లో 28; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) క్రీజులో కాసేపే ఉన్నా మెరిపించింది. దీంతో ఢిల్లీ పవర్‌ప్లేలో 56/1 స్కోరు చేసింది. డెత్ ఓవర్లలో జెమీమా చెలరేగడంతో భారీస్కోరు సాధ్యమైంది. ముంబై బౌలర్లు షబ్నిమ్, సైకా ఇషాక్ చెరో వికెట్ తీశారు. అనంతరం కష్టసాధ్యమైన లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 163 పరుగులు చేసి ఓడిపోయింది. ఢిల్లీ బౌలర్లు జెస్ జొనాసెన్ (3/21), మరిజాన్ కాప్ (2/37), శిఖా పాండే (1/27), టిటాస్ సాధు (1/23) ముంబైను కట్టడి చేశారు. ఒకదశలో ముంబై 68/5 స్కోరు వద్ద సగం వికెట్లను కోల్పోయింది. టాపార్డర్‌లో హేలీ మాథ్యూస్ (17 బంతుల్లో 29; 6 ఫోర్లు) మినహా ఆ తర్వాత వరుసగా యస్తిక భాటియా (6), నట్ సీవర్ (5), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (6) నిరాశపరిచారు. లోయర్ ఆర్డర్‌లో అమన్‌జోత్ (27 బంతుల్లో 42; 7 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచింది. నేడు జరిగే మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్‌తో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు తలపడుతుంది.


జెమీమా

విజయం దిశగా విదర్భ

నాగ్‌పూర్: మధ్యప్రదేశ్‌తో జరుగుతున్న రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీ రెండో సెమీఫైనల్లో రెండుసార్లు చాంపియన్ విదర్భ విజయం దిశగా సాగుతోంది. విదర్భ నిర్దేశించిన 321 పరుగుల విజయలక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన మధ్యప్రదేశ్... నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 71 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 228 పరుగులు చేసింది. గెలుపు దక్కాలంటే మధ్యప్రదేశ్ మరో 93 పరుగులు చేయాల్సి ఉండగా... నాలుగు వికెట్లు పడగొడితే విదర్భ మూడోసారి ఫైనల్ బెర్త్ లభిస్తుంది. ప్రస్తుతం సారాంశ్ జైన్ (16 బ్యాటింగ్), కుమార్ కార్తికేయ (0 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. యశ్ దూబే (94; 10 ఫోర్లు), హర్ష్ గావ్లి (67; 11 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేశారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 343/6తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన విదర్భ 402 పరుగులకు ఆలౌటైంది. యశ్ రాథోడ్ (141; 18 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మధ్యప్రదేశ్ బౌలర్లలో అనుభవ్ అగర్వాల్ ఐదు వికెట్లు తీసుకున్నాడు.


యశ్ రాథోడ్

సినిమా

ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు - గోపీచంద్



''భీమా' పక్కా కమర్షియల్ ప్యాక్డ్ మూవీ. నేను చేసిన భీమా పాత్రలో చాలా ఇంటెన్సిటీ ఉంటుంది. ప్రేమ, ఎమోషన్స్, రొమాన్స్.. ఇలా అన్ని అంశాలున్నాయి. ఈ కథలో సెమీ ఫ్యాంటసీ ఎలిమెంట్‌ని హర్ష అద్భుతంగా చూపించాడు. ప్రతి యాక్షన్ సీక్వెన్స్‌లో అద్భుతమైన భావోద్వేగం ఉంటుంది. సినిమా చూసి బయటికి వచ్చాక ప్రేక్షకుల మనసులో భీమా నిలిచిపోతాడనే నమ్మకం ఉంది'' అని హీరో గోపీచంద్ అన్నారు. ఎ. హర్ష దర్శకత్వంలో గోపీచంద్ హీరోగా, ప్రియా భవానీ శంకర్, మాళవికా శర్మ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'భీమా'. కేకే రాధామోహన్ నిర్మించిన ఈ చిత్రం ఈ 8న విడుదలవుతోంది. ఈ సందర్భంగా గోపీచంద్ పంచుకున్న విశేషాలు.

- 'భీమా' సహనిర్మాత శ్రీధర్‌గారు కోవిడ్ సమయంలో దర్శకుడు హర్షని నాకు పరిచయం చేశారు. అప్పుడో కథ చెప్పాడు హర్ష.. కథ బావుంది కానీ ఆ సమయంలో చేయకూడదని అనిపించింది. పోలీస్ నేపథ్యంలో ఏదైనా వైవిధ్యమైన కథ ఉంటే చెప్పమన్నాను. ఎనిమిది నెలలు గ్యాప్ తీసుకొన్న హర్ష ఆ తర్వాత వచ్చి 'భీమా' కథ చెప్పాడు. చాలా బాగా నచ్చడంతో ఓకే చెప్పాను.
- నేను గతంలో పోలీసు పాత్రలు చేశాను. 'గోలీమార్'లో డిఫరెంట్ కాప్. 'ఆంధ్రుడు' లవ్ స్టోరీ నేపథ్యంలో నడుస్తుంది కానీ దాని నేపథ్యం పోలీసు కథే. 'శౌర్యం' కూడా భిన్నమైన కథ. ఈ మూడు చిత్రాలకు పూర్తి వైవిధ్యమైన పోలీస్ పాత్రని 'భీమా'లో చేశాను. ఈ పోలీసు కథలో సెమీ ఫ్యాంటసీ ఎలిమెంట్ చాలా కొత్తగా ఉంటుంది.. అదే నాకు చాలా ఆసక్తిని కలిగించింది. హర్ష కన్నడలో చాలా అనుభవం ఉన్న దర్శకుడు. 'భీమా'ని అద్భుతంగా తీశాడు.. స్క్రీన్ ప్లే చాలా ఆసక్తిగా ఉంటుంది.
- 'భీమా' పరశురామ క్షేత్రంలో జరిగే కథ. ట్రైలర్‌లో చూపించినట్లు అఘోరాలు, కలర్ ప్యాలెట్, నేపథ్య సంగీతం వల్ల 'అఖండ' సినిమాతో పోలుస్తున్నారు. కానీ, ఇది పూర్తిగా వైవిధ్యమైన కథ. ఈ సినిమాలో శివుని నేపథ్యం ఉంది. పైగా సినిమా కూడా మహాశివరాత్రికి వస్తోంది. అయితే దీన్ని మేం ముందుగా ప్లాన్ చేయలేదు.. అలా కలిసొచ్చింది. శివుని ఆజ్ఞ అనుకుంటాను.
- నిర్మాత రాధామోహన్, నా కాంబినేషన్‌లో 'పంతం' (2018) సినిమా వచ్చింది. అప్పటి నుంచి ఆయన, నేను చాలా ఫ్రెండ్లీగా ఉంటాం. 'పంతం' వాణిజ్య పరంగా సక్సెస్ అయినా ఎక్కువ మంది ప్రేక్షకులకు చేరువ కాలేదు. కానీ, 'భీమా'తో తప్పకుండా హిట్ సాధిస్తామనే నమ్మకం ఉంది. ఈ సినిమాని చాలా గ్రాండ్‌గా నిర్మించారాయన.
- మా నాన్న (డైరెక్టర్ టి. కృష్ణ)తో పాటు ఆ తరంలోని దర్శకులు జనాలతో మమేకం అయ్యేవారు. అలా ప్రజల సాధక బాధకాలు, సమస్యలు తెలుసుకుని కథ రాసుకుని, సామాజిక బాధ్యతతో సినిమాలు తీసి హిట్ సాధించేవారు. కానీ, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. శంకర్‌గారి లాంటి ఒకరిద్దరు దర్శకులు తప్ప మిగిలిన వారు సమాజం, ప్రజల నేపథ్యంలో కథలు రాయడం లేదు. సొసైటీ బ్యాక్‌డ్రాప్‌ని ఎంచుకుని సరైన విధానంలో తెరపై చూపించగలిగితే ఇప్పటికీ ప్రేక్షకులు బ్రహ్మాండంగా ఆదరిస్తారు. దర్శకత్వం అనేది చాలా కష్టమైన పని.. అందుకే నాకు ఆ ఆలోచన లేదు.
- చిత్ర పరిశ్రమలో దాదాపు 22 ఏళ్ల ప్రయాణం నాది.. ఇన్నేళ్ల జర్నీ హ్యాపీగా ఉంది కానీ నటుడిగా పూర్తిగా సంతృప్తి పడటం లేదు. ఒక నటుడికి సంతృప్తి అనేది ఎప్పటికీ ఉండదు.. ఎప్పటికప్పుడు కొత్తగా చేయాలనే తపన ఉంటుంది. ప్రభాస్, నేను కలిసి సినిమా చేయాలని ఎప్పటినుంచో అనుకుంటున్నాం. కానీ, ఆ చాన్స్ రాలేదు.. వస్తే మాత్రం తప్పకుండా నటిస్తాం. ప్రస్తుతం శ్రీను వైట్లగారి దర్శకత్వంలో నేను చేస్తున్న సినిమా 30 శాతం పూర్తయింది. ఆ తర్వాత బీవీఎస్ఎన్ ప్రసాద్, బాపినీడుగార్లతో ఓ చిత్రం, యూవీ క్రియేషన్స్‌లో ఓ సినిమా చేయాల్సి ఉంది.

రహస్య గూఢచారిగా యుద్ధం


ఎన్టీఆర్

హిందీ చిత్రం 'వార్ 2'లో ఎన్టీఆర్ విలన్‌గా కనిపిస్తారా? అసలు ఆయన పాత్ర ఎలా ఉంటుంది? అనే ప్రశ్నలకు చిన్న క్లూ దొరికింది. ఈ చిత్రంలో ఎన్టీఆర్ భారతదేశానికి చెందిన రహస్య గూఢచారి పాత్రలో కనిపిస్తారని టాక్. ఈ పాత్ర పాజిటివ్‌గా ఉంటుందట. ఇక యశ్‌రాజ్ స్పై యూనివర్స్‌లో భాగంగా రూపొందుతున్న 'వార్ 2' మల్టీస్టారర్ మూవీ అనే విషయం తెలిసిందే. హృతిక్ రోషన్, ఎన్టీఆర్ కాంబినేషన్‌లో అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో ఆదిత్య చోప్రా నిర్మిస్తున్నారు. త్వరలో ఎన్టీఆర్ ఈ చిత్రం షూటింగ్‌లో పాల్గొంటారు. ఇంకో విషయం ఏంటంటే... 'వార్ 2'లో రహస్య గూఢచారిగా యుద్ధం చేసే ఎన్టీఆర్‌తో ఆ తర్వాత ఇదే పాత్రతో ఒక ఫుల్ మూవీ తీయాలని, ఆ తర్వాత వచ్చే ఈ స్పై చిత్రాల్లో కీలక పాత్రల్లో ఎన్టీఆర్‌ని చూపించాలని ఆదిత్య చోప్రా అనుకుంటున్నారట. ఇక 'వార్ 2' వచ్చే ఏడాది ఆగస్టు 14న విడుదల కానుంది.

పెద్ద హీరోలతో సినిమాలు చేయను - చదలవాడ శ్రీనివాసరావు



''గతంలో డైరెక్టర్, ప్రొడ్యూసర్ భార్యాభర్తల్లా ఉండేవారు. ఇప్పుడు డైరెక్టర్, హీరో ఒక్కటై నిర్మాతకి అంత విలువ ఇవ్వట్లేదు. సినిమాల సక్సెస్ రేట్ తగ్గడానికి ఇదే ప్రధాన సమస్య. నేను బ్రతికుండగా పెద్ద హీరోలతో పెద్ద బడ్జెట్ సినిమాలు చేయను. నేనింత ఆరోగ్యంగా ఉండడానికి కారణం పెద్ద బడ్జెట్, పెద్ద హీరోల సినిమాలు చేయకపోవడమే'' అని దర్శక-నిర్మాత చదలవాడ శ్రీనివాసరావు అన్నారు. నిహార్, నాగార్జున, రగ్గా ఇఫ్తాకర్, సత్య కృష్ణ, సంజన కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'రికార్డ్ బ్రేక్'. చదలవాడ శ్రీనివాసరావు దర్శకత్వంలో చదలవాడ పద్మావతి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 8న విడుదల కానుంది. ఈ సందర్భంగా చదలవాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ- ''బిచ్చగాడు'లో తల్లి కోసం కొడుకు కష్టపడతాడు. కానీ, 'రికార్డ్ బ్రేక్'లో బిడ్డల కోసం తల్లి ఏం చేస్తుంది? అన్నది ఆసక్తిగా ఉంటుంది. కథ బాగుంటే ప్రేక్షకులు ఏ సినిమాని అయినా ఆదరిస్తారని మా 'బిచ్చగాడు' నిరూపించింది. అదే నమ్మకంతోనే బడ్జెట్‌కి వెనకాడకుండా 'రికార్డ్ బ్రేక్' తీశాం. యునిక్ కథాంశంతో రూపొందిన ఈ చిత్రాన్ని ఎనిమిది భాషల్లో రిలీజ్ చేస్తున్నాం. గతంలో నాగేశ్వరరావు, శోభన్ బాబు, కృష్ణ గార్లతో సినిమాలు తీశాను. వాళ్లు నాకంటే ముందే షూటింగ్ లొకేషన్‌కి వచ్చేవారు. డైరెక్టర్లు అజయ్ కుమార్, సదాశివరావు, కేఎస్ నాగేశ్వరరావు కూడా మహాను భావులు'' అన్నారు.

ఓహ్... మేడమ్...


'అల్లరి' నరేశ్, ఫరియా


నచ్చిన అమ్మాయి మనసు దోచేయడానికి 'ఓహ్... మేడమ్...' అంటూ పాట అందుకున్నారు 'అల్లరి' నరేశ్. 'ఆ ఒక్కటీ అడక్కు' చిత్రం కోసమే ఈ పాట. 'అల్లరి' నరేశ్, ఫరియా అబ్దుల్లా జంటగా నటిస్తున్న చిత్రం ఇది. మల్లి అంకం దర్శకత్వంలో రాజీవ్ చిలక నిర్మిస్తున్నారు. ఈ చిత్రం కోసం నరేశ్-ఫరియాపై చిత్రీకరించిన తొలి పాట 'ఓహ్.. మేడమ్'ను సంగీతదర్శకుడు ఎస్ఎస్ తమన్ విడుదల చేశారు. గోపీచందర్ స్వరపరచిన ఈ పాటకు భాస్కరభట్ల సాహిత్యం అందించగా, అనురాగ్ కులకర్ణి పాడారు. హీరోయిన్ పట్ల హీరో వ్యక్తపరిచే భావోద్వేగాల నేపథ్యంలో ఈ పాట ఉంటుందని చిత్రబృందం పేర్కొంది. ఈ నెల 22న ఈ చిత్రం రిలీజ్ కానుంది.

ఆ నమ్మకమే ఈ సినిమా చేసేలా చేసింది


ఎస్తేర్

''మాయ' క్రైమ్ స్టోరీ అయినప్పటికీ ఇందులో భావోద్వేగాలు ఉన్నాయి. డైరెక్టర్ రమేశ్ నమ్మకమే నన్నీ సినిమాలో నటించేలా చేసింది'' అని హీరోయిన్ ఎస్తేర్ అన్నారు. కిరణ్ ఆవల, ఎస్తేర్ ప్రధాన పాత్రల్లో రమేష్ నాని దర్శకత్వం వహించిన చిత్రం 'మాయ'. జీరో ప్రొడక్షన్స్ సమర్పణలో రాజేష్ గొరిజవోలు నిర్మించిన ఈ మూవీ ఈ నెల 15న రిలీజవుతోంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకి నటులు 'సత్యం' రాజేశ్, అనుదీప్ చౌదరి అతిథులుగా హాజరయ్యారు. రమేశ్ నాని మాట్లాడుతూ- ''మిస్టీరియస్ థ్రిల్లర్, ఎమోషనల్ డ్రామాగా తెరకెక్కిన ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తున్న బాపిరాజు గారికి థ్యాంక్స్'' అన్నారు. ''మంచి కథ కావడంతో గ్రాండ్‌గా నిర్మించాను'' అన్నారు రాజేశ్.

రిస్క్ అంచున ప్రయాణం చేశాం - విద్యాధర్ కాగిత



''గామి అంటే గమ్యం చేరేవాడు. ఇందులో ప్రధాన పాత్రకు ఒక గమ్యం ఉంటుంది. దాన్ని ఎలా చేరాడనేది ఆసక్తిగా చూపించాం. తర్వాత ఏం జరగబోతుందనే ఆసక్తి ప్రేక్షకుల్లో ఉంటుంది. స్క్రీన్‌ప్లే చాలా గ్రిప్పింగ్‌గా ఉంటుంది'' అన్నారు విద్యాధర్ కాగిత. విశ్వక్ సేన్, చాందినీ చౌదరి జంటగా విద్యాధర్ కాగిత దర్శకత్వం వహించిన చిత్రం 'గామి'. వి సెల్యులాయిడ్ సమర్పణలో కార్తీక్ శబరీష్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 8న విడుదల కానుంది. విద్యాధర్ కాగిత మాట్లాడుతూ- ''ఓ వాస్తవ ఘటనకి ఫిక్షన్ జోడించి 'గామి' కథ రాశాను. క్రౌడ్ ఫండ్ కోసం ఒక వీడియో చేశాం. దాని ద్వారా వచ్చిన డబ్బులతో సినిమా ఆరంభించాం. ఆ తర్వాత కార్తీక్ శబరీష్ బయట నుంచి డబ్బు తీసుకొచ్చారు. మా మూవీ గ్లింప్స్ నచ్చడంతో యూవీ క్రియేషన్స్ వారు భాగస్వామ్యం అయ్యారు. మా సినిమాకి ఐదేళ్లు పట్టింది. విశ్వక్ సేన్‌గారి ధైర్యాన్ని మెచ్చుకోవాలి. యూనిట్ అంతా ఈ సినిమా కోసం రిస్క్ అంచున ప్రయాణం చేశాం'' అన్నారు.

గ్రామంలో థ్రిల్


సత్యరాజ్, రవితేజ నున్నా

రవితేజ నున్నా, నేహా జురెల్ జంటగా సత్యరాజ్ దర్శకత్వం వహించిన చిత్రం 'రాజుగారి అమ్మాయి.. నాయుడుగారి అబ్బాయి'. మణికొండ రంజిత్ సమర్పణలో ముత్యాల రామదాసు, నున్నా కుమారి నిర్మించారు. రామిశెట్టి వెంకట సుబ్బారావు, కలవకొలను సతీష్ సహనిర్మాతలుగా వ్యవహరించిన ఈ సినిమా ఈ నెల 9న విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో సత్యరాజ్, రవితేజ నున్నా మాట్లాడుతూ- ''రాజుగారి అమ్మాయి.. నాయుడుగారి అబ్బాయి' గ్రామీణ నేపథ్యంలో సాగే కథ అయినప్పటికీ ఇదొక క్రైమ్ థ్రిల్లర్. గోదావరి గ్రామీణ నేపథ్యంలో సాగే సినిమాలంటే ప్రేమకథ, ప్రకృతి అందాలు వంటివి ఉంటాయి. అయితే మా సినిమాలో వీటితో పాటు అందమైన ప్రేమకథ, క్రైమ్ ఉంటుంది. ఈ మూవీలో హీరోయిన్ అనుకోకుండా చనిపోతుంది. ఆమెను ఎవరు హత్య చేశారు? అనే పాయింట్‌తో ఎంతో ఇంటెన్స్‌గా ఈ కథ నడుస్తుంది'' అన్నారు.

ఫీల్డ్ ఆఫ్ డ్రీమ్స్ ఫార్మాట్‌లో ఆస్కార్

పదిహేనేళ్ల తర్వాత ఈ ఫార్మాట్ పునరుద్ధరణ



ఆస్కార్ అవార్డు వేడుకలను వీలైనంత ఎక్కువమంది వీక్షకులకు చేరువ చేయాలని ఎప్పటికప్పుడు ప్రయత్నిస్తూ ఉంటుంది ఆస్కార్ అవార్డు కమిటీ. ఇందులో భాగంగా ఈ ఏడాది 'ఫీల్డ్ ఆఫ్ డ్రీమ్స్' ఫార్మాట్‌ను పునరుద్ధరించాలని అనుకుంటోందట. అప్పటి వరకూ జరిగిన అవార్డు వేడుకల్లో ఆస్కార్ గెలుచుకున్న ఐదుగురు స్టార్స్ తాజా వేడుకలో పాల్గొని, విజేతలను ప్రకటించి, అవార్డును ప్రదానం చేయడమే ఈ ఫార్మాట్ ఉద్దేశం. గతంలో (2009) జరిగిన ఆస్కార్ అవార్డు వేడుకలో ఈ విధానాన్ని పాటించారు. 'ఫీల్డ్ ఆఫ్ డ్రీమ్స్' పేరిట అప్పటి అవార్డు వేడుకలో ఈ విధానాన్ని ప్రవేశపెట్టారు. అయితే ఆ తర్వాత జరిగిన వేడుకల్లో ఈ ఫార్మాట్‌ని ఫాలో కాలేదు. పదిహేనేళ్లకు ఈసారి ఈ విధానాన్ని పునరుద్ధరించాలని కమిటీ భావిస్తోందట. మాజీ ఆస్కార్ విజేతలు తాజా విజేతలను ప్రకటించి, అవార్డును ప్రదానం చేయడం అనేది చూడ్డానికి కనువిందుగా ఉందని 2009లో జరిగిన అవార్డు వేడుకలో పలువురు పేర్కొన్నారు. వీక్షకుల నుంచి కూడా మంచి స్పందన వచ్చిందట. కాగా, కరోనా తర్వాత ఆస్కార్ అవార్డు వేడుకల వీక్షకుల సంఖ్య కాస్త తగ్గుముఖం పట్టిందని హాలీవుడ్ అంటోంది. ఈ నేపథ్యంలోనే ఎక్కువ సంఖ్యలో వీక్షకులను రాబట్టడానికి గతంలో సక్సెస్ అయిన ఈ ఫార్మాట్‌ని పునరుద్ధరించాలని కమిటీ భావించిందని హాలీవుడ్ భోగట్టా. అయితే ఈ 'ఫీల్డ్ ఆఫ్ డ్రీమ్స్' నటీనటుల విభాగానికి మాత్రమే వర్తిస్తుంది. ఇక ఈ నెల 10న లాస్ ఏంజిల్స్‌లో (భారత కాలమానం ప్రకారం మార్చి 11) ఆస్కార్ అవార్డుల వేడుక జరగనుంది. మూడేళ్లుగా వ్యాఖ్యాతగా వ్యవహరించిన జిమ్మీ కెమ్మెల్ ఈసారీ ఆ బాధ్యతను నిర్వర్తించనున్నారు. మరి.. వార్తల్లో ఉన్నట్లుగా 'ఫీల్డ్ ఆఫ్ డ్రీమ్స్' ఫార్మాట్‌ని కమిటీ రీ విజిట్ చేసిందా? లేదా అనేది ఆ రోజు తెలిసిపోతుంది.

సాక్షి బిజినెస్
బుధవారం
6-3-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	195	73,677
నిఫ్టీ ▽	49	22,356

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	15,957	▽ 250
డోజోన్స్	38,725	▽ 264
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,649	△ 9
డాక్స్	17,735	△ 20
షాంఘై	3,047	△ 8
నికాయ్	40,098	▽ 12

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	64,598 △ 1,118
బంగారం (99.5 స్వచ్ఛత)	64,339 △ 1,113
వెండి (కేజీ)	72,244 △ 1,467

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	[illegible]	82.50	83.52
£	బ్రిటన్ పౌండ్	[illegible]	104.04	106.61
€	యూరో	[illegible]	88.91	91.27
¥	జపాన్ ఎన్ (100)	[illegible]	54.64	55.88
AUS	ఆస్ట్రేలియా డాలర్	[illegible]	53.02	54.96
S$	సింగపూర్ డాలర్	[illegible]	59.37	64.05
SAR	సౌదీ రియాల్	[illegible]	21.20	22.77
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.67	23.47
¥	చైనా యువాన్	[illegible]	10.39	12.47



ఒకసారి చార్జింగ్‌తో 650 కిలోమీటర్లు

- భారత్‌లో బీవైడీ సీల్ ఎలక్ట్రిక్ సెడాన్
- ఎక్స్‌షోరూం ధర రూ.41–53 లక్షలు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ వాహనాల తయారీలో ఉన్న చైనా దిగ్గజం బీవైడీ.. భారత్‌లో సీల్ ఎలక్ట్రిక్ సెడాన్‌ను మూడు వేరియంట్లలో ఆవిష్కరించింది. ధర రూ.41 లక్షలతో ప్రారంభమై రూ.53 లక్షల వరకు ఉంది. ఒకసారి చార్జింగ్‌తో వేరియంట్‌నుబట్టి ఈ కారు 510–650 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. గంటకు 100 కిలోమీటర్ల వేగాన్ని 3.8 సెకన్లలో అందుకుంటుంది. 15.6 అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, 10.25 అంగుళాల డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, హెడ్–అప్ డిస్‌ప్లే వంటి హంగులు ఉన్నాయి. ప్రపంచంలో తొలిసారిగా సెల్ టు బాడీ, ఇంటెలిజెంట్ టార్క్ అడాప్షన్ కంట్రోల్ సాంకేతికతలతో రూపుదిద్దుకుందని కంపెనీ తెలిపింది. అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్‌ను పొందుపరిచారు. 4.8 మీటర్ల పొడవు ఉంది. పూర్తిగా తయారైన కారును చైనా నుంచి భారత్‌కు దిగుమతి చేస్తారు. ఇప్పటికే బీవైడీ భారత్‌లో ఈవీ6 ఎలక్ట్రిక్ ఎంపీవీ, ఆటో3 ఎలక్ట్రిక్ ఎస్‌యూవీని విక్రయిస్తోంది. రూ.30 లక్షలకుపైగా ఖరీదు చేసే లగ్జరీ ఎలక్ట్రిక్ కార్ల విభాగంలో భారత్‌లో తాము నాయకత్వ స్థానంలో ఉన్నామని బీవైడీ ఇండియా ఎలక్ట్రిక్ ప్యాసింజర్ వెహికల్ బిజినెస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సంజయ్ గోపాలకృష్ణన్ తెలిపారు.

అతిజాగ్రత్తతో వృద్ధికి ఆటంకం

- రెగ్యులేటర్లు మరీ సంప్రదాయకంగా ఉండకూడదు
- కోటక్ మహీంద్రా బ్యాంక్ వ్యవస్థాపకుడు ఉదయ్ కోటక్



న్యూఢిల్లీ: నియంత్రణ సంస్థలు జాగ్రత్త చర్యలు అతిగా అమలు చేస్తే ఆర్థిక వృద్ధికి ఆటంకం కలుగుతుందని కోటక్ మహీంద్రా బ్యాంక్ వ్యవస్థాపకుడు ఉదయ్ కోటక్ వ్యాఖ్యానించారు. రెగ్యులేటర్లు మరీ సంప్రదాయకంగా, అతిజాగ్రత్తగా వ్యవహరించకూడదన్నారు. అయితే, ఏ రంగంలోనైనా 'ప్రమాదాలు' చోటు చేసుకుంటే సత్వరం స్పందించే విధంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. నేషనల్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ అథారిటీ (ఎన్‌ఎఫ్‌ఆర్‌ఏ) ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా కోటక్ ఈ విషయాలు తెలిపారు. 'భారత్ భవిష్యత్తుపై నేను అత్యంత ఆశావహంగా ఉన్నాను. అదే సమయంలో తగిన జాగ్రత్త లేకుండా కేవలం అవకాశాలపైనే పూర్తిగా దృష్టి పెట్టి ముందుకెళ్లడమనేది రిస్కుతో కూడుకున్న వ్యవహారం. అలాగని, మరీ అతిగా జాగ్రత్త చర్యలు తీసుకుంటే మనం అక్కడికి (సంపన్న దేశం కావాలన్న లక్ష్యానికి) చేరుకోలేం' అని ఆయన పేర్కొన్నారు. వచ్చే 20–25 ఏళ్ల పాటు 7.5–8 శాతం జీడీపీ వృద్ధి రేటును కొనసాగించాలంటే సామర్థ్యాలను గణనీయంగా పెంచుకోవాల్సిన అవసరం ఉంటుందని కోటక్ చెప్పారు.

నాలుగు రోజుల ర్యాలీకి బ్రేక్

ప్రపంచ పరిణామాలపై అప్రమత్తత



ముంబై: దేశీయ స్టాక్ సూచీల నాలుగు రోజుల వరుస లాభాలకు మంగళవారం బ్రేక్ పడింది. ఐటీ, ఎఫ్‌ఎంసీజీ షేర్లలో అమ్మకాలు తలెత్తడంతో విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాలూ ఇందుకు కారణమయ్యాయి. అమెరికా ఉద్యోగ గణాంకాలు, ఫెడ్ చైర్మన్ సెనెట్ ప్రసంగం వంటి ప్రపంచ పరిణామాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తత పాటించారు. తీవ్ర ఒడిదుడుకుల నేపథ్యంలో సెన్సెక్స్ 195 పాయింట్లు నష్టపోయి 73,677 వద్ద స్థిరపడింది. ఒక దశలో 460 పాయింట్లు క్షీణించి 73,412 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. నిఫ్టీ 49 పాయింట్లు నష్టపోయి 22,356 వద్ద నిలిచింది.

- ప్లాటినం ఇండస్ట్రీస్ బీఎస్‌ఈలో ఇష్యూ ధర (రూ.171)తో పోలిస్తే భారీగా 33% ప్రీమియంతో రూ.228 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 39% ఎగసి రూ.237 గరిష్టాన్ని తాకింది. చివరికి 29% పెరిగి రూ.221 వద్ద ముగిసింది.
- ఎక్సికం టెలి–సిస్టమ్స్ లిస్టింగ్ రోజే భారీ లాభాలు పంచింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర (రూ.142)తో పోలిస్తే 86% ప్రీమియంతో రూ.264 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 93% దూసుకెళ్లి రూ.274 వద్ద గరిష్టాన్ని తాకింది. చివర్లో 59% లాభంతో రూ.226 వద్ద స్థిరపడింది.

ఐపీఓకి బిగ్‌బాస్కెట్!



టాటా గ్రూప్ ఆన్‌లైన్ గ్రోసరీస్ సంస్థ బిగ్‌బాస్కెట్ వచ్చే ఆర్థిక సంవత్సరం (2024–25)లో పబ్లిక్ ఇష్యూ చేపట్టాలని యోచిస్తోంది. అయితే అంతకంటే ముందుగానే కంపెనీ లాభాల బాటలోకి ప్రవేశించనున్నట్లు బిగ్‌బాస్కెట్ సహవ్యవస్థాపకుడు, సీఈవో హరి మీనన్ పేర్కొన్నారు. టాటా డిజిటల్‌లో భాగమైన కంపెనీ రానున్న 6–8 నెలల్లో టర్న్‌అరౌండ్ కానున్నట్లు అభిప్రాయపడ్డారు.

డీలిస్ట్ చేసిన యాప్‌లు మళ్లీ ప్లేస్టోర్‌లోకి..

కేంద్రం జోక్యంతో సమస్య పరిష్కారం!



న్యూఢిల్లీ: బిల్లింగ్ వివాదంతో డీలిస్ట్ చేసిన దాదాపు 250 భారతీయ యాప్‌లను గూగుల్ తమ ప్లేస్టోర్‌లో పునరుద్ధరించే ప్రక్రియను ప్రారంభించింది. గూగుల్, స్టార్టప్ సంస్థల మధ్య సయోధ్య కుదిర్చేందుకు కేంద్ర టెలికం శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఇరు పక్షాలతో సమావేశమైన నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే డీలిస్ట్ చేసిన యాప్‌లను ప్లేస్టోర్ లో తిరిగి అనుమతించినప్పటికీ సదరు సంస్థలతో 3–4 నెల ల పాటు చర్చించే సమయంలో కూడా ఇన్– యాప్ పేమెంట్స్‌పై గూగుల్ 11–26 శాతం సర్వీసు ఫీజు విధించడాన్ని కొనసాగిస్తుందని సమాచారం.

ఫిబ్రవరిలో నెమ్మదించిన సేవలు

న్యూఢిల్లీ: భారత్ సేవల రంగం ఫిబ్రవరిలో నెమ్మదించాయి. జనవరిలో 61.8 వద్ద ఉన్న హెచ్‌ఎస్‌బీసీ ఇండియా సర్వీసెస్ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ ఫిబ్రవరిలో 60.6కు తగ్గింది. వ్యాపార క్రియాశీలత, అమ్మకాలు, ఉపాధి అవకాశాలు మందగించడం తాజా పరిస్థితికి కారణం. కాగా, ఈ సూచీ 50పైన ఉంటే వృద్ధి ధోరణిగానే పరిగణించడం జరుగుతుంది. 50కన్నా దిగువన నమోదయితేనే క్షీణతగా భావిస్తారు. మరోవైపు సేవలు–తయారీలతో కూడిన కాంపోజిట్ పీఎంఐ అవుట్‌పుట్ ఇండెక్స్ జనవరి ఆరు నెలల గరిష్టస్థాయి 61.2 నుంచి ఫిబ్రవరిలో 60.6కు పడిపోయింది.



కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

6-3-2024	
విశాఖ	500–00
చిత్తూరు	523–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	463–00
విజయవాడ	463–00
రిటైల్ ధర (డజను)	72.00
5-3-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	469–00
వరంగల్	471–00
రిటైల్ ధర	5.30

రైల్వేస్టేషన్లలో స్విగ్గీ ఫుడ్ డెలివరీ

- మార్చి 12 నుంచి వైజాగ్, విజయవాడసహా 4 స్టేషన్లలో సర్వీసులు



న్యూఢిల్లీ: రైలు ప్రయాణికులకు రైల్వే స్టేషన్లలో ఫుడ్ డెలివరీ సర్వీసులు అందించే దిశగా ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ)తో స్విగ్గీ అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. దీని ప్రకారం మార్చి 12 నుంచి వైజాగ్, విజయవాడతో పాటు నాలుగు స్టేషన్లలో (బెంగళూరు, భువనేశ్వర్) ఈ సర్వీసులు ప్రారంభించనున్నట్లు సంస్థ తెలిపింది. రాబోయే వారాల్లో వీటిని మరో 59 స్టేషన్లకు విస్తరించనున్నట్లు స్విగ్గీ సీఈవో రోహిత్ కపూర్ పేర్కొన్నారు.

మోసపూరిత కాల్స్‌పై ఫిర్యాదుకు చక్షు



- కీలక సేవలను ప్రారంభించిన టెలికం

న్యూఢిల్లీ: మోసపూరిత కాల్స్, లాటరీ ఆఫర్లు, ఉద్యోగ ఆఫర్ల వంటి అనుమానిత సందేశాలను నివేదించడానికి కేంద్ర టెలికం శాఖ చక్షు సేవలను ప్రారంభించింది. సంచార్‌సాథి పోర్టల్‌లో ఇందుకోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. కాల్, ఎస్‌ఎంఎస్, వాట్సాప్ ద్వారా సైబర్ నేరం, ఆర్థిక మోసాలు, వంచన, ఏదైనా ఇతర దుర్వినియోగం వంటి ప్రయోజనం కోసం కేవైసీ, లోన్/జాబ్/ఆన్‌లైన్ లాటరీ ఆఫర్, ఫేక్ కస్టమర్ కేర్ హెల్ప్‌లైన్, అనుమానిత లింక్స్, ఆటోమేటెడ్ కమ్యూనికేషన్ వంటివి ఏవి అందుకున్నా చక్షు ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.

ఫేస్‌బుక్, ఇన్‌స్ట్రాగామ్ సేవలకు అంతరాయం



న్యూఢిల్లీ: భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా జీమెయిల్, యూట్యూబ్‌తో పాటు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ వంటి సోషల్ నెట్‌వర్కింగ్ సైట్ల సర్వీసులకు మంగళవారం అంతరాయం కలిగింది. భారత కాలమానం ప్రకారం మంగళవారం రాత్రి 9 గంటలకు గూగుల్, మెటా యాప్స్ సర్వీసుల్లో అంతరాయం గురించి ఫిర్యాదులు వచ్చినట్లు సోషల్ మీడియా నెట్‌వర్క్ ఔటేజ్ ట్రాకర్ ప్లాట్‌ఫాం డౌన్ డిటెక్టర్ వెల్లడించింది.

మరోవైపు, తోటి సోషల్ నెట్‌వర్క్ సైట్లలో అంతరాయాలను వెక్కిరిస్తూ ఎక్స్ చీఫ్ ఎలాన్ మస్క్ స్పందించారు. 'మీరు (యూజర్లు) ఈ పోస్టును చదువుతున్నారంటే మా సర్వర్లు పక్కాగా పని చేస్తున్నాయని అర్థం' అంటూ పోస్ట్ చేశారు.

జేఎం ఫైనాన్షియల్‌పై ఆర్‌బీఐ ఆంక్షలు



- రుణాల విడుదలకు చెక్

ముంబై: ప్రైవేట్ రంగ సంస్థ జేఎం ఫైనాన్షియల్ ప్రొడక్ట్స్‌పై ఆర్‌బీఐ వెనువెంటనే అమల్లోకి వచ్చేవిధంగా ఆంక్షలు విధించింది. షేర్లు, డిబెంచర్లుసహా ఐపీవోలకు రుణాలు విడుదల చేయవద్దంటూ ఆదేశించింది. అయితే ప్రస్తుత రుణ ఖాతాలను కొనసాగించేందుకు అనుమతించింది. యథావిధిగా రుణ వసూళ్లు, రికవరీలను నిర్వహించుకోవచ్చని తెలియజేసింది. డిబెంచర్ల సబ్‌స్క్రిప్షన్‌కు సైతం తాజా ఆదేశాలు వర్తించనున్నాయి. ఎన్‌సీడీ సబ్‌స్క్రిప్షన్లు, ఐపీవో ఫైనాన్సింగ్‌లలో నిబంధనల ఉల్లంఘనలు.. కంపెనీపై తాజా చర్యలకు నేపథ్యం.

జాబ్ పాయింట్

ఎయిమ్స్‌లో-నర్సింగ్ ఆఫీసర్ పోస్టులు

ఎయిమ్స్ న్యూఢిల్లీ.. దేశవ్యాప్తంగా ఉన్న ఎయిమ్స్ సంస్థల్లో నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నర్సింగ్ ఆఫీసర్ రిక్రూట్‌మెంట్ కామన్ ఎలిజిబిలిటీ టెస్ట్(నార్‌సెట్)–6 నోటిఫికేషన్ విడుదల చేసింది.

» **ఎయిమ్స్ సంస్థలు:** ఎయిమ్స్ భటిండా, ఎయిమ్స్ భువనేశ్వర్, ఎయిమ్స్ బిలాస్‌పూర్, ఎయిమ్స్ డియోఘర్, ఎయిమ్స్ గోరఖ్‌పూర్, ఎయిమ్స్ గువాహటి, ఎయిమ్స్ కళ్యాణి, ఎయిమ్స్ మంగళగిరి, ఎయిమ్స్ నాగ్‌పూర్, ఎయిమ్స్ రాయ్ బరేలీ, ఎయిమ్స్ న్యూఢిల్లీ, ఎయిమ్స్ పాట్నా, ఎయిమ్స్ రాయ్‌పూర్, ఎయిమ్స్ విజయ్‌పూర్.

» **అర్హత:** గుర్తింపు పొందిన ఇన్‌స్టిట్యూట్ లేదా యూనివర్శిటీ నుంచి బీఎస్సీ(హానర్స్) నర్సింగ్/ బీఎస్సీ నర్సింగ్ లేదా బీఎస్సీ(పోస్ట్ సర్టిఫికేట్)/బేసిక్ బీఎస్సీ నర్సింగ్ తదితర ఉత్తీర్ణత ఉండాలి. స్టేట్/ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ లేదా రాష్ట్రంలో నర్సులు, మిడ్‌వైఫ్‌లుగా రిజిస్టర్ అయి ఉండాలి. **వయసు:** 18 నుంచి 30 ఏళ్లు ఉండాలి. రిజర్వేషన్ వర్గాలకు గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

» **వేతనం:** రూ.9300 నుంచి రూ.34,800+ గ్రేడ్ పే రూ.4600.

» **పరీక్ష విధానం:** నార్‌సెట్ పరీక్ష రెండు దశలలో జరుగుతుంది. అవి..ప్రిలిమినరీ పరీక్ష, మెయిన్ పరీక్ష. వీటి ద్వారా అభ్యర్థులను ఎంపికచేస్తారు.

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా .

» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 17.03.2024.

» **వెబ్‌సైట్:** www.aiimsexams.ac.in

ఎస్‌ఎస్‌సీ-కేంద్ర ప్రభుత్వ శాఖల్లో వివిధ ఉద్యోగాలు

స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్‌ఎస్‌సీ).. కేంద్ర మంత్రిత్వ శాఖల్లోని వివిధ విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి పరీక్ష నిర్వహిస్తోంది. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 2049

» **ఖాళీలున్న విభాగాలు:** ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా, సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ, సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్, సెంట్రల్ వాటర్ కమిషన్, రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ హైవేస్ మినిస్ట్రీ, హోం అఫైర్స్ మినిస్ట్రీ, డిఫెన్స్ మినిస్ట్రీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిషరీస్, సెంట్రల్ ట్రాన్స్‌లేషన్ బ్యూరో, డిపార్ట్‌మెంట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ తదితరాలు.

» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, 10+2, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

» **వయసు:** 18 నుంచి 27 ఏళ్లు ఉండాలి. రిజర్వేషన్ వర్గాలకు వయోసడలింపు లభిస్తుంది.

» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, స్కిల్ టెస్ట్–టైపింగ్/డేటా ఎంట్రీ/కంప్యూటర్ ప్రొఫిషియెన్సీ టెస్ట్(సంబంధిత పోస్టులకు మాత్రమే), డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

» **పరీక్ష విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహిస్తారు. 100 ప్రశ్నలు- 200 మార్కులకు ప్రశ్నాపత్రం ఉంటుంది. పరీక్షా సమయం 60 నిమిషాలు. జనరల్ ఇంటెలిజెన్స్ 25 ప్రశ్నలు–50 మార్కులకు, జనరల్ అవేర్‌నెస్ 25 ప్రశ్నలు–50 మార్కులకు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్(బేసిక్ అర్థమేటిక్ స్కిల్స్) 25 ప్రశ్నలు–50 మార్కులకు, ఇంగ్లిష్ లాంగ్వేజ్(బేసిక్ నాలెడ్జ్) సబ్జెక్ట్‌లకు 25 ప్రశ్నలు–50 మార్కులకు పరీక్ష ఉంటుంది. ప్రతి తప్పు సమాధానానికి 0.50 మార్కుల నెగిటివ్ మార్కింగ్ ఉంటుంది.

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.

» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 18.03.2024.

» **దరఖాస్తు సవరణ తేదీలు:** 22.03.2024 నుంచి 24.03.2024.

» **పరీక్ష తేదీ:** 06.05.2024 నుంచి 08.05.2024 వరకు

» **వెబ్‌సైట్:** https://ssc.gov.in

సెయిల్, న్యూఢిల్లీలో 314 ఉద్యోగాలు

న్యూఢిల్లీలోని స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్(సెయిల్).. వివిధ విభాగాల్లో ఆపరేటర్-కమ్-టెక్నీషియన్(ట్రైనీ)-(ఓసీటీటీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 314

» **పోస్టుల వివరాలు:** ఓసీటీటీ–మెటలర్జీ–57, ఓసీటీటీ–ఎలక్ట్రికల్–64, ఓసీటీటీ–మెకానికల్–100, ఓసీటీటీ–ఇన్‌స్ట్రుమెంటేషన్–17, ఓసీటీటీ–సివిల్–22, ఓసీటీటీ–కెమికల్–18, ఓసీటీటీ–సెరామిక్–06, ఓసీటీటీ–ఎలక్ట్రానిక్స్–08, ఓసీటీటీ–కంప్యూటర్/ఐటీ(మైన్స్‌లో మాత్రమే)–20, ఓసీటీటీ–డ్రాఫ్ట్స్‌మ్యాన్–2.

» **అర్హత:** పదో తరగతి లేదా తత్సమాన ఉత్తీర్ణతతోపాటు మెటలర్జీ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్/ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ ఎలక్ట్రానిక్స్, సివిల్, మెకానికల్, కెమికల్, సిరామిక్, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ విభాగాలకు సంబంధించి ఏదో ఒక దానిలో ఇంజనీరింగ్ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. ఓసీటీటీ–డ్రాఫ్ట్స్‌మ్యాన్ పోస్టుకు ఏడాదిపాటు డ్రాఫ్ట్స్‌మ్యాన్/డిజైనర్‌గా పని అనుభవం ఉండాలి.

» **వయసు:** 18 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.

» **ఎంపిక విధానం:** రాతపరీక్ష ఆధారంగా.

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.

» **పరీక్ష కేంద్రాలు:** దేశంలోని ప్రధాన నగరాల్లో ఉంటుంది.

» **దరఖాస్తులకు చివరితేది:** 18.03.2024.

» **వెబ్‌సైట్:** www.sail.co.in

గ్రూప్-1కు.. ఇలా గురి!

టీఎస్‌పీఎస్సీ గ్రూప్-1.. రాష్ట్రంలోని లక్షల మంది అభ్యర్థులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే నోటిఫికేషన్! ఇటీవల గత నోటిఫికేషన్‌ను రద్దు చేసిన టీఎస్‌పీఎస్సీ.. 563 పోస్టులతో కొత్తగా గ్రూప్-1 నోటిఫికేషన్ విడుదల చేసింది. గతంలో రెండుసార్లు ప్రిలిమ్స్‌కు హాజరైన వారు సైతం తప్పనిసరిగా మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని కమిషన్ స్పష్టం చేసింది. గతంలో మాదిరిగానే రెండంచెల(ప్రిలిమ్స్, మెయిన్స్) రాత పరీక్షల విధానం ద్వారా ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నట్లు ప్రకటించింది. జూన్ 9వ తేదీన ప్రిలిమ్స్ పరీక్ష జరుగనుంది. ఈ నేపథ్యంలో.. టీఎస్‌పీఎస్సీ గ్రూప్-1 పోస్టులు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక ప్రక్రియ, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ తదితర వివరాలు..

» టీఎస్‌పీఎస్సీ గ్రూప్-1 తాజా నోటిఫికేషన్
» మొత్తం 563 పోస్ట్‌ల భర్తీకి ఎంపిక ప్రక్రియ
» జూన్ 9న ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహణ
» విశ్లేషణాత్మక అధ్యయనమే విజయానికి మార్గం

గత గ్రూప్–1 నోటిఫికేషన్‌తో పోల్చుకుంటే.. తాజా నోటిఫికేషన్‌లో పోస్ట్‌ల సంఖ్య పెరగడం అభ్యర్థులకు కలిసొచ్చే అంశమని చెప్పొచ్చు. గత నోటిఫికేషన్‌లో 503 పోస్ట్‌లను పేర్కొనగా.. తాజా నోటిఫికేషన్‌లో మొత్తం 563 పోస్ట్‌లను ప్రకటించారు. అంటే.. 60 పోస్ట్‌లు పెరిగాయి.

అర్హతలు

- ఫిబ్రవరి 19, 2024 నాటికి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్/అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్/అసిస్టెంట్ లెక్చరర్ ఇన్ ట్రైనింగ్ కాలేజ్ అండ్ స్కూల్(ట్రెజరీ అండ్ అకౌంట్స్ సర్వీస్) పోస్ట్‌లకు కామర్స్/ మ్యాథమెటిక్స్/ఎకనామిక్స్ సబ్జెక్ట్‌తో కనీసం ద్వితీయ శ్రేణిలో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. అదేవిధంగా ఆర్‌టీఓ పోస్టులకు మెకానికల్ ఇంజనీరింగ్/ఆటోమొబైల్ ఇంజనీరింగ్ ఉత్తీర్ణులవ్వాలి.

వయసు

- జూలై 1, 2024 నాటికి 18–46 ఏళ్లు ఉండాలి(డీఎస్పీ/అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పోస్ట్‌లకు 21–35 ఏళ్లు; ఆర్‌టీఓ పోస్ట్‌లకు 21–46 ఏళ్లు; డీఎస్పీ–జైల్స్ పోస్ట్‌లకు 18–35 ఏళ్లు). రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు నిబంధనలకు అనుగుణంగా గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

రెండు దశల రాత పరీక్ష

టీఎస్‌పీఎస్సీ గ్రూప్–1 పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియలో భాగంగా రెండు దశల్లో రాత పరీక్షలు నిర్వహిస్తారు. అవి ప్రిలిమినరీ పరీక్ష, మెయిన్ ఎగ్జామినేషన్.

ప్రిలిమినరీ పరీక్ష

గ్రూప్–1 సర్వీసుల ఎంపిక ప్రక్రియలో తొలి దశ ప్రిలిమినరీ పరీక్షను ఆబ్జెక్టివ్ విధానంలో ఒకే పేపర్‌గా నిర్వహిస్తారు. జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ పేరిట ఈ పరీక్ష ఉంటుంది. మొత్తం 150 ప్రశ్నలతో–150 మార్కులకు ప్రిలిమ్స్ నిర్వహిస్తారు. పరీక్షకు అందుబాటులో ఉండే సమయం రెండున్నర గంటలు.

900 మార్కులకు మెయిన్స్

గ్రూప్–1 మెయిన్ ఎగ్జామినేషన్ పూర్తిగా డిస్క్రిప్టివ్ విధానంలో ఆరు పేపర్లుగా 900 మార్కులకు నిర్వహించనున్నారు. దీంతోపాటు.. ఇంగ్లిష్ లాంగ్వేజ్ పేపర్ కూడా ఉంటుంది. ఈ పేపర్‌ను కేవలం అర్హత పరీక్షగానే నిర్దేశించారు. జనరల్ ఇంగ్లిష్ (క్వాలిఫయింగ్ టెస్ట్) 150 మార్కులకు ఉంటుంది. పేపర్ 1లో జనరల్ ఎస్సే 150 మార్కులకు; పేపర్ 2లో హిస్టరీ, కల్చర్–జాగ్రఫీ 150 మార్కులకు; పేపర్–3లో ఇండియన్ సొసైటీ, రాజ్యాంగం, పరిపాలన 150 మార్కులకు; పేపర్–4లో ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ 150 మార్కులకు; పేపర్ 5లో సైన్స్–టెక్నాలజీ–డేటా ఇంటర్‌ప్రిటేషన్ 150 మార్కులకు; పేపర్–6లో తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర ఆవిర్భావం 150 మార్కులకు ఉంటాయి.

సిలబస్‌పై అవగాహన

ప్రిపరేషన్‌ను ప్రారంభించే ముందు అభ్యర్థులు సిలబస్‌ను పూర్తిగా ఆకళింపు చేసుకోవాలి. ప్రిలిమినరీ పరీక్షలో పేర్కొన్న అన్ని అంశాలకు సంబంధించి నిర్దేశించిన సిలబస్‌ను క్షుణ్నంగా అధ్యయనం చేయాలి. దాని ఆధారంగా చదవాల్సిన ముఖ్యమైన అంశాలపై స్పష్టత ఏర్పరచుకోవాలి. ప్రిపరేషన్‌లో ఏ అంశానికి ఎంత సమయం కేటాయించుకోవాలో నిర్ణయించుకోవాలి. అదే విధంగా టీఎస్‌పీఎస్సీ ఇటీవల కాలంలో నిర్వహించిన ఇతర నియామక పరీక్షల జనరల్ స్టడీస్ పేపర్లను పరిశీలించడం కూడా మేలు చేస్తుంది.

సమయ పాలన

గ్రూప్–1 అభ్యర్థులు ప్రిపరేషన్‌లో సమయ పాలనకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రిలిమినరీ పరీక్షను జూన్ 9న నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ ప్రకటించింది. అంటే.. గరిష్ఠంగా మూడు నెలల సమయం అందుబాటులో ఉంది. ఈ సమయంలో ప్రతిరోజు ప్రతి సబ్జెక్ట్ చదివేలా సమయ పాలన పాటించాలి. ప్రిలిమినరీ సిలబస్‌లో మొత్తం 13 అంశాలను పేర్కొన్నారు. వీటిలో కొన్నింటిని ఉమ్మడిగా అనుసంధానం చేసుకుంటూ చదివే వీలుంది. మొత్తంగా ప్రతి రోజు సగటున 8 నుంచి 10 గంటల సమయం ప్రిపరేషన్‌కు కేటాయించేలా టైమ్ టేబుల్ రూపొందించుకోవాలి.



లోకల్ టు ఇంటర్నేషనల్

అభ్యర్థులు ప్రిపరేషన్ సమయంలో అంతర్జాతీయ పరిణామాలు మొదలు.. స్థానిక అంశాల వరకు అన్నింటిపైనా దృష్టిపెట్టాలి. ముఖ్యంగా తెలంగాణ ప్రాంత ప్రాధాన్యమున్న అంశాలను ఔపోసన పట్టాలి. తెలంగాణ ఉద్యమ దశలు, తెలంగాణ ఆవిర్భావ దశ, మలి ఉద్యమంలో ముఖ్యమైన ఘట్టాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. అదే విధంగా తెలంగాణ చరిత్రలో తెలంగాణ సామాజిక ముఖ చిత్రాన్ని తెలియజేసే అన్ని అంశాలను చదవాలి. సాహిత్యం, కళలు, కవులు, సంస్థానాలు, భౌగోళిక స్వరూపం, వనరులు, ప్రభుత్వ పథకాలు, తెలంగాణ ఏర్పాటు తర్వాత అమలు చేస్తున్న కొత్త పథకాలు.. ఇలా అన్నింటిపైనా అవగాహన పెంచుకోవాలి.

ప్రభుత్వ విధానాలు

జాతీయ స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో సామాజిక సమస్యలు; వాటిపై ప్రభుత్వాలు చేసిన విధానాలపై ప్రశ్నలు అడిగే అవకాశం ఉంటుంది. ఇందులో మహిళా సాధికారత వంటివి ముఖ్యమైనవి. మహిళల సాధికారత కోసం జాతీయస్థాయిలో రకరకాల పథకాలు తెచ్చారు. మైనారిటీలు, వెనుకబడిన తరగతులు, ఎస్సీ/ఎస్టీలు, బాలలు, వృద్ధులు, గిరిజన సంక్షేమం కోసం విధానాలు తెచ్చారు. అదే విధంగా పలు నూతన పాలసీలు రూపొందుతున్నాయి. వాటి గురించి కూలంకషంగా అధ్యయనం చేయాలి. ఉదాహరణకు..నూతన విద్యా విధానం..ఇప్పటి వరకు తీసుకొచ్చిన విద్యా విధానాలు,ప్రస్తుత విధానానికి వాటికి మధ్య ఉన్న వ్యత్యాసం,ఉద్దేశం, లక్ష్యాలు ఇలా అన్ని కోణాల్లో అధ్యయనం చేయాలి.

తెలంగాణపై ప్రత్యేక దృష్టి

తెలంగాణ ప్రత్యేక ప్రాధాన్యం ఉన్న అంశాల నుంచి పరీక్షలో ఎక్కువ ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. కాబట్టి అభ్యర్థులు ముందుగా తెలంగాణ పాలసీలపై అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా తెలంగాణ ఏర్పాటు.. దానికి సంబంధించి ప్రధాన డిమాండ్లుగా పేర్కొన్న నీళ్లు.. నిధులు.. నియామకాలు.. వంటి అంశాలపై ఎలాంటి విధానాలు తెచ్చారన్నది తెలుసుకోవాలి. అదే విధంగా రాష్ట్రంలో ఆయా వర్గాల కోసం అమలు చేస్తున్న నూతన విధానాలపై అవగాహన పెంచుకోవాలి.

సొసైటీకి ఇలా

భారతీయ సమాజం, తెలంగాణ సమాజంలో ప్రత్యేక అంశాలు (వెట్టి, జోగిని వంటివి), సామాజిక వర్గాలు, గిరిజన సమస్యలు, ప్రాంతీయ సమస్యలు వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. అదే విధంగా ఒక అంశాన్ని చదివేటప్పుడు అన్ని కోణాల్లో అధ్యయనం చేయాలి. ఉదాహరణకు సామాజిక వర్గాలనే పరిగణనలోకి తీసుకుంటే.. ఆయా వర్గాల నిర్వచనంతోపాటు వాటి ఆవిర్భావ చరిత్ర, విస్తరణ, తాజా పరిస్థితులు.. ఇలా అన్నింటినీ చదవాలి. అప్పుడే ఆయా అంశాలపై సంపూర్ణ అవగాహన ఏర్పడుతుంది.

డిస్క్రిప్టివ్ విధానం

డిస్క్రిప్టివ్ విధానంలో ప్రిపరేషన్ సాగిస్తే.. ఆయా అంశాలపై అన్ని కోణాల్లో సమగ్ర అవగాహన పెంచుకునేందుకు వీలుంటుంది. ఫలితంగా ప్రశ్న ఎలా అడిగినా జవాబు గుర్తించగలుగుతారు. ఇది భవిష్యత్తులో మలి దశలో ఉండే మెయిన్ పరీక్షకు కూడా ఉపయుక్తంగా నిలుస్తుంది. ఎంపిక చేసుకున్న ప్రామాణిక పుస్తకాలను క్షుణ్నంగా చదవాలి.

మెయిన్స్‌తో అనుసంధానం

గ్రూప్–1 అభ్యర్థుల్లో చాలా మందిలో నెలకొనే సందేహం.. ప్రిలిమ్స్‌తోపాటు మెయిన్స్‌కు చదివే వీలుందా? అనేది. ప్రస్తుత సిలబస్ అంశాలను పరిగణనలోకి తీసుకుంటే.. ఈ అవకాశం ఉందనే చెప్పాలి. మెయిన్స్ డిస్క్రిప్టివ్ విధానంలో, ప్రిలిమ్స్ ఆబ్జెక్టివ్ పద్ధతిలో ఉంటుంది. కాబట్టి అభ్యర్థులు మెయిన్స్, ప్రిలిమ్స్ అంశాల సిలబస్‌ను బేరీజు వేసుకుని.. డిస్క్రిప్టివ్ విధానంలో చదివే నేర్పు సొంతం చేసుకుంటే ఒకే సమయంలో రెండింటికీ సన్నద్ధత లభిస్తుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:**2024, మార్చి14
- **దరఖాస్తుల సవరణ అవకాశం:** మార్చి 23 – మార్చి 27
- **హాల్ టికెట్ డౌన్‌లోడ్:** పరీక్షకు వారం రోజుల ముందు నుంచి
- **ప్రిలిమినరీ పరీక్ష:** 2024, జూన్ 9
- **మెయిన్ ఎగ్జామినేషన్:** సెప్టెంబర్/అక్టోబర్‌లో నిర్వహించే అవకాశం
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://www.tspsc.gov.in

క్లుప్తంగా...

చాక్‌పీస్ పౌడర్, గంజి పొడితో ట్యాబ్లెట్లు!

- లేని కంపెనీ పేరుతో రాష్ట్రానికి నకిలీ మందుల సరఫరా
- డ్రగ్ కంట్రోల్ అధికారుల సోదాలు.. రూ. 33.35 లక్షల మేర నకిలీ ట్యాబ్లెట్ల స్వాధీనం

సాక్షి, హైదరాబాద్: చాక్‌పీస్ పౌడర్, గంజి పొడిని ఉపయోగించి సంఘ విద్రోహ శక్తులు సాగిస్తున్న నకిలీ ట్యాబ్లెట్ల విక్రయాలకు డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) అధికారులు తెరదించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సోదాలు చేపట్టి రూ. 33.35 లక్షల విలువైన, మూడు రకాల నకిలీ యాంటీబయోటిక్ మందులను స్వాధీనం చేసుకున్నారు. నకిలీ మందుల రాకెట్‌పై కేసులు నమోదు చేశారు. ఈ మేరకు డీసీఏ డైరెక్టర్ జనరల్ కమలాసన్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. హిమాచల్ ప్రదేశ్‌లోని సిర్మౌర్ జిల్లా పల్లిగావ్ ప్రాంతంలోని మెగ్ లైఫ్‌సైన్సెస్ పేరుతో కేటుగాళ్లు ఏమాత్రం ఔషధ విలువల్లేని నకిలీ మందులు తయారు చేసి సరఫరా చేస్తున్నట్లు తమ తనిఖీల్లో తేలిందన్నారు. వాస్తవంగా మెగ్ లైఫ్‌సైన్సెస్ అనే కంపెనీయే మనుగడలో లేదని తమ దర్యాప్తులో తేలిందన్నారు. అందువల్ల మందుల విక్రయదారులతోపాటు ప్రజలు సైతం ఈ కంపెనీ పేరుతో ఉన్న ఏ రకమైన ట్యాబ్లెట్ల సరఫరా, కొనుగోళ్లను మానుకోవాలని సూచించారు. మార్కెట్‌లో నకిలీ మందులను గుర్తిస్తే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1800-599-6969 ద్వారా లేదా https://dca.telangana.gov.in/ వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయాలని కోరారు.

'సేంద్రియా'నికి నూతనోత్సాహం



ప్రపంచవ్యాప్తంగా 2022లో 26.6% పెరిగిన సేంద్రియ పంటల విస్తీర్ణం

రూ. 12 లక్షల కోట్లకు పెరిగిన ఆర్గానిక్ మార్కెట్

భారత్‌లో 78% పెరిగిన సేంద్రియ సాగు

45 లక్షల మంది సేంద్రియ రైతుల్లో 25 లక్షల మంది భారతీయులే

ది వరల్డ్ ఆఫ్ ఆర్గానిక్ అగ్రికల్చర్-2024 నివేదిక వెల్లడి

(సాక్షి సాగుబడి డెస్క్)

ప్రపంచవ్యాప్తంగా సేంద్రియ పంటల విస్తీర్ణం 2021తో పోలిస్తే 2022 నాటికి సగటున 26.6% (2.03 కోట్ల హెక్టార్లు) పెరిగినట్లు తాజా నివేదిక వెల్లడించింది. ముఖ్యంగా భారత్‌లో 77.8%, గ్రీస్‌లో 73%, ఆస్ట్రేలియాలో 48% సేంద్రియ సాగు పెరిగిందని పేర్కొంది. అంతర్జాతీయ సేంద్రియ వ్యవసాయోత్పత్తుల మార్కెట్ 2000 సంవత్సరంలో 15.1 బిలియన్ యూరోలుండగా 2022 నాటికి దాదాపు 135 బిలియన్ యూరోల (రూ. 12.13 లక్షల కోట్ల)కు పెరిగిందని... రిటైల్ అమ్మకాల్లో అమెరికా 56.6 బిలియన్ యూరోలతో అగ్రగామి మార్కెట్‌గా కొనసాగగా జర్మనీ, చైనా రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయని వివరించింది. ఈ మేరకు 188 దేశాల నుంచి సేకరించిన సేంద్రియ/ప్రకృతి వ్యవసాయ గణాంకాలతో కూడిన తాజా వార్షిక నివేదిక 'ది వరల్డ్ ఆఫ్ ఆర్గానిక్ అగ్రికల్చర్-2024'ను స్విట్జర్లాండ్‌కు చెందిన సేంద్రియ వ్యవసాయ పరిశోధనా సంస్థ ఎఫ్ఐబీఎల్, ఐఫోమ్-ఆర్గానిక్ ఇంటర్నేషనల్ విడుదల చేశాయి. గత 25 ఏళ్లుగా ఏటా ప్రపంచ సేంద్రియ వ్యవసాయ గణాంకాలను ఈ సంస్థలు ప్రచురిస్తున్నాయి.

ఆస్ట్రేలియా ఫస్ట్, ఇండియా సెకండ్..

- ఈ నివేదిక ప్రకారం 2022 చివరికి ప్రపంచవ్యాప్తంగా 9.64 కోట్ల హెక్టార్లలో సేంద్రియ వ్యవసాయం జరుగుతోంది. 2021తో పోలిస్తే ఇది 26.6 శాతం లేదా 2.03 కోట్ల హెక్టార్లు ఎక్కువ.
- సేంద్రియ/ప్రకృతి వ్యవసాయ విస్తీర్ణం 2022లో 2 కోట్ల హెక్టార్లకుపైగా పెరిగింది. 5.3 కోట్ల హెక్టార్ల సేంద్రియ సాగు విస్తీర్ణంతో ఆస్ట్రేలియా అత్యధిక విస్తీర్ణంలో సేంద్రియ వ్యవసాయం చేస్తున్న దేశంగా నిలిచింది. 2022లో 48.6% వృద్ధిని సాధించింది.
- 47 లక్షల హెక్టార్ల సేంద్రియ/ప్రకృతి సేద్య విస్తీర్ణంతో భారత్ రెండో స్థానంలో ఉంది. 2022లో సేంద్రియ/ప్రకృతి సేద్య విస్తీర్ణం ఏకంగా 78% పెరిగింది.
- ప్రపంచవ్యాప్తంగా సేంద్రియ/ప్రకృతి వ్యవసాయదారుల సంఖ్య 1999లో 2 లక్షలు ఉండగా 2022 నాటికి 45 లక్షలకు పెరిగింది. 2021లోకన్నా ఇది 26 శాతం ఎక్కువ. భారత్ అత్యధిక సంఖ్యలో 25 లక్షల మంది రైతులు సేంద్రియ/ప్రకృతి వ్యవసాయం చేస్తున్న దేశంగా నిలిచింది.
- సేంద్రియ సాగు ప్రాంతం సగానికిపైగా ఓషియానియా (5.32 కోట్ల హెక్టార్లు) దేశాల్లోనే కేంద్రీకృతమైంది. 22 దేశాల్లోని వ్యవసాయ భూమిలో 10 శాతం లేదా అంతకంటే ఎక్కువ విస్తీర్ణంలో సేంద్రియ సాగు జరుగుతోంది. అయినా మొత్తం సాగు భూమిలో ఇప్పటికి సేంద్రియ సాగు వైపు మళ్లింది 2% మాత్రమే. సేంద్రియ సేద్య ప్రోత్సాహక కార్యాచరణ ప్రణాళికలతో కూడిన ప్రత్యేక చట్టాలు 2023 నాటికి 75 దేశాల్లో అమల్లోకి వచ్చాయి.

మన సంస్కృతికి చిహ్నం చీరకట్టు



మంగళవారం జాతీయ సంస్కృతి మహోత్సవాల్లో సాంస్కృతిక ప్రదర్శన

- 'శారీ వాకథాన్'లో గవర్నర్ తమిళిసై
- 'మహిళా బిల్లు' శుభాకాంక్షలు తెలిపిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

ఖైరతాబాద్ (హైదరాబాద్): చీరకట్టు అంటే భారతదేశ సంప్రదాయం, సంస్కృతికి చిహ్నం అని...చీర అంటే సంతోషం, గౌరవానికి చిరునామా అని గవర్నర్ తమిళిసై అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన 'శారీ వాకథాన్'లో గవర్నర్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ సంస్కృతి మహోత్సవాలు-2024 వేడుకల్లో భాగంగా మంగళవారం సాయంత్రం పీపుల్స్ ప్లాజా వేదికగా నిర్వహించిన శారీ వాకథాన్‌లో వందలాది మంది మహిళలు, విద్యార్థినులు చీరలు ధరించి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, తాను విదేశాల్లో చదువుకునే సమయంలో ఎలాంటి స్టిచ్చింగ్ లేకుండా చీర ఎలా కడతారంటూ తన స్నేహితులు ఆశ్చర్యపోయేవారని తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ, 75 సంవత్సరాల నుంచి ఎదురుచూస్తున్న మహిళా రిజర్వేషన్ బిల్లు చట్టసభలో పాసైన సందర్భంగా ప్రతి మహిళకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. 33 శాతం రిజర్వేషన్ ఉపయోగించుకుని అసెంబ్లీ, పార్లమెంట్‌లో అడుగుపెట్టబోతున్న మహిళలకు ఈ సందర్భంగా అభినందనలు తెలుపుతున్నానన్నారు. అనంతరం బెలూన్స్ ఎగురవేసి శారీ వాకథాన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి దర్శన జర్దోష్, పద్మశ్రీ ఆనంద శంకర్, హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ కమిషనర్‌తో పాటు పెద్దఎత్తున మహిళలు పాల్గొన్నారు.



'శారీ వాకథాన్'ను ప్రారంభిస్తున్న తమిళసై. చిత్రంలో కిషన్‌రెడ్డి

వాళ్లని అవినీతికి వాడుకుని వదిలేసిన బాబు

బాబు 'యూజ్ అండ్ త్రో' జాబితాలో ఉమా, గంటా, చింతమనేని, యరపతినేని

సాక్షి, అమరావతి: టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో చంద్రబాబు దోపిడీలో భాగస్వాములై, అవినీతిని కొత్త పుంతలు తొక్కించిన ఆ టీడీపీ నేతలను ఇప్పుడు అదే చంద్రబాబు పాతాళంలోకి తొక్కేస్తున్నారు. చంద్రబాబుకు మాత్రమే సొంతమైన 'యూజ్ అండ్ త్రో' ఆటలో ఆ నేతలకు సొంత నియోజకవర్గాల్లోనే దిక్కు లేకుండా పోయింది. అధికారంలో ఉండగా ఈ నేతలకు సర్వాధికారాలూ ఇచ్చి, అక్రమ సంపాదనకు వారిని ప్రోత్సహించి, రాష్ట్రాన్ని దోచుకున్న చంద్రబాబు.. ఇప్పుడు వారికి టికెట్టు దక్కని పరిస్థితి కల్పించారు. అవసరానికి వాడుకోవడం, అవసరం తీరిపోయాక పక్కన పడేయడం బాబుకు మొదటి నుంచి ఉన్న నైపుణ్యం. సొంత కుటుంబం నుంచి పార్టీలో అనేక మంది నాయకుల వరకు చంద్రబాబు పాలసీకి బలైనవారే. తాజాగా ఆ కోటాలో టీడీపీ సీనియర్ నేతలు దేవినేని ఉమామహేశ్వరరావు, గంటా శ్రీనివాసరావు, చింతమనేని ప్రభాకర్, యరపతినేని శ్రీనివాసరావు చేరిపోయారు. 2014-2019 మధ్య యధేచ్ఛగా అవినీతికి పాల్పడి చంద్రబాబుకు, ఆయన తనయుడు లోకేశ్‌కి కప్పం గట్టిన వీరికి ఇప్పుడు సీట్లు లేకుండాపోయాయి. అప్పట్లో అధికారం తలకెక్కడంతో చంద్రబాబు చెప్పినట్లు చేసి తమ కోసం పనిచేసిన సొంత పార్టీ నాయకులు, కార్యకర్తల్నే హింసించారు. తద్వారా కేడర్ వ్యతిరేకతను మోయలేనంతగా మూటగట్టుకున్న ఈ నేతలు ప్రజా క్షేత్రంలో బలం కోల్పోవడంతో చంద్రబాబు వెంటనే ప్లేటు ఫిరాయించేశారు.

జలవనరులను దోచి ఇచ్చినా ఉమాను పక్కన పెట్టిన బాబు

ఎన్టీఆర్ జిల్లాకు చెందిన మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావుకు సీటు నిరాకరించడం రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ వర్గాలను ఆశ్చర్యపరిచింది. చంద్రబాబుకు అత్యంత విధేయుడు, సుదీర్ఘకాలం కృష్ణా జిల్లాలో కీలక నేతగా ఉన్నా ఎవరూ ఆయన గురించి ఒక్క మంచి మాట చెప్పరు. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చాక జలవనరుల శాఖ మంత్రిగా ఆయన చేసిన అవినీతి అంతా ఇంతా కాదు. పోలవరం ప్రాజెక్టును దోపిడీకి ఉపయోగించుకున్నారు. ఇతర సాగు నీటి ప్రాజెక్టుల్లోనూ అవినీతిని పారించారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలోనూ అందిన కాడికి దండుకుని వేల కోట్లు పోగేశారు. ఆ అక్రమ సంపాదనను చంద్రబాబు, లోకేశ్‌కి కట్టబెట్టి వారి మెప్పు పొందారు. చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్ ప్రోద్బలంతో అవినీతి పిచ్చిలో మునిగిపోయిన ఉమ తన కేడర్, నేతలను వదిలేశారు. జిల్లాలో ఇతర నాయకులు, సీనియర్లను కూడా ఇబ్బంది పెట్టారు. జిల్లా పార్టీలో తానే సర్వం అయ్యారు. పని మీద వెళ్లిన పార్టీ నేతలను అవమానించారు. దీంతో నియోజకవర్గం మొత్తం ఆయనకు వ్యతిరేకంగా మారిపోయింది. దీంతో బాబు ఆయన్ని పక్కన పెట్టేశారు. అప్పట్లో తనకు ఎంత సహకరించినా, అవినీతి సొమ్ములో కమీషన్లు కట్టినా చంద్రబాబు కనికరించలేదు.

గంటాతో భూకుంభకోణాలు: విశాఖ జిల్లాకు చెందిన మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు అవకాశవాద రాజకీయానికి, అవినీతికి నిలువెత్తు రూపమైనా చంద్రబాబుకు ఆయనకి మంత్రి పదవి కట్టబెట్టారు. గంటా ద్వారా చంద్రబాబు విశాఖలో ఊహించని రీతిలో భూ దందాలు చేయించారు. విశాఖ జిల్లావ్యాప్తంగా నానా బీభత్సం సృష్టించారు. విశాఖలో భూ కుంభకోణం జరిగిన ప్రతిచోటా గంటా పేరు వినిపించేది. దీంతో పార్టీలో, జనంలోనూ ఆయనపై వ్యతిరేకత వెల్లువెత్తింది. ఇక గంటాతో ఉపయోగం లేదనుకున్న బాబు ఈసారి విశాఖలో సీటు లేదని కరాఖండిగా చెప్పారు. ఏకంగా జిల్లా దాటించి విజయనగరం జిల్లా చీపురుపల్లిలో పోటీ చేయాలని సూచించారు. దీంతో గంటా ఏమి చేయాలో పాలుపోక చింతిస్తున్నారు.

చింతమనేనికే ఎసరు

టీడీపీలోని పాపులర్ నాయకుల్లో చింతమనేని ప్రభాకర్ ఒకరు. ఏలూరు జిల్లా దెందులూరు నియోజకవర్గంలో తిరుగులేని నాయకుడు. అధికారంలో ఉన్నప్పుడు ఆయన వైపు చూసేందుకే నేతలు, ప్రజలు భయపడేవారు. పోలవరం కాలువ గట్లపై యధేచ్ఛగా మట్టిని తవ్వి అమ్మేసి డబ్బు దండుకున్నారు. తమ్మిలేరులో ఇసుకను అక్రమంగా తవ్వి కనీవినీ ఎరుగని రీతిలో సొమ్ము చేసుకున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఆయన అనధికారిక మంత్రిగా వ్యవహరించారు. అంతటి అవకాశం ఇచ్చిన చంద్రబాబు, ఆయన తనయుడికి చింతమనేని క్రమం తప్పకుండా కప్పం కట్టారు. వారి అండ చూసుకుని చింతమనేని అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలను అల్పులుగా చూశారు. ఇసుకను అక్రమంగా తవ్వద్దని అడ్డపడినందుకు ఏకంగా మహిళా తహశీల్దార్‌పైనే దాడి చేసిన ఘనుడు. దానికి చంద్రబాబు వంతపాడి తహశీల్దార్‌నే తప్పుపట్టి రాజీ చేశారు. ఇలా అనేక దౌర్జన్యాలకు పాల్పడిన చింతమనేనిపై 40కిపైగా కేసులున్నాయి. వీటిలో కొన్ని క్రిమినల్ కేసులు కూడా ఉన్నాయి. అడ్డగోలుగా గొడవలకు వెళ్లడం, రౌడీయిజంతో భయపెట్టడంతో జనం ఆయన్ని 2019లో ఓడించి కసి తీర్చుకున్నారు. ఇప్పుడు సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా ఆయనకు సీటిస్తే పని చేసేది లేదని చెప్పడంతో చంద్రబాబూ ఆయన్ని వదిలించుకోవాలనుకున్నారు. దెందులూరు సీటు ఇవ్వనని చెప్పేశారు.

యరపతినేనితో గనుల దోపిడీ

ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మైనింగ్ డాన్‌గా పేరుపొందారు. లోకేశ్ అండతో ఆయన అక్రమ మైనింగ్‌లో రికార్డులు సృష్టించారు. గనులను కొల్లగొట్టి ఆ సొమ్మును లోకేశ్, చంద్రబాబుకు పంచిపెట్టారు. సొంత పార్టీ నేతలే ఆయన అక్రమ మైనింగ్ చూసి నివ్వెరపోయారు. అధికారులను కూడా బెదిరించి లొంగదీసుకున్నారనే ఆరోపణలున్నాయి. గుంటూరు జిల్లాలో తానే హోంశాఖ మంత్రి అనేలా పరిస్థితిని తయారు చేశారు. చంద్రబాబు ఇచ్చిన అధికార బలంతో పోలీసు అధికారులను సొంత ప్రయోజనాలకు వాడుకున్నారు. చివరికి ఆయన పాపం పండి అక్రమాలపై సీబీఐ కేసు నమోదు చేసింది. ఇవన్నీ చూసి పార్టీ కేడరే విసుగెత్తిపోయింది. సొంత నియోజకవర్గంలో ప్రజలు, కేడర్ వ్యతిరేకం కావడంతో చంద్రబాబుకు యరపతినేని కరివేపాకు అయ్యారు. ఆయనకు సీటును డౌటులో పెట్టారు. టికెట్టు ఇస్తారో లేదో తెలియక యరపతినేని గందరగోళంలో ఉన్నారు.

యాదాద్రిలో శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం



యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి అనుబంధంగా కొనసా గుతున్న శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభ మయ్యాయి. మహాశివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ధ్వజ స్తంభం ముందు యజ్ఞ బ్రహ్మ ఆధ్వర్యంలో విష్వక్సేన పూజ, శుద్ధి పుణ్యాహవాచనం, రక్షా బంధనం వంటి కార్యక్రమాలు అర్చకులు జరిపారు. ఈ వేడుకల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి, ఈవో రామకృష్ణారావు, ఆలయ సిద్ధాంతి, ప్రధానార్చకులు, పారాయణికులు, పురోహితులు, అధికారులు పాల్గొన్నారు.



వెంకయ్యకు దేవేందర్‌గౌడ్ అభినందనలు

సాక్షి, హైదరాబాద్: దేశానికి విశిష్ట సేవలు అందజేసిన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడికి భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన అత్యున్నత పౌర పురస్కారం పద్మ భూషణ్ ప్రకటించిన నేపథ్యంలో మాజీ మంత్రి దేవేందర్‌గౌడ్, ఆయన తనయులు విజయేందర్‌గౌడ్, వినయేందర్‌గౌడ్ మంగళవారం ఆయన నివాసంలో కలిసి అభినందించారు.

తెలంగాణ సహా పలు రాష్ట్రాల్లో ఎన్ఐఏ సోదాలు

సాక్షి, హైదరాబాద్: లష్కర్-ఈ-తైబా (ఎల్ఈటీ) తీవ్రవాదులు బెంగళూరు పరప్పన అగ్రహార సెంట్రల్ జైలులో తోటి ఖైదీలను ఉగ్ర వాదం వైపు మార్చుతున్న కేసులో అనుమానితులను గుర్తించేందుకు ఎన్ఐఏ (జాతీయ దర్యాప్తు సంస్థ) అధికారులు మంగళవారం తెలంగాణ సహా పలు రాష్ట్రాల్లో తనిఖీలు చేపట్టారు. కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, పంజాబ్, గుజరాత్, పశ్చిమబెంగాల్, గుజరాత్‌లో మంగళవారం జరిపిన సోదాల్లో డిజిటల్ పరికరాలు, పలు దేశాల కరెన్సీ, అనుమానాస్పద పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎన్ఐఏ అధికారులు తెలిపారు. 2023, అక్టోబర్ 25న నమోదైన ఈ కేసులో ఈ ఏడాది జనవరి 12న ఎన్ఐఏ అధికారులు చార్జిషీట్ నమోదు చేశారు. ఈ కేసులో పరారీలో ఉన్న నిందితులు జునైద్ అహ్మద్, సల్మాన్‌ఖాన్ దేశవ్యాప్తంగా నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసు కున్నట్లు అందిన సమాచారంతో ఈ సోదాలు నిర్వహించినట్లు అధికారులు చెప్పారు.

టీశాట్ సీఈవోగా వేణుగోపాల్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: టీశాట్ సీఈవోగా బోదనపల్లి వేణుగోపాల్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ పదవిలో ఆయన రెండేళ్లపాటు కొనసాగుతారని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ మంగళవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న టీశాట్‌లో తెలంగాణ స్కిల్, అకడమిక్ అండ్ ట్రైనింగ్ తదితర అంశాలను ప్రసారం చేస్తున్నారు. వేణుగోపాల్‌రెడ్డి ఇదివరకు తెలంగాణ జర్నలిస్టుల అధ్యయన వేదిక అధ్యక్షుడిగా ఉన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.